ఆంధ్రసచిత్రవార
పత్రిక


సినీతారాలోక
ప్రత్యేక వ్యాసావళి ప్రారంభ



22-5-64
30 న.పై.




డా॥ 'చక్రవర్తి' లో సావిత్రి.




Roopkala
తప్పక చూడండి
దర్శకత్వం: శ్రీధర్
VIJAYA PUBLICITIES
నిర్మాతలు: M. జగన్నాధరావు. M.R. జయరామ్



బెంగాల్ కెమికల్ వారి
గోల్డన్
ఆమ్లా
హేర్ ఆయిల్
ఆయుర్వేద హేర్ ఆయిల్—
మెదడుకు ఉపశమన
చల్లదనం యిస్తుంది.
పుష్కలంగా శిరోజాలు
పెరుగ దోహదం చేస్తుంది.



స్త్రీల ఆరోగ్య
సౌభాగ్యములకు
లోధ్ర
Lodhra
కేసరి కుటీరం
(ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)



అదేమిటే! మా స్నేహితురాలు శారద టీపార్టీ మొదలుపెట్టక ముందే వెళ్ళిపోతూందెందుకో
చూడు
పిల్లాడు కాదమ్మా పిశాచం- ఇందాకటినించి ఎంత సముదాయించినా ఏడుపు మానటంలేదు
ఇటువంటప్పుడు మీ పాపాయికే వ్వాళ్ళిందల్లా ఇన్‌ఫెంటోన్ గ్రైప్‌వాటరే. కొంచెం
తాగగానే ఎలా ఇంచక్కా ఏడుపు మానేడో చూడు
ఇన్‌ఫెంటోన్
గ్రైప్‌వాటర్
జలుబు, విరేచనములు, పిల్లలకు పళ్ళు వచ్చేరోజుల్లో కలిగే విరేచనములకు, అన్ని విధమ్ములైన అజీర్ణరోగముల నరికట్టుటకు అమోఘుంగా పనిచేస్తుంది
ఇన్‌ఫెంటోన్
గ్రైప్ వాటర్
పాపాయిని సంతోషముగా
వుంచును
తయారుచేయువారు
ది హైదరాబాద్ కెమికల్ అండ్ ఫార్మస్యూటికల్ వర్క్సు లి
హైదరాబాదు. ఆం.ప్ర
INFANTONE

ముఖాముఖి

"ఎన్.టి.ఆర్.తో ముఖాముఖి" అనే శీర్షికలో రామారావుగారి అభిప్రాయములను తెలుపు చున్నందులకు చాలా సంతోషము. ఇంటర్వ్యూ మరియు ఇతర పోటోలు నన్నెంతో ఆకర్షించాయి. కానీ వారి(రామారావుగారి) సతీమణితోగాని పిల్లలతో 'గాని దిగిన పోటోలను ప్రచురించనందులకు మిక్కిలి నిరాశచెందితిని.

జి. సత్యనారాయణ (హైదరాబాద్)

* * *

చుక్కల్లో చంద్రుడిలా వెలుగుతున్న ఆంధ్రుల అభిమాన ఏకైక సినీ కథా నాయకుడు, శ్రీ రామారావుగారితో జరుపబడిన ఇంటర్వ్యూ వ్యాసం చదివి చాలా ఆనందించాను. సినిమా పరిశ్రమగురించి వారు వ్రాయబోయే వ్యాసముల కోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూసే అసంఖ్యాక పాఠకుల్లో నేనొకణ్ణంటే నమ్ముతారుకదూ?

కె. భాస్కరరావు (సికిందరాబాద్)

* * *

వీరాజీగారి "ముఖాముఖి" (శ్రీ రామారావుతో) వ్యాసం పాత చింతకాయపచ్చడిలా ఉంది. పాత నటులగురించి ఎన్నోసార్లు వ్రాస్తారో తెలియదు. విసిగెత్తిపోతూంది. ఇలా వ్రాయడం "పాతసీసాలో కొత్త సారా"లా ఉంది.

ఇలా పేజీలు వృధాపరచడంకంటె లలితకళల్లో (చిత్రకళ, నాట్యం, నాటకరంగాలలో) పైకి వస్తున్న కళకారులు ఎంతోమందివున్నారు వారి గురించి ప్రజలకు తెలియపరచడం ముఖ్యం. అలా చేయడంవలన లలితకళలకు ఎంతో మంచిచేసినట్లవుతుంది.

బి. టి. కృష్ణ, బి. ఎ. లిట్ (వాల్తేరు)

కార్టూన్

"జయదేవ్" గారు వేసిన రెండుజెళ్లు చూస్తే నాకు నవ్వు వచ్చింది. కోపమూ వచ్చినది. కారణం అవి చాలా అసహజంగా ఉన్నది. ఆ విధంగా అవమాన పరుస్తూ వేయటం అందులోనూ అసహజమైనవి న్యాయంగాలేదు. పాములవాడు పూదుట మరీ విపరీతంగా ఉంది.

మిస్ రాధ. (ఎల్లందు)

* * *

ఈవారం (17—4—64) సంచికలో 27 వ పేజీలోని కార్టూన్ అసందర్భముగా నున్నది. ఈ కార్టూను కేవలం హాస్యము కొరకే వేసినట్లున్నదిగాని సహజంగాలేదు. ఇంకా అదే కార్టూన్‌లో గోడ గడియారంలో వక ముల్లుకుడి పైపున '8' మీద ఉంది. కాని అక్కడ '3' అంకెమీద ఉండవలెను. ఇలాంటి చిన్న చిన్న తప్పులు ఇక ముందు ఉండగూడదని కోరుచున్నాను.

దమ్మవళం రామారావు (అమ్మనబ్రోలు)

కథలు

1—5—64 ఆంధ్రపత్రిక సచిత్రవార పత్రికలో 'కట్నం కోరని కామేశం' కథ ప్రచురించబడింది. కథ బాగానే ఉంది. కాని, ఆ కథ, "కంటిన్యుయేషన్", 57వ పేజీలో, 2వ కాలంలో, రెండవ పేజీలో మొదటి రెండు లైన్లు నాకు బోధపడలేదు.

ఉత్తరాలు

అవి ఏమనగా "అందరూ తెలిసినవారే. ఉద్యోగరీత్యా కామేశం వాళ్ళు దూర ప్రదేశాలకు వెళ్ళటంవల్ల, ఈ మధ్య రాకపోకలు ఎక్కువయి పరాయి వాళ్ళలా మారిపోయారు."

దూర ప్రదేశాలకు వెళితే రాకపోకలు ఎక్కువవుతాయా? రాకపోకలు ఎక్కువయితే పరాయివాళ్ళలా మారిపోతారా? ఇది అచ్చు పొరపాటా? లేక రచయిత్రిగారి పొరపాటా? తెలుపుతారని ఆశిస్తున్నాను.

కోదండ రామారావు (హుజూరునగరు)

సినిమా వార్తలు

10—4—64 తేదీ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో "నటీ నటుల పుట్టిన సంవత్సరాలు, వారి మొదటి చిత్రాలు" సూచించిన జాబితా ప్రకారం శ్రీ వి. నాగయ్యగారు మొదటి చిత్రం "సుమంగళి" కాదు. నాగయ్యగారు నటించిన మొదటిచిత్రం "గృహలక్ష్మి", రెండవ చిత్రం "వందేమాతరం". బహుశా శ్రీ సి. ధర్మారావు గారు పొరపడి ఉండవచ్చును.

న్యాయపతి వెంకట రాఘవరాజు (ఖర్గపూరు)

సీరియల్ కథలు

గతవారం పత్రికలో రెండు సీరియల్ కథల ముగింపులు చదవడం జరిగింది. "సంపెంగపొదలు" ముగింపు సుఖాంతం చేయడం జరిగినా సహజంగా లేదు. తనని ప్రాణాధికంగా ఆరాధించే హరిని కాదని ఉమ గిరిని వివాహం చేసుకోవడం ఏం బాగా లేదు. ఈ విధంగా జరగడం స్త్రీ త్యాగ శీలతకు గొడ్డలిపెట్టు. తన స్నేహితుని కొరకు అన్నీ చేయగలిగిన గిరి ఈ విషయంలో 'ఆత్మవంచన' చేసుకోవడం జరిగింది. కథ మొత్తం సరళమైన శైలిలో వ్రాయబడటం మెచ్చుకోదగింది.

"ఎండమావులు"లో రచయిత ముగింపును కావాలని దుఃఖాంతంగా మార్చారనిపిస్తున్నది. వర్ణాంతర వివాహాల ఫలితాలు ఇలా ఉంటాయని చూపాలని రచయితగారి ఉద్దేశ్యమనుకుంటాను.

డి. మధుసూదన్ (హైదరాబాదు)

* * *

శ్రీ సి. ఆనందరామం గారు వ్రాసిన "సంపెంగ పొదలు" బాగుంది. కథను ఆనందరామం గారు సుందరాంగంగా రూపొందించారు. వారికి నా ధన్యవాదములు.

శ్రీ హరికిషన్ గారు వ్రాసిన "ఎండమావులు" చదువుతుంటే ఎంతటి కఠినాత్ములకైనా కండ్ల వెంట నీళ్ళు తిరగవలసిందే! వారికి నా ధన్యవాదములు.

కొండవీటి వెంకటేశ్వరరావు (వెంకటపాలెం)

సరాగమాల

ఈ మధ్య ఆకాశవాణి విజయవాడ కేంద్రము నుండి కార్మికుల కార్యక్రమములో 'అన్నవరములోన అలకొండపైన వెలసిన సత్యనారాయణా,! ఓ వెలసిన శ్రీమన్నారాయణా' అనేపాట విన్నాను. బహుశా ఇది ప్రైవేట్ రికార్డు అనుకుంటాను. చాలా చక్కగా ఉంది. ఈ రికార్డుయొక్క నెంబరు, మరియు దీనిని పాడినవారి వివరములు శ్రీ వి. ఎ. కె. రంగారావు గారు తెలియచేయగలరని కోరుచున్నాను.

ఇ.హేమచందర్. (హనుమకొండ)

రాజధాని కబుర్లు

మీ వారపత్రికలో నాగేశ్వరరావు అమెరికా పర్యటనను పురస్కరించుకొని, ధారా ప్రవాహంగా వెలువడుతున్న మీ విలేఖరుల పొగడ్తలను చూస్తే నిజంగా నవ్వు పుట్టుకొస్తున్నది. ఈ పొగడ్తల్లూ, కొందరు ప్రేక్షక మహాశయుల సన్మానాలూ చూస్తూంటే—అమెరికా వెళ్ళడమంటే ఎంతో ఘన కార్యమన్నట్టు—కేవలం మన తెలుగు ప్రేక్షకులు మాత్రమే భావిస్తున్నట్టుగా స్పష్టమవుతున్నది. ఇలా ఎందుకనవలసి వస్తున్నదంటే—మొన్న మార్చి మూడవ వారంలో ప్రఖ్యాత హిందీ నట, నిర్మాత 'దేవానంద్' స్టేట్ డిపార్టుమెంట్ ఆహ్వానాన్ని, హాలీవుడ్ నటుడు డగ్లస్ ఆహ్వానాన్ని పురస్కరించుకొని, చడీచప్పుడూ కాకుండా అమెరికా వెళ్ళిన విషయం చాలామంది ప్రేక్షక—కమ్—పాఠక మహాశయులకు తెల్సిన విషయమే! అయితే, ఉత్తరాది ప్రేక్షకులు తాము అమితంగా అభిమానించే తమ నటులను మన ఆంధ్ర ప్రేక్షకులాగా ఏనుగులూ, సింహాలూ ఎక్కించి సన్మానాలు ఎందుకు చేయలేదు?......వాళ్ళకు విదేశాలకు వెళ్ళడం చాలా మామూలు అలవాటా?... దీనికి సమాధానం వెతుక్కుంటే ఇంకా(కొందరు) ఆంధ్ర ప్రజలు చాలా దశాబ్దాల వెనుకటి మన సత్త్వాలతో జీవిస్తున్నారనే అనుకోవలసి వస్తున్నది. "విదేశాలకు వెళ్ళబోతున్న సినిమా నటుని చూసి చాలామంది జన్మ సార్థకత చేసికున్నా"రనా మీ విలేఖరి పొగడ్తల సారాంశం? భగవాన్!! వార పత్రికలో ఇటువంటివి చదువవలసి వచ్చినందుకు 'ఆంధ్రులు'గా నిజంగా సిగ్గుపడుతున్నాం.

ఈలెక్కన ఇక యూనివర్శిటీలనుండి స్కాలర్‌షిప్‌లమీద, అధమం వారానికొకసారైనా ఉన్నత విద్యలకోసం విదేశాలకు వెడుతున్న మా స్టాఫ్ మెంబర్సనీ, నాలుగైదేళ్ళు విదేశాలలో గడిపి, ప్రస్తుతం మాకు రీడర్స్‌గా, ప్రొఫెసర్స్‌గా, లెక్చరర్స్‌గా వస్తున్న వారినీ ఏవిధంగా సన్మానించి మా జన్మలు సార్థకం చేసికోవాలో అర్థమవడం లేదు.

గోపాలకృష్ణమూర్తి, సూర్యప్రసాద్ (వాల్తేరు)

* * *

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 27-3-64 సంచికలో 'కథ కాని కథలు' వ్రాసిన ఓ. దాశరథీశర్మ (లక్నో), సి. వెంకటేశ్వరరావు (కాకినాడ) గారలను పూర్తి చిరునామాలను తెలియచేయ గోరుతున్నాము.

—సం॥

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 22—5—'64
క్రోధినామ సం॥ వైశా॥ శుద్ధ ఏకాదశి
సంపుటము 56 సంచిక . 38

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా వివరాలు

ఇండియా రూ. 15.60. ఇతర దేశాలు ఓడమీద (Sea Mail) రూ. 28 60. విమానం ద్వారా (Air Mail) బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు: రూ. 120.00. అమెరికా రూ. 176.80. ఆస్ట్రేలియా రూ. 148.20.

విడిప్రతి 30 న.పై.
సంవత్సర చందా 15.60 న.పై.
6 మాసాల చందా 7.80 న.పై.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1



నల్ల డబ్బేదేనావుంటే నాకు ధర్మం చేయండమ్మా!
(మీకు ఇన్‌కమ్‌టాక్సు [illegible] బాధ [illegible]ఉండదు!)

మనలో మాట

ఈ వారం మధ్యపేజీలలో ప్రచురించిన వ్యాసం ప్రత్యేక వనితాలోకం వ్యాసావళిలో మొదటిది. శ్రీమతి ఆనందారామం తర్వాత శ్రీమతులు ముప్పాళ రంగనాయకమ్మ, నాయని కృష్ణకుమారి, 'విశాఖ', ఎం. సుగుణ, హేమలతా కైలాసం, రాధా రాఘవ్ మొదలయినవారు స్త్రీలకు సంబంధించిన కొన్ని ముఖ్య సమస్యలను చర్చిస్తారు. మరికొందరు ఇతర రచయిత్రులు కూడా ఈ శీర్షికలో వ్రాస్తారు. వారి పేర్లు తర్వాత ప్రచురిస్తాము. వీటన్నిటికీ శ్రీ బాపు బొమ్మలు వేస్తారు...

* * *

'నాహిని' కథ రచయిత 'న్యూక్లియర్ కెమిస్ట్రీ'లో కాక మరొక విషయమై పరిశోధన చేస్తున్నట్లు తెలుస్తున్నది...

* * *

చలనచిత్ర పరిశ్రమమీద శ్రీ ఎన్. టి. రామారావుగారి రెండవవ్యాసం ఈసంచికలోని 40వ పుటలో మొదలవుతుంది...

* * *


ఇదే సంచికలో అమెరికానుంచి నాగేశ్వరరావుగారు వ్రాసిన ఉత్తరాలలో కొన్ని వాక్యాలు సేకరించి ఒకరు పంపగా వేశాము (58వ పేజీ)...

* * *

శ్రీమతి కన్నాంబగారి మరణం చలనచిత్ర పరిశ్రమకి తీరని లోటు. ఆమె కుటుంబం వారందరికీ మా సంతాపం తెలియచేస్తున్నాము...

విషయానుక్రమణిక

ముఖచిత్రం: బి. సరోజాదేవి.



స్వయం నిర్ణయాధికారాలు ఉండాలంటూ అబ్దుల్లా చేసిన సూచన దేశంలో అన్ని వర్గాల మీద వెర్రి ప్రభావాన్ని చూపొచ్చు.
ద్రవిడస్తాన్ జిందాబాద్
మాకు ద్రవిడస్తాన్ కావాలి
సిక్కిస్థాన్ కావాలి
మా కోరిక నెరవేరాలి
ఇస్తారా ఛస్తాము
నాగా వాసులకు స్వాతంత్ర్యం
మాకు స్వయం నిర్ణయాధికారం కావాలి
మరి గోవన్ల మాటేమిటి? మాకు స్వాతంత్ర్యం కావాలి
మన రాజులందరికీ వేరే రాజ్యం కావాలి
మహిళలకూ స్వయం నిర్ణయాధికారం!
మా హక్కుల సాధనకు ఏమైనా చేస్తాం.
మరి మా మాటేమిటి
నిజం మాట్లాడితే, మన వృద్ధులందరికీ వేరే రాష్ట్రం కావాలి!
తలకొక రాష్ట్రం కావాలనేమో!

నెహ్రూ శకం ముగుస్తున్నదా?

ఈనాడు ఢిల్లీ మహానగరంలో అలముకొనివున్న వాతావరణాన్నిబట్టి చూస్తే నెహ్రూ శకం ముగిసిపోతున్నదా, అన్న సందేహం కలుగుతున్నది.

మరో నూతన శకం కూడా ప్రారంభమవుతున్నట్లు, ఆ ప్రారంభానికి సంకేతంగా 'ప్రసవ వేదన'లు వినిపిస్తున్నట్లు కూడా అనిపిస్తున్నది. దేశ నాయకత్వపు పోరాటం యొక్క రూపు రేఖలు కూడా మారిపోతున్నాయి.

మరొకవైపు షేక్ అబ్దుల్లా తన అభిమతమేదో, బల్లగుద్ది చెప్పేశాడు. అబ్దుల్లా, పోయిన వారమే ప్రధాని "అతిథి"గా ఢిల్లీ వచ్చారు. సహజంగా నెహ్రూగారు ఏ విషయాన్నైనా "మక్కీకి మక్కీ" పద్ధతిలో అమలు జరిపే తత్వం గలవాడు. ఉదాహరణకు ఒక సంగతి చెపుతాను. ఆయన రాష్ట్రపతికి ఎలాంటి ఉత్తరం వ్రాసినా ప్రారంభంలో "డియర్ శ్రీ ప్రెసిడెంట్" అని వ్రాస్తారు. కాని, ఆయన సోదరి శ్రీమతి పండిట్ విషయం అలా కాదు. ఆమె తన సోదరునికి అధికార పూర్వక వర్తమానాలు పంపినా మొదట్లో "డార్లింగ్ భాయ్" (ప్రియమైన సోదరుడా) అని వ్రాస్తుంది. ఇంత, అధికార పూర్వకంగా ఉండే నెహ్రూగారే, ఈ మధ్య అబ్దుల్లా వచ్చినపుడు తన సంప్రదాయాన్ని విస్మరించినట్లున్నారు. అలా కాకపోతే అసలు, కొత్త మంత్రి దినేష్‌సింగ్‌నూ, కామన్వెల్తు సంబంధాల కార్యదర్శిని అబ్దుల్లాకు స్వాగతం చెప్పేందుకు విమానాశ్రయానికి పంపవలసిన అవసరం ఏమొచ్చింది? ఒకరకంగా చూస్తే, దినేష్‌సింగ్ ఉండటంలో కొంత అర్థం ఉన్నది, కారణ మేమంటే నెహ్రూ గారింటి చుట్టూ తిరుగుతూ, ఆ ఇంటి వాసాలనే పట్టుకొని వ్రేలాడటం ఆయనకు పరిపాటి. లోక్‌సభలో తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. లేకపోతే నెహ్రూగారి వలన స్వతంత్ర ప్రతిపత్తిగల భూటాన్‌నూ, మన కాశ్మీర్‌నూ సమానంగా ఆయన పరిగణించినట్లు అర్థం చెప్పుకోవలసిన వచ్చేది.

అబ్దుల్లాకు అనవసరంగా చాలా ప్రాముఖ్యత వచ్చినట్లు కనిపిస్తున్నది. చివరకు భారత రాష్ట్రపతి కూడా అబ్దుల్లాను కలిసేందుకు కొన్ని కార్యక్రమాలను రద్దు చేసికొన్నారట.

అబ్దుల్లా పరిస్థితే అలా ఉండగా, కుమారి మిర్దుల్లా శారాభాయ్ కూడా అకస్మాత్తుగా వెలుగులోకి వచ్చేసింది. అంతటితో ఆగక ఆవిడ 'ప్రాముఖ్యం' బాగా పెరిగిపోతున్నది. విదేశీ విలేఖరులు, స్వదేశీ విలేఖరులు కూడా కుమారి శారాభాయ్ చుట్టూ పరిభ్రమిస్తున్నారు. తీరా వెళ్లేసరికి, అక్కడ కాచుకొని కూర్చొన్న అబ్దుల్లా బంటులు, వాళ్ల గురువు గొప్పతనాన్ని గురించి విలేఖరులకు ఉపన్యాసాల మీద ఉపన్యాసాలను దంచేస్తున్నారు.

ఈ మధ్యనే అనుకోంటూ— అబ్దుల్లా ఢిల్లీలో మన్న మసీదుల నన్నిటిని దర్శించి, తన "భక్తి ప్రపత్తులను" ప్రదర్శించుకొన్నారు. దీనికి సాక్ష్య మన్నట్లు, ఢిల్లీలోని కొన్ని పత్రికలు కూడా అబ్దుల్లా ప్రార్థనలు చేస్తున్నప్పటి ఫోటోలను అచ్చు వేశాయి. అసలు సంగతి అదికాదు— మసీదులో గాని, మరో మహమ్మదీయ సమావేశంలో గాని ఫోటోలు తీయటం "ఇస్లాం" మతానికి వ్యతిరేకం. భక్తాగ్రేసరుడు షేక్ అబ్దుల్లా దేవుణ్ణి ప్రార్థిస్తున్నప్పుడు ఫోటోలు తీయటం ఆశ్చర్యకరంగా లేదూ!

అది అలా ఉంచండి— అబ్దుల్లా రాజకీయ ధోరణులు గమనిద్దాం.

ఈమధ్యనే నెహ్రూగారితో సుదీర్ఘమైన చర్చలనే జరిపారు. నెహ్రూగారికొక అలవాటువుంది. తాను ఎవరితోనైనా ఎలాంటి చర్చలు జరిపినా "రికార్డు" చేసికొంటూరు కాని అబ్దుల్లా విషయంలో అదేమీ జరిగినట్లు కనిపించదు. మాట్లాడినవన్నీ ఏదో వరవడి రావటంతో, మాట్లాడటంతోనే జరిగిపోయిందట.

అబ్దుల్లా నెహ్రూతోటే తన చర్యలను ముగించ లేదు. లాల్ బహాదూర్ శాస్త్రి, కాంగ్రెసు అధ్యక్షుడు కామరాజ్, ఆర్థిక మంత్రి టి. టి. కె., హోం మంత్రి లాలా నందాలతోకూడా అబ్దుల్లా చర్చలు జరిపారు. తాను అబ్దుల్లాతో ఏం మాట్లాడిందీ నందా బహిరంగ పరచారు కూడా.

కాశ్మీరు సమస్యతో సంబంధం పెట్టుకొని కొంత ప్రచారం పొందుతున్న మరో వ్యక్తి ఉన్నాడు —జె. జె. సింగ్. ఈయన్ను నాయకునిగా ఎవరూ పరిగణించలేదు. తనకు తానుగా నాయకుడై కూర్చొన్నాడు. ఒకప్పుడు ఈయన అమెరికాలో ఉండి విచిత్రమైన జీవితాన్ని గడిపాడు. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఢిల్లీలోనే ఉంటున్నాడు. జయప్రకాశ్ నారాయణ్ లాంటి వ్యక్తులకు ఆతిథ్యాలను ఇవ్వటమే ఈయన చేస్తున్న రాచకార్యం. ఈ మధ్యనే ఒక రోజున జయప్రకాశ్ నారాయణ్‌తో కలిసి సింగు గారు కొందరు పార్లమెంటు సభ్యులతో మాట్లాడి వచ్చారట. ఆ సభ్యుల వద్దనే శ్రీ సింగ్ ఒక పత్రాన్ని వెల్లడి చేశారట— కాశ్మీరులోని రెండు భాగాలను (ఒక భాగం పాకిస్తాన్ ఆధీనంలో ఉన్నది) కలుపటానికి ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శిని ఆహ్వానించాలని సారాంశం.

జయప్రకాశ్ నారాయణ్ గారి వాదన కూడా వింటూనే ఉన్నాం. ఏ ప్రాంతాన్నైనా, ఆ ప్రాంతీయుల అభిమతానికి వ్యతిరేకంగా, ఇండియాలో కలుపరాదని జయప్రకాష్ వాదన. జయప్రకాశ్ వాదన పూర్తిగా అమలు జరిగితే, స్వతంత్రమైన "ఒక ఇండియా", లక్షలాది స్వతంత్ర దేశాలుగా తయారవుతుంది. అన్నట్లు ఈయన స్నేహితుడొకాయన ఉన్నారు— పేరు బాబూ యస్. కే. డే— గ్రామ పంచాయతీ దశాన్ని సృష్టించాడు. దాంతోనే ఇండియా స్వతంత్రాన్ని అభివృద్ధిపరిచే 'డే' తాపత్రయం.

జయప్రకాశ్ నారాయణ్ అంటే నాకు వ్యక్తిగతంగా ఎంతో గౌరవం ఉన్నది.

దేశంలో మత సామరస్యం ఉండాలని, పాకిస్తాన్‌తో సత్సంబంధాలు పెరగాలని, ఆయన చేసే కృషి ప్రశంసనీయమే. కాశ్మీరు సమస్యను పరిష్కారం చేసేందుకు ఆయన చేస్తున్న కృషి మెచ్చదగినదే. కాని చిక్కు అదికాదు— ఆయన చేసిన సూచన కాంగ్రెసుకు గాని, దేశానికి కాని ఆమోదయోగ్యం కానేరదు. కాశ్మీరు ప్రజలు తమ రాష్ట్రాన్ని ఇండియాలో కలపాలని కోరినట్లు లోగడనే నెహ్రూ అన్నారు. . . . అదంతా అబద్ధమని ఇండియా గాని, లేదా నెహ్రూ గాని తిరిగి భద్రతా సంఘానికి చెప్పుకోవాలని జయప్రకాశ్, అబ్దుల్లాల కథనం.

అబ్దుల్లా మాటుకు ఇంతవరకూ తన కదనుసక్రమంగానే నడుపుకొంటూ వచ్చారు. ఆడవలసిన నాటకమంతా బాగానే ఆడుతున్నారు. తాను అనేదేమిటో, తన ఉద్దేశ్యాలు ఏమిటో ఇంతవరకు బయట పెట్టలేదు. నెహ్రూయే స్వయంగా తనను ఏదైనా కోరిక కోరాలని అబ్దుల్లా సాహెబు

57 వ పేజీ చూడండి

పై ఏడాదినుంచి ఉస్మానియాలో కూడా మెట్రిక్ పరీక్షలు !

ఆంధ్రుల రాజధానీ నగరంలో, ఆంధ్రత్వం పూర్తిగా లోపించిందనే విమర్శకు రానురాను అర్థం లేకుండా పోతోంది. ఆవకాయ కాయకు బాగా గిరాకి తగులుతోంది. డ్రైనేజిలేని ఆంధ్రుల పట్నాల మాదిరిగానే హైదరాబాదుకూడా క్రమ క్రమంగా మారుతోంది. ఈ ఏడు ఎండలు కూడా విజయవాడకు ఏమీ తీసిపోలేదు. సాయంత్రం ఆరయిన తర్వాత కూడా వడగాడ్పుల జోరు రాజధాని ప్రజలు చవిచూడటం ఇదే మొదటి సారి ! కొన్నాళ్లకు మిగతా లక్షణాలు కూడా సంతరించుకుని, హైద్రాబాదు పట్నం, పూర్తిగా ప్రాతినిధ్యం వహిస్తూ, ఆంధ్రుల రాజధానీ నగరంగా విరాజిల్లగలదని ఆశాభావం వ్యక్తపరుస్తున్నాడు, మా శ్రీనివాస్.

వీస్తున్న వేడి గాలులతో పాటు, ప్రాణం హాయి అనిపించేటట్లు కాసిని చినుకులూ పడ్డాయి. ఓ మంచి నాటకం ప్రదర్శించారు. సాహితీ బంధువుల మధ్య కృతి స్వీకారం జరిగింది. సంగీత నాటక అకాడమీ పెద్దలకు సన్మానం చేశారు. నలుగురూ మెచ్చుకున్న పెద్ద మనిషినే, మళ్లా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమించారు. ప్రముఖ సినీతార జి. వరలక్ష్మి గారు, హైదరాబాద్‌లో స్థిరనివాసం యేర్పరచుకోబోతున్నామని తెలియజేశారు. అనేక యుద్ధముల ఆరితేరిన వృద్ధ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.

రసన సమాఖ్య వారు 'కళావాణి' ఆధ్వర్యాన రాగరాగిణి నాటకాన్ని రవీంద్ర భారతిలో ప్రదర్శించారు. ఈ నాటకం యొక్క మూల పదార్థం పాశ్చాత్యుల సొత్తు అయినప్పటికీ, నాటకం యొక్క పోకడ, నటీ నటుల నటనా చాతుర్యం, సంభాషణలో నిజాయతీ, ఔచిత్యం, అన్నీ కూడా ఆంధ్రుల జీవితానికి ప్రతిబింబంగా నిల్చినాయి. భావాల సంఘర్షణకు అనుగుణంగా భాషా పటుత్వాన్ని సమకూర్చిన రచయిత శ్రీ గొల్లపూడి మారుతీరావు అభినందనీయులు, దర్శకుడు, రచయిత, నటీ నటులు పరస్పరం అర్థం చేసుకున్ననాడే ఉత్తమ నాటకానికి రూపకల్పన అవుతుందని, ఈ ప్రదర్శన సందర్భంలో శ్రీ కె. వి. గోపాలస్వామిగారన్నారు. ఈ నాటకం చూసిన తర్వాత, ఇలాంటి సహకారం పుష్కలంగా ఉన్నదనిపించింది.

* * *

ప్రెస్‌క్లబ్ వారిచ్చిన పార్టీలో డాక్టర్ డి. యస్. రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, తాము తలపెట్టిన కార్యక్రమాల్ని వివరించారు. తెలుగు జర్నలిజమ్ కోర్సును ప్రారంభించబోతున్నారు. మెట్రిక్ పరీక్షలు పై ఏడాది నుంచి నిర్వహించ బోతున్నారు. ఇప్పటి వరకు ఈ పరీక్షల కోసమని, హైదరాబాదు నుంచి ఇతర పట్నాలకు వెళ్లవలసి వచ్చేది. ఇక ముందు, విద్యార్థులకు అలాంటి శ్రమ తప్పిపోతుంది. దేశ భాషల్లో పెద్ద చదువుల కోసం ఈ విశ్వవిద్యాలయంలో జరిగిన ఏర్పాట్లు, దేశం మొత్తం మీద యే విశ్వవిద్యాలయంలో కూడా లేవన్నారు. ఆఫ్రికా ఖండం ఇప్పుడిప్పుడే జాగృతి చెందుతోంది. ఆ ఖండంతో, మన దేశం, సన్నిహిత సంబంధాలు యేర్పరుచుకోవటం అన్ని విధాలా మంచిది. అందువలనే ఆఫ్రికా దేశాల గురించి తెలుసుకోవటానికని ప్రత్యేకంగా 'కోర్స్'ను ప్రారంభించాము. ఇక్కడ విద్యార్థులను కొంత మంది ఆయా దేశాలకు, చదువు నిమిత్తం పంపే ఏర్పాటు కూడా చేస్తున్నాం. బాగా తెలివితేటలు గల విద్యార్థులకు ప్రత్యేకంగా కోర్స్ నొకటి యేర్పాటు చేసి, వాళ్లకు ఇతోధికంగా ప్రోత్సాహమిస్తూ, వారి శక్తి సామర్థ్యాలను బాగా పెంపొందించుకోవటానికి బాగా



ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితులైన శ్రీ పట్టం ఎ. తానుపిళ్లైకు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఈ నెల 3 వ తేదీన బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం చెప్పినప్పటి చిత్రం.

అవకాశం ఇస్తున్నాం. ఈ విధంగా పరీక్షలు పెట్టి బి. ఏ. బి. యస్. సి. కోర్సులలో ఉన్న కొంత మంది విద్యార్థులకు, విడిగా శిక్షణ ఇవ్వటం జరుగుతోంది. తగినంత మంది విద్యార్థులుంటే ఇతర కాలేజీల్లో కూడా, ఈ పద్ధతినే అమలు చెయ్యటం జరుగుతుందన్నారు. సాయం కళా శాలలో, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సును ప్రారంభించక పోవటానికి కారణాలు చెపుతూ, వాటికి యెక్కువ శ్రద్ధా సక్తులుండాలని, ఏడెనిమిది గంటలు, ఆఫీసులలో పనిచేసి, సాయంత్రం పూట ఈ కోర్సును చదవాలంటే సాధ్యపడదనీ అన్నారు.

వైస్ ఛాన్సలర్ ఎన్ని అనుకున్నప్పటికీ, వాట న్నింటిని అమలులో పెట్టటం సాధ్యంకాదని, యూనివర్సిటీ గ్రాంట్సు కమీషన్ వారు ఇంటర్ యూనివర్సిటీబోర్డువారు, ఇతర యూనివర్సిటీలు, ప్రభుత్వం వారు, ఇంతమంది ఆమోదిస్తేగాని, ఏ కొత్త పద్ధతినీ ప్రవేశ పెట్టటానికి సాధ్య పడదని అన్నారు. ఉదాహరణిస్తూ, తాను ఈ పరీక్షల పద్ధతిలో విప్లవాత్మక మైన మార్పు నొకటి తీసుకు రాదలచుకున్నప్పటికే మిగతా వాళ్ల సహకారం లేక, అది ఆగిపోయిందని అన్నారు. అదేమిటంటే విద్యార్థులకు, పుస్తకాలిచ్చి, సమాధానాలు వ్రాయ మనటం దీనివలన విద్యార్థుల అసలు తెలివితేటలు బైట పడిపోతాయి. పైగా కాపీ కొట్టటమనే దురలవాటు తగ్గి పోతుందనీ డాక్టర్ డి. యస్. రెడ్డి గారన్నారు.

అన్నట్టు, కూకటిపల్లి దగ్గర సింథటిక్ డ్రగ్స్ ప్రాజెక్టులో రీసెర్చి లేబరేటరీ, పైలట్ కర్మాగార విభాగానికి, కేంద్ర మంత్రి శ్రీ ఓ. వి. అలగేశన్ శంఖు స్థాపన చేశారు. ఇరవై కోట్ల వ్యయంతో నిర్మాణ మవుతున్న ఈ ప్రాజెక్టు 1966 నాటికి పూర్తి అవుతుందని, అప్పటికి ఉత్పత్తి కూడా ప్రారంభ మవుతుందని అంచనా, ఈ ప్రాజెక్టుకు కావలసిన సాంకేతిక సిబ్బందిని, తయారు చెయ్యటానికి, ఉస్మానియా యూనివర్సిటీ వారు, ఆయా కోర్సులను ప్రవేశ పెట్టబోతున్నారు కూడా.

ఈ మధ్య నగరంలో సినిమా పరిశ్రమను గురించిన హడావిడి కొంతవరకు సద్దుకుంది. అక్కినేని నాగేశ్వరరావుగారు అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత, మళ్లీ సంచలనం ప్రారంభ మవుతుందని, సారథీ స్టూడియోస్ బాగా 'బిజీ'గా ఉంటుందని అనుకుంటున్నారు. ఆదుర్తి సుబ్బారావుగారు తల పెట్టిన తేనె మనసులు త్వరలో షూటింగ్ ప్రారంభం కాబోతోంది. నటీ నటులంతా కొత్త వాళ్లు కాబట్టి, ఎన్నికలో తప్పని సరిగ్గా టైం తీసుకోవాలిసి వుంటుంది. ఇదిట్లా ఉండగా జి. వరలక్ష్మి గారు, హైదరాబాద్‌లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, నటీ నటులకు కావలసినంత శిక్షణిచ్చి, ప్రతి చిన్న నటుని కోసం, మద్రాసు పరుగెత్తే అలవాటును, నిరుత్సాహపరుస్తా మంటున్నారు. ఈ నాటి యువతీ యువకుల్లో, సినిమాలో నటించాలనే అభిలాష ఎక్కువగా కనిపిస్తోందని, అలాంటప్పుడు వాళ్ల ఆకాంక్షను స్వప్రయోజనాలకు ఉపయోగించుకుని, కొంత మంది మోసగిస్తున్నారని,దీన్ని అరికట్టుతూ నిర్మొహ మాటంగా, సినిమా రంగంలో ఉపయోగ పడే వారికే శిక్షణ ఇవ్వటానికి, ఈ కేంద్రం కృషి చేస్తుందనీ అన్నారు.

జనరల్ శ్రీ నగేష్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా పదవి విరమించి, మైసూర్ రాష్ట్రానికి గవర్నర్‌గా వెళ్లారు. నిజానికి నగేష్‌గారు హైద్రాబాద్‌కు కొత్తేమీ కాదు. వారి తండ్రిగారైన డాక్టర్ మల్లన్నగారు హైద్రాబాద్‌లో ప్రముఖ వ్యక్తి, అందువలన, నగేష్‌గారు బాల్యం ఇక్కడే గడిపారు. సర్వసేనాధిపతి పదవి అలంకరించటానికి నాందీ ప్రస్తావన ఇక్కడ కూడ బొలారమ్‌లోనే జరిగింది. ఈ రెండేళ్ల కాలంలో కూడా, అన్ని వర్గాల వారికి అతి సన్నిహితుడయ్యాడు. సాంఘిక సంక్షేమ కార్యకలాపాల్లోనూ, ఇతర ప్రజాహిత కార్యాల్లోనూ దంపతులిద్దరూ కూడా అత్యంత శ్రద్ధా శక్తులు ప్రదర్శిస్తూ, మన్ననలకు పాత్రులయ్యారు. రాజకీయాల్లోంచి వచ్చిన వ్యక్తి కాబట్టి, విధుల నిర్వహణలో సమర్థత, క్రమ శిక్షణ, నిష్పాక్షిక దృష్టి, ఆయనలో మూర్తీభవిస్తూ కనిపించేవి. నిజానికి ఇలాంటి వ్యక్తులు ఆంధ్రప్రదేశ్‌కు చాలా అవసరం కూడా !

ఒకే రోజున పాత గవర్నర్‌గార్కి వీడ్కోలు, కొత్త గవర్నర్ గార్ని ఆహ్వానించటం జరిగింది. పట్టం తానుపిళ్లెగారు గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను తన సొంత రాష్ట్రంగా అభివర్ణించారు. ప్రజల దృక్పథంలో సేవా లక్ష్యం, సానుభూతి, సహనం, ప్రేమ, ఉదాత్తభావం కలిగి ఉండాలని, రాష్ట్ర ప్రజలను ఉద్దేశిస్తూ ఉద్బోధించారు. కార్యదీక్షతో పని చేస్తూ, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి తోడ్పడమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎనభై ఏళ్ల వయస్సుగల పిళ్లెగారు, మూడు సార్లు కేరళ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికయి, ఆరాష్ట్ర రాజకీయాల్లో పెనవేసుకుని పోయారు. ఆంధ్ర కేసరి ప్రకాశంగారి మాదిరిగానే, అజేయుడైన నాయకునిగా కీర్తి పొందారు. ఓ సమయంలో కాంగ్రెసు నుంచి తొలగిపోయి, ప్రజా సోషలిస్టు పార్టీ నాయకత్వాన్ని స్వీకరించి, ఆ పార్టీ నాయకునిగానే ముఖ్యమంత్రి పదవిని అలంకరించారు. పట్టుదల, అహర్నిశాలు కృషి చేయుగల స్తోమత, చావగల నాయకుడు. ఈ కొత్త గర్నవర్‌గారి ముందు కార్య నిర్వహణలో జాప్యం ఉంటానికి అవకాశాలుండవని ఆశిద్దాం.

జి. ఎల్. ఎన్. ★

ఇంటింటి పజ్యాలు

ఆరుద్ర

అనుపానం పులిపోలు

ఉన్నప్పుడు నా వంట్లో కొద్దిగ నలత
ఉండబోదు అడ్డమైన సలహాల కొరత
వేయమంటా డొకాయన శొంఠి గంధపట్టు
పీల్చమంటా డొకాయన ముక్కు పొడుం పట్టు
ఉచిత వైద్యానికే కట్టుకొని కంకణం
ఉండమంటా డొకాయన రోజుకో లంఖణం
అన్నిటికీ కారణం నిజంగా అజీర్ణం
అంచేత తినమంటాడు ఆవదం గింజల చూర్ణం
తానిచ్చే తైలం ఖరీదొక అర్ధణా
తప్పక చేయాలి తలపైన మర్ధనా
ఇంకోడికే మందన్నా చాలా అసహ్యం
ఇస్తాడు అందుకే పిడుక్కీ బియ్యానికి ఒకటే లేహ్యం
ఉప్పూ కారం తినే నాపాలిటి నరకుడు
చప్పిడి చేయమంటాడో చాదస్తం చరకుడు
కషాయ మంటాడో ధన్వంతరి చిన్నన్న
నిషాయ మంటాడో ఉమర్ఖయాం పెద్దన్న
ఎవరేం చెప్పినా నేన్చెయ్యనా చికిత్స
ఎందుకంటారా? నా కింకా పోలేదు జీవితేచ్ఛ. ★

హుసేన్ సాగర్

శివమూరి శమంత



ఆంజనేయులుగారు గుంటూరులో పొగాకు వ్యాపారం చేసి లక్షలు గడించారు. ఇంటి పేరేమో అందరూ మర్చిపోయారు. పొగాకు ఆంజనేయులనే వ్యవహరించేవారు. ధనం ఆర్జించడం కేవలం స్వార్థం కోసరమని అతడనుకోలేదు. ఉన్నది ఒక పుత్రుడు. అతనికి కావలసినంత ధనం ప్రత్యేకంగా ఉంచి మిగతా ధనం అనాథ శరణాలయాలకు, సేవా శ్రమాలకు దానం చేసేవాడు.

ఆంజనేయులు కృష్ణభక్తుడు. అందుచేత పుత్రునకు గోపాలరావు అని పేరుపెట్టాడు పది సంవత్సరాల ప్రాయం నుంచే చదువుతో పాటు మురళి నేర్పించాడు. కొడుకును గోపీ అనే పిలిచేవాడు ఆ పేరే వాడుకలోకి వచ్చింది.

ఒక రోజు గుంటూరులో సంగీత సభ జరిగింది. దానిలో సంజీవరావుగారు మురళి వాయించారు. సభకు ఆంజనేయులుగారు కొడుకును తీసుకు వెళ్ళారు. ఆ గానం వింటూ ఉంటే గోపీ లోకాన్నే మరిచిపోయాడు. సభ ముగిసిన తర్వాత సంజీవ రావుగారికి ఆంజనేయులింట్లో విందు ఏర్పాట్లు చేశారు. హేమాహేమీలు, గాయకులు, గాన ప్రియులువచ్చారు. ఆంజనేయులుగారు సంజీవరావు గారిని ఉచితరీతి సన్మానం చేసిన వెనుక వినయంతో ఆయన్ని తన కుమారుని మురళి గానాన్ని వినమని ప్రార్థించారు. గోపీ ఉత్సాహంతో మురళి వాయించాడు. సంజీవరావు విని చాలా మెచ్చుకొన్నాడు. "ఇంత చిన్న వయసులో ఇంత నిర్దుష్టంగా ఇంత బిగువుతో వాయించిన వాళ్ళను నేను చూడలేదు" అని. వెళ్ళేటప్పుడు ఆంజనేయులుతో కుమారునికి గాత్రపాట కూడ నేర్పించమన్నాడు. గోపీ అతనికి నమస్కారం చేశాడు. సంజీవరావు దీవించాడు. తండ్రి గోపీకి గాత్రపాట నేర్పడానికి ఏర్పాటు చేశాడు, కొడుకు గీతాలు వర్ణాలు పాడుతూ ఉంటే ఆలకించిన తండ్రికి ఆశ్చర్యం ఆనందం రెండూ కలిగినవి. ఎంత మధురమైన కంఠం! ఎంత స్వర శుద్ధి ! ఎంత తాళజ్ఞానం ఇంత వయస్సులో ఇంత సామర్థ్యం కలుగదు అనుకొన్నాడు తండ్రి.

గోపీ స్కూల్లో చదువుకున్నాడు. తెలుగు ఉపాధ్యాయుడు. క్లాసులో అతని చేత పద్యాలు చదివించేవాడు. కళ్ళు మూసుకొని ఆనందంతో ఆలకించేవాడు. బడి వదిలిన వెనుక తోడిబాలురు అతన్ని భజనలు, సినిమా పాటలు పాడమనే వారు. అతడు పాడుతూ ఉంటే వాళ్లందరూ చేతుల్తో తాళం వేసేవారు. గోపాల బాలుర మధ్య అపరబాలకృష్ణు నివలె ఉండేవాడు. ఎక్కువ శ్రద్ధగా చదవకపోయినా ప్రతి క్లాసు పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకొనేవాడు. స్కూల్ ఫైనల్ ప్యాస్ కాగానే తండ్రి గోపీని చదువు మాన్పించాడు. తన అనంతరం వ్యాపారం చూచుకోవలసిన వాడు ఇప్పటి నుంచి నేర్చుకుంటే తర్వాత తనే సర్వం నడప గలడు. ఈ ఉద్దేశంతో ఒక శుభదినం గోపీని ఆఫీసుకు తీసుకొని వెళ్లి ప్రవేశ పెట్టాడు. ఆఫీసు మానేజరు కోదండరావు ఆంజనేయులు గారికి కుడి భుజం. తెలివి, అనుభవం, దూరదృష్టి, సమయ స్ఫూర్తి అన్నీ ఉన్నవి అతనికి. వీటితోపాటు అసమానమైన విశ్వాసం. అతని నిరంతర కృషి వల్లనే ఆంజనేయులుగారి వ్యాపారం అభివృద్ధి అయింది. గోపీకి అతనికన్నా మంచి గురువు దొరకడు అనే నమ్మకంతో గోపీని అతని శిక్షణలోకి వదిలాడు.

రోజంతా లెక్కలు చూడడం, కాంట్రాక్టులు పఠించడం ఆసాములతో కోదండ రావు చేసే లావాదేవీలు గమనించడం గోపీకి ఏమీ నచ్చలేదు. విధిలేక పండ్లు బిగ బట్టుకొని కొన్ని ఘంటలు రోజూ ఆఫీసులో గడిపేవాడు. తండ్రి అంటే చనువున్నా భయం కూడా. తల్లి దగ్గర గారాబం ఉన్నా తండ్రి మాట జవదాటడానికి తల్లి కూడా సమ్మతించదు.

ఒక రోజు రాత్రి భోజనానంతరం ఆంజనేయులుకు భార్య తాంబూలం అందిస్తూ గోపీ వివాహం ప్రస్తావన తెచ్చింది.

"ఇరవై యేండ్లయినా రాలేదు. అప్పుడే పెళ్లేమిటే" అన్నాడతను.

"అదేమిటండీ, మీకు పెళ్లయినప్పుడు ఎంత వయసు. పదహారేండ్లే కదండీ"

"ఆ రోజులు వేరు. నీకప్పుడు పదేండ్లు. చీర కట్టుకోవడానికి తెలియదు" అని పరిహాసం చేశాడు.

"అబ్బ ! మీరే నేర్పించినట్టు."

"పోనీలే. కానీ, పిల్లల్ని వెదకొద్దూ ?"

"అదేమిటండీ. మన సుమిత్ర ఉన్నప్పుడు. అన్నయ్య కున్నదే ఆ బిడ్డ. వదిన పోయినప్పటి నుంచి ంతో ఆదరంగా పెంచాడు..... చురుకైన పిల్ల.... మంచి తీరు...."

"ఇంకా చెప్పు, మేనత్తను పోలి చక్కని చుక్క."

"పొదురూ. ముసలమ్మని నన్ను వేళాకోళం చేయాలి కాబోలు."

"ఓహో ! నేను ముసలాణ్ణని దెప్పడమా. ఏం చేద్దాం ఇప్పుడు"

"అన్నయ్యకు మంచి భూస్థితి."

"గోపీకి నేను గడించిన డబ్బు చాలదూ ?"

"అది కాదండీ. సంప్రదాయం, తాహతూ అన్నీ సరిపోతవి అన్నాను."

"సరేలే. ఒకసారి మీ అన్నయ్యని సుమిత్రతో రమ్మను. మన గోపీ అమ్మాయిని ఎప్పుడో చిన్నప్పుడు చూసి ఉంటాడు. ఇప్పుడు చూస్తే బాగుంటుంది."

"అలాగే వ్రాస్తాను. మీరు రమ్మన్నట్లుగా."

వారాంతంలో విశాలమ్మ అన్న వెంకటేశ్వర్లు కూతురితో వచ్చాడు. సుమిత్ర బావను చూడగానే అతని మీద మనసు లగ్నమై పోయినది. ఆ విశాల ఫాలం, ఆ నొక్కు తలకట్టు, ఆ వంపు కనుబొమలు, పలుచని చెక్కిళ్ళు, చూచి మెచ్చుకున్న మగువలకు తక్కువ లేదు గాని గోపీకి సంగీతం మీద తప్ప తదన్యం దేని మీదా ఆసక్తి లేదు. యవ్వన సహజమైన కోర్కెలే లేవు. సుమిత్ర తన మామ కూతురు. ఆప్త బంధువు. చిన్నప్పుడు తనతో ఆడుకునేది. ఇప్పుడు పెద్ద దయినది అంతే, మొమాటం లేకుండా మాట్లాడే వాడు. సిగ్గుపడే వాడు కాదు. మనసులో ఏ అభిప్రాయం లేనందువల్ల, వచ్చిన మర్నాడు సాయంత్రం డాబా మీద గోపీ మురళి వాయిస్తూ ఉంటే సుమిత్ర వచ్చి కూర్చుంది వింటూ. గోపీ ఆపకుండా పాట ఆఖరయ్యే వరకూ వాయించి, అడిగాడు "పాట నేర్చుకున్నావా" అని. లేదని తల వూపి, "అయితే పాట అంటే చాలా ఇష్టం. అమ్మ చచ్చిపోయాక ఇంట్లో ఎవరున్నారు, నాన్న తప్ప. ఎవరూ నేర్పించలేదు" అన్నది. గోపీ జాలిపడి "అయ్యో" అన్నాడు బాధతో "నీవు నేర్పిస్తే నేర్చుకుంటాను బావా" అన్నది సుమిత్ర ఏదో అవ్యక్తమైన అంతరంగిక భావంతో గోపీ నవ్వి వూరుకున్నాడు.

"బావా ఏదైనా పాడవూ? మీరా భజన్లు బాగా పాడతావట."

"వినేవాళ్ళుంటే పాడడానికి సర్వదా సిద్ధంగా ఉంటాను" అని "మై హరి చరణోంకే దాసీ" అనే మీరా భజన పాడి విన్పించాడు. బావ ఇంత అద్భుతంగా పాడగలడని సుమిత్రకు తెలియదు. "ఎంత హాయిగా పాడావు బావా నీ పాట వింటే అన్నాహారాలు అక్కరలేదు" అని చెప్పి తనలో తాను ఏవో కలలు కనజొచ్చింది. ఇతని అర్ధాంగిగా ఉంటే జీవితం ఎంత ఆనందమయంగా ఉంటుంది. తన కట్టె భాగ్యం కలుగుతుందా, గోపీ ఏమీ బదులు చెప్పలేదు. చీకటి పడుతోంది. క్రిందికి వెళ్దామా, అని దారి తీశాడు.

వారం రోజులుండి వెంకటేశ్వర్లు కూతురుతో హైదరాబాదు వెళ్లిపోయారు. గోపీ సుమిత్రతో కలిసి మెలిసి ఉండడం చూచి ఆంజనేయులు, విశాలమ్మ గోపీకి సుమిత్రను వివాహం చేసుకోడానికి ఇష్టమేనని తీర్మానించుకున్నారు గాని అతన్ని పరిష్కారంగా అడగలేదు. కుర్రవాడు వాణ్ణే అడగడమెందుకన్నాడు తండ్రి, విశాలమ్మ అన్నయ్యతో తమ అభిప్రాయం చెప్పింది. అతనికి అపరిమిత సంతోషమైంది. సుమిత్రను అడగ లేదు. అనవసరమని.

వారు వెళ్లిన పదిరోజులకు ఆంజనేయులు జబ్బు పడ్డాడు. అనేక సంవత్సరాలుగా ఉన్న నీరు వ్యాధి విపరీతంగా పరిణమించింది. మందులు, ఇంజెక్షన్లు ఉపయోగం లేక పోయినవి. మూడు రోజులు స్మరణ లేకుండా ఉండి నాల్గవ రోజు కాలం చేశాడు. విశాలమ్మ దుఃఖం చూడలేక పోయాడు. గుంటూరులో ఉన్న పెద్ద వారందరు వచ్చి ఆఖరు నమస్కారం చేసి వెళ్లిపోయారు. గోపీకి జీవితంలో ఇదే మొదటి దెబ్బ. స్తంభించి పోయాడు. తల్లిని వోదార్చడాని కయినా శక్తి లేక పోయింది.

ఎలాగో రోజులు గడిచాయి. కార్యానికి వెంకటేశ్వర్లు మాత్రం వచ్చి రెండు రోజులుండి వెళ్ళి పోయాడు. రోజుల వెంట నెలలు గడిచాయి. తండ్రి చనిపోయిన నాటి నుండి గోపీ ఆఫీసుకు వెళ్లలేదు. దానికి కారణం దుఃఖం కాదు. గోపీకి వ్యాపార వ్యవహారాలంటే తలనొప్పి. తండ్రి కోసరం ముక్కు పట్టుకొని ఆఫీసులో కూర్చునే వాడు. అంతే కోదండరావు రెండు మూడు సార్లు వచ్చి ప్రార్థించాడు. కనీసం వారానికి ఒక్కసారైనా వస్తే బాగుంటుందని. గోపీ వెళ్లలేదు.

ఆంజనేయులు గారికి హైదరాబాద్‌లో సిగరెట్ ఫ్యాక్టరీ ఉంది. మాధవరావు కోదండరావు మేనల్లుడు దానికి మానేజరు. అప్పుడప్పుడు లెక్కలు కట్టడానికి, ముఖ్య విషయాల్లో సలహా

హుసేన్ సాగర్

్రకు గుంటూరు వచ్చేవాడు. మాధవరావుకు కోదండరావుకూ ఎంతో తేడా. మాధవరావు తెలివి గలవాడే గాని భోగ లాలసుడు. గుంటూరులో ఒక సాని, హైదరాబాదులో ఒకసాని ఉన్నట్లు ప్రతీతి. గోపీకి ఈ సంగతి తెలియదు గానీ అతనికి నృత్య సంగీత కళలంటే అభిరుచి, వాటిలో జ్ఞానం ఉన్నదని తెలుసును. అతడు గోపీ పాటను ఎక్కువగా పొగిడేవాడు. అందుచేత గోపీ మాధవరావుతో మిత్రుని లాగు ప్రవర్తించేవాడు.

ఒక రోజు కోదండరావు చిన్న బోయిన ముఖంతో వచ్చి గోపీ దగ్గర నిలబడ్డాడు, లెక్క పుస్తకాలతో. గోపీ కూర్చోమని చెప్పి రాకకు కారణం అడిగాడు. కోదండరావు పొగాకు వ్యాపారంలో చాలా నష్టం వచ్చిందని చెప్పాడు. వ్యాపారం యథారీతిగా నడిపించాలంటే బ్యాంకుల వద్ద అప్పు తీయవలసి ఉంటుందన్నాడు. ఆస్తి హామీగా ఇయ్యకపోతే బ్యాంకీవారు అప్పు ఇవ్వరు. ఈ కథ అంతా గోపీకి విసుగు పుట్టించింది. చికాకుగా అన్నాడు "అయితే కోదండరావుగారూ, వ్యాపారం ఆపేస్తేనే మంచి దేమో. అప్పు తీసి సాగిస్తే మాత్రం నష్టం రాదని చెప్పగలరా అసలు నాకీ వ్యాపారం అంటేనే అభిలాష లేదు. హైదరాబాద్ ఫ్యాక్టరీ బాగా నడుస్తూ ఉందన్నాడు మాధవ....అది చాలును."

కోదండరావు మొదలంట కొట్టేసిన చెట్టు లాగ కూలిపోయాడు. తన బుద్ధి, తన కాలం, తన శ్రమ— తన జీవితమంతా ఈ వ్యాపారానికి ధారపోశాడు. ఆంజనేయులు గారికి లక్షలు గడించి ఇచ్చాడు. ఆ వ్యాపారం ఇప్పుడు చాలించడమా! బ్రతకడానికి వీలు లేకకాదు. తాను. తన భార్య— ఇద్దరికీ చాలినంత స్థితి ఉంది. కాని తాను పెంచి పెద్ద చేసిన సంస్థను తాను బ్రతికి ఉండగానే చంపేయడమా? కోదండరావు పలుకలేదు. గోపీ లేచి "వేరే మార్గం లేదు.... ఆ! తమకు ఏదైనా పెన్షను ఏర్పాటు చేస్తాలెండి" అని చెప్పి లోపలికి వెళ్తుంటే కోదండరావు కూడా లేచి "అక్కర లేదు. నమస్కారం. ఈ లెక్కల పుస్తకాలు వదిలి వెళ్తున్నాను." అని కండ్ల వెంబడి నీరుకారుతూ నమస్కరించి వెళ్లిపోయాడు. గోపీ ఒక్క క్షణం బాధ పడ్డాడు. నిట్టూర్చి పైకి వెళ్లాడు.

ప్రథమ ఆబ్దికం అయిపోయింది. కాని ఆ ఇంట్లో గోపీకి వాయించడానికిగాని, పాడడానికి గాని మనస్కరించలేదు. ఒకరేమన్నా అనుకుంటారని కాదు. తనకే ఉత్సాహం లేదు. మాధవరావు గుంటూరు వ్యాపారం కట్టేసిన వెనుక ఒకసారి వచ్చాడు. గోపీతో సంగీత ప్రస్తావన చేశాడు. గోపీ తల నిమురుకుంటూ అన్నాడు. "ఏమో, మాధవా. ఈ ఇంట్లో సంగీతం వైపు బుద్ధి పోవడం లేదోయ్."

"రైట్. నిజం సెలవిచ్చారు. అందుకే నామనవి వినాలి. తమరు హైదరాబాద్ వచ్చేయండి. అక్కడ ఫ్యాక్టరీ కాంపౌండులోనే ఒక భవనం వుంది తండ్రి గారు స్వంత నివాసానికి కట్టించారు. ఎవరూ లేరని నేను అందులో క్రింద రెండు గదుల్లో ఉంటున్నాను. బ్రహ్మచారినికాకి భోజనం. తమరు అక్కడ వుండ వచ్చును. ఇంకొక్క విషయం. క్షమించగలరు. హైదరాబాద్‌లో హిందూస్థానీ సంగీతం ఎక్కువగా వృద్ధి చేసుకోడానికి అవకాశం వుంటుంది. తమకు ఆ సంప్రదాయమంటే ఎక్కువ ఇష్టం అనిచెప్పేవారు ..... ఒప్పి ఆలోచించండి ..... మీ ప్రతిభ రాణించాలంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్య పట్టణమే ఉచిత స్థానం."

మాధవరావు వెళ్లిపోయినా అతని మాటలు నిలిచినవి. గోపీ మనసు ఆలోచనాపూరితమైనది. ఈ ఊరు వదిలితే — హైదరాబాదే వెళ్లాలి. తన ఫ్యాక్టరి ఉంది అంతకన్నా ప్రబల కారణం — సంగీతం — అమ్మను వదిలి వెళ్లడం ఇష్టం లేదు. మరి అమ్మ ఏమంటుందో? మెల్లగా ఈ విషయం తెలియజెయ్యాలి. ఇట్టి సందిగ్ధావస్థలోనున్న గోపీకి విధి సహాయ పడింది. వెంకటేశ్వర్లు విశాలమ్మకు ఉత్తరం వ్రాశాడు. కొడుకుతో సహా హైదరాబాద్ వచ్చి కొంతకాలం తన ఇంట్లో వుండమని. భర్త గతించినప్పటినుంచి వెనకబడిన గోపీ వివాహ విషయం మళ్లీ ముందుకు వచ్చింది. విశాలమ్మకు ఉత్తరం వచ్చిన రాత్రే గోపీతో చెప్పింది ఉత్సాహంతో — ఇంకేమి — రొట్టె విరిగి నేతిలో పడ్డదనుకొన్నాడు గోపీ. అయితే తన అభిప్రాయాలూ కోరికలు చెప్పలేదు. 'అలాగేనమ్మా' అని తల్లి ఆజ్ఞ శిరసావహించినట్లు ఉన్నాడు.

హైదరాబాద్‌లో గోపీకి నవజీవనం ప్రారంభమైనది. గుంటూరులో తండ్రి ఉన్నంతకాలం ఆయన ఆధీనతకు లోబడి ఉండడం అలవాటైపోయింది. తండ్రి చనిపోయినప్పటికి అతని స్మృతికి విరుద్ధంగా నడవడానికి సాధ్యం కాలేదు. హైదరాబాద్‌లో గోపీకి స్వాతంత్ర్యం లభించింది. తల్లి అంటే ప్రేమ, గౌరవం ఉన్నా భయం లేదు. మామయ్యకు లోబడి ఉండవలసిన బాధ్యత లేదు. క్రొత్తగా ఇట్టి పరిస్థితిలో దొరికిన స్వేచ్ఛను గోపీ సంగీతానికే వినియోగించాడు. మాధవరావు ఆ వూర్లో సరస్వతీ గాన సభకు కార్యదర్శి. అతనికి తెలియని గాయకులు లేరు. అతనిద్వారా ప్రఖ్యాత హిందూస్థానీగాయకుడు ఒక విద్వాంసుని , శిష్యుడై హిందూస్థానీ గానం అభ్యసించ నారంభించాడు. అనతికాలంలోనే నిపుణుడైనాడు. దైవ ప్రసాదితమైన ప్రతిభగలవారికి ఏ విద్య అయినా శీఘ్రంగా నేర్చుకునే సామర్థ్యం ఉంటుంది కదా.

ఇంట్లో గోపీ గురువుదగ్గర నేర్చుకున్నది పాఠం చేస్తూ ఉంటే సుమిత్ర వింటూ కూర్చునేది. తనకు కూడా సంగీతం వచ్చి ఉంటే ఎంత బాగుండేది అని చింతించేది. విశాలమ్మకూ వెంకటేశ్వర్లుకూ గోపీ ఈ విధంగా సంగీత సాగరంలో మునిగిపోవడం నచ్చ లేదుగాని ఆక్షేపించడానికి ధైర్యం చాలలేదు. వూరుకున్నారు. కొన్నిరోజులు గడిచిన వెనుక గోపీ అమ్మతో అన్నాడు. "అమ్మా నాకు హైదరాబాద్‌లోనే ఉండిపోవాలని ఉంది. ఎన్నిరోజులు మామయ్య ఇంట్లో ఉండడం. మన ఫ్యాక్టరీ దగ్గర ఇల్లు వుంది. మనదే. అక్కడ ఉండ వచ్చును." అమ్మ ఒప్పుకోలేదు. "మామయ్య, సుమిత్ర ఒంటరిగా ఉండడానికన్నా మనం కూడా ఉంటే సందడిగా ఉంటుంది." అని పైకి కారణం చెప్పినా లోలోపల ఆవిడ భావాలు భవిష్యత్తుకు పరుగిడినవి. శీఘ్ర కాలంలో గోపీకి సుమిత్రకు వివాహం జరుగుతుంది. అన్నయ్యకు గోపీని ఇల్లరికం ఉంచుకోవాలని ఆశ.

అప్పుడు అక్కడే ఉండిపోవచ్చు. ఇంతలో వేరేకాపురం ఎందుకు ?

మాధవరావు సలహాపైన గోపీ ఫ్యాక్టరీ బంగళా మేడను ఆక్రమించుకున్నాడు. పడకగదిలో మంచం వేయించాడు. హాల్లో సోఫాలు, కుర్చీలు, తివాచీలు, తన సంగీత సరంజామా అంతా అక్కడ చేర్చాడు. తంబూరా, తబలా, ఇత్యాది ప్రతిదీను గోపీ అతి శ్రద్ధగా అభ్యాసం చేస్తూ వచ్చాడు. సారంగి, ఫిడేలు, తబలా, మృదంగం వాయించే వాళ్ళని మాధవరావు కుదిర్చేవాడు. రెండునెలలయిన తర్వాత ఒక ఆది వారం సాయంత్రం సరస్వతీ గాన సభలో గోపీ కచేరీ ఏర్పాటు చేశాడు మాధవరావు. రేడియోలో రెండు మూడుసార్లు పాడాడు. కాని నిండు సభలో తాళ వాయిద్యాలతో ఎప్పుడూ పాడలేదు గోపీ. అందుచేత కొంత జంకు కలిగింది. కాని మాధవరావు ఉత్ప్రేక్షలు ఉత్సాహభరితుణ్ణి చేసినాయి.

సభ జనంతో క్రిక్కిరిసి పోయింది. మాధవరావు చేసిన ప్రకటన ప్రభావం వల్ల, ఆంధ్రులు, ఆంధ్రే తరులు వచ్చారు. ఇరవై, ముప్పయిమంది స్త్రీలు కూడా వచ్చి ప్రత్యేకంగా కూర్చున్నారు. బావ పాట వినాలని సుమిత్ర కూడా వచ్చింది. మొదట కొంత కాలం గోపీ మురళి వాయించాడు. అంత మధురంగా, అంత లయాన్వితంగా ఎవరూ వాయించగా వినలేదు. గనుక అపరిమితంగా మెచ్చుకొన్నారు. తర్వాత కర్నాటక పద్ధతిలో కాంభోజి రాగం ఆలాపించి "ఎవరి మాట" అనే త్యాగరాజకృతి, క్షేత్రయ్య పదం ఒకటి పాడాడు. ఆ వెనుక హిందూస్థానీ గానం, మాల్కౌస్ రాగంలో ఆలాప్ ఖయాల్, విలంబిత్, ద్రుత్ పాడి పీలులో ఒక ఠుమ్రీ — ఆఖరున ఒక అష్టపదితో కచేరి సమాప్తి చేశాడు. సభాసదులు మాటిమాటికి "హాయి, హాయి." "శహబాష్" "అచ్ఛీబాత్" అని ప్రశంసిస్తూ, ప్రతిపాట ముగిసిన వెంటనే కరతాళధ్వనులతో హాలు నింపేశారు. ఒక్క యువకుడు ఇంత సర్వంకషత్వం ప్రదర్శించడం అత్యాశ్చర్య మైనది. సభ జయప్రదమైంది.

ఆనాడు గోపీకి ఒక క్రొత్త అనుభవం ప్రాప్తించింది. కర్ణాటక సంగీతం ముగించిన వెనుక, వయలిన్, మృదంగం వాయించిన వాళ్ళు వెళ్ళి సారంగి, తబలా వాళ్ళు రావడానికి కొంత ఆలస్యమైంది. అప్పుడు సుమిత్ర ఎక్కడ ఉందో అని గోపీ స్త్రీలు కూర్చున్న వైపు చూచాడు. తక్షణమే సుమిత్ర ప్రక్కనున్న యువతిని చూచాడు. సుమిత్ర కన్న అందంలో మిన్నగాకపోయినా ఛాయలో నహా తక్కువయినా అపూర్వ లావణ్యం తొణకిస లాడుతూ వున్న ఆమె వదనం గోపీని వివశుణ్ణి చేసింది. ఒక స్త్రీ వ్యక్తిచే ఆకర్షింపబడింది ఆ తరుణంలోనే ఇంతకు పూర్వం ఎన్నడూ ఇట్టి అనుభూతి పొందలేదు. తర్వాత తాను పాట ఆపినప్పుడు ఆ వైపు, అంటే ఆమెను చూచే వాడు. మరికొంత సేపటికి పాడుతున్నప్పుడు కూడా ఆ వదనాన్నే చూస్తూ వచ్చాడు. కచేరీ ముగిసిన వెనుక సుమిత్రను పిలుచుకొని వెళ్ళడానికి ఆప్రక్క పోయినప్పుడు ఆ మగువ కనబడ లేదు.

ఆ రాత్రి గోపీ ఎంత ప్రయత్నించినా ఆ వదన బింబాన్ని మరచి పోవడానికి శక్యం కాలేదు. ఎవరామె ? పేరేమి ? ఏవూరు— ఎలా కనుక్కోవడం. సుమిత్రను అడిగితే ఏమనుకుంటుందో ! అసలు సుమిత్రకే తెలుసునో, లేదో ? మాధవరావు నడగడానికి సిగ్గు పడ్డాడు. ఏమీ తోచలేదు. మాధవరావు బుద్ధి అతి సూక్ష్మమైనది. అందులో ఇటువంటి విషయాల్లో తీక్షణంగా పనిచెయ్య గలడు. గోపీ దృష్టి ఏవైపు పడి నిల్చిపోయిందో గమనించాడు. తను పన్నిన పన్నాగం సఫలమైంది. రాధాదేవిని సుమిత్ర ప్రక్కన కూర్చో పెట్టినది అతని యుక్తే. గోపీ రాధ వంకనే చూడడం గమనించాడు. గోపీ పాటకన్నా గోపీ చూపులే అతనికి అతనికి ముఖ్యం. సరే ! మొదటి ఎత్తు తనదే. అయితే జాగ్రత్తగా పైకి వెళ్ళాలి. గోపీ లోకజ్ఞానం లేనివాడు. మొదటనే పచ్చిగా ప్రసంగిస్తే సహించలేడు. మంచి యవ్వనంలో ఉన్నాడు. రసికుడు. రాధాదేవి ఇంద్రజాలాన్ని నిరోధించలేడు. నాటకంలో ప్రథమ రంగం సంగీతంలో ప్రారంభించాలి. అదే సులభ మార్గం.

కచేరి జరిగిన మర్నాడ సాయంత్రం మాధవరావు గోపీని కలుసుకున్నాడు. వూరిలో ప్రముఖులందరూ అతని గానప్రావీణ్యాన్ని స్తుతించారని చెప్పాడు. గోపీ అంత ఉత్సాహం కనబరచలేదు· అతని మనసు అన్యాయత్తంగావుండడం కనిపెట్టాడుమాధవరావు. దానికి కారణం గ్రహించాడు. గోపాలకృష్ణుడు రాధ కోసరం పరితపిస్తున్నాడని లోలోన నవ్వుకున్నాడు. ఇదే సమయము. "మీతో ఒక విషయం మనవి చేసుకోవాలని వచ్చాను. సభాసదులందరూ మీగానాన్ని మెచ్చుకున్నారు. శబాష్ అన్నారు. వెళ్ళిపోయారు. బహుశా ఈ పాటికి మరిచిపోయి ఉంటారు. అయితే ఒక వ్యక్తి మాత్రం పరవశం అయిపోయింది. మిమ్మల్ని గురించే కలవరిస్తూ వుంది. ఆవిడకు సంగీతం బాగా వచ్చు. ఆమె కంఠం అంత సొంపుగా ఉంటుందని ఆమెకు కిన్నెరసాని అని బిరుదు."

ఈ మాటలు వింటున్నాడు గోపీ సరధ్యాన్నంగా. "ఏమండీ వింటున్నారు కదూ. ఆ అమ్మాయిని సభలో చూచారో లేదో. మీ సుమిత్రమ్మ ప్రక్కనే" ఈమాట వినగానే గోపీ ఉలిక్కిపడ్డాడు. గుండె కొట్టుకుంటూ వుంది. ఆవిడే ! ఆవిడే ! సుమిత్రకు ఇంకోవైపు ఎవరో ముసలమ్మ కూర్చుండినది. మాధవరావు గ్రహించాడు గోపీ ఆదుర్దా.

"ఆమె పేరు రాధాదేవి. ఆవిడది పెద్ద కోరిక, మిమ్మల్ని కలుసుకోవడమే కాదు. మీకు తనపాట వినిపించాలని కూడా ....."

"తప్పకుండా" అనేశాడు గోపీ.


"అయితే ఒక చిక్కు. మీ మామయ్య ఇంటికి వచ్చి కలవడం బాగోదు, ఏమంటారు ?"

"అవును"

"తమరు ఆవిడ ఇంటికి వెళ్తే తమకు స్వేచ్ఛగా ఉండదు. తమకు అభ్యంతరం లేకపోతే రేపు సాయంత్రము బంగళాకు నాతో పిలుచుకొని వస్తాను. ఏదో ఒక గంటసేపుండి వెళ్ళిపోతుంది." గోపీ తీవ్రంగా "అభ్యంతరం ఎందుకు. ఇందులో తప్పేమీ లేదే" అన్నాడు.


మరుసటి దినం గోపీకి నిమిషాలు గంటలుగా, గంటలు దినాలుగా తోచాయి. సాయంత్రం అయిదు గంటలకే బంగళా మేడమీద హాల్లో కూర్చుని, ఏచప్పుడైనా వాళ్ళేనని కిటికీలో నుంచి చూచి మళ్ళీ నిరాశతో సోఫా చేరేవాడు. అబ్బ ! వాళ్ళే వస్తున్నారు ...... అవును. ఆ సుందరీమణే. ఏ సందేహం లేదు. పైకి వచ్చారు. ఆమె నమస్కారం తన నమస్కృతితో అందుకుని కూర్చోమని సోఫా చూపించాడు. మాధవ తానూ ఒక కుర్చీలో కూర్చున్నాడు. గోపీ ఒక్కసారి రాధను కలియజూచినాడు. ఆకాశవన్నె చందేరీ చీర వెండిసరిగ కొంగు, వాల్జడ, మల్లెపూలు, కుంకుమబొట్టు, కండ్లకు కాటుక. రాధగోపీతో అన్నది. "మీవంటి శ్రీమంతులు నావంటిదానికి దర్శనం ఇంత సులభంగా ఇయ్యగలిగారంటే మీ కళారాధనకే గాదు, సౌజన్యానికి కూడా తార్కాణం." ఎంత చక్కని మాటలు అని మెచ్చుకున్నాడు గోపీ లోపల, పైకి అన్నాడు. "కళాప్రపంచంలో ఎక్కువ తక్కువలు లేవు." "ఏం రాధాదేవీ,

51 వ పేజీ చూడండి



"ఏరా నిత్యానందం?... నీ పెళ్ళయి పట్టుమని పదిరోజులు కూడా కాలేదు... అప్పుడే మొదలయిందా నీకూ ఇంట్లో??...

సరాగమాల



వి.ఎ.కె. రంగారావు

నా పర్యటనలో నెల్లూరు, తెనాలి, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, తుని విశాఖ పట్టణం, కాకినాడ, గుడివాడ, బందరు, తిరుపతి మొదలగు వూళ్లలో ప్రతి గ్రామఫోను డీలరుని కలుసుకున్నాను. వారు చెప్పగా, కొంత వారి సాధక బాధకాలను తెలుసుకున్నాను. ఇద్దరు, ముగ్గురు అతి చక్కగా నిర్వహిస్తున్నవారూ, అంతేపుంది అతి అసహ్యంగా నిర్వహిస్తున్నవారూ తప్పితే, తక్కినవా రందరూ బాగానే నడుపుతున్నారని చెప్పాలి. ఈ బాగానే నడపటం వారి వ్యాపార దృష్టిలో లేదు. రికార్డులు కొనడానికి వెళ్లిన శ్రోతను సరియైన పద్ధతిలో ఆదరిస్తున్నారా లేదా అన్న దృష్టితో మాత్రమే. వారి వ్యాపార దృక్పథాలు ఎలా ఉన్నవో వారికే అవసరముగాని సరాగమాల పాఠకులకు కాదు.

అతి చక్కగా నిర్వహిస్తున్నారన్నానే, వారిని గురించి తెలుసుకొనే ముందు వారికి పరస్పరం విరుద్ధమైన మార్గంలో నడిపేవారి గురించి రెండు మాటలు— ఆ డీలర్ల పేర్లు యిక్కడ ఉదహరించటంలేదు. కాని, వారికీ ఆ షాపులో కొనుక్కోవలసిన అగత్యం ఉన్నవారికి వెంటనే తెలిసిపోతుంది.

ఒక షాపులో గత రెండేళ్లలో విడుదలయిన ఒక్క రికార్డు లేదు. అన్నీ పాతవి. కనకతార, సీతా రామకల్యాణం, భూకైలాస్ మొదలగు చిత్రాల రికార్డులు వారికి సరికొత్తవి. సరే. ఇక వాటి స్థితి. ఆరు నెలలు అతి జాగ్రత్తగా ఏంప్లిఫైయర్ల మీద అరగదీసినట్టు ఉన్నవి. నిజంగా అలానే చేశారో లేక అజాగ్రత్తగా ఉండటంవలన అలా తయారయినవో వారికే తెలియాలి. ఆ షాపులోనే రికార్డులు వినటానికి ఒక గ్రామఫోనూ లేదు. ఇదేమిటండీ అని అడిగితే ఉన్నది చెడిపోయినదట. మరొకటి రిపేరునకు వెళ్లినదట. కొత్త ఎలక్ట్రిక్ ప్లేయర్‌కి ఆర్డరిస్తే కంపెనీవారు రెండు నెలలుగా పంపలేదట. అయితే మొదటి రెండూ నిజము కావచ్చు గాని ఆఖరిది మాత్రం కాచి వడబోసిన అబద్ధం. ప్లేయర్ ఆర్డరిస్తే వారంలో పంపుతున్నారు కంపెనీవాళ్లు. ఏం వాళ్లకు మాత్రం అమ్మకం అక్కరలేదా! ఇక ఆ షాపు స్వంత దారునితో మాట్లాడి లాభంలేదని తెలుసుకున్నాను. ఆ వూళ్లో రికార్డులు ఎవరికి కావలసినా చుట్టు పక్కల వూళ్లకు వెళ్లి, అంటే ఇరవై ముప్ఫై మైళ్ల పైచిలుకే, తెచ్చుకుంటారట.

మరొక వూళ్లో ఆ షాపులో దొరికే వస్తువు లేవని అడిగేకన్న దొరకనిది ఏది అని అడిగితే జవాబు చెప్పడం సులభం. పంచదార, బెల్లం, ఉప్పు (ఏ కారణంచేతనో పప్పు లేదు) బిస్కట్లు, తీపి బిళ్లలు, తల నూనెలు, సబ్బులు, సిరాలు, పెన్నులు, పెనసళ్లు, తెల్లని కాగితాలు, పుస్తకాలు, మరచెంబులు, బెడ్డింగులు, గ్లాసులు, ప్లాస్టిక్ బొమ్మలు యివన్నీ ఆ నలభై, యాభై చదరపు అడుగులు గల కొట్టులోనే. ఆ వైశాల్యంలో ఒక పదో వంతులో దొంతర్లగా కొన్ని వందల రికార్డులు. ఏ రికార్డు ఉన్నదో ఏది లేదో ఎవరి కెరుక ? ఒక రికార్డు కోసం అడిగితే పందొమ్మిది (నిజం వాచి చూశాను) నిమిషాలు వెతికి లేదనుకుంటానండి అన్నాడు ఆ రికార్డులబ్బాయి. కూర్చోడానికి స్థలం లేదు. వినటానికి చోటు చాలదు. ఈ గొడవంతా ఎప్పుడూ, ఉదయం పద కొండు గంటలకు, మరేవిధమైన రద్దీ లేనప్పుడు. ఇక ఉన్నప్పుడు సంగతిని ఆ దశకంఠుడే వర్ణించాలి.

ఇంకో వూళ్లో : చిన్న గది. గోడవార రికార్డు పెట్టెల దొంతర్లు. శుచిగా శుభ్రంగా ఉంది. అలానే ఉన్న ఒక కుర్రవాడు అర్ధ నిద్రావస్థలో ఉన్నాడు. ఏదడిగినా నాకు తెలీదండి. మా షావుకారు లేడు అని జవాబు. ఎప్పుడు వస్తాడు ? ఇప్పుడొచ్చేస్తాడండి ! ఆ 'యిప్పుడు' గంటయినా రానందున లేచి వచ్చేశాను. అప్పటికీ యిప్పు డొచ్చేస్తాడు కాసేపుండండీ అని అతి వినయంగా బతిమాలుతూనే ఉన్నాడు.

ఇక అతి చక్కగా, శ్రోతలకు అన్ని విధాలా సౌకర్యంగా నిర్వహింపబడుతున్నవాటి గురించి, నేను వెళ్లిన మూడవ వూరు గుంటూరు. అక్కడ డి. హనుమంతరావు గారి షాపును చూసి డంగై పోయాను. రికార్డులు వినటానికి రెండు వేరే గదులు ఒకదానిలో మామూలువి, రెండవదానిలో లాంగ్ ప్లేయింగ్‌వి. ఈ రెండవ గది ఎయిర్ కన్‌డిషన్ చేయించారు. అలంకరణ అతి నవీన పద్ధతిలో చాలా అందంగా రికార్డులు కొనేవాడికి అన్ని విధాలా అనువైన ప్రదర్శనతో కళకళ్లాడుతున్నది. మామూలు రికార్డులు అమ్మే గది కూడా చక్కగా ఉంది. ఇక్కడ చూసినన్ని రికార్డులు నేను చూసిన షాపుల్లో మహా ఉంటే మరొక రెండు మూడు షాపుల్లో ఉండునేమో ! ఈ షాపులో రికార్డుల శాఖ చూసుకునే మరొక హనుమంతరావు పాటల రచయిత కూడాను. ఆయన వ్రాసిన జాతీయ గీతం ఒకటి, భావ గీతాలు రెండు ప్రైవేటు రికార్డులుగా విడుదలైనవి. మొదటిది. పాడినది ఘంటసాల బృందం. రెండవది జిక్కి, అప్పారావు విడివిడిగా పాడిన "కన్నా కన్నా కలపరా", "మల్లె పూల తోటలో" అన్నవి. ఈ ఆఖరిది చలాకీ అయిన రచన.

రెండవది వెళ్లుతున్నప్పుడు చూసిన ఆఖరి వూరిలో మొదటిది. విశాఖపట్టణంలో ఎమ్. వెంకట్రామయ్య రేడియో హౌం. ఈ షాపులో చెప్పుకోదగ్గ విషయ మేమిటంటే విశాలమైన హాల్లో రికార్డులూ, గ్రామఫోనులూ, రేడియోలూ,



"రాముడు-భీముడు"లో జమున, రంగారావు.


తవటికి సన్నిహితంగా సంబంధించిన పరికర సామగ్రి వొప్ప మరొక వస్తువు లేదు. ఇక్కడ ఉన్నంత స్టాకు మరెక్కడా నేను చూడలేదు. పాతవి గాని కొత్తవిగాని కేటలాగ్‌లో ఉంటే ఇక్కడ సర్వ సాధారణంగా దొరుకుతవి. ఇంకా పాతవి కూడా కొన్ని ఉన్నాయి. హిందీవి, ఇంగ్లీషు లాంగ్ ప్లేయింగ్‌వి కూడ సమృద్ధిగా ఉన్నవి. ఈ హాలు కాక లోపల వేరే మరొక 'ఆడిషన్' గది ఉన్నది. అందులో గాలి కాస్త తక్కువగాని శబ్ద ప్రతిబింబము మాత్రం నిర్దుష్టంగా ఉన్నది.

ఇక మూడవది నా తిరుగు ప్రయాణంలో మొదటి వూరు. కాకినాడలో గిరి ఎండ్ కంపెనీ తక్కిన రెండు కంపెనీల గురించి ఇంతకు ముందే కొంత కొంత నాకు తెలుసు. ఈ గిరి షాపు మాత్రం కొత్త. నే నెవరో చెప్పకుండా ఒక పదిహేను నిమిషాలు రికార్డుల శాఖలో వచ్చే పోయే వారిని, వారిని పరామర్శించే వారినీ పరిశీలించాను. శ్రోత అడిగిన సంగతి వినిపించుకోవడము. ఉన్నదో లేదో రెండు నిమిషాలలోపునే చూచి చెప్పడము. వేయమంటేవేసి వినిపించడము. మరేదైనా ప్రశ్న అడిగితే విసుగు చూపించక మర్యాదగా జవాబు చెప్పడము, రికార్డు శాఖ చూసుకుంటున్నవారు విధిగా చేయ వలసిన పని. ఈ కనీస మర్యాదలనైనా పాటించని వారెందరో ఉన్నారు. కాని గిరిలో మాత్రం ఇవన్ని పాటించడం యెంతో మెప్పించింది. కుర్చీలు అవి కొంత పాత ఫక్కీ ఉన్నా, రికార్డులు వినిపించే శబ్ద యంత్రాలు గాని, రికార్డులు అమర్చే విధా నంలోగాని అన్నీ సరికొత్త పద్ధతిలో శ్రోతలను మరీమరీ రప్పించే పద్ధతిలో ఉన్నవి.

నేను చూసిన షాపుల్లో ఈ మూడూ తల మానికాలనవచ్చు. తక్కినవి బాగులేవని నా అర్థం కాదు. ఇంతటి నవీన పద్ధతులతో శ్రోతకు ఇంత సౌకర్యంగా ఉండేవి లేవనే. ఇంకాకొన్ని షాపులు పెద్దవి చేస్తున్నారు. మరికొన్నిటిలో ఉన్న సౌకర్యాలను ఇనుమడింపజేస్తున్నారు. చిన్నచిన్న గదుల నుంచి పెద్ద హాలుల్లోకి మార్చడానికి ప్రయత్నిస్తున్నారు మరికొందరు. ఉన్న వాటినేసక్రమంగా నడుపుకొన గలిగితే చాలనుకుంటున్నారుకొందరు.

ఈ సందర్భంలో మరొక విషయం తెలియ జేయాలి. నేను వెళ్ళిన ప్రతి చోట కూడ షాపుల స్వంతదారులు అతి మర్యాదగా ప్రవర్తించారు. అనివార్యమైన కారణాల వలన ఒకోచోట గంట ఆలస్యమైనా వోపికతో వేచి ఉన్నారు. నే నడిగిన ప్రశ్నలకు సహృదయంతో సమాధానం చెప్పారు. వారందరికీ నా కృతజ్ఞతాభి వందనములు.

తిరుగు ప్రయాణంలో కొన్ని చోట్ల, నేను రాబోయే సమయం ముందు తెలుపలేక పోయి నందు వలన, శ్రోతలను ఓలన్నపూ కలుసుకో లేక పోయాను. అమలాపురంలో, ఒంగోలులో, గూడూరులో ఇలా జరిగింది. వారిని క్షమించ మని కోరుతున్నాను. ఒక చోట మాత్రం, తిరుప తిలో ఒకరి నిర్లక్ష్యం వలన శ్రోతలకు సరాగ మాల పతితలకు కొందరికి ఆశాభంగం కలిగింది. వారి మన్నింపునూ అర్థిస్తున్నాను. ★



కొత్తగా ప్రారంభించిన ఒక కంపెనీ "నల్ల నీడ" అనే వంగ అపరాధ పరిశోధక చిత్రాన్ని తెలుగున అనువదిస్తున్నారని వార్త. సరించడమే కాదు ఆ సంగతి మరెవరికీ తెలియకుండా ఉంచ డానికి విశ్వప్రయత్నం చేస్తున్నారనీ, కొంతవరకు అందులో కృత కృత్యులయారనీ కూడా వార్త. అందరూ "ధర్మపు ఢంకా" వాయించి అను కరణలూ, అనుసరణలూ (ఆలయమణి, కర్పగం, ఆరతి) చేస్తూ ఉంటే వీళ్లకెందుకో భయం ? హక్కులు కొనుక్కోవలసి వస్తుందని కాబోలు. అవుసుమరి అయిదు వేలు తగ్గినా తగ్గినట్లే కదా!

* * *

మైరావణ చిత్రం గురించి కాకినాడ పాఠకుడు పంపిన రివ్యూ. బి. ఎ. ఎస్. వారి సరికొత్త చిత్రము నిరాశాజనక పూరితమై, నిరుత్సాహము జనింప చేయుచున్నది. ఇటువంటిది శోచనీయము. ధూళిపాళ నటన ఫరవాలేదు. కృష్ణకుమారి, శారదల నటన బాగానే ఉన్నవి. ఛాయ నిర్దుష్ట ముగాను, శబ్దము పటిష్టముగాను, సంగీతము మ్యూజికల్‌గాను దర్శకత్వము ఆదర్శప్రాయము గాను ఉన్నవి. అన్ని చోట్ల అర్ధ శత దినోత్సవాలు తప్పక చేసుకో గలదు. ఒక మాదిరి ఉత్తమంగా ఉంది.

* * *

'ఆత్మబలం'లో చక్కని ప్రణయ సన్నివేశాలు చూచి ఆనందించిన వారు, నెత్తి బాదుకున్న వారు, చెవులు కొరుక్కున్న వారూ హిందీ చిత్రం "శోహ్రా" చూసి అదే పనులు చేయమని కోరిక లేక ఒక వేళ పొరుగింటి వాళ్లది రుచి అంటా రేమో !

* * *

"దూజ్ కా చాంద్" అనే హిందీ చిత్రంలో నటిస్తున్నపుడు బి. సరోజాదేవి తల పగుల కొట్టించుకున్నప్పటినుంచి ఆమెకు, పావం, కాల్షీట్లు జ్ఞాపకం ఉండటం లేదట. ఉదయం ఉండి వెళ్లినా మధ్యాహ్నానికి మరపు వచ్చేస్తున్నదట. ఇది గమనించిన నిర్మాతలలో తమ తలలు పగల గొట్టుకోవటమెలా అని ఆలోచించేవారు కొందరూ, రంగాలా పతాక సన్నివేశంలోనే లేకుండా తీసి వేయ గల సమర్థులు కొందరూ, అనవసరంగా అడకత్తె రలో పడిన అమాయకుడు రాజేంద్ర ప్రసాద్‌లా అల్లాడే వాళ్ళూ ఉన్నారట. ★

కన్నాంబ స్మృతి



తెలుగు, తమిళ చిత్రాలలో గత రెండు దశాబ్దాలకుపైగా నటిస్తూ, అపూర్వమైన పేరు ప్రఖ్యాతులు బడసిన శ్రీమతి కన్నాంబ గత గురు వారంనాడు మద్రాసులో స్వల్ప మైన అనారోగ్యంతో కాలధర్మం చెందారు. ఈమె మరణం చలనచిత్ర పరిశ్రమకి తీరనిలోటు.

వ్యక్తిత్వం



న్యాయపతి రాజగోపాలం

శ్రీరామచంద్రమూర్తి అన్నది అతడి పూర్తి పేరని చాలా తక్కువ మందికి తెలుసును. అతడినిఅందరూ మూర్తి అనే పిలుస్తారు. కొందరు "ఒరేమూర్తి" అంటారు., కొందరు "మూర్తీ" అంటారు., మిగతావాళ్లు "మూర్తిగారూ", అంతేతేడా. మొత్తంమీద కాలేజీలో మూర్తిని ఎరగని విద్యార్థి లేడు. మూర్తి స్ఫుర ద్రూపి, మధురమైన కంఠస్వరం కలవాడూను. వీటికి తోడు అధ్యాపకులతో అణకువగాను, తోటి విద్యార్థులతో అభిమానంగాను మాట్లాడేవాడు. అతడి పెదవులపైన ఎప్పుడూ చిరునవ్వు తొణికిస లాడుతూ ఉండేది. అసలు నలుగురిని ఆకర్షించ గలిగిన శక్తి కొందరిలో మాత్రమే వుంటుంది. ఒక వ్యక్తి కనబడగానే "హల్లో" "హల్లో" అంటూ నలుగురూ చుట్టూ మూగుతారు. అదే ఇంకొక వ్యక్తి కనబడేసరికి సెక్షన్ 144 అమలులో ఉన్నట్లు ఎక్కడివాళ్లు అక్కడ చెదిరిపోతారు. మూర్తికి ఈ ఆకర్షించేశక్తి దైవికంగా ప్రాప్తించిందో, లేక డేల్ కార్నిజీ చదివి సంపాదించుకొన్నాడో మనకి తెలియదు. కాని బి. ఏ. చదువుతున్నప్పుడు రెండు సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా విద్యార్థి సంఘానికి కార్య దర్శకత్వాన్ని వహించిన ఘనత అతడి ఒక్కడికే దక్కింది.

మూర్తి ప్రస్తుతం ఎం. ఏ. చదువుతున్నాడు. ఈ సంవత్సరంతో అదీ పూర్తి అవుతుంది. మూర్తి చిన్నతనంలోనే అతడి తండ్రి మరణించాడు. ఉన్న కొద్ది ఆస్తిని జాగ్రత్తగా కాపాడుకొంటూ, కష్టంగా సంసారం సాగిస్తూ, మూర్తితల్లి అతడిని ఇంత వరకు చదివిస్తూ పెద్దవాడిని చేసింది. తల్లి తన గురించి ఎంతత్యాగం చేస్తున్నది మూర్తికి తెలుసును. అతడు బి. ఏ. తో చదువు ముగించి ఏదైనా ఉద్యోగంలో ప్రవేశిస్తానన్నాడు. కాని ఆమె అంగీకరించలేదు. అతడు ఎం. ఏ. చదవాలని, పెద్ద ఉద్యోగం చెయ్యాలని, చిన్న ఉద్యోగాలలో ప్రవేశించడం తనకి ఇష్టం లేదని ఆమె చెప్పింది.

భీమారావు మూర్తికి బి. ఏ. లో సహాధ్యాయి. అమాయకుడు. పిరికి స్వభావం కలవాడు. భీమారావు ఈ ప్రపంచంలో ఎలాగ జీవనయాత్ర సాగించ గలడా అని ఎల్లప్పుడు అతడి తండ్రి ఆందోళన చెందేవాడు. చొరవ, కపటం, కొంతవరకు అహం భావం, చిన్నవిషయాలకే పెద్దగా గొడవచేసే స్వభావం ఉన్నవాళ్ళే ఇప్పుడు ఇతరులని పక్కకి నెట్టుకొంటూ ముందుకు పోగలుగుతున్నారు. భీమారావులో ఈ గుణాలు వెతికినా లేవు. ఎవరైనా తనవైపు తేరపారి చూస్తే నిద్రభంగి ఆకులాగ వాడిపోతాడు. "భోజ నము చేస్తావా?" అని ఎవరైనా ప్రశ్నిస్తే, భీమా రావు మొహం కందగడ్డలాగ చేసుకొని, అటూ ఇటూ బెదురుగా చూసి, "ఊఁ" అనేసి అక్కడి నుండి వెళ్లిపోతాడు.

భీమారావుని ఒక మనిషిగా ఎలాగ చెయ్యడమో అతడి తండ్రికి తెలియలేదు. తన మిత్రులలో కొందరిని సలహా అడిగాడు. ఎవరికి తోచింది వాళ్ళు చెప్పారు.

"భీమాశాఖ వారు డెవలెప్‌మెంటు ఆఫీసర్లుగా పట్టభద్రులని వేసుకొంటారు. మీ వాడికి బి.ఏ. పూర్తికాబోతున్నది కదా! ఆ ఉద్యోగం కోసం ప్రయత్నించండి. వాళ్లు ఆరు వారాలు మాత్రం ట్రెయినింగు ఇస్తారు. కాని ఆ ఆరువారాలలో మనిషిలో ఎంత మార్పు వస్తుందను కొన్నారు? అసలు ముఖ లక్షణాలు కూడా మారిపోతాయంటే నమ్మండి. ఇక మీదట మీ వాడిగురించి మీకు ఏ చీకు చింతా అవసరం ఉండదు" అని ఒకాయన చెప్పాడు. భీమారావు తండ్రికి ఈ సలహా నచ్చింది.

కొన్ని రోజులు గడిచాయి.

ఒక రోజు సాయంత్రం మూర్తి అలా బజారు బయల్దేరాడు. బస్‌స్టాపుకి అతడు నలభై గజాల దూరంలో ఉండగా ఒక బస్సు వచ్చి ఆగింది. ఒక్క వ్యక్తి మాత్రం దిగాడు. ఎక్కవలసిన వాళ్లు చాలా మంది ఉన్నారు. కండక్టర్ ఒక్కడిని మాత్రం ఎక్కించాడు. తక్కిన వాళ్లకి స్థలం లేదని చెప్పాడు. బెల్ నొక్కాడు. బస్ కదిలింది.

ఇంతలో జనసమూహాన్ని తోసుకొంటూ ఒక టెర్లిన్ కుర్రవాడు నడుస్తున్న బస్సు ఎక్కడానికి ప్రయత్నించాడు. కాలు జారి కింద పడ్డాడు. బస్సు వెళ్లిపోయింది.

అదృష్టం కొద్దీ అతడికి దెబ్బలు తగలలేదు. కాని బట్టల నిండా మాత్రం మట్టి మరకలు అంటుకొన్నాయి. దానికి అతడేమీ విచారించలేదు. ఒక్కసారి సబ్బుతో ఉతికేస్తే పోతాయి. కాని మాన సికంగా అతడు పెద్ద దెబ్బ తిన్నాడు. ఇంతమంది చూస్తుంటే తను బోల్తాకొట్టడం ఎంత చిన్నతనం?

అందులోనూ ఇద్దరు అమ్మాయిలు ముసిముసి నవ్వులతో అతడి పాటు గమనించడం అతడు గమనించాడు. అతడు ఇంకొక్క క్షణమైనా అక్కడ నిలబడలేదు. నడుచుకొంటూ ఎక్కడికో వెళ్లిపోయాడు.

ఈ సంఘటన చూస్తూ మూర్తి బస్‌స్టాపు చేరాడు. జరిగిన దానిగురించి అక్కడ విమర్శలు ప్రారంభం అయ్యాయి.

"వళ్లు పొగరు" అన్నాడు ఒకాయన.

"అది నిజమే ననుకోండి. కాని ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికి మనకీ ఎప్పుడో ఒకప్పుడు కాలు జారుతుంది. లేదా బస్సే బోల్తా కొడ్తుంది. లేదా రైలు తిరగ బడుతుంది. నివసిస్తున్న ఇల్లు కూలిపోతుంది. వచ్చేక్షణం మనది అని చెప్పలేం. మనం వస్తామని పాపం ఇంటివద్ద భార్య, పిల్లలు, మనకోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఇక వాళ్లగతి ఏమౌతుంది? అందుకే ప్రతీవ్యక్తి తన జీవితాన్ని భీమా చేయించుకోవడం చాలా అవసరం. ప్రీమియంలో రెండు మూడు రూపాయలు అదనంగా చెల్లిస్తే ఇటువంటి దుర్మరణం జరిగినప్పుడు భీమాచేసిన విలువకి రెట్టింపు ఇస్తారు" అని ఒకాయన ఉపన్యాసం ప్రారంభించాడు.

పరిచయమైన కంఠస్వరమే. ఎవరా అని మూర్తి వెనకకు తిరిగి చూచాడు. భీమారావు. అదే క్షణంలో భీమారావు కూడా మూర్తిని చూచాడు.

"హల్లో! మూర్తి" అంటూ దగ్గరికి వచ్చాడు.

"చాలా కాలానికి కనపడ్డావ్! మనిషి బాగా మారిపోయావే. ఎక్కడున్నావ్! ఏమిటి చేస్తున్నావ్? అందరూ క్షేమమేనా?" అని అడిగాడు మూర్తి.

"భీమాశాఖలో డెవలెప్‌మెంట్ ఆఫీసరుగా పని చేస్తున్నాను. సుమారు ఒక సంవత్సరం కావస్తోంది. ఎం. ఏ. చదువుతున్నావట కదూ. ఈ మధ్యనే తెలిసింది. నీ వద్దకు వద్దామనే అనుకుంటున్నాను. కొంత బిజినెస్ ఇస్తావని" అన్నాడు భీమారావు.

"ఏం బిజినెస్?" అన్నాడు మూర్తి అర్థంగాక.

"అదేనోయ్. నీ జీవితం ఒక అయిదువేల రూపాయలకి భీమా చేయిస్తావని" అన్నాడు భీమారావు.

మూర్తి తెల్లబోయాడు. "నాకెందుకయ్యా భీమా? నాకేం భార్యా పిల్లలూ ఉన్నారా? ఉద్యోగం ఉన్నదా?" అన్నాడు.

"ఆ సంగతి నాకు తెలుసును. కాని సవ్యంగా ఆలోచించు. మీ తల్లిగారు నిన్నే నమ్ముకొన్నది. ఆమె ఎంతో త్యాగం చేసి నిన్ను చదివిస్తున్నది. ఇప్పుడు మాటకి అనుకొందాం — నీకేదైనా ఆపద సంభవించిందనుకో. ఆమె పరిస్థితి ఎలాగుంటుందో వూహించావా? ఆమె జీవితం దుర్భరమైపోతుంది. నీ చదువుకోసం మీ తల్లి ఇల్లు గుల్లచేసింది. ఆమె జీవించడం ఎలాగ? అటువంటి క్లిష్టసమయంలో ఆపద్బాంధవులలాగ మేము ఆదుకుంటాం. మేము వెళ్లి ఆమె దోసిట్లో అయిదువేల రూపాయలు పోస్తాం. నిన్ను పోగొట్టుకొన్న ఆ తల్లిశోకం ఎవరూ తీర్చలేరనుకో. కాని ఆమె తన జీవనోపాధికి కూడా బాధపడే అగత్యం తప్పుతుంది. ఈ విధంగానైనా తల్లి ఋణం తీర్చుకొన్నావనే తృప్తి నీకూ వుంటుంది. ఎలాగో కష్టపడి నెలకి పదిహేను రూపాయలు మిగిల్చి ఒక పాలసీ తీసుకో" అన్నాడు భీమారావు.

మూర్తి ఆశ్చర్యంగా భీమారావువైపు చూచాడు. ఇతడిలో ఎంతమార్పు వచ్చింది అనుకున్నాడు. మనిషి మునుపటి కంటే ఒడ్డూ పొడవూ అయ్యాడు. అతని ముఖంలో పిరికితనం వెతికినా కనబడడం లేదు. కళ్లు ధైర్యంగా చూస్తున్నాయి. ఇదివరకు భీమారావు ఎన్నడూ తల ఎత్తడం మూర్తి చూడలేదు. — ఒక్కసారి కళ్లల్లో మందు వేసుకొన్నప్పుడు తప్ప. ఇదివరకు పిలిస్తే పలకడానికే సిగ్గుపడే భీమారావేనా ఇప్పుడు ఈ మాటలాడుతున్నది.?

"అలా తెల్లబోయి చూస్తున్నావేం?" అన్నాడు భీమారావు.

"నేను నెలకి పదిహేనురూపాయలు మిగల్చడం అసాధ్యం. నేను మరణించేటంతటి దురదృష్టం మా తల్లికి కలిగినప్పుడు ఈ అయిదువేల రూపాయలు కూడా ఆమెకు ప్రయోజనంకావు. నువ్వు చెప్పిన దాంట్లో నిజం లేకపోలేదు. ప్రతి వ్యక్తికి జీవిత భీమా చాలా అవసరం. నాకు ఇప్పట్లో మాత్రం వీలులేదు. అయినా నా చదువు త్వరలోనే ముగుస్తుంది కదా. చూద్దాంలే" అన్నాడు మూర్తి.

ఇంతలో భగవంతుడు ఇచ్చిన వరంలాగ బస్సు వచ్చింది.


2

రెండవసారి భీమారావు దర్శనం మూర్తికి సినిమా హాలులో కలిగింది. అక్కడ కూడా భీమాచేయించడంలో గల లాభాలు చెప్తూవచ్చాడు భీమారావు. మూర్తి దురదృష్టంకొద్దీ వాళ్లు చూచిన చిత్రంలో రెండు మూడు మరణాలు ఉన్నై. అసలుమరణం లేని సినిమా లేదనుకొండి — ఈ చిత్రంలో మోతాదు కాస్త ఎక్కువగానే పడింది. ఆ మరణించిన వారు తమ జీవితాలు భీమా చేయించుకొని వుంటే ఈ చిత్రంలో ఎంతమార్పు వచ్చేదో వూహించమన్నాడు భీమారావు. అసలు ఈ చిత్రం తియ్యవలసిన అవసరమే లేకపోయేది అని కూడా విమర్శించాడు.

ఆ రాత్రి మూర్తికి ఎందుకో నోరు చేదుగా ఉన్నట్లు అనిపించింది. పిక్చర్ చూచాడేగాని అతడికి ఏమీ ఉత్సాహం కలగలేదు.

అప్పటినుండి మూర్తి కాస్త జాగ్రత్త పడ్డాడు. ఎక్కడికి వెళ్తున్నా, "హొరైజన్"లో భీమారావు ఉద్భవిస్తున్నాడేమో అని పరికిస్తూనే వెళ్లేవాడు. ఒకసారి భీమారావు దూరాన్న కనిపించగానే మూర్తి పక్క సందులోకి మళ్లిపోయి తప్పించుకున్నాడు. ఆ తర్వాత అనుకోకుండా ఒకసారి భీమారావుకి మళ్ళా దొరికి పోయాడు.

"జాతస్య మరణం ధ్రువం" అన్నారు పెద్దలు. అంటే పుట్టాక చావు తప్పదు. అందుకే మనిషిని మోర్టల్ అంటారు ఇంగ్లీషువారు. అంటే చావవలసిన వాడు అని అర్థం. ఎం. ఏ. చదువుతున్నావు. ఇవన్నీ నీకు నేను చెప్పనవసరం లేదు. కాని మరణం అన్నది ఎల్లప్పుడు ప్రతిమనిషికి ఒక గజం ఎత్తున అంతరిక్షంలో తాండవం చేస్తూ ఉంటుంది. అది ఎప్పుడు గభీమని మనమీదికి ఉరుకుతుందో చెప్పలేం. చచ్చి పోయి కూడా సాధించాడని కొందరు అంటారు విన్నావో లేదో. ఇన్సూర్ చెయ్యడం అంటే సరిగ్గా అదే. మన మరణంలో కూడా ఇతరులకి లాభం కల్పిస్తామన్న మాట. ఇందులో ఆలోచించవలసినది వెనక్కి తగ్గవల్సి



నది ఏమీ లేదు. నీకు మా ఏజెంటు ఒక తడవే మంచివాణ్ణి అప్పచెప్తాను. ఏమంటావ్?" అంటూ మొదలెట్టాడు భీమారావు.

మూర్తి ఎలాగో తప్పించుకొని బయట పడ్డాడు.

అప్పటి నుండి భీమారావంటే మూర్తికి అమితమైన భయం పట్టుకొంది. ఇంతవరకు అతడు తన బసకి మాత్రం రాలేదు. ఇక మీదట అక్కడికి కూడా వచ్చి తన చదువు సాగనివ్వడేమో అని బెంగ పెట్టుకొన్నాడు. భీమారావు జ్ఞప్తికి వచ్చేసరికి మూర్తికి ముచ్చెమటలు పోసేవి.

కాని మూర్తి భయం అనవసరం అయింది. రానురాను భీమారావు కనిపించడం ఎందుచాతనో తగ్గి పోయింది. మూర్తి పరీక్షలలో బాగా వ్రాయగలిగాడంటే అదొక ముఖ్యకారణమనే చెప్పాలి.

పరీక్షలు ముగిసాక ఇంటికి వెళ్లాడు మూర్తి.

"చదువు పూర్తి అయింది. ఇక పెళ్లి మాటేమిటంటావ్" అని అడిగింది తల్లి.

"కాస్త వోపిక పట్టమ్మా, రిజల్ట్సు రావాలి. నేను ప్యాసు కావాలి. ఏదైనా ఉద్యోగం దొరకాలి. నాకు నచ్చిన అమ్మాయి కుదరాలి. అప్పుడు పెళ్లి" అన్నాడు మూర్తి.

మూర్తి ఇష్టపడిన అమ్మాయినే అతడికి పెళ్లి చెయ్యాలని తల్లి సంకల్పం. కాని తనకు ఎటువంటి అమ్మాయి నచ్చుతుందో మూర్తికి

ఇంత వరకు తెలియలేదు. అతడు కాలేజీలో చదువుతున్నప్పుడు అనేక మంది అమ్మాయిలను చూచాడు. కాని అందులో ఎవరిలోనూ ప్రత్యేకమయిన ఆకర్షణ కనిపించలేదు — ఒక్క సరళలో తప్ప. మూర్తి బి. ఏ. చదువుతున్నప్పుడు సరళ పి. యు. సి. చదువుతూండేది. ఆమెలో మాత్రం ఏదో ప్రత్యేకత ఉన్నట్టు మూర్తికి కనపడేది. ఆమెతో అతడికి కొంత పరిచయం ఏర్పడింది. కార్యదర్శి ఎన్నికలలో ఒకటి రెండు సార్లు మూర్తి ఆమెతో మాట్లాడేడు. "మూర్తి గారికే మీ వోటు" అనే రంగు రంగుల నోటీసులు ఆమె కూడా కొన్ని పంచిపెట్టింది. వారి పరిచయం అక్కడితో ఆగింది. తన పరిస్థితుల దృష్ట్యా అప్పటిలో తన వివాహం గురించి ఆలోచించడమే అసంభవం అనిపించింది మూర్తికి. అటువంటప్పుడు ఆమెతో తన స్నేహం అభివృద్ధి చేసి ఇద్దరి మనస్సులలోనూ మమతలు రెచ్చ కొట్టడం అవివేకం అనేఉద్దేశంతో మూర్తి తన మనస్సును నిగ్రహించుకున్నాడు.

పి. యు. సి. పూర్తి అయిన తరువాత సరళ తిరిగి మూర్తికి కనిపించలేదు. చదవడం మానివేసిందో లేక ఆమె తండ్రికి ఎక్కడికైనా బదిలీ అయి పోయిందో మూర్తికి తెలియలేదు. తెలుసుకోవడానికి అతడు ప్రయత్నించలేదు కూడా. కాని నేటి వరకు ఆమె రూపం మాత్రం అతడి హృదయ ఫలకం మీద నుండి చెరిగిపోలేదు.

పరీక్ష ఫలితాలు తెలిశాయి. మూర్తి ఫస్టు క్లాసులో ప్యాసయినాడు. అతడిని అభినందిస్తూ టెలిగ్రాములు శరపరంగా వచ్చి పడిన్నై. తల్లి కొడుకుల ఆనందానికి అవధులు లేక పోయిన్నై. ఇక పత్రికలలో "వాంటెడ్" ప్రకటనలు చూడడం ప్రారంభించాడు మూర్తి. దగ్గరగా ఉన్న ఒక వూళ్ళో కొత్తగా ప్రారంభిస్తున్న ఒక కాలేజీకి అసిస్టెంటు లెక్చరర్లు కావాలనే ప్రకటన అతడి కంట పడింది. వెంటనే దరఖాస్తు పంపాడు.

దేనికైనా రోజులు కలిసిరావాలి. పదిహేను రోజులలోగానే కాలేజీ కమిటీ వారి వద్ద నుండి జవాబు వచ్చింది— ఇంటర్వ్యూకి రమ్మంటూ. ఫలానా తేదీ అని వారు నిర్ణయించడం మంచి మంచి రోజు చూడవలసిన అవసరం లేకపోయింది మూర్తికి. తెల్లవారితే ఇంటర్వ్యూ అనగా ఆ వూరు చేరాడు. ఒక వసతి గృహంలో మకాం పెట్టాడు.

మూర్తితో బాటు ఇంకొక ఆరుగురు కూడా ఇంటర్వ్యూకి హాజరు అయినారు. కాలేజీ అధికార్లు మూర్తిని ఏవేవో ప్రశ్నలు వేశారు. మూర్తి వాళ్ళకి సరియైన సమాధానాలు చెప్పాడు.

ఆరుగురిని ఈ విధంగా పరీక్షించేటప్పటికి పన్నెండున్నర గంటలయింది. ఎవరిని వెళ్ళిపోవద్దని ఒక్క అర గంట ఆగవలసిందని కమిటీ వారు కోరారు. మూర్తికి ఆకలి దహించేస్తున్నా నిరీక్షించక తప్పింది కాదు.

ఒంటి గంట అయ్యేటప్పటికి ఫలితాలు తెల్పబడిన్నై. మూర్తిని, అతడితో బాటు ఇంకొక ఇద్దరిని కమిటీ వారు ఆమోదించారు. ఆర్డర్లు కూడా చేతికి ఇచ్చారు.

ఆర్డరు చేతిలో పడగానే మూర్తి ముఖకైవారం మూడు అంగుళాలు పెరిగింది. అందరి వద్ద శలవు తీసుకొని బయటకు వచ్చాడు. ఎదురుగా కనిపిస్తున్న హోటలులో భోజనం చేసి బసకి బయల్దేరాడు.

3

ఇన్నాళ్ళకి తన కష్టాలు, తన తల్లి కష్టాలూ ఒడ్డెక్కాయి అనుకొన్నాడు మూర్తి తోవలో. తల్లి ఋణం తీర్చుకొనే అవకాశం ఇప్పుడు తనకి కలిగింది. ఇక ఆమెను ఏ విధంగాను కష్టపడనివ్వ కూడదని నిశ్చయించు కొన్నాడు. ఆమె కోరిక ప్రకారం తనకి నచ్చిన అమ్మాయిని అతడు వివాహం చేసుకోవాలరి కూడా.

ఎండ మండి పోతోంది. రిక్షాని పిలిస్తే బాగుంటుంది అనుకొన్నాడు మూర్తి. నాలుగు వైపులా చూచాడు. కనుచూపుమేరలో ఏక్కడా రిక్షా కనిపించలేదు. పైగా ఇది ఇందాకటి తను వచ్చిన వీధికాదని గ్రహించాడు. తను వచ్చింది. మెయిన్ రోడ్డు దారి తప్పాడా ? ఇంటర్వ్యూకికి తను వచ్చినప్పుడు తోవ గుర్తుంచుకొన్నాడు. మెయిన్‌రోడ్డు వదిలి కుడిచేతి వైపు తిరిగి మళ్ళా ఎడంచేతి వైపు తిరిగితే కమిటీ ఆఫీసు వచ్చింది. ఇప్పుడు భోజనం చేసి బయల్దేరినప్పుడు మూర్తి కుడిచేతి వైపు నడిచి మళ్ళా కుడిచేతి వైపే తిరిగాడు. కాని మెయిన్ రోడ్డు రాలేదు. ఇదేదో ఈ సిథిలో పడ్డాడు. ఏమో ! అనుకొన్నాడు. వెంటనే మూర్తికి జరిగిన పొరబాటు తెలిసింది. హోటలు కాలేజీ కమిటీ ఆఫీసుకి ఎదుట ఉన్నది. అందుచేత తను బయటకు రాగానే ఎడంచేతి వైపు మళ్ల వలసింది. తను పెట్టుకున్న గుర్తు ప్రకారం కుడిచేతి వైపు పరధ్యానంగా నడిచి రావడం ఇప్పుడు తోవ తప్పాడు.

మూర్తికి ఏమిటి చెయ్యాలో తోచలేదు. ఎవరైనా కనిపిస్తే అడిగి తోవ తెలుసుకొందామను కొన్నాడు. ఎవ్వరూ కనిపించలేదు. రోడ్డు నిర్మానుష్యంగా ఉన్నది. వచ్చిన తోవనే వెనకకి మళ్లి మళ్ళా కమిటి ఆఫీసు చేరుకోవాలనుకొన్నాడు.

ఇంతలో దూరం నుండి ఎవరో ఒక వ్యక్తి తన వైపే వస్తూండటం గమనించాడు. మూర్తి వెంటనే తన తిరోగమన పథకం రద్దు చేసి తిరిగిపురోగమించాడు ఎదురుగా వస్తున్న వ్యక్తి దగ్గర పడుతున్న కొలదీ అతడు తనకు ఇదివరకు పరిచయం ఉన్న వ్యక్తేనని పించింది మూర్తికి. మరి నాలుగు అడుగులు వెయ్యగానే ఆ వస్తున్నదెవరో గుర్తుపట్ట గలిగాడు. అతడి గుండె కొట్టుకొనటం మానేసింది. ఆ నడక, ఆ వాటం, ఆ చేతిలో వాలెట్ — భీమారావు. సందేహం లేదు.

ఇప్పుడు భీమారావు కంట తను ఎంత మాత్రం పడకూడదు అనుకొన్నాడు మూర్తి. తనకి ఉద్యోగం దొరికిందని తెలిస్తే ఇక తను భీమా చేసే వరకు వదలడు. తనకి మొదటి నెల జీతం రాగానే దరఖాస్తు ఫారం పైన సతకం చేస్తానని చెప్పినా ఒప్పుకోడు. పైగా సాయంత్రం వరకు తన వెంటే పడతాడు. తన మధుర స్వప్నాలు పాడు చేస్తాడు. అకస్మిక మరణాలు, కుటుంబ భారాలు జ్ఞప్తికి తెస్తాడు. ఎంతో ఉత్సాహంగా గడప వలసిన రోజు ఇది. భీమారావు దీనిని విషాదంగా మార్చేస్తాడు.

మూర్తి నడుస్తున్న పక్కనే ఒక ప్రహరీ గోడ, ఒక గేటు కనిపించాయి. భీమారావు దాటి పోయే వరకూ తను ఆ ప్రహరీలో దాక్కుంటే ఈ అవాంతరం గడిచి పోతుందనుకొన్నాడు మూర్తి. గేటు తీసే ఉన్నది. లోపల ప్రవేశించాడు. గేటు పక్కనే నిలబడి రోడ్డువైపు తొంగి చూడ సం ప్రారంభించాడు.

ఇంతలో తన వెనుక వైపు ఎవరో ఎండు టాకులపైన నడిచిన శబ్దం వినిపించింది మూర్తికి. వెనక్కి తిరిగి చూచాడు.

ఒక భీకరమైన పెంపుడు కుక్క తనవైపే వస్తున్నది. అది ఏదో దుష్కృతం తలపెట్టినట్టు దాని ముఖం చూడగానే మూర్తికి తెలిసింది.

4

రామయ్యగారు స్థితిపరుడు. పైగా తహశీల్దారీ ఉద్యోగం చేస్తున్నారు. సరళ వారి కుమార్తె, ఏకైక సంతానం. సరళ పి. యు. సి. ప్యాసయిన కొద్ది రోజులకే రామయ్యగారికి ఈ వూరు బదిలీ అయింది. ఈ వూళ్లో ఇంత వరకు కాలేజీ లేక పోవడం నుండి, పై చదువుల కోసం ఆమెను ఇంకొక వూరు పంపడం రామయ్యగారికి, వారి సతీమణికి ఇష్టం లేకపోవడం నుండి, సరళ చదువు అంతటితో ఆగి పోయింది.

సరళ చక్కటి అమ్మాయి. చాలా తెలివైనది. కథలు కూడా వ్రాస్తూంటుంది. ఆమె వ్రాసిన కథలు చదువుతూంటే, ఇంత అనుభవం, ఇంత లోకజ్ఞానం కుమారిగా ఉన్న తన కుమార్తెకు ఎలాగ కలిగినవా అని రామయ్యగారే ఆశ్చర్య పడుతూండేవారు. ఇన్‌కమ్‌టాక్సు వాళ్లకి ఒక కొత్త "ఎససీ" దొరికినంత ఆనందంతో ఆమె పంపిన ప్రతీ కథా పత్రికల వాళ్ళు స్వీకరించేవారు. ఒక పేజీకి సరిపోయినంత "సరాగమ్" బొమ్మ వేయించేవారు. ఇక పాఠకుల సంగతి సరేసరి. "కుమారి సరళ వ్రాసిన— కథ నన్నెంతో ఆకర్షించింది. పేజీ తాకుతే చాలు వాస్తవికత చేతికి అంటుకొంటున్న దంటే నమ్మండి. ఇంతటి చక్కటి కథ వ్రాసిన రచయిత్రికి, ప్రచురించిన మీకు నా ధన్యవాదాలు అర్పించకుండా ఉండలేక పోతున్నాను." అంటూ ఒక టేఉత్తరాల గొడవ.

అయితే ప్రతీ కథలోను నాయకి, తన ప్రియుణ్ణి పొందలేక చివరికి ఆత్మహత్య చేసుకొన్నట్టు సరళ విధిగా చూపించేది. ప్రతీకథా ఇదే విధంగా విషాదాంతం కావడం రామయ్య గారికి కాస్త వెగటుగా తోచేది. సరళ మానసికంగా ఏదో బాధ పడుతున్నదని ఈ విషాదాంతాలు దాని ప్రతిబింబాలేమో అని రామయ్యగారికి భయం పట్టుకొన్నది. తన ఆంతరంగిక మిత్రులతో ఈ విషయ ఆయన చెప్పారు.

ఆంతరంగిక మిత్రులు రామయ్యగారు చెప్పినది విని కొంత సేపు మవునంగా ఆలోచించారు. వారి ముఖాలు గంభీరంగా మారినై. "ఇది ఒక చిత్రమైన మనోవికారం. ఆమెకి వెంటనే పెళ్లి చెయ్యాలి లేకపోతే ఇది ఎంతటి ప్రమాదానికైనా తియ్యవచ్చు" అని ఏకగ్రీవంగా సలహా ఇచ్చారు.


అప్పటి నుండి రామయ్యగారు సరళకి తగిన వరుణ్ణి అన్వేషించడం ప్రారంభించారు. రెండు మూడు సంబంధాలు తీసుకొని వచ్చారు. ఆ వరులు వచ్చి సరళని చూచారు. వాళ్లకి సరళ నచ్చింది. కాని సరళకి వాళ్లెవరు నచ్చలేదు. అందులో ఎవరిని కూడా చేసుకోనని ఖచ్చితంగా చెప్పింది.

"పోనీ నీ మనస్సులో ఎవరైనా ఉంటే చెప్పమ్మా" అని తల్లి తండ్రులు అడిగారు.

సరళ జవాబు చెప్పలేదు. ఆమె చెప్పవలసింది ఏమీ లేదు కూడా. ఆమె మనస్సులో ఒక నీడ మాత్రం నిలిచి ఉన్నది. సరళ చదువుకొంటున్న రోజులలో మూర్తి ఆమెను ఆకర్షించి ఆమె హృదయంలో ఒక స్థానం కల్పించు కొన్నాడు. కాని అచిర కాలంలోనే అతడు ఆమె జీవితం నుండి తొలగి పోయాడు. అతడి పైన ఆమెకు కలిగిన ప్రేమ సఫలత పొందడానికి అవకాశం లేక పోయింది. మూర్తి ఇప్పుడు ఎక్కడ ఉన్నది ఏమిటి చేస్తున్నది, అతడికి వివాహం అయినది, లేనిది ఆమెకు తెలియదు. అతడి పూర్తి పేరు శ్రీరామ చంద్రమూర్తి అని, అతడికి తండ్రి లేడని మాత్రం ఆమె ఇదివరకు తెలుసుకొన్నది. ఈ రెండు వివరాలు ఆధారంగా అతడిని వెదికి తీసుకొని రమ్మని తండ్రితో చెప్తే చాలా అసందర్భంగా ఉంటుంది. మూర్తిని మరిచి పోవడానికే సరళ ప్రయత్నిస్తోంది. కాని ఇంతవరకు ఇంకెవరినీ వివాహం చేసుకోడానికి ఆమె అంగీకరించలేక పోతున్నది. తండ్రిని అనవసరంగా బాధించ వలసి వస్తున్నదని ఆమె బాధ పడుతోంది.

"వాళ్లెవరూ నాకు నచ్చలేదు. అంతే" అని

44 వ పేజీ చూడండి



"ఇదుగోనయ్యా నీ సైకిలు!... అద్దెంతయ్యింది?"

22-5-1964 శుక్రవారము మొదలు
28-5-1964 గురువారము వరకు

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

ఈ వారం సామాన్యంగా ఉంటుంది. విశేషమైన ఫలితాన్ని ఆశించడానికి సమయం కాదు. వృత్తి వ్యాపారాల్లో పరిస్థితి యథాతథంగా ఉంటుంది. వారాంతంలో కొన్ని చికాకులు ఏర్పడగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో ఆదాయం పెరగదు గాని ఆందోళన కలిగించే పరిస్థితి ఏర్పడుతుంది. మానసిక వ్యథ తప్ప చెప్పుకోదగ్గ నష్టం కూడా ఏమీ కలగదు. అధికారులవలన కావలసిన పనులు కొంత శ్రమమీద కాని నెరవేరవు. బంధువుల వ్యవహారాల్లో కూడా కార్యభారం పెరుగుతుంది. రాజకీయాల్లో మీ పరిస్థితి ఇదివరకటి కంటె ప్రోత్సాహకరంగా ఉంటుంది. మున్ముందు బాగా రాణించుటకు అవకాశం ఏర్పడుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు మాత్రం ఇంకా ఒక దారికి రావు. వారాంతంలో మానసికాందోళన కలిగించే పరిస్థితి ఏర్పడవచ్చును.

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగ 1, 2పా.)


ఈ వారం కూడా బాగా ఉంటుందని చెప్పడానికి అవకాశం లేదు. వృత్తి వ్యాపారాల్లో ఏర్పడ్డ అనిశ్చిత పరిస్థితి ఇంకా తొలగదు. వ్యాపారంలో శ్రమకు తగిన ప్రయోజనం ఉండదు. వృత్తిలో మీ స్థానాన్ని నిలబెట్టుకొంటారు. ఉద్యోగంలో చెప్పదగిన మార్పులు రావు గాని గౌరవం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో చిక్కులు ఇంకా తగ్గే సూచనలు లేవు. వారాంతంలో అనారోగ్యం చేయవచ్చును. కుటుంబ వ్యవహారాల్లో ఒడుదుడుకులు ఉండవు. విద్యారంగంలో మీ బుద్ధి చురుకుగా పనిచేస్తుంది. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రవర్తన పదిమంది దృష్టినీ ఆకర్షిస్తుంది. పుణ్య కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండకపోవచ్చును. సంతానానికి సౌఖ్యం లభిస్తుంది. బంధువుల వ్యవహారాల్లో జోక్యం చేసికొనడంవల్ల తీరిక లభించని పరిస్థితి ఏర్పడును.

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆర్ద్ర, పునర్వసు, 1, 2, 3 పా.)

అప్పుడప్పుడు కొద్ది చికాకులు కలిగినా మొత్తం మీద ఈ వారం బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో ప్రోత్సాహం లభిస్తుంది. నూతన వ్యవహారాలు రాణించగల సూచనలు ఉన్నాయి. రావలసిన డబ్బు సమయానికి అందక తాత్కాలికమైన ఇబ్బంది కలగవచ్చును. వృత్తి రీత్యా పెద్దవారితో పరిచయం తద్వారా లాభం కలుగుతాయి. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు రావచ్చును. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ



మ హే ష్

వ్యవహారాల్లో బంధువుల తోడ్పాటు లభిస్తుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. ఇష్టంలేకపోయినా అనవసరమైన వ్యయం చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు అనుకొన్నట్లుగా జరుగుతాయి. విలువైన అలంకార వస్తువులు కొంటారు.

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

వృత్తి వ్యాపారాల్లో శ్రమ పెరిగినా ప్రయోజనం కూడా ఉంటుంది. వ్యాపార విస్తరణకై చేసే ప్రయత్నాలు, భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు వాయిదా వేయడం మంచిది. వృత్తిలో ఆదాయం, గౌరవం లభిస్తాయి. అధికారులవలన జరుగవలసిన పనులు సులభంగా నెరవేరుతాయి. ఏ వ్యవహారంలోను యితరులను విశేషంగా నమ్మడానికి వీలులేని సమయం. ఆరోగ్యం బాగానే ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు నిరాటంకంగా సాగిపోతాయి. రాజకీయాలు అనుకూలంగా ఉంటాయి. బాధ్యతతో కూడిన పదవిని నిర్వహిస్తారు.

స్త్రీలకు—అన్ని విధాలా అనుకూలమైన కాలం. నూతన విషయాలను తెలుసుకొంటారు. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఈ వారం కూడా గత వారం వలెనే ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో అనుకూలత ఉంటుంది. వ్యాపారంలో శ్రమా, ఆదాయమూ రెండూ పెరుగుతాయి. వృత్తిలో అన్ని పనులూ చురుకుగా సాగడం వలన లాభం కలుగుతుంది. నూతన వ్యాపారాలు అనుకూలంగా కన్పించినా కొంతకాలం పాటు వాయిదా వేయడం మంచిది. వృత్తి రీత్యా ప్రయాణం చేయవలసి రావచ్చును. ఆరోగ్యం బాగానే ఉంటుంది. కుటుంబంలో స్వల్ప భేదాభిప్రాయాలు వచ్చినా ఏ కార్యక్రమమూ నిలచిపోదు. సంతానానికి సౌఖ్యం లభిస్తుంది. పుణ్యకార్యాలు నెరవేరతాయి. వైజ్ఞానిక కళా రంగాల్లో ఖ్యాతి

ఈ వారము ధరలు

ధాన్యం ధర కొంచెం పెరగవచ్చును అపరాల ధరలు తగ్గుతాయి. బెల్లం ధర కొంచెం తగ్గి తరువాత పెరుగుతుంది. మిర్చి ధర కొంచెం పెరుగుతుంది. నూనె, నువ్వుల ధరలు నిలకడగా ఉంటాయి. బట్టల ధరలు పెరుగుతాయి.

లభిస్తుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

స్త్రీలకు—ఆరోగ్యం అంత బాగా ఉండదు, అనవసరమైన వ్యయం చేయవలసి వస్తుంది సాంఘిక కార్యక్రమాల్లో పలుకుబడి లభిస్తుంది.

కన్య :

(ఉత్తర 2, 3, 4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

అన్ని వ్యవహారాలూ అనుకూలంగా కన్పించినప్పటికీ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నష్టం తప్పదు. వృత్తి వ్యాపారాల్లో క్రమంగా అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. రాబోయే సహాయాన్ని నమ్మి ఏ వ్యవహారమూ ప్రారంభించుటకు సమయం కాదు. వృత్తిలో కూడా కొంచెం ప్రశాంతత లభిస్తుంది. ఉద్యోగంలో మీ పట్ల వైముఖ్యంగా ఉన్న అధికారులు ఆదరణను చూపిస్తారు. సాధ్యమైనంతవరకు అన్ని వ్యవహారాల్లోను తటస్థంగా ఉండడం మంచిది. సాంఘిక వ్యవహారాల్లో మీరు ఇదివరకు చేసిన కృషికి ఫలితం లభిస్తుంది. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వారాంతంలో సంతోషం సౌఖ్యం లభిస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం గతవారంలో కంటే బాగా ఉన్నా నిర్లక్ష్యం చేయడానికి వీలుపడేదు. బంధువులతో భేదాభిప్రాయాలు రావచ్చును.

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

ఈ వారం అన్ని వ్యవహారాలూ అనుకూలంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాల్లో ఎదురుచూడని ప్రోత్సాహం లభిస్తుంది. వ్యాపారంలో మీ ప్రయత్నాలకు తగిన ప్రయోజనాన్ని పొందగలరు. వృత్తిలో అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. ఇంతేవరకు మీకు అనుకూలంగా ఉన్నవారు వ్యతిరేకించడం వలన కోర్టు వ్యవహారాల్లో కొన్ని చిక్కులు రావచ్చును. ఆదాయమూ, వ్యయమూ రెండూ పెరగగల సూచనలు ఉన్నాయి. ఆరోగ్యం బాగా ఉన్నా ఏదో ఆందోళన కలుగుతూ ఉంటుంది. సంతానానికి స్వల్ప అనారోగ్యం చేయవచ్చును. సాంఘిక వ్యవహారాల్లో గౌరవం, పెద్దలతో పరిచయం లభిస్తాయి. డబ్బుకు సంబంధించిన వాగ్దానాలు చేయడం మంచిదికాదు.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరిగినా, అన్ని పనులూ అనుకొన్నట్లుగా జరుగుతాయి.

వృశ్చికం :

(విశాఖ 4–: పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఈ వారం సామాన్యంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో శ్రమ పడినా, ఫలితం సాధించ గలిగామనే సంతృప్తి కలుగుతుంది. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా లభించవచ్చును. వృత్తిలో ఇదివరకటికంటె ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగంలో అనుకూలంగా చిన్న చిన్న మార్పులు రావచ్చును. స్థిరాస్థి వ్యవహారాల్లో కొన్ని మార్పులు జరగగల సూచనలు ఉన్నాయి. ఏదో డబ్బు చేతికి అందుతూ ఉండడం వలన ఇబ్బంది లేకుండా గడచిపోతుంది. ఆరోగ్యం బాగానే ఉంటుంది. సారస్వత, వైజ్ఞానిక రంగాల్లో పేరు లభిస్తుంది. వృత్తిరీత్యా అనేకులతో పరిచయం లభిస్తుంది. రాజకీయాల్లో ఇంతవరకు మీకు వ్యతిరేకంగా ఉన్నవారు కూడా అనుకూలంగా మారతారు.

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. సాంఘిక వ్యవహారాల్లో పలుకుబడి లభిస్తుంది. బంధువులకు సహాయం చేస్తారు.

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

వృత్తివ్యాపారాల్లో గత కొద్ది వారాలుగా ఏర్పడిన చికాకులు కొంచెం తగ్గుముఖం పట్టినందున విశ్రాంతి లభిస్తుంది. సాహసముకూడిన వ్యాపారాల్లో నష్టం రావచ్చును. వృత్తిలో ఇంతవరకు అనుకూలంగా ఉన్నవారుకూడా వ్యతిరేకించవచ్చును. ఉద్యోగస్థులు ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయడం మంచిది. కొంత ఆందోళనతప్ప యేవిధమైన నష్టమూ కలగకపోవచ్చును. వారాంతం నుంచి అన్ని వ్యవహారాల్లోనూ అనుకూలత లభిస్తుంది. సంతానానికి సౌఖ్యం సంతోషం లభిస్తాయి. ప్రేమ వ్యవహారాల్లో స్వల్ప ప్రోత్సాహం ఉంటుంది. విలువైన వస్తువులు కొంటారు. స్నేహితులకుగాని దూరపు బంధువులకుగాని సహాయం చేస్తారు.

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉన్నా అప్పుడప్పుడు బలహీనత కన్పించవచ్చును. కుటుంబ వ్యవహారాల్లో స్వల్పమైన అభివృద్ధి ఉంటుంది.

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా.

వృత్తివ్యాపారాల్లో ఏర్పడగల అనవసరమైన పొడపుడివలన కొన్ని చికాకులు కలిగినా ఆదాయం పెరగగల సూచనలు ఉన్నాయి. వ్యాపారంలో ఇదివరకు మీరు ప్రయత్నించేసిన వ్యవహారాలకు మరల ప్రాముఖ్యత వస్తుంది. డబ్బు ఇచ్చిపుచ్చుకోవడాల్లో కొన్ని తగాదాలు రావచ్చును. వృత్తి ఉద్యోగాల్లో మీకు అనుకూలంగా పెద్దమార్పులను ఆశించడానికి అవకాశంలేని సమయం. ఆరోగ్యం గతవారంకంటే బాగా ఉన్నా కాలడం జారిపడడం వంటి ప్రమాదాలు కలగవచ్చును. కుటుంబంలో భేదాభిప్రాయాలు రావడంవలన కొన్ని కార్యక్రమాలు నిలచిపోవచ్చును. స్త్రీమూలంగా కలహం రావచ్చును. శుభకార్యాల విషయంలో అభివృద్ధి ఉండదు.

స్త్రీలకు —ఆరోగ్యం గతవారంవలెనే ఉంటుంది. సాంఘిక వ్యవహారాల్లో పలుకుబడి లభిస్తుంది. బంధుమిత్రుల సమావేశాల్లో పాల్గొంటారు.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1,2,3 పా.)

ప్రతిక్షణమూ హోరా హోరిగా పోరాడితేనేగాని యే కార్యమూ సాధించలేరు. వార ప్రారంభంలో కంటే వారాంతంలో అన్ని వ్యవహారాల్లోనూ అనుకూలత ఉంటుంది. నూతన వ్యాపారాల్లో లాభించగల సూచనలు ఉన్నాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో అంతగా ప్రోత్సాహం ఉండదు. వృత్తిలో మీరు ఇదివరకు వదలివేసిన అవకాశం తిరిగి లభిస్తుంది. ఉద్యోగంలో మీ అభిప్రాయాలకు అధికారుల ఆమోదం లభిస్తుంది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. బంధువుల కార్యభారాన్నికూడా మీరు వహించడంవలన శ్రమ పెరుగుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. సంతానానికి సంతోషం, సౌఖ్యం లభిస్తాయి.

స్త్రీలకు - ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు. సాంఘిక వ్యవహారాల్లో జోక్యం చేసుకొనడంవల్లనే కార్యభారం పెరుగుతుంది.

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)
శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు.

వృత్తివ్యాపారాల్లో అవకాశాలు ఇంద్రధనుస్సువలె కన్పిస్తాయి. నూతన వ్యాపారాలు చేయడంవలన నష్టం రాగల సూచనలు ఉన్నాయి. అధికారులవలన జరుగవలసిన పనులు కొంచెం శ్రమమీద నెరవేరి లాభం కలగవచ్చును వృత్తిలో అధిక వ్యయముతోకూడిన పనులు ప్రారంభించడం వలన ప్రస్తుతం కొంత ఇబ్బంది కలిగినా ముందుముందు దాని ప్రయోజనాన్ని పొందుతారు. ఉద్యోగంలో కొంచెం తీరిక, శాంతి లభించవచ్చును. కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా సాగిపోతాయి. విద్యారంగంలో మీకృషి రాణిస్తుంది. ప్రయాణం ద్వారా కార్యసాధన జరుగగల సూచనలు ఉన్నాయి. రాజకీయాలలో మీకు వ్యతిరేకంగా ప్రయత్నాలు జరుగవచ్చును. కాని మీకు నష్టం కలగదు.

స్త్రీలకు —వారం మధ్యలో అనారోగ్యం చేయవచ్చును. పుణ్యకార్యాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాల్లో వ్యయం పెరుగుతుంది. ★

జన్మదినఫలం

మే-22

ఈ సంవత్సరం అప్పుడప్పుడు కొన్ని చికాకులు కల్గినా మొత్తంమీద బాగానే ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో మీకు సహాయం చేయువలసినవారు వ్యతిరేకించినా మీ స్వయం కృషివల్లనే కొంత అభివృద్ధిని సాధిస్తారు. నూతన వ్యవహారాల్లో ధన లాభం రాగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో ప్రారంభంలో కొంత అనిశ్చిత పరిస్థితి ఉన్నా రానురాను చక్కబడి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగంలో మీరు కోరే మార్పులకోసం ప్రయత్నము చేయడానికి మంచి సమయం. ఉద్యోగానికి సంబంధించిన విద్యల్లో మీరు ఉత్తీర్ణులు కాగల సూచనలు ఉన్నాయి. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు ఒడుదుడుకులు లేకుండా సాగిపోతాయి. ఇంతవరకూ చికాకులతో ఉన్న బంధు వ్యవహారాలు కూడా ఒక దారికి వస్తాయి. విద్యార్థులు కృతార్థులు కాగలరు. కళాకారులకు, యంత్ర వ్యాపారులకు మంచి సమయం

మే-23

ఈ సంవత్సరం సామాన్యంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో గత సంవత్సరం కంటె ప్రోత్సాహం లభిస్తుంది. వ్యాపార విస్తరణకై చేసే ప్రయత్నాలు కొనసాగి లాభించగల సూచనలు ఉన్నాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు కూడా బాగా ఉంటాయి. వృత్తిలో కొద్ది పోటీ వచ్చినా మీ కార్యక్రమాలకు ఆటంకం రాదు. ఉద్యోగంలో స్థానచలనమునకు అవకాశం ఉన్నది. స్థిరాస్థి వ్యవహారాల్లో ఇంతవరకూ ఉన్న చిక్కులు తగ్గుతాయి ఆరోగ్యం బాగానే ఉంటుంది. కాని సంవత్సరం మధ్యలో అనారోగ్యం చేయవచ్చును కుటుంబ వ్యవహారాల్లో ఎప్పుడూ ఏవో చిక్కులు వస్తూ ఉంటాయి. శుభకార్య విషయంలో తగిన ప్రోత్సాహం లభించదు. ప్రేమ వ్యవహారంలో అనుకూలత ఉంటుంది. విద్యార్థులు కొంచెం శ్రమమీద కృతార్థులు కాగలరు.

మే-24

ఈ సంవత్సరం చిత్రంగా ఉంటుంది. మీకు ఇష్టంలేకపోయినా కార్యసాధన కోసం మీ అభిప్రాయాలకు విరుద్ధంగా ప్రవర్తించవలసి వస్తుంది. మీకంటె ఎక్కువ స్థాయి వారితో కలసి మెలసి తిరుగుతారు వృత్తి వ్యాపారాల్లో ఆదాయం పెరగగల సూచనలు ఉన్నాయి కాని, వ్యాపారంలో సాహసం చేయడం మంచిదికాదు. ఉద్యోగంలో పెద్ద మార్పులు రావు కాని పై అధికారుల ఆదరణ లభిస్తుంది. గృహనిర్మాణాది ప్రయత్నాలు అతి చురుకుగా సాగుతాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది గాని, అప్పుడప్పుడు ఉష్ణాధిక్యత కలుగుతూ ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. శుభకార్యాల విషయంలో అనుకూలత ఉంటుంది. సంవత్సరం మధ్యలో దూర ప్రయాణాలు చేస్తారు. విలువైన వస్తువులు కొంటారు. విద్యార్థులు సాధారణంగా కృతార్థులు కావచ్చును.

మే-25

ఈ సంవత్సరం అన్నివిధాలా అనుకూలంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో మీరు ఎదురుచూడని అవకాశాలు లభిస్తాయి. వ్యాపారంలో ఆకస్మిక ధనలాభం కలుగగల సూచనలు ఉన్నాయి. వ్యాపార విస్తరణకై చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. వృత్తిలోనూతన మార్గాల ద్వారా ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగస్థులకు ఉన్నతస్థానం లభించగల సూచనలు ఉన్నాయి. కోర్టు వ్యవహారాల్లో మాత్రం కొన్ని చిక్కులు ఏర్పడవచ్చును. కాని నష్టం కలగదు. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు ఆటంకం లేకుండా సాగిపోతాయి గాని బంధువులకు సంబంధించిన వ్యవహారాల్లో కొన్ని చికాకులు

జన్మదినఫలం

రావచ్చును. ప్రేమ వ్యవహారాల్లో ప్రోత్సాహం లభిస్తుంది. విద్యార్థులకు క్లాసు రావచ్చును. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ధనలాభం.

మే-26


ఈ సంవత్సరం మీరు విశేషమైన ప్రయోజనాన్ని పొందలేకపోయినా మొత్తంమీద బాగా ఉంటుందని చెప్పవచ్చును. సంవత్సరం ప్రారంభంలో కంటే ఆఖరున ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాపారంలో స్వల్పంగా ఆదాయం పెరగగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో శ్రమ పెరుగుతుంది. విశేషమైన అనుకూలత ఉండదు. ఉద్యోగంలో మార్పులను గురించి సంవత్సరాంతంలో ప్రయత్నం చేయడం మంచిది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది కాని అప్పుడప్పుడు బలహీనత కన్పిస్తుంది. కుటుంబ వ్యవహారంలో కొన్ని ఒడుదుడుకులు వచ్చి క్రమంగా సర్దుకొంటాయి. సంతానానికి స్వల్ప అనారోగ్యం చేయవచ్చును. రాజకీయాలలో కొంత ప్రతిఘటనను ఎదుర్కొన్న తరువాత విజయాన్ని సాధిస్తారు. బాధ్యతతో కూడి పదవులను నిర్వహిస్తారు. విద్యార్థులు మంచి మార్కులతో కృతార్థులు కాగలరు.

మే-27

ఆడంబరం ఎక్కువ, అనుభవం తక్కువ అనే ధోరణిలో ఈ సంవత్సరం ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో గౌరవం పెరుగుతుంది. ప్రయత్నించిన పనులన్నీ నెరవేరుతూ ఉంటాయి కాని ఫలితం చేతికి వచ్చేసరికి సంతృప్తికరంగా ఉండదు. భాగస్వాములతో భేదాభిప్రాయాలు రావడం వలన కొన్ని వ్యవహారాలు నిలిచిపోవచ్చును. రావలసిన డబ్బు చేతికి రాక కొంత ఇబ్బంది కలుగుతుంది. అన్ని వ్యవహారాలూ అనుకూలంగా కన్పించినా ఆందోళన కలిగించే పరిస్థితి ఉంటుంది. ఆరోగ్యం చిత్రంగా ఉంటుంది. కొంతకాలం అనారోగ్యం చేయడం మరల వెంటనే ఆరోగ్యంగా ఉండడం జరుగుతుంది. కుటుంబ వ్యవహారాల్లో ముఖ్యమైన విషయాలను వాయిదా వేయడం మంచిది. సాంఘిక వ్యవహారాల్లో ఖ్యాతి లభిస్తుంది. విద్యార్థులు శ్రమమీద కృతార్థులు కాగలరు.

మే-28

ఈ సంవత్సరం బాగా ఉంటుందని చెప్పడానికి అవకాశం లేదు. కాని నష్టం కూడా కలగకపోవచ్చును. వృత్తి వ్యాపారాల్లో ఏవో ఒడుదుడుకులు వస్తూ ఉండడం వలన ఆశించిన అభివృద్ధిని సాధించలేరు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం రాగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో కొత్తవారి పోటీ తీవ్రంగా ఉండడం వలన శ్రమ పెరుగుతుంది. ఉద్యోగంలో మీ అభిప్రాయాలకు తగిన అవకాశం దొరకక నిరాశ కలుగుతుంది. మానసిక వ్యథ కలిగించే వార్తలు రావచ్చును. వ్యాపార విస్తరణకై చేసే ప్రయత్నాలు అంతగా ఫలించవు. రక్త సంబంధమైన అనారోగ్యం చేయవచ్చును. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. విద్యారంగంలో మీ బుద్ధి చురుకుగా పనిచేస్తుంది. రాజకీయాల్లో తటస్థంగా ఉండటం మంచిది. విద్యార్థులు సామాన్యంగా కృతార్థులు కాగలరు. ★



ముప్పాళ్ల రంగనాయకమ్మ

జరిగిన కథ

తను రాసిన కథపై సహృదయంతో విమర్శ రాసిన మధుసూదన్ స్నేహాన్ని శారద వాంఛిస్తుంది. ఒకరోజు బీచ్‌లో ఒకమ్మాయి కేసి తదేకంగా చూస్తున్న మధును చూచి, ఆమెను గురించి అడుగుతుంది శారద. మధు చెప్పాడు. కళ్యాణి జగన్నాథం దంపతులకు సూర్యం, మధు సంతానం. మేనకోడలు పుట్టిం దన్న ఉత్సాహంతో జగన్నాథంగారు వద్దన్నా నిండు నెలల్లో పుట్టింటికి బయల్దేరుతుంది కళ్యాణి. పుట్టింట్లో ఆడపిల్లను ప్రసవించి కన్నుమూస్తుంది.

3

ఓయీ భగవంతుడా ! ఏరిచి ఏరిచి మంచి వాళ్లనే కరువు చేస్తావు. ఇదెక్కడి న్యాయమయ్యా ? తల్లీబిడ్డలనూ భార్యాభర్తలనూ నిర్దయగా వేర్పు చేస్తావు. పచ్చని కాపురాలలో ఆరని చిచ్చుపెడతావు. నవ్వుతూ బ్రతికేవాళ్లని హఠాత్తుగా ఏడిపిస్తావు. ఈ క్షణాన వున్నదంతా మరుక్షణానికి మాయం చేస్తావు. ఇందుకేనా ప్రభూ నిన్ను కరుణాసముద్రుడని స్తుతి చేస్తారు? ఇదేనా ప్రభూ నీ నిరంకుశ సృష్టి విలాసం ?

ప్రేమస్వరూపిణియైన కల్యాణిని కరువు చేశావే ! కన్నకూతురి కోసం అహోరాత్రులూ అలమటించే ఆ తల్లిదండ్రుల గర్భశోకం అర్థం చేసుకోగలవా ? తల్లి లేక దీనాతి దీనంగా విలపించే పసిబిడ్డల్ని నీవు మరిపించగలవా ? అర్ధాంగి మరణంతో కుప్పకూలి జీవచ్ఛవమై పడివున్న భర్త మనో వ్యథ వూహించనైనా వూహించగలవా ? ఏ ఒక్కటి చేయగలిగినా నీవు కల్యాణిని కరువు చేయవే ! భగవాన్! నీ బిడ్డలనే బొమ్మలుచేసుకొని ఆడుకుంటావా? నీ సృష్టిలోనే వేదన చూసుకు ఆనందిస్తావా ? కరుణించవలసిన నీవే దారుణంగా పాలిస్తావా?

కంటికి కనుపించని భగవంతుణ్ణి నిందించటం, జవాబు చెప్పని విధిని ఆరోపించటం తప్పితే చేయ గలిగింది ఏముంది ?

కల్యాణి మరణంతో ఆ కుటుంబంలో భయం కరమైన పరిస్థితులు సంభవించాయి. జగన్నాథం గారు మతిభ్రమించిన వ్యక్తిలా పిచ్చిగామారిపోయారు. ఎవరెన్నివిధాల సముదాయించినా ఆయన శూన్య దృష్టిలో కళాకాంతులు ప్రవేశించలేదు. మంచంలో పడివుండే ఆ వ్యక్తి ఒకనాటి అర్ధరాత్రి హఠాత్తుగా మాయమయ్యారు. ఎటుపోయారో ఏమయ్యారో ఎవరికి అంతు చిక్కలేదు — కూతురి మరణం ! అల్లుడి పరారీ ! తీరని దుఃఖాన్ని దిగమింగి రెక్కలురాని మనుమల కోసం గుండెరాయి చేసుకొని అల్లుడి సంసారాన్ని ఆదుకోబోయిన రాజయ్యగారికి విద్యుద్ఘాతం తగిలింది.

జగన్నాథంగారి ఆస్తి చాలావరకు అప్పులలోనే మునిగి వుంది. ఆయన అంతర్ధానంతో అప్పుల వాళ్లంతా ఒక్కసారి బయట పడ్డారు. మూడో మనిషికైనా తెలియని ఈ నిజాన్ని గురించి పన్నెత్తి మాట్లాడకుండా ఆస్తి అప్పులకింద కట్టబెట్టవలసి వచ్చింది. ధైర్యానికి ప్రతిరూపం వంటి రాజయ్య గారు పసివాళ్లను కావలించుకొని బావురుమన్నారు. చెడుమార్గాలు పట్టి తిరిగే అల్లుడ్ని మందలించుకో లేకపోయిన ఆయన పెద్దరికం మంటగలిసింది. లోకుల మాటలతో అభిమానధనుడైన రాజయ్య గారు కుంచించుకు పోయారు.

అల్లుడు జల్సారాయుడని తెలిసికూడా పట్టించు కోక పోవటం ఆయనకు చాలా అపరాధంగా తోచింది. ఆదిలోనే అల్లుణ్ణి మందలించి అనునయంగా నచ్చ జెప్పి ఈనాడీ గడ్డుస్థితి సంభవించకుండా చేయలేక పోయిన తన మూర్ఖతకు అమితంగా పశ్చాత్తాప పడ్డారు.

ఒకప్పుడు రాజయ్యగారు అల్లుడు ఆస్తిపరుడని గర్వించార. కూతురి సంసారం దివాణంలాగే వుంటుందని తృప్తిగా నవ్వుకున్నారు. ఆ పల్లెటూరి పిచ్చివాళ్లకు మొట్టమొదట తమ అల్లుడే రేడియో తెచ్చి చూపించాడనీ — మునసబుగారి మనవడి పెళ్లిలో తమ అల్లుడు మాత్రమే భోగం సానితో పంతం పట్టగలిగాడనీ— వూళ్లో జరగాల్సిన విశేషా లన్నిటికి అల్లుడి మాటే ఆయువు పట్టనీ — చేయిజాపి యాచించే వాడికి చేతికందినంతా గిర వాటు వేయగలడనీ — అల్లుడి బ్రతుకే ఒక జమీందారు తరహా అనీ అల్లుడు చేసేవంతా ఆస్తి పరుడు చేయాల్సిందేననీ — నిశ్వసించిన రాజయ్య గారు భవిష్యత్ నిర్ణయాలను లీలా మాత్రమైనా శంకించలేక పోయారు.

గుమ్మడి పండు కుళ్లి భళ్లున బద్దలైంది. కల్యాణి కాపురం విచ్చి పోయింది. ఇల్లాలు మర ణించింది. యజమాని పరారీ అయ్యాడు. అప్పుల వాళ్లు ఆస్తి కట్టుకున్నారు. పరువు బజారుపాలయింది. పసివాళ్లు అనాథు లయ్యారు.

ఆ ఇంటి తలుపులు మూసుకున్నాయి.

* * *

తల్లి మరణానికి చిహ్నంగా మిగిలిపోయిన పసిపాప ఇంట్లో అందరి అనురాగం పొందలేక పోయింది.

"అక్కయ్యే వుంటే కూతుర్ని పువ్వుల్లో పెట్టి పెంచుకోదా ? దాని ఆత్మశాంతికైనా పాపని పెంచి పెద్దచేయాలి కదా ?" అనుకున్న పినతల్లి జానకి మాత్రం పాప బాధ్యత స్వీకరించింది.

"అమ్మ కావాలి .... అమ్మ ! అమ్మ !" అంటూ రాత్రింబవళ్లూ ఏడ్చే మధు ఒక సమస్యే అయ్యాడు — "అమ్మ దగ్గరికి తీసుకువె అన్నయ్యా ! అమ్మ ఎక్కడికి వెళ్ళింది ??" అంట మధు అడుగుతోంటే తమ్ముణ్ణి వోదార్చటం మ తనూ ఏడ్చేవాడు సూర్యం. పదేళ్ల సూర్యం ఏమం కష్టసుఖాలు తెలిసినవాడు కాకపోయినా పరిస్థితు అర్థం చేసుకోగలిగినట్టు ఏడవకుండా మౌనం ఆలోచించుకోవటానికి అలవాటు పడ్డాడు.

"అమ్మ చచ్చిపోయింది. నాన్న ఎక్కడికో వె పోయాడు. పొలాలు అన్నీ ఎవరో తీసేసుకున్నార పాపం నాన్నవాళ్ల దగ్గర చాలా డబ్బు తెచ్చుకున్నాడ

అందుకని తాతయ్య మరీ ఏడుస్తున్నాడ అమ్మమ్మ మంచం మీదనుంచి లేవటమే లేదు – ఇప్పుడు మనం ఏడిస్తే ఎవరు చూస్తారు ? పిన్ని కేమో చెల్లాయితోనే సరిపోతుంది" — తనను తన వోదార్చుకోగలిగిన సూర్యం అమ్మ కోసం ఏడ్చే



కూలిన గోడలు

తమ్ముణ్ణి కూడా వోదార్చటానికి ఎన్నోవిధాల ప్రయత్నించేవాడు.

" అత్తామామా ఏడవటం ఎందుకూ? తాతయ్యా అమ్మమ్మా పిన్నీ అత్తయ్యలూ మామయ్యలూ అందరూ వున్నారుగా ? "

" మరి అమ్మా నాన్నా లేరేం ? "

" అమ్మ చచ్చిపోయిందిగా. నాన్న ఎక్కడికో వెళ్ళిపోయాడు."

" నాన్న ఇంక రాడా అన్నయ్యా ? "

" ఏమో మరి."

" మనల్ని తీసుకు వెళ్లకుండా నాన్న ఒక్కడే వెళ్లిపోయాడు కదూ ?

" మనం చిన్నవాళ్లం కదా ? అందుకే తాతయ్య దగ్గిర వుంచేశాడు."

" నీకు ఏడుపు రావటం లేదూ అన్నయ్యా ? "

" నాకేం రావటం లేదు. అసలు ఏడవటం ఎందుకేమిటి ? తాతయ్య ఏడవకూడదని చెప్పలా ? "

" తాతయ్యే ఏడుస్తాడేం మరి ? "

సూర్యం బుర్ర గోక్కున్నాడు. ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు చాలాసేపు. క్రిష్ణుడు — సీతాపతి కొడుకు. వాళ్లిద్దర్నీ వెదుక్కుంటూ వచ్చాడు — "ఇక్కడ కూర్చున్నారా మీరు ? తాతయ్య మీ కోసం వెదుకుతున్నాడు. మన ముగ్గుర్నీ ఆడుకోటానికి వెళ్లమన్నాడు."

సూర్యం లేస్తుంటే మధు లేచాడు. ముగ్గురూ కలిసి వెళ్తుంటే జానకి పిలిచింది — " పాప ఏడుస్తోంది సూర్యం. కొంచెం ఎత్తుకు కూర్చుంటావా ? నాకు ఇంట్లో పని వుంది." అంది బతిమిలాడుతూన్నట్టు.

సూర్యం ఆగిపోయాడు — " మీరు వెళ్లి ఆడుకోండిరా ! నేను చెల్లాయిని ఎత్తుకుంటాను."

" ఊహూ ! నేనూ నీ దగ్గిరే కూర్చుంటాను. చెల్లాయిని ఆడిద్దాం. నువ్వు వెళ్లిపోరా బావా ! " క్రిష్ణుడికి చెప్పేసి వచ్చాడు మధు. క్రిష్ణుడు కూడా వచ్చేస్తూ — " నేనూ వెళ్లను. మీ చెల్లిని ఆడిస్తాను." అన్నాడు.

" సరే ! అందరూ జాగ్రత్తగా మన అరుగు మీదే ఆడుకోండి." అంటూ జానకి లోపలికి వెళ్లింది.

తల్లిదండ్రుల ధ్యాసనుంచి మధూ మనస్సు మళ్లించటానికి ఎవ్వరే ప్రయత్నాలు చేసినా బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. అప్పటికప్పుడు మధు ఆ విషయాన్ని మర్చిపోయినా కొంతసేపటికి ఎప్పటి స్థితి ప్రారంభమయ్యేది. మధూ తిండి తినటం — నిద్రపోవటం మానేశాడు ! ఏడ్చేవాడిని జాలిపడి పెద్దత్త పార్వతి ఎత్తుకోబోయింది.

" నన్ను నువ్వేం ఎత్తుకోవద్దు." అంటూ హోరాయించాడు.

" ఒరేయ్ ! దొంగ లొస్తారు. పడుకో, లేకపోతే ఎత్తుకుపోతారు." భయపెట్టాడు మేనమామ విశ్వనాధయ్య.

ఎదురు తిరిగాడు మధు — " నన్నేం ఎత్తుకుపోరు. మా అన్నయ్య లేడా ? నిన్నే ఎత్తుకు పోతారు."

విశ్వనాథం — కొంచెం కోపంగానే మందలించాడు అల్లుణ్ణి — " వేలెడంత లేవు. వెధవ పెంకి జవాబులూ నువ్వూను. నోరు మూసుకుని పడుకుంటావా లేదా ? . అని,

మధు భయంతో బావురుమన్నాడు. రాజయ్య గారు మనమణ్ణి గుండెలకు జేర్చుకుంటూ — "చిన్నవాడితో నీకేమిటి విశ్వం ? తల్లిదండ్రులు కన్పించక పసివాళ్ళు కుళ్లి పోతోంటే వోదార్చవలసింది పోయి కసురుకుంటావా ? పిల్లలు బెంగటిల్లి పోరూ ? అంటూ మందలించారు కొడుకుని. విశ్వనాథం మారుమాట్లాడకుండా గది తలుపులు మూసు కున్నాడు. మధు తాత గుండెల మీదపడి వెక్కి వెక్కి ఏడుస్తూ నిద్రపోయాడు. రాజయ్యగారు నిశ్శబ్దంగా కళ్లు ఒత్తుకున్నారు. పసివాళ్ళు ఏడిస్తే వినటానికి తనైనా వున్నాడు. తనే ఏడిస్తే ఎవరు వింటారు ? దీర్ఘంగా నిట్టూర్పు విడిచారు. చేతుల్లో నిద్రపోయిన మనమణ్ణి పక్కమీద పడుకోబెట్టి వీపుని నిము రుతూ తుళ్లి పడ్డారు. మధూ చాలా నీరశించి పోయాడు. ఎముకలు బయటపడి అస్థిపంజరం కన్నా ఒక్క చూపు మెరుగ్గా వున్నాడు. ఇలా నిర్లక్ష్యం చేస్తే పసివాడు కూడా దక్కకపోవచ్చు. మరి చేయ గలిగిందేముంది ?

రాజయ్యగారి ఆలోచనలు పరిపరివిధాల పరుగు లెత్తాయి....... చివరికో ఆలోచన ..... ఈవూరు పరిసరాలు మారిస్తే ..... మధు కొంత తేరుకో లేడూ ? కొత్త ప్రాంతంలో పిల్లలు మారవచ్చునన్న ఆలోచన సుందరమ్మగారికి కూడా సమంజసంగానే తోచింది.

సంస్థానపు వుద్యోగం విరమించుకొని పిల్లల్ని చూసుకొంటూ ఇంటి దగ్గరపడి వుందామని నిశ్చ యించుకున్న రాజయ్యగారు తిరిగి సంస్థానానికి వెళ్లిపోవటానికే తయారయ్యారు.

* * *

మధూ విషయంలో రాజయ్యగారి అంచనా ఏమంత నిజం కాలేదు. ఇళ్ళు మారినా మధూ లేత మనస్సులోని ముద్రలు — తల్లిదండ్రుల జ్ఞాపకాలు మాసిపోలేదు. ఆట పాటలు మాని దిగులుతో కృశించి పోతూన్న మధూని చూస్తున్నకొద్దీ సుందరమ్మగారి గుండెలు తరుక్కు పోయాయి. సూర్యం పరిస్థితి మాత్రం ఏమంత విచారించనవసరం లేక పోయింది. తిరిగి బడిలోచేరి చదువుకోటానికి అలవాటు పడ్డాడు.

వీధిలో చింతచెట్టు క్రింద పిల్లలందరూ ఆడు కొంటూంటే వాళ్ళని చూస్తూ అరుగు మీదే కూర్చున్నాడు మధు. సూర్యం కూడా ఆడుకోవటం యిష్టం లేక పుస్తకం తెరుచుకు తమ్ముడిని పక్కనే కూర్చున్నాడు.

వీధి చివర నుంచి ఏదో మేనా వస్తున్నట్టు కన్పించింది. చూస్తూండగానే దగ్గిరికి వచ్చి మధూ వాళ్ల ఎదుర్తుగానే ఆగింది. ఆడుకొంటూన్న పిల్లలందరూ బిలబిల్లాడుతూ వచ్చి మేనాని చుట్టేశారు. సూర్యం సంభ్రమంగా లేచి నిలబడ్డాడు. మధూ లోపలికి పరిగెత్తాడు.

"అమ్మమ్మా ! అమ్మమ్మోయ్ ! మేనా వచ్చే సింది. నిజంగానే మనం వెళ్తావా ?"

ఎక్కడికో వెళ్తామని పొద్దున్న నుంచీ సుంద రమ్మగారు చెప్తోంటే మధూ నమ్మలేదు. తను ఏడిచినప్పుడల్లా ఉత్తుత్తి అబద్దాలేవో అలా చెప్తూనే ఉంటారు. కాని మేనా రావటం స్వయంగా చూసిన మధు నమ్మక తప్పలేదు. మేనాలో వెళ్తా మనుకొంటే చాలా సరదా వేసింది.

కూలిన గోడలు

సంస్థానంతో రాజయ్యగారి ఉద్యోగపు హోదా చిన్నదే అయినా జమీందారుల దృష్టిలో వారికి ప్రత్యేక స్థానం ఉంది. రాజయ్యగారి పనితనం నిజాయితీ జమీందారులకు స్వకులస్థులపై ఉన్న అభిమానం ఆయన పలుకుబడికి కారణ మయ్యాయి. మగవారి స్నేహ భావాలను అర్థం చేసుకునే జమీందారిణి శ్యామసుందరీదేవి రాజయ్య గారి కుటుంబంతో బాంధవ్యం ఉంచటానికి ప్రయత్నిస్తుంది. జమీందారిణి పుట్టిన రోజు వేడుకకు సుందరమ్మగారికి ప్రత్యేక ఆహ్వానం వచ్చింది.

కూతురి మరణానంతరం కంటి తడైనా ఆరకుండా వీధి మొహం చూడటానికి ఇష్టం లేని సుందరమ్మగారు నిగర్వి దయామయీ అయిన జమీందారిణి అభిమానంతో పంపిన ఆహ్వానం తిరస్కరించలేక ప్రయాణానికి సిద్ధ మవక తప్ప లేదు.

మధు హుషారుగా కొత్త చొక్కా తొడు క్కుంటూ "నువ్వు కూడా తొడుక్కోవేంరా అన్నయ్యా ?" అన్నాడు.— "వాడు వద్దు పోయినా ! నిన్ను తీసుకు వెళ్తాను. అందరూ వెళ్తే బావుంటుందా ?" అంది సుందరమ్మ గారు.

"అదేమిటి ? పాపం అన్నయ్య చూడద్దా ?" పొద్దున్న అమ్మమ్మ చెప్పిన మాటలు జ్ఞాపకం ఉండనే ఉన్నాయి సూర్యానికి— "నేను రానురా తమ్ముడూ ! బోలెడు పాఠాలు చదువుకోవాలి. లేక పోతే మేష్టారు కొడతారు. అమ్మో ! దెబ్బలు తినినా ఏమిటి ?" అన్నాడు తనకు రావటమే ఇష్టం లేనట్టు.

నడివీధిలో పిల్లలందరి మధ్యా తను ఒక్కడే మేనాలో ఎక్కి కూర్చోవటంతో మధుకి చాలా గర్వం కలిగింది. నవ్వుతూ మేనా అద్దాల్లోంచి పిల్లలందరికేసి చూశాడు. ఇన్ని రోజులకి మనవడి మొహం మీద నవ్వు కన్పించటంతో సుందరమ్మ గారు మధుని దగ్గరికి తీసుకొంది.

"మనం ఎక్కడికి వెళ్తున్నాం అమ్మమ్మా? ఎందుకూ ? మరి ఈ మేనా వాళ్లదే కదూ ? వాళ్ల ఇల్లు ఎలా ఉంటుంది ?" అంటూ చాలా ప్రశ్నలు వేశాడు మధు. అన్నిటికీ సుందరమ్మ గారు సమాధానాలు చెప్పి— "అక్కడ నువ్వు అల్లరి చెయ్యకూడదు సుమా ! అమ్మ గుర్తు వచ్చినా ఏడవ కూడదు. బుద్ధిగా ఉంటావు కదూ?" అంది. మధు అంగీకరిస్తున్నట్టే తల వూపాడు.

"అమ్మమ్మా ! మరి మనం. . . ." మనవడు మాటి మాటికీ పలకరిస్తుంటే సుందరమ్మగారు ముక్కు మీద వేలు ఉంచుకొని— "ష్ !మనం బజారు లోంచి వెళ్తున్నాం. ఇలా మాట్లాడు కొంటూంటే అందరూ వినరూ ? తప్పు. మాట్లాడ కూడదు." అంటూ మందలించింది. మధూ అమ్మ మ్మని ప్రశ్నలు వేయటం మాని మేనా అద్దాల లోంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు. మేనా దివాణాన్ని సమీపిస్తుంటే సుందరమ్మగారు నెమ్మ దిగా అంది— "మనం వారి మేడ దగ్గరికి వచ్చే స్తున్నాం." అద్దాల్లోంచి సింహద్వారం కన్పిం చింది.

ద్వారం పైన ఆర్చీమీద రెండు నల్లని పోత సింహాలు నిగనిగలాడుతున్నాయి. ద్వారానికి రెండు వైపులా ఖాకీ బట్టలు కట్టుకున్న ఇద్దరు సిపా యిలు బల్లేలు పుచ్చుకొని నిలబడి ఉన్నారు.

"అమ్మమ్మోయ్ !" గట్టిగా అరవబోయిన మధూ నోరు చటుక్కున మూస్తూ మందలిం చింది సుందరమ్మగారు—" తప్పుకదూ ? అంత గట్టిగా అరుస్తారా ? మనం జమీందారు గారిం టికి వెళ్లి పోతున్నాం అక్కడ అసలే మాట్లాడ కూడదు."

మేనా సింహద్వారం దాటి అందమైన చెట్ల లోంచి వెళ్తుంటే ఆశ్చర్యంగా చూస్తూ కూర్చు న్నాడు మధు. మధ్యగా దారిఇస్తూ కరివేపు చెట్లూ, గన్నేరు చెట్లూ పచ్చగా ఎర్రగా విరగబూసి ఉన్నాయి. వాటి మధ్య మధ్య కొబ్బరిచెట్లూ, జీలుగు చెట్లూ, ఠీవిగా నిలబడ్డాయి.

"అమ్మమ్మా ! ఎన్ని చెట్లో ! ఎన్ని పువ్వులో !" హిత బోధ మర్చిపోయిన మధు సంభ్రమంగా అరి చాడు. సుందరమ్మగారు కళ్లెర్రజేసి నిశ్శబ్దంగా కోపపడింది. మధూకి చిరాకు వేసింది. గట్టిగా అరుచుకొని మాట్లాడుకోకుండా ఈ నిర్బంధం ఏమిటి ? ఇబ్బందిగా మొహం పెట్టుకు కూర్చు న్నాడు.

మేనా కోటగుమ్మం వరకూ వెళ్లి ఆడవారి లోగిళ్లకేసి మళ్లింది. దారిలో అక్కడక్కడా నీళ్లు చిమ్ముతూన్న ఫౌంటైన్లు కన్పించినా చూడ టం తప్ప మధు మాట్లాడలేదు. మనవడి ఉదా సీనత గ్రహించిన సుందరమ్మగారు ప్రేమగా మధువీపు నిమిరి ఓదార్చింది.

చక్కని మేడ ముందు మేనా ఆగటంతో ఒక దాసి మేనా తలుపులు తెరిచి సుందరమ్మ గారికి నమస్కరించి మెట్లవైపుకు దారి చూపించింది.

అందమైన ఆ మేడలో ఏది చూసినా మధూకి ఆశ్చర్యమే కలిగింది. మేడమీద విశాలమైన గదు లున్నాయి. గుమ్మాలకూ కిటికీలకూ కట్టిన తెల్లని తెరలు గాలి విసురుకి ఎగి రెగిరి పడుతున్నాయి. నేల కన్పించకుండా గదులన్నిటిలోనూ రంగు రంగుల తివాచీలు పరిచి ఉన్నాయి. విశాలమైన గోడలమీద పెద్ద పెద్ద చిత్రాలు— బల్లల మీద పూల కూజాలూ ఎంతో మనోహరంగా ఉన్నాయి. కథల్లో రాకుమారుడు దేవలోకంలో ప్రవేశించి నట్టు మధు మంత్ర ముగ్ధుడై కళ్లు విశాలం చేసుకుని ఇల్లంతా పరికిస్తూ అమ్మమ్మ చెయ్యి గట్టిగా పట్టుకొని నడవసాగాడు.


"పాపం అన్నయ్య కూడా వస్తే ఎంత బావుం డును !" మధూకి దిగులు వేసింది.

జమీందారిణి శ్యామసుందరీదేవి చిరునవ్వుతో ఎదురువచ్చి సుందరమ్మగారికి నమస్కరించింది.

"నమస్కారం తల్లీ !" సుందరమ్మగారు తిరిగి చేతులు జోడిస్తూ "అమ్మగారికి నమ స్కారం పెట్టు బాబూ !" అంటూ మనవడితో కూడా దణ్ణం పెట్టించింది. మధు సిగ్గుగా చేతులు జోడిస్తుంటే శ్యామసుందరీదేవి నవ్వింది. మధుకి ఆవిణ్ణి చూస్తుంటే మతి పోయింది.

జమీందారిణి శరీరం నిండా నక్షత్రాల రాశి పోసుకున్నట్టు ధగధగ మెరిసి పోయే రాళ్ల నగలే అలంకరించుకొంది. చేతులకు నిండుగా రాళ్ల గాజులూ మెడలో రాళ్ల గొలుసులూ— నడుం చుట్టూ నక్షత్రాల వడ్డాణం— కాళ్లకు కూడా రాళ్ల పాంజేబులూ— వేళ్లకి ఉంగరాలు— ఆడ వాళ్లకు అన్ని నగలు ఉండచ్చునని కూడా తెలియదు మధుకి. ఆవిడ జానెడు జల్తారు అంచుగల ఎర్రని పట్టుచీర కట్టుకొంది. చీరమీద జల్తారు పువ్వులు అక్కడక్కడా విడిసి పడుతున్నాయి. ఆవిడ వెంట్రుకల ముడి పెద్దదిగా అందంగా ఉంది. ముడి చుట్టూ ఒకే మాదిరి తెల్ల గులాబీలు పిక

47 వ పేజీ చూడండి



"ఇప్పుడు ప్రతివస్తువు మీకు బాగా కన్పిస్తుంది...ఏదీ...కాస్త ఆ బోర్డు చదవండి!..."
"బోర్డా ? ? ... ఎక్కడుంది ? ? ?


నికో
క్రిమిసంహార సబ్బు
పార్క్-డేవిస్ ఉత్పత్తి

మీ చర్మాన్ని, మొటిమలు, పొక్కులు, పేయడంనుంచి కాపాడి పరిశుభ్రంగా ఆరోగ్యంగా వుంచుతుంది. దీనితో నిత్యం తల రుద్దుకొంటే, దీని క్రిమిసంహారనురగ, చుండ్రు రాకుండా కాపాడుతుంది. నిరుపమానమైన నికో క్రిమిసంహార సబ్బు మీకు మూడు విధాల లాభం చేకూరుస్తుంది: అది పరిశుభ్రంచేయడం, క్రిములను నాశనంచేయడం, సంరక్షించడం. మీ చర్మానికి కావలసిన సంరక్షణ నిత్యంచేయండి.



NATIONAL PD 9162

—మొట్టమొదటి క్రిమిసంహార సబ్బు, నిత్య ఉపయోగానికి.


"లేచిపోయింది"
గంగాధర్
జహార్

గబాగబా ఉడికీఉడకని నాలుగు మెతుకులు కతికి బయట పడ్డాను. అప్పుడే పావు తక్కువ పది అయింది కనీసం ఆఫీసు చేరుకోవటానికి ఇరవై నిముషాలైనా పడుతుంది. పోస్టుమేన్ రాఘవులు ఎదురై "మీకొక కవరుందండీ" అంటూ అందించాడు. జేబులో కుక్కుకొని పరుగెత్తాను.

సాయంత్రం ఆఫీసునుండి బయటపడి స్వేచ్ఛగా గాలి పీల్చుకొని మెల్లగా కృష్ణ యొడ్డుకు దారి తీశాను. కృష్ణమీదుగుండా వచ్చే చల్లటి గాలికి చేసిన శ్రమంతా మరచి మనసు ఆనందంతో ఊహాలోకంలో విహరించ సాగింది హఠాత్తుగా కవరు సంగతి గుర్తుకొచ్చింది. ఆఫీసు పనిలో పడి దాని సంగతే మర్చిపోయాను. బహుశ రాధ వ్రాసిందేమో నను కుంటూ చించాను.

'ప్రియమైన చలపతీ: చాలరోజులకు ఉత్తరం వ్రాస్తున్నాను. మనం కలుసుకొని దాదాపు నాలుగు సంవత్సరాలవుతుంది. ఇంటి విషయాల్లో మునిగి పూర్తిగ బయటి ప్రపంచాన్నివిస్మరించాను. ముఖ్యంగా వ్రాయటమేమనగా వచ్చే శుక్రవారం మా చెల్లెలు శశి వివాహం నిశ్చయించాము. నీవు నాలుగు రోజులు ముందే బయలు దేరి రావలసింది. పట్టణ నాగరికతతో, ఒంటరి జీవితంలో విసిగిపోయి ఉంటావు. అది గాక నాకు ఈ నాలుగు రోజులూ సహాయంగా కూడ ఉండవచ్చు. తప్పకుండా రావలెను. అశ్రద్ధ చేయవద్దు... రామం.'

రామం అన్నట్లు నిజంగానే ఈ వాతావరణంలో విసిగి పోయాను. నాలుగు రోజులు హాయిగా ఎటన్నా తిరిగి రావాలని చాల రోజులనుండి అనుకుంటూ యున్నాను. అటు స్నేహితుడికి సహాయం చేసినట్లుంటుంది, నాకూ మార్పు కలుగుతుంది

రామం నేను ఇంటర్‌లో సహాధ్యాయులం. వాడు జీవితపు విలువ తెలిసినవాడు కాబట్టి చదువుకు స్వస్తిపల్కి, స్వగ్రామం వెళ్లి పొలం పనులు అజమాయిషీ చేసుకుంటూ ఉండిపోయాడు. నేను మాత్రం డిగ్రీ పుచ్చుకొని గుమస్తాగిరి వెలిగిస్తున్నాను.

బుద్ధి పుట్టాలేగాని అది సాధించేవరకు నాకు మనశ్శాంతి ఉండదు. ఉదయమే సెలవు చీటి వ్రాసి ఆఫీసుకు పంపి ప్రయాణ సన్నాహాలు చేసుకున్నాను.

రామం వాళ్లవూరు ఐదేళ్లక్రితం రామంతోపాటు కలసి ఒకసారి వెళ్లాను. ఊరు బాగా గుర్తు ఉన్నప్పటికి, ఈ అయిదేండ్లలో పెరిగిన నాగరికత ఆ వూరికి కూడ పెనవేసుకోవడంతో, రామం వాళ్ల ఇల్లు తెలుసుకోవడం కొద్దిగా కష్టమే అయింది.

పెంకుటిల్లకు బదులు డాబా వెలిసింది. ఇంటి ముందు పెద్ద పందిరి. తెల్లగా సున్నం కొట్టిన గోడలు. పెళ్లివారిల్లని తేలికగా గుర్తు పట్టవచ్చు.

నన్ను చూడగానే "అరె ఇంత కరెక్టుగా వస్తావనుకోలేదురా" అంటూ రామం ఎదురొచ్చాడు. అదే మాటకారి తనం, అదే అప్యాయత. వాడిలో ఏమీ మార్పు రాలేదు.

కాఫీ త్రాగి వాడి గదిలో కూర్చున్నాము. కాలేజీ అనుభవాలనుండి ప్రస్తుత విషయాలమీదకు చర్చ చుట్టి వచ్చేటప్పటికి కాలమెంత గడిచిందో కూడా తెలియలేదు.

"నమస్కారం అన్నయ్యా" అంటూ రామం చెల్లెలు శశి ప్రవేశించింది. నేను ఇదివరకు చూసిన శశికి ఇప్పటి శశికి పోలికే లేదు. పచ్చటి పసిమి ఛాయ సన్నగా, నాజూగ్గా, ఆకర్షణీయమైన కళ్లతో శశి ఎంతో అందంగా ఉంది. కాని నాకెందువలననో ఆ కళ్లల్లో ఒకరకమైన నిరుత్సాహం, అసంతృప్తి ఛాయా మాత్రంగా గోచరించాయి. బహుశ పెళ్లి అనగానే ఆడపిల్లలకు భయం బెరుకు ఉండటం సహజం. అందువలననేమో అట్లా ఉన్నది అని సరిపెట్టుకుందామనుకున్నా, శశిని చూచే కొలది ఏదో మనసులో బాధను సహిస్తూ పైకి కప్పి పుచ్చుకొని సంతోషంగా ఉన్నట్లు నటిస్తున్నట్లుగా కనబడసాగింది.

తల్లిదండ్రులు చిన్నప్పుడే పోయారు కొన్ని తరాల వరకు తరగని ఆస్తి. రామం శశి ఇద్దరే సంతానం. రామం పెదనాయనగారే చిన్నప్పటినుండి స్వంత బిడ్డలకన్నా ఎక్కువగా ఎంతో ప్రేమతో పెంచుకొని వచ్చారు. రామం ప్రయోజకుడై పెదనాయనకు భారం తొలగించి, శశి భారం, ఇంటిభారం పైన వేసుకున్నాడు.

"వరుడు ఎం. బి. బి. ఎస్. ఫైనల్ చదువుతున్నాడు. యోగ్యుడు. మా శశి అదృష్టవంతురాలు. ఈ కాస్త పని అయిపోతే నాకిక జీవితంలో ఆలోచించవలసిన విషయాలే ఉండవు. తల్లి దండ్రి లేని లోటును తీర్చగలిగాననే తృప్తి, శాంతి నాకుంటుంది." అంటూ రామం నిట్టూర్చాడు.

"నాకు కొద్దిగా పనులున్నాయి నువ్వేదయినా చదువుకుంటూవుండు. ఆ బీరువాలో పుస్తకాలున్నాయి" అని వాడు బయటకు వెళ్లి పోయాడు.

శరత్ చరిత్రహీనులు తిరగవేస్తూ ముండువాలోని ఈజీ-ఛెయిర్‌లో కూలబడ్డాను కాని చదువేమీ సాగటం లేదు. పిల్లలు ముండువాలో చేరి ఆడుకుంటూ గోల చేస్తున్నారు. కలిగిన వారింట్లో పెళ్లి కాబట్టి పెళ్లింకా నాలుగు రోజులుండగానే ఒకరొకరుగా చుట్టాలు దిగుతున్నారు. ఇంకా త్వరగా రానందుకు గృహస్థుల నిష్ఠూరాలు అందుకు అతిథుల సమాధానాలు, సామాన్లు లోపలికి పెట్టమని వాళ్లమీద గదమాయింపులతో, వాతావరణమంతా సందడిగా ఉంది. పరధ్యానంగా పుటలు తిరగ వేస్తున్నాను.

ఇంటిముందొక గుర్రబ్బండి ఆగింది. అందులో నుండి ఎవరో దిగుతున్నారు. సన్నటి షిఫాన్ చీర, హైహీల్స్, చేతికి రిస్టువాచీ, మెళ్లో ఖరీదయిన నెక్లెస్—ఒకావిడ దిగింది. ఆమె వెనక ఏభైలో పడిన ముసలావి డొకతె తెల్లగా, బొద్దుగా ఉన్న చిన్న పిల్లవాడితో దిగింది. ఆ పిల్లవాడు ముందు దిగినావిడ బిడ్డడు కావచ్చు. పిల్లవాణ్ణి తన దగ్గరుంచుకోవటం సభ్యతకు విరుద్ధమేమో నాకు తెలియదు. ఇంట్లోవాళ్లంతా ఆమెకు ఎదురువెళ్లి పిల్చుకొని వస్తున్నారు. ఆమేదో పెద్ద ఆఫీసరు భార్యో, లేక రామం వాళ్లకు బాగా కావలసినామేమో అయివుండాలి

పెద్దగా మాట్లాడుకుంటూ నా దగ్గరిగా వచ్చారు. మాట్లాడుతూ మాట్లాడుతూ ఆమె నావైపొకసారి చూసి కొద్దిగా ఉలిక్కిపడి గబగబా అడుగులేసుకుంటూ లోపలికి వెళ్లిపోయింది.

ఆ మనిషి పోలికలు నేనెక్కడో చూసినట్లుగానే గుర్తుంది. ఎవరై ఉంటారా అంటూ ఆలోచించ సాగాను. ఒక్కసారి నా మస్తిష్కంలో మెరుపు మెరిసింది. అప్రయత్నంగా నా పెదవులపై సావిత్రి అన్నమాట వెలువడింది.

అవును సావిత్రి ఎంత మారిపోయింది. నాకు తెలిసిన సావిత్రికి ఇప్పుడు నేను చూసిన సావిత్రికి పోలికలే లేవు. చివరిసారి నేను సావిత్రిని చూసి ఐదేండ్లవుతుంది కాని, ఈ ఐదేండ్లలోనే కాలం సావిత్రిలో ఇంతటి మార్పు తీసుకువచ్చినందుకు ఆశ్చర్యపడకుండా ఉండలేకపోయాను.

వెనుకటి స్మృతులు ఒకటొకటిగ నా కండ్ల ముందు తిరగసాగినై. బాహ్యప్రపంచాన్ని మరచి గతంలో మునిగిపోయాను.

మా చెల్లెలు రాధతోపాటు చదువుకోటానికి మా యింటికి తరచుగా సావిత్రి వస్తుండేది. మా అమ్మ సావిత్రిని రాధతోపాటు చూసుకునేది.

సావిత్రి నాన్న గోపాలంగారు పెద్ద వకీలు, పేరు ప్రఖ్యాతులతోబాటు సిరిసంపదలను కూడా ఆర్జించారు. సావిత్రి రెండవది. చాలా గారాబంగా పెరిగింది. ఖరీదైన బట్టలతో, హుందాగ, గంభీరంగా ఉండేది. ఎక్కువగ మాట్లాడేది కాదు. మా రాధ ఎప్పుడూ "ముచ్చు" అని పిలుస్తుండేది.

నాతోపాటు చదువుకొనే జోసఫ్ ఎక్కువగా మా ఇంటికి వస్తుండేవాడు. కొన్ని రోజుల పరిచయంలోనే మా యింట్లోవారందరికీ అతి సన్నిహితుడైపోయాడు. సన్నగా, ఎర్రగా, ఎప్పుడూ చలాకీగా ఉండేవాడు. అప్పుడప్పుడూ రాధకు, సావిత్రికి తెలియనివి చెప్తుండేవాడు. మా అమ్మ గాని, నేను గాని అంతగా పట్టించుకొనేవాళ్ళం కాము. చాల సోషల్‌గా మూవ్ అవుతుండేవాళ్లం.

కొన్ని రోజులు గడిచిన తరువాత ఒకరోజు మా అమ్మ నన్ను పిల్చి, "అరేయ్ చలపతి జోసఫ్ సావిత్రిల మీద నాకు అనుమానంగా ఉందిరా, విషయమేమిటో తెలుసుకో, ఏదైన జరిగితే మన మీదకు వస్తుంది" అని అన్నది.

నేను కూడ కొన్ని రోజులనుండి జోసఫ్ ప్రవర్తనలో మార్పు కనిపెడుతూ వచ్చాను. కాని, అంతగా పట్టించుకోలేదు.

సాయంత్రంపూట కృష్ణ ఒడ్డుకు వెళ్లి వాడితో అసలు సంగతి కదిపాను దానిమీదట తేలిన సంగతిది.

"అవునురా నేను సావిత్రి ప్రేమించుకున్నాము. మనస్ఫూర్తిగ ఒకర్నొకరం చేసుకోవాలని అనుకుంటున్నాము. కాని, మీరేమైనా అనుకుంటారని ఇన్ని రోజుల నుండి చెప్పకుండా ఆగాము" అన్నాడు.

"జోసఫ్ నీకు అన్ని విషయాలు తెలుసు. మీది నిష్కల్మషమైన ప్రేమే కావచ్చు. కాని, సమాజాన్ని గుర్తించి భవిష్యత్తులో జరుగబోయే పరిణామాల్ని ఆలోచించాలి. ఇందుకు ఒక్క వర్ణాంతర అభ్యంతరమే కాదు, సావిత్రి వాళ్లది బాగా కలిగిన కుటుంబం. అతి గారాబంగా పెరిగింది. ఒక వేళ సావిత్రి నిన్ను మనసార ప్రేమించి, జీవితంలో ఎదురయే పరిస్థితులను ఎదిరించటానికి సిద్ధపడినా, అటు ఆమె తల్లిదండ్రులు సుతరామూ ఒప్పుకోరు. ఆ విషయం నీకు తెలుసు. అన్నివిధాల మీకు వ్యతిరేక వాతావరణమే ఉంటుంది.


మంచి చిక్కని కాఫీ
—ఎల్లప్పుడు తాజాయైనది
—పరిశుద్ధమైనదని హామీ!



ఎంచబడిన మంచి గింజలతో: సువాసన, రుచికొరకు బ్రూక్ బాండ్ ఎప్పుడంతే మేలురకం గింజలు ఎంచబడును. అందువలననే మీకు బ్రూక్ బాండ్ చాలా ఎక్కువ కప్పుల కాఫీ ఇచ్చును.

శాస్త్రీయ పద్ధతిని వేచబడి: ఆధునాతన యంత్రములచే పరిమిత ఉష్ణోగ్రతల్లో గింజలు వేచబడును. అందువల్లనే బ్రూక్ బాండ్ ప్రతి ప్యాకెట్‌లోని కాఫీ ఒకే రకము. కమ్మదనము, చిక్కదనము కలిగియుండును.

గాలిచొరని సెలోఫేన్ సంచులలో భద్రపరచబడి: బ్రూక్ బాండ్ కాఫీ చేతికి తాకబడక పరిశుభ్రముగ, గాలి చొరబడని ఇనుమడికైన సెలోఫేన్ సంచులలో ప్యాక్ చేయబడివందువల్లనే తాజాగా, కమ్మగా వుంటుంది.



JWTBB 1294

ఊహించని సంఘటన లెన్నో జీవితంలో ఎదురవచ్చు. అప్పుడు ఈ ఆదర్శాలు, ప్రేమలూ ఉండవు. జీవితం మనం అనుకొన్నంత సులభంకాదు."

"మేము అన్ని విషయాలు ఆలోచించుకున్నాము" జోసఫ్ దృఢనిశ్చయంతో జవాబిచ్చాడు. మా యిద్దరికీ సావిత్రి తల్లిదండ్రులంగీకరించరని తెలుసు. సావిత్రి నన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నది. నాతోపాటు అన్ని చిక్కులు ఎదుర్కొనటానికి తాను ఎప్పుడూ సిద్ధమే. నాకోసం సర్వం త్యాగం చేస్తానన్నది. నేనుకూడా సావిత్రిని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. సావిత్రికోసం ఏమైనా చేస్తాను. ఉద్రేకంలో విచక్షణాజ్ఞానంలేకుండా తొందరపడుతున్నామని అనుకోకు. మాది పవిత్రమైన ప్రేమ" అని అన్నాడు.

మరునటి రోజు మధ్యాహ్నం రాధకోసం సావిత్రి వచ్చింది. "సావిత్రీ! జోసఫ్ నాకన్ని సంగతులు చెప్పాడు. మీ అంతరంగిక విషయంలో కలుగజేసుకుంటున్నానని అనుకోకుండా ఉంటే ఒక విషయం అడుగుతాను. మా రాధయెంతో నువ్వుకూడా అంతే జోసఫ్ నాకు స్నేహితుడు, నీవు మారాధ స్నేహితురాలవు. అందుకని మీ విషయంలో మాకూ కొంత బాధ్యత ఉంది. మీ మంచిని కోరేవాళ్ళల్లో నేను ముఖ్యుణ్ణి. నీవు బాగా ఆలోచించక త్వరపడుతున్నావనే నేను అనుకుంటున్నాను. జోసఫ్ మంచివాడే. నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్న మాటకూడా నిజమే. ముఖ్యంగా ఒక విషయం ఆలోచించు. ఇందుకు మీవాళ్ళు ఒప్పుకోరు. వారిని ఎదిరించి, చేసుకోవాలి. ఫలితంగా మీకు సంఘంలో కలగబోయే స్థానంగురించి ఊహించు. ఆత్మనిగ్రహం లేక జరిగినదానికి పశ్చాత్తాపపడితే జీవితాంతంనరకం అనుభవించాలి. చేతులుకాలిన తరువాత ఆకులు పట్టుకుంటే లాభం ఉండదు. ఇది తప్పితే గమ్యస్థానం చేరుకోలేరు. బాగా ఆలోచించు. మీవాళ్ళు నీముఖం చూడరు. శరీరంలో వేడి, ఉద్రేకం తగ్గిన తర్వాత చేసిన తప్పిదమేమిటో అర్థం అవుతుంది.

నేను చెప్పినదంతా శ్రద్ధగా ఆలకించి జవాబిచ్చింది. "కాదండి నేను జోసఫ్‌ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నేను అన్నీ ఆలోచించే నిర్ణయించుకున్నాను. మావాళ్ళు ఒప్పుకోరని నాకుతెలుసు. కాని జీవితంలో జోసఫ్‌ను తప్ప యింకొకరికి నా హృదయంలో స్థానమివ్వలేను. అందుకు ఏ త్యాగం చేయటానికయినా, ఎన్నికష్టాలనెదుర్కొనటానికయినా నేను సిద్ధమే".

ఇక నేనేం మాట్లాడలేకపోయాను. వారంతటి దృఢసంకల్పంతో ప్రేమించుకుని, ఒక నిశ్చయానికి వచ్చిన తరువాత నేను అంతరాయం కల్గించడం సమంజసం కాదనుకున్నాను.

నా చదువయిపోయి, ఉద్యోగంలోచేరి విశాఖపట్నం వచ్చేశాను. నేను వచ్చిన మూడోనెలకు జోసఫ్ దగ్గరనుండి ఉత్తరము వచ్చింది.

సావిత్రి తల్లిదండ్రి సావిత్రికి పెళ్ళిచేయాలని అనుకుంటున్నారట. తను మునిసిపాలిటిలో చిన్న ఉద్యోగంలో చేరాడట. సాధ్యమైనంత త్వరలో పెళ్ళిచేసుకోవాలనుకొంటున్నానని వ్రాశాడు.

నేను రెండు రోజులు సెలవుచూసుకుని వెళ్ళి

లేచిపోయింది

రావాలని అనుకుంటున్నాను. ఒకరోజు హఠాత్తుగా జోసఫ్ సావిత్రి ప్రత్యక్షమయ్యారు. విషయమేమిటో అర్థం అయింది. తను పెళ్ళిచేసుకోబోతున్నట్లు తనకోసం ప్రయత్నించవద్దని ఉత్తరం వ్రాసిపెట్టి వచ్చేసిందట.

రెండవరోజు నాకుతెలిసిన కొద్దిమంది స్నేహితులతో సింహాచలం వెళ్ళి, దేవుని సమక్షంలో సావిత్రి జోసఫ్‌ల వివాహం అతి నిరాడంబరంగా జరిగింది.

నాలుగురోజులు సావిత్రి జోసఫ్‌లు విశాఖలోనే గడిపారు. సాధ్యమైనంత త్వరగా వేరేవూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకోమని జోసఫ్‌కు సలహాయిచ్చి స్టేషనుకు వెళ్ళి వాళ్ళను బండి ఎక్కించాను.

వారంరోజుల తరువాత అకస్మాత్తుగా జోసఫ్ నుండి 'స్టార్ట్ యిమీడియట్లీ' అని టెలిగ్రాం. వచ్చింది. ఏం జరిగిందో ఊహించలేకపోయాను. వెంటనే బయలుదేరాను.

నేను వెళ్ళేటప్పటికి జోసఫ్ ఒక్కడే ఉన్నాడు. ఎందుకో మనిషి చాలా నీరసించిపోయాడు. దవడలు పీక్కుపోయి, ఎముకలు కనపడూ జీవకళలేకుండా ఉన్నాడు.

నూతిలోనుండి మాటలు వస్తున్నట్లు అతి బలహీనంగా చెప్పాడు. రెండు రోజులక్రితం సావిత్రి నాన్నగారు వచ్చి సావిత్రి తల్లికి చాలా సీరియస్‌గా ఉందనిచెప్పి సావిత్రికి పిల్చుకొని వెళ్ళారట. నిన్నటి దినం వీడు వాళ్ళింటికి వెళ్ళితే, వాళ్ళింటో చాలా భీభత్సంగా ఉన్నదట. సావిత్రి అక్క మరికొంతమంది చుట్టాలూ సావిత్రిని అనేక రకాల ఒత్తిడి చేశారట. మిగిలిన పిల్లలకు పెళ్ళిళ్ళుకావని, వారి కుటుంబం తిరిగి తలెత్తుకొని తిరగదని, జరిగిన విషయం ప్రచారం కాకముందే, సావిత్రిని వాళ్ళక్కగారి వూరు తీసుకుని వెళ్ళి వేరే పెళ్ళి చేయటానికి నిశ్చయించారట. జోసఫ్‌ను వాళ్ళు అనేకరకాలుగా బతిమాలి వారి వంశ మర్యాదను కాపాడ్డంకోసం సావిత్రి ఆశ వదులుకొని, జరిగినది మర్చిపోతే నష్టపరిహారంగా కొంత డబ్బిస్తామని అన్నారట.

"అయితే సావిత్రి ఏమన్నది?" అని అడిగాను. సావిత్రి ఎటూ జవాబివ్వలేదు. నేను తరచి అడిగితే, తన్ను మర్చిపొమ్మని, తనవాళ్ళు చెప్పినట్లు వింటానికే నిశ్చయించుకొన్నట్లు అన్నదట. జరిగినదాన్ని మర్చిపోవటానికి యిరువురం ప్రయత్నిద్దామన్నదట. ఇక వీడక్కడ ఉండలేక తిరిగివచ్చి నాకు వైరిచ్చాడు.

నేనేం చేయాలో పాలుపోలేదు. వాడికెట్లా ధైర్యం చెప్పాలో అర్థంకాలేదు. అంత ధైర్యంతో చేసుకున్న సావిత్రి అంత త్వరగా యెట్లా మారిపోయిందో ఊహించలేకపోయాను. జీవితంలో ఇటువంటి సంఘటనలు జరుగుతయ్యని నేను అనుకోలేదు.

నేనొకసారి సావిత్రిని, సావిత్రి నాన్నగార్ని కలుసుకుని అన్న విషయాలు మాట్లాడ్తానని వాడికి ధైర్యం చెప్పి వచ్చేశాను.

"లాభంలేదురా సావిత్రి నాతో గట్టిగా చెప్పింది. వాళ్ళంతా ఎంత కట్నమైనా యిచ్చి వేరేచేయటానికి నిశ్చయించారు" అని అన్నారు.

రాత్రంతా పరిపరివిధాల ఆలోచించాను. ఇట్లా జరగటానికి నేనుకూడా బాధ్యుణ్ణి. దీని పర్యవసానం ఎట్లా అవుతుందో అంతుపట్టలేదు. డబ్బెంతయినా చేస్తుంది. సావిత్రికి వేరే పెళ్ళిచేస్తే జోసఫ్ గతి ఏమిటి? వాడు సావిత్రిని మర్చిపోగలడా? అనే ఆలోచనలతో రాత్రంతా సతమతమయ్యాను.

తెల్లగా తెల్లవారలేదు. అప్పుడే మగతగా నిద్రపడుతున్నది. జోసఫ్ యింటిప్రక్క వాళ్ళబ్బాయి నాకోసం పరుగెత్తుకొని వచ్చాడు ఒగర్చుకుంటూ. విషయమేమిటోచెప్పలేకపోతున్నాడు.ఏదో ఆపదసూచన

60 వ పేజీచూడండి



" ఎంత ఘాటు ప్రేమరో !"



నేటి యువతీయువకులు వివాహవ్యవస్థ విషయమై ఏవిధమైన ఆసక్తి చూపుతున్నారు?

సి. ఆనందారామం



"మేడమ్ !" అంటూ సుడిగాలిలా వచ్చింది జానకి, ఇన్ని శుభలేఖలు చేతో పట్టుకుని.

నేను సంభ్రమంతో "అయితే, చివరకు పెళ్లి చేసేసుకుంటున్నా వన్నమాట !" అన్నాను.

జానకి పకపక నవ్వి, "ఇవి నా పెళ్లి శుభ లేఖలు కావండీ ! రమవి. ఇవి అందరికీ అందజేసే భారం ఆ మొద్దు నామీద పెట్టింది" అని ఒక శుభలేఖ నా చేతికిచ్చి బయలుదేరబోయింది.

"కూర్చో ! ఎండలో వచ్చి కొంచెం కాఫీ అయినా తీసుకోకుండా వెళ్లిపోతావా ?" అని ఆ అమ్మాయిని బలవంతాన కూర్చోపెట్టి, తొందరగా ఇన్‌స్టెంట్ కాఫీ కలిపి రెండు కప్పుల్లో పోసి జానకికి ఒకటిచ్చి, నే నొకటి తీసికొన్నాను.

"అయితే, జానకీ ! మరి, నీ పెళ్ళెప్పుడూ ?" కుతూహలంగా అడిగాను. ఎందుకంటే జానకి ఎప్పుడూ "అసలు పెళ్లి చేసుకోను." అంటుండేది.

"ఇంతమంది దంపతులను చూస్తున్నాను మేడమ్ ! సౌఖ్యంగా ఉన్నామని అనుకునేవాళ్ళు ఒక్కరూ కనపడటంలేదు. ప్రేమ వివాహాలూ, పేరయ్యలు కుదిర్చిన వివాహాలు, అన్నీ ఒక్క లాగే ఉన్నాయి. అసలీనాటి సాంఘిక వ్యవస్థకు వివాహం సరిపడదనిపిస్తోంది. అందుకే నే నసలు పెళ్లి చేసుకోను" గంభీరంగా అంది జానకి.

నే నాశ్చర్యపోతూ "అయితే—తాడూ బొంగరం లేని జీవితం గడుపుతావా ?" అన్నాను.

జానకి సమాధానం చెప్పకుండా చుట్టూ పరీక్షగా చూడసాగింది.

"ఏమిటి చూస్తున్నావూ ?" అన్నాను.

"చుట్టుప్రక్కల కర్ర, చీపురుకట్ట, చాంతాడు, వగైరా రాలేదీ లేకుండా చూస్తు కుంటున్నాను. నా మాటలు విన్నాక మీరు నన్ను కొట్టకుండా ఉండటానికి ….."

అల్లరిపిల్ల ! హాయిగా నవ్వాను.

సోఫాలో వెనక్కు జేర్లగిలబడి "ఏ యిష్టం వచ్చినట్టు మాట్లాడు." అన్నాను.

"అసలు వివాహమంటే, ఏమిటో చెప్పండి."

"కొంచెం లోతుగా ఆలోచిస్తే, వివాహ మనేది కేవలం స్త్రీ పురుషుల భౌతికావసరాల కొరకు మాత్రమే ఏర్పడింది కాదని స్పష్టమౌతుంది. సృష్టిలో స్త్రీ పురుష శక్తులు పరస్పరం విభిన్నాలయినవి. ఈ రెండింటి కలయికే మానవ జీవితము. రెంటిలో ఏ ఒక్కటీ పరిపూర్ణత్వాన్ని పొందలేదు. ఈ దృష్టితో ఆలోచించినపుడు, వివాహాన్ని మానవుని ఐహికాముష్మిక ఫలసాధక మయిన ఒక దివ్య వ్యవస్థగా అంగీకరించక తప్పదు."

"అబ్బ ! మీ ఆముష్మికము: సంగతి అవతల పెట్టి, ఐహికం సంగతి కాస్త చెప్పండి—పోనీ, నేనే చెపుతాను. మానవజీవిత మాధుర్యమైన అనురాగ సంపదను సమంగా పంచుకొన్న రెండు జీవాలను ఒకటిగా బంధించేది వివాహం. అవునంటారా? అయితే ఈ విషయాన్ని అసలు గుర్తించేవా రెంతమంది ? గుర్తించినవారిలో అనుభవంలోకి తెచ్చుకున్నవా రెంతమంది ? అనుభవంలోకి తెచ్చుకున్నవారిలో నిలుపుకో గలిగినవా రెంతమంది ? మరి, ఈ వివాహమనే గారడీ ఎందుకండీ ? లేనిపోని బరువులకూ, బాధ్యతలకూ కాకపోతే ? ….."

"అలా అనకు. మొదటినుండీ మన దేశంలో వివాహాన్నొక పవిత్ర సంస్థగా ….."

"అవునండీ ! నాకు తెలుసు. ఒకనాడు మన దేశాన్ని ధర్మం పరిపాలించేది. ప్రతి ప్రాణీ ఆనాడు ధర్మానికి కట్టుబడి ఉండేది. రూపానికీ, ఐశ్వర్యానికీ దేనికీ లేని విలువ, పవిత్రమైన అగ్నిహోత్రానికీ, వేద మంత్రాలకూ ఉండేది. జీవుల పరస్పర అనుబంధాలన్నిటికీ ధర్మమే ఆధార మయ్యేది. ఆనాటి ఆధ్యాత్మిక వాతావరణ మీనా డెక్కడుందీ ? అగ్నిహోత్రాలు కానీ, వేద మంత్రాలు కానీ, ఒక తంతుగా నిర్వహింపబడుతున్నాయే తప్ప వాటి పావిత్ర్యాన్ని ఎవరు పరిగణిస్తున్నారూ ? నేటి మన సంఘంలో ధనానికున్న ప్రాధాన్యం మరి దేనికుంది ? రూపమూ, గుణమూ, కలిగిన కన్య లెంతమంది మాటలులేని కారణంగా అవివాహితలుగా నిలిచిపోవటంలేదూ ?"

"ఆమాట కొస్తే స్త్రీలు మాత్రం తక్కువ తిన్నా రేమిటి ? వరుని హృదయం కన్న, రూపం కన్న అతని ఉద్యోగమూ, ఆస్తీ ముఖ్యం కావటం లేదూ ?"

"అది నిజమే ! ఇట్లాంటి పెళ్లిళ్ళు ఎందుకూ చేసికోవటం ? ఘోరమైన ఆత్మవంచన కాకపోతే ….."

"కానీ, ఈ ఆత్మవంచన నుంచి తప్పించుకో వచ్చును గదా ! ఈనాటి యువతీ యువకులందరూ, కనీసం వివాహ విషయంలో నైనా, ధనాన్ని గురించి ఆలోచించటం మానేసి, వ్యక్తి ప్రాధాన్యతను గుర్తించి, తమ వైవాహిక జీవితాన్ని ఫలవంతం చేసుకోవచ్చును గదా !"

"ఇది అనుకున్నంత తేలిక కాదండీ ! అయినా, ఒక్క డబ్బు విషయంలోనే కాదు. ఇంకేవిధంగా చూసినా నేటి వివాహ వ్యవస్థ పటుత్వంగా లేదు. ఒక్క సంగతి ఆలోచించండి. పూర్వంలాగ ఈనాడు "అష్ట వర్షాత్ భవేత్ కన్యా" అని ఎనిమిదేళ్ల పిల్లలకు పెళ్లిళ్ళు చేసివెయ్యటం లేదు. ఈనాటి స్త్రీలు, సంపూర్ణ యౌవనవతులై, విజ్ఞానవతులై, సంపూర్ణమైన మనోవికాసాన్ని పొందిన తర్వాతనే వివాహ విషయం గురించి ఆలోచిస్తున్నారు. అయితే ఈనాటి మన సంఘం, ఒక నిర్దిష్ట మైన జీవన విధానం కానీ, కొన్ని స్థిరమైన విలువలు కానీ, లేకుండా ఉంది. "స్త్రీకి ఇల్లూ, పిల్లలూ ముఖ్యం. ఏ ఉద్యోగాలూ అక్కర్లేదు." అనేవారు కొందరయితే, "నేటి ఆర్థిక పరిస్థితిని బట్టి స్త్రీ పురుషు లిద్దరూ సంపాదనపరులు కావాల"ని మరికొందరు—తన భార్య గడప దాటని ఉత్తమ ఇల్లాలు కావాలని ఒకడి ఆశయితే, తనతో క్లబ్బులకూ, పార్టీలకూ వచ్చే "కల్చర్డ్ లేడీ" భార్య కావాలని మరొకడి కల ?

"మరి, మా కాబోయే భర్తగారి కెలాంటి

వనితాలోకం ప్రత్యేక వ్యాసావళి ప్రారంభం!

ఏ ఆశయా లుంటాయో మేం కలగంటామా? మా అనుకూలాన్నిబట్టి మే మొక జీవన విధానాన్ని అనుసరిస్తాం. భగవంతుడి దయవల్లా మా అదృష్టంవల్లా, మేము అనుసరించే విధానమూ, అతని ఆశయాలూ, ఒకటైతే, సరేసరి! లేకపోతే ఆ దాంపత్య మొక నరకమే! సాహసముంటే విడిపోవడమూ, లేకపోతే తమను తాము తిట్టుకుంటూ, విధిని తిట్టుకుంటూ చావలేక బతికటం—ఇట్లాంటి వివాహాలవల్ల ప్రయోజనమేమిటి?

"కానీ, వివాహానికి పూర్వమే, ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవచ్చును గదా ఈనాటి మన సమాజంలో ఈమాత్రపు అవకాశం ఉందనుకుంటాను...."

"మీరు పొరబడుతున్నారండీ! వివాహానికి పూర్వం వధూవరులు పరస్పరం కొంతవరకైనా అర్థం చేసుకోగలిగే అవకాశం చాలా తక్కువగా ఉంది. వివాహానికి పూర్వం వధూవరుల ఒక గంట మహా అయితే రెండు గంటలు సంభాషించమనటం తటస్థిస్తుందేమో! అందులో తేలేదేమీ ఉండదు. సాధారణంగా సంభాషణ చాలా "ఫార్మల్" గా నడుస్తుంది. ఈ నాటకంలో పెళ్లికూతురి పాత్ర చాలావరకూ "ఊఁ, ఊఁ బసవన్న" లా తల వూపటమే! పెద్దల ఆదేశములా ఉంటుంది. ఏ నాబోటిదయినా సాహసించి "ఇది కాదు—అది" అంటే, గయ్యాళి అనో, పొగరుమోతుదనో ముద్ర పడిపోయి, ఇక ఆ జన్మాంతమూ పెళ్లి కానేకాదు. వివాహానికి పూర్వ మిలా .....

"ఇక వివాహానంతరం సాధారణంగా ప్రతి మొగవాడూ తన భార్య ఒక మైనపు ముద్దలా, తన కనుకూలమైన ఆకారంలోకి తిరిగిపోవాలని వాంఛిస్తాడు. కానీ, అప్పటికే ఒక స్థిరమైన ఆకారాన్ని పొందిఉన్న ఆ యువతికి క్షణాలలో అతనికి అనుకూలంగా మారిపోవటం కష్టమే అవుతుంది. అక్కణ్ణుంచి సంఘర్షణ ప్రారంభ మవుతుంది. సర్వ సాధారణంగా ఈ సంఘర్షణలో ఓటమి స్త్రీదే! సంఘానికి వెరచి అయితేనేమి, తాను బయటకు వచ్చిన తరువాత ఎదుర్కోవలసి భయంకర సమస్యలకు భీతిల్లి అయితే నేమి పిల్లలమీది మమకారంవల్ల నయితేనేమి, స్త్రీ తప్పనిసరిగా తన మనస్సును చంపుకొని యాంత్రికంగా జీవించడాని కలవాటు పడిపోతుంది. ఈనాటి వివాహ వ్యవస్థవల్ల మూడు వంతుల మందిమి పొందగలుగుతున్న దిలాంటి యాంత్రిక జీవనమే ఎవరో కవి అన్నాడట!— ఏ వికారమూ లేని ఒక యంత్రంగా మారడం కంటె, మనుష్యునిగా ఉండి కన్నీరు కార్చటమే తన కభిమతమని. అవివాహితగా సంఘంలో నిలవటం ఎదురీత అని నాకు తెలుసు—అయినా, ఆ యాంత్రిక జీవనం కంటె, ఈ ఒంటరితనమే నాకు బాగుంటుంది".

"ఇంతకూ, పురుషుడు స్త్రీని తనతో సమానుగా చూడాలంటావు ?!"

"అది కానేకాదు. స్త్రీని స్త్రీగా, ఒక పరిపూర్ణ వ్యక్తిగా గుర్తించి, ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించాలని అంటున్నాను. అలా గౌరవించగలిగే సంస్కారం ఈనాటి పురుషులలో చాలామందికి కరువయిందని అంటున్నాను. స్త్రీపురుషులిద్దరూ సమానమని అటూ, మొగవాడు వంటింట్లో కూర్చోవాలనీ, ఆడవాళ్లు క్లబ్బులకు వూరేగవచ్చనీ, వెర్రిగా వాదించటంలేదు— నేను. అసలు స్త్రీ పురుషుల జీవన విధానాలు వేటికవి ప్రత్యేకమైనవి. బాబ్డ్ హెయిర్‌తో నోట్లో సిగరెట్టు పెట్టుకునే స్త్రీనిచూస్తే ఎంత వెలపరం పుడుతుందో, వంటింట్లో పీట వేసుకుని గోళ్లు గిల్లుకునే మొగవాడిని చూసినా, అంతే రోతపుడుతుంది. ఎక్కడికి పోతుందని అలుసుతీసికొని భార్యను బానిసలాచూసే పురుషుణ్ణి భరించటం ఎంతకష్టమో, తెలుగు సినిమాలలో హాస్యగాడిలా, భార్య కొంగు వెనకాల పిల్లిమొగ్గలేసే మొగవాడిని భరించటమూ అంతే కష్టమవుతుంది. భార్యాభర్తలలో ఏ ఒక్కరు మరి ఒకరిని "డామినేట్" చెయ్యడానికి ప్రయత్నించినా అది మరొకరికి భరింపరానిదే అవుతుంది. అలాకాక సహృదయంతో, ఒకరినొకరు అర్థంచేసుకోవటానికి ప్రయత్నిస్తూ, ఒకరి అభిప్రాయాన్ని మరి ఒకరు గౌరవించగలిగి, అభిప్రాయభేదాలను సహనంతో సరిదిద్దుకోగలిగిననాడే దాంపత్యం వైవాహిక వ్యవస్థ సాఫల్యానికి నిదర్శనమవుతుంది. కానీ, ఈనాటి మన సంఘంలో, అట్లాంటి దాంపత్యాలు నూటికీ, కోటికీ ఒకటుంటే గొప్ప...."

"నీమాటల్నిబట్టి చూస్తే ప్రేమ వివాహాలు మాత్రమే సఫలమవుతున్నాయని నీ ఉద్దేశ్యం లాగుందే?"

"అమ్మబాబోయ్! ఎంతమాత్రమూ కాదు. నన్నడుగుతే, అసలు స్త్రీపురుషులు ప్రేమవ్యవహారాలలో తగులుకోవటమంత బుద్ధితక్కువ మరొకటి లేదు. ఎందుకంటారా?- ముఖ్యమైనది—మనపెద్దవాళ్లకు, ప్రేమకథలు చదవటమూ, ప్రేమను సినిమాల్లో చూసి ఆనందించటమూ తప్ప, ప్రేమను అర్థం చేసికోగలిగే సంస్కారం చాలాతక్కువ. తమ కుమార్తె లేక కుమారుడు ప్రేమించిన వ్యక్తి అన్నివిధాలా తమకు అనుకూలుడు, లేక అనుకూలురాలు అనిపిస్తే పెద్దల అంగీకారం లభిస్తుంది. లేకపోతే, ప్రేమాలేదు, పాడూలేదు. చావగొట్టి తమ కిష్టమైన సంబంధం చేసి పారేస్తారు. ఇట్లాంటి సందర్భాలలో పెద్దలను ఎదిరించటంమూ, అంత తేలికైన విషయంకాదు. ముఖ్యంగా స్త్రీలకు ఇది మరీ కష్టం—దురదృష్టవశాన, ఈ వ్యక్తులు మన్ని తహృదయులైతే, జీవితాంతమూ మానని గాయం మాత్రమే మిగులుతుంది. అన్నింటికంటే, నేటి



ఇటీవల సీరియల్‌గా పాఠకులు చదివిన 'సంపెంగ పొదలు' నవల వ్రాసిన శ్రీమతి ఆనందారామంగారి పూర్తిపేరు సి. ఆనందలక్ష్మి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం. ఏ. పట్టభద్రురాలైన యీ వ్యాస రచయిత్రి హైదరాబాదులో ప్రభుత్వ గృహవిజ్ఞాన కళాశాలలో తెనుగు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. పి హెచ్. డి. కి కూడా కృషి చేస్తున్నారు. భర్త 'హెవి ఎలక్ట్రికల్స్'లో ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు. రచయిత్రి తన పరిచయంలో చేర్చమన్న మాటలు ఇక్కడ చేరుస్తున్నాము. "వివాహానికి పూర్వం చిన్న కథలు వ్రాసేదాన్ని... నా మిత్రురాలు డాక్టర్ సరస్వతి ప్రోత్సాహించి నన్ను తిరిగి రచనా వ్యాసంగంలోకి దింపింది. ఒక రచయిత్రిగా, పత్రికాముఖాన, నా కృతజ్ఞతలు ఆమెకు తెల్పుకోగలిగితే సంతోషిస్తాను. ..."


తలనొప్పి
నడుమునొప్పి
పంటినొప్పి
బహిష్టు రోజులలో నొప్పి
జలుబు
Saridon
ఒకే ఒక సారిడన్ 'రోష్'
నొప్పులను పోగొట్టును!
నొప్పిని పోగొట్టును, సేదదేర్చును, నవోత్సాహమును కలిగించును
నొప్పికి ఉపశమనకారిగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సారిడన్ నొప్పులనుండి
త్వరితముగా, నిరపాయముగా మరియు నిశ్చయముగా ఉపశమనము కలిగించును.
తలనొప్పి, పంటినొప్పి, ఒంటినొప్పి, జ్వర చిహ్నములు మరియు జలుబులకు
సారిడన్ వేసుకోండి. పెద్దవారికి ఒక బిళ్ల పూర్తియైన మోతాదు.
పిల్లలకు ¼ నుండి ½ బిళ్ల వరకు చాలును.
'రోష్' తయారు
ఏకైక డిస్ట్రిబ్యూటర్లు: వోల్టాస్ లిమిటెడ్
ఒకే సారిడన్ బిళ్ల చాలును
ఒక బిళ్ల ఖరీదు 13 నయా పైసలు

నేటి యువతీ యువకులు వివాహ వ్యవస్థ విషయమై ఏ విధమైన ఆసక్తి చూపుతున్నారు?

యువతీయువకులలో ఎవరిది వ్యామోహమో, ఎవరిది నిజమైన అనురాగమో, తెలిసికోవటం మరీకష్టం. నాలుగురోజులుకూడా తిరిగి ఐదోనాడు గుడ్‌బై చెప్పే యువకులూ, కొద్దిరోజులు చుట్టూ తిప్పుకొని తర్వాత "సారీ! మానాన్నగారు నాకు సంబంధం నిశ్చయం చేసారు." అని సిగ్గుపడిపోతూనే చెప్ప గలిగిన యువతులూ గల ఈ మహా సముద్రాన్ని ఈదటం ఎంత కష్టం? ఆత్మవిశ్వాసమూ, మనోధైర్యమూ, విచక్షణజ్ఞానమూ కలిగిన యువతీ యువకులు, పరస్పరం అర్థంచేసుకొని ప్రేమతో తమ దాంపత్య జీవితం ప్రారంభించిననాడు, అది స్వర్గతుల్య మవుతుంది. కానీ, అలాంటి దాంపత్యాలు చాలా అపురూపంగా కనుపిస్తాయి.

"లాభంలేదండీ! వ్యక్తులు మారాలి. మనదృష్టి ఇంకా విశాలం కావాలి. మనలో మనకూ, ఇతరుల పట్లా నమ్మకం పెరగాలి— ప్రతి ఒక్కరూ, వారి వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలగాలి, జీవితపు విలువలను తెలిసికోగలగాలి. భగవానుడు మనకు జీవితాన్ని ప్రసాదించింది ధర్మమార్గంలో జీవనమాధుర్యాన్ని అనుభవించడానికి కాని, బరువుగా ఈడ్చుకుపోవటానికి కాదనే సత్యం ప్రతి ఒక్కరూ అర్థంచేసికోగల్గాలి. ఆనాటివరకు, ఈ మన వివాహ వ్యవస్థ తప్పనిసరిగా ఆచరించే ఒక తంతుగా మాత్రమే నిలిచిపోతుంది............"

ఉద్రేకంగా తన మాటల్ని పూర్తిచేసి జానకి తన ఉద్రేకానికి తనే సిగ్గుపడిపోతూ లేచి సెలవు తీసుకుంది. ★

వచ్చే వారం! మరొక ప్రత్యేక వ్యాసం!

వనితా వాణి

కోడిగుడ్డులేని కేక్‌లు

కోడిగుడ్డు లేని కేక్‌లు వ్యాసం వేసి మా కందరికి మీరెంతో మహోపకారం చేశారు. ఇటు వంటి గమ్మత్తైన వంటకాలు ఇక ముందు కూడా వేస్తారని ఆశిస్తున్నాము.

సుశీల, శారద (అర్కోణం)

* * *

17—4—64 సంచికలో సుశీలారామశేషు గారు వేసిన దోసకాయల కేక్ సరిగా రాలేదు. పైన బెల్లమని వేసేరు క్రిందపంచదారని వేసేరు. దీంట్లో ఏది వెయ్యాలో తెలియలేదు. తెలియ చేస్తారని ఆశిస్తాము.

పి. సుశీల (రాజమండ్రి)

* * *

రవ్వతో కేక్‌లు తయారు చేయడం గురించి చదివి నమ్మలేక పోయాము గాని చేసి చూస్తే బాగానే కుదిరాయి. సుశీలా రామశేషుగారికి మా అభినందనలు.

శ్రీమతి కె. రాధ, కుమారి ఆర్. అంబిక (బందరు)

మనసులో మాట

మనసులో మాట గురించి లక్ష్మీ ప్రసన్న గారు మరి కాస్త విపులంగా రాస్తే బాగుండేది. ఆత్మీయులకు కూడా చెప్పుకోలేని మాటలుకూడా ఉంటాయన్నది నిజం.

ఎస్. రాజమ్మ (బెజవాడ)

* * *


మనసులో మాటను ఇతరులతో చెప్పి వారి సానుభూతిని పొంది పూరట చెందేవారు కొందరైతే మనసులో మాటను గోరంతను కొండంతలు చేసి వూరంతా వ్యాపింపజేసి సంసారం నడి వీధిలో పెట్టే వారు మరి కొందరు. లక్ష్మీప్రసన్నగారికి అభివందనములు.

లక్ష్మీతులసి (ఆముదాలవలస)

* * *

మా యింటిముందు పోకచెట్లు ఉన్నవి. ఇప్పుడు బాగుగా కాయలు కాచుచున్నవి. ఈ కాయల నుండి పోకచెక్క తయారుచేసుకొను విధము తెలుపమని సోదరీమణులను ప్రార్థించుచున్నాను.


శేషమ్మ (మద్రాసు) ★



"ఏమండోయ్! రేపు శెలవులకి అమ్మాయి అల్లుడూ వస్తున్నారుట. రెండు గదుల న్న ఇల్లు చూడండి!
"ఇల్లు దొరకటం కష్టంగావుందిగాని . . . వాళ్ళనీ ఇంట్లోవుంచి మనం మీ పుట్టింటికి పోదాంలే! . . ."

రామచరిత మానస్

తులసీదాసు



తెలుగు: ముంగర శంకరరాజు

32

వసిష్ఠుని ఆనందము

ఒక సందర్భమున కులగురువు వసిష్ఠుడు సుఖధాముడైన శ్రీరాముని సందర్శించుటకై వచ్చెను. రఘూద్వహుడు పరమాదరముతో ముని వరేణ్యుని సన్మానించి సుఖాసీనునిగా జేసెను. అర్ఘ్య పాద్యములతో గురుపూజ చేసి, రఘువీరుడా గురు చరణోదకమును తన శిరస్సుపై చల్లుకొని కుశల ప్రశ్న చేసెను.

వసిష్ఠుడంత ప్రహృష్టాంతరంగుడై కేలు గీలించి రుద్ధ కంఠముతో స్వామి నిట్లు స్తుతించ సాగెను—

"ఓ కోసలేశ్వరా ! కృపాసింధూ ! శ్రీరామ చంద్రా ! దయామతివైనా మనవి ఒకటి పాలించ మని నిన్ను ప్రార్థించుచున్నాను.

రామా ! నిత్య ప్రతి నీవు ప్రదర్శించు లీలా మానుష చర్యలు నన్నెంతయో మోహింప జేయు చున్నవి. వేదాతీతమగు నీ మహిమ వర్ణింప నే నెంతటి వాడను ! దేవా ! పౌరోహిత్యము బహు నైచ్యమైనదని శాస్త్రములు చెప్పుచు యున్నవి. తొలుదొల్త నేనీ పురోహిత వృత్తి స్వీకరించుటకు విముఖుడుగా నుంటిని. ఆ సందర్భమందు ప్రజాపతి నాతో— "వసిష్ఠా ! ఈ వృత్తి హేయమైనదని భావించి తిరస్కరించకుము. దీని వలన ఉత్తరోత్తరా నీకు మేలు కలుగ నున్నది. సాక్షాత్ పరబ్రహ్మ నరరూప ధారియై రఘు కులమున అవతరించ నున్నది. కనుక నీవీ కార్యమునకు సమ్మతించి భవిష్యత్తులో సుఖింపుము"— అని పలికి నన్నీ వృత్తి స్వీకరించుటకు ప్రోత్సాహించెను. భగవాన్ ! దేనిని యజ్ఞ యాగ వ్రతోపవాసములతో సాధించుట దుస్తరమై యున్నదో ఆ సత్ఫలము నాకీ మూలమున సుకరముగా లభించ నున్నదని భావించి రఘుకులవంశ పౌరోహిత్యమునకు ఒప్పుకొంటిని. స్వామీ ! జపతపములు, పురాణ పఠన శ్రవణాదులు, తీర్థాటన, భూత దయా పరత, సంయమనియమాదులు మున్నగు సాధనములకు లక్ష్యము భక్తి ప్రాప్తిగదా ! ఆ పరమభక్తి నీచరణ కమలములను నిరంతరము ప్రేమించుటచే సుకరముగా సిద్ధించుచున్నది.

ఎవని మానసము నిరంతరము నీ పాదారవింద ములయెడ ప్రేమతో పరిపూర్ణమై యున్నదో ఆ మహనీయుడే సర్వజ్ఞుడు, వాడే తత్వజ్ఞుడు, అతడే విజ్ఞుడు, ఆ పుణ్యచరితుడు పండిత ప్రవరుడు. దేవా ! జన్మ జన్మాంతర పర్యంతరము నీ పాదాంబుజ ముల యెడపాయని భక్తి ప్రేమ నాలో కలిగి యుండునట్లు నన్ననుగ్రహింప వేడుకొనుచున్నాను.

ఇవ్విధముగ వసిష్ఠుడు శ్రీదేవుని స్తుతించి పరమానంద పరవశుడై నిజాశ్రమమునకు పోయెను.

నా ర ద గా న ము

వసిష్ఠుని గమనానంతరము అవధేశుడు అనుజులతో, అంజనీ తనయునితో గూడి అయోధ్య నగరమునకు సమీపమందున్న ఒక ఆమ్రవనమును చూడ బోయెను. అక్కడ విడిసియున్న చతురంగ బల సమూహములను పరామర్శించి దశరథనందనుడు వారిని బహువిధ బహుమానాలతో సత్కరించి సంతృప్తులగునట్లు చేసెను. అనంతరమా సుఖధాముడగు రాముడు చల్లని చూతవృక్షచ్ఛాయలో భరతుడు ఉత్తరీయము పరచగా దాని మీద సుఖాసీనుడై విశ్రమించెను. వాయుసూనుడు వింజామరులతో రఘుకులేశునికి సేవలు చేయు చుండెను.

అట్లు సాకేతపతి వనములో సుఖాసీనుడై యున్నప్పుడు దేవర్షి నారద మౌనీంద్రుడచ్చట కరుదెంచి, స్వీయ వీణను మీటి ప్రగాఢ భక్తిపారవశ్యకతో సీతాపతి నిట్లు కీర్తించ సాగెను. —

"మామవ లోకయ పంకజలోచన
కృపాబిలోకని సోక బిమోచన,
నీల తామరస శ్యామ కామ అరి
హృదయ కంజ మకరంద మధుప హరి.

*　　　*　　　*

భుజ బల బిపుల భార మహి ఖండిత
ఖర దూషణ బిరాధ బధ పండిత,
రావణారి సుఖరూప భూప హర
జయ దశరథకుల కుముద సుధాకర
సుజస పురాన బిదిత నిగమాగమ
గావత సుర నర ముని సంత సమాగమ,
కారుణీక బ్యాలీక మదఖండన
సబబిధి కుసల కోసలా మండన,

*　　　*　　　*

కలి మల మథన నామ మమతాహన
తులసి దాస ప్రభు పాహి ప్రనత జన.,,

నారదు డట్లు తన్మయుడై స్వామి ననేక ప్రకారముల స్తోత్రము చేసి, దాశరథి దివ్యరూపము హృదయమం దుంచుకొని, మరల మరల స్వామి గుణ కీర్తన చేయుచు మహదానందముతో బ్రహ్మలోకమునకు గమనము చేసెను.

శివుడు కాకభుశుండి యొద్ద రామకథ వినినవైనము,

గిరిజా సునహు బిసద యహ కథా
సబ కహి మోరి మతి జథా,
రామచరిత సతకోటి అపారా
స్రుతి సారదా న బరనయి పారా.

"ఓ గిరికుమారీ ! ఈ సుందరమైన — రామ గాథ నా బుద్ధికి తోచినట్లు సవిస్తరముగ వర్ణించ గలిగితిని. శతకోటి ప్రవిస్తరమగు రఘునాథ చరితమును వర్ణింప వాణికి వేదములకు సైతం సాధ్యము గాదు. రాము డనంతుడు, అతని గుణము లనంతములు, ఆ స్వామి లీలావతార క్రియ లనంతమైనవి. జల సీకరములను ధూళికణములను లెక్కించవచ్చును. కాని కౌసల్యా తనయుని గుణ సందోహము గుణించుట సాధ్యము. కాకభుశుండి గరుత్మంతునకు చెప్పియుండిన రామ చరిత్ర నా శక్త్యనుసారము నీకు వినిపించ గలిగితిని.,, అని పరమేశ్వరుడు పరమేశ్వరితో పలికెను.

పరమేశ్వరుడు ప్రసన్న భావముతో ప్రవచించిన శ్రీరాముని చరిత్రము పరమ భక్తితో ఆలకించి పార్వతి ఆనంద మనుభవించెను. తద నంతరము కేలుగీలించి వినమ్ర వాక్కుల పరమ శివు నిట్లు ప్రశ్నించెను

"ఓ త్రిపురారీ ! మీ దయవలన భవభయాపహరమగు సీతాపతి శుభచరిత్ర ఆలకించినందున నా జన్మ ధన్యత గాంచెను. ఇప్పటికి నాకున్న సందేహము తొలగిపోయె, శ్రీరాముడు సాక్షాత్ సచ్చిదానంద స్వరూపుడని గ్రహింప గలిగితిని. దేవా ! చంద్రుని వంటి మీ ముఖము నుండి వెలువడిన రామ కథామృత పానముచే నా మానసమునకు పరిపూర్ణ తృప్తి లభించెను. పరమ పవిత్రమగు ఈ రామ కథను చెవులుండియూ చవులార ఆలకించ నొల్లని వాడు మూర్ఖుడు, ఆత్మఘాతకుడగుచున్నాడు.

కామకంఠా ! అయిననూ నా మనసు నందింకనూ ఒక చిన్న సందేహము శేషించియున్నది. నాథా ! మీరు రామాయణమును కాకభుశుండి—గరుత్మంతుల సంవాద రూపమున గదా నా కెరిగించితిరి ! అయితే, జ్ఞాన విజ్ఞాన వైరాగ్య తత్వ సంపన్నుడగు కాకభుశుండికి యేకలమున కాకి రూపము ధరించ వలసి వచ్చెను ! ఆక్షుద్ర విహంగమునకు మునిదుర్లభమగు రామభక్తి యెట్లు సంప్రాప్తించెనో తెలుసుకొన కుతూహలముగ నున్నది.

పరమేశా! వేయి మందిలో ఒక ధర్మశీలు డుత్తముడు, అట్లాంటి కోటి మంది ధర్మాత్ములలో ఒక విరాగి శ్రేష్ఠుడు, అట్టి కోటి మంది విరాగులలో ఒక జ్ఞాన సంపన్నుడధికుడు, అటువంటి కోటి మంది జ్ఞానులలో జీవన్ముక్తి సాధించుకొన్న వాడుఘనుడు. ఆ జీవన్ముక్తుని కంటే కూడ రామభక్తి సంతరించుకొన్న పుణ్యాత్ము డగ్రగణ్యుడుగా పరిగణించ బడుతున్నాడు. రామభక్తి అట్లు సర్వోత్కృష్ట మైనది. అట్టి— పరమభక్తి తత్త్వము ఈ కాకమున కెట్లు సిద్ధించెనో! విశదీకరించి నా సంశయము నివారింప వేడుకొనుచున్న దాసను. అదియునూ గాక సకల గుణావతంసుడగు వైనతేయుడు ఎందరో మహాత్ములుండగా హరిని వదలి ఈ వాయసము నాశ్రయించి కథాశ్రవణ మెందుకు చేసెను? ఆ కాకభుశుండి గరుత్మంతుల రామకథా ప్రసంగము మీ రెట్లు వినగల్గుట తటస్థించెను? సవిస్తరముగ వివరింప ప్రార్థన."

పార్వతి తన ప్రశ్నావళి ద్వారా వ్యక్తీకరించిన కథాశ్రవణ కుతూహలత కెంతయు మదనాంతకుడు సంతసించిన వాడై సతి నవలోకించి—

"ప్రియా! నీ ప్రసంగము సముచితముగా నున్నది. నీ వడిగినట్లే ఒకప్పుడు గరుత్మంతుడు సైతం కాకభుశుండిని ప్రశ్నించి యుండెను. అది నేను వినుటెట్లు సంభవించెనో ఆ వైనము విందువుగాక. భయశోకములను ఉన్మూలించి భవసాగరము తరింప జేయు పావన గాథ యథాభక్తి ఆకర్ణింతువు గాక—" అని పలికి వృషకేతుడిటు చెప్ప నారంభించెను—

"అపర్ణా! మునుపు నీ వొకప్పుడు దక్ష ప్రజాపతికి పుత్రికవై అవతరించి యుంటివి. అప్పుడు నీ పేరు సతి. నీ తండ్రి దక్షుడు యజ్ఞము తలపెట్టుట, ఆ సందర్భమున నన్నతడు అకారణముగా అవమానించుట, అపై నీవు క్రోధవివశవై ప్రాణ త్యాగము చేయుట, అనంతరము నా యనుచరులు దక్షుని యజ్ఞము ధ్వంసము చేయుట మున్నగు సంఘటనలు ఇప్పటికినీ నీకు జ్ఞాపకముండవచ్చును. ప్రియా! నీ మరణానంతరము నా హృదయము శోక వ్యాకులిత మయ్యెను. దుస్సహ వియోగ దుఃఖముచే కలత చెందిన నా మనసుకు శాంతి లేక పోయెను. దుఃఖోపశమనార్థమై నేనపుడు కైలాసము వదలి దేశాటనకు పూనుకొని పర్వతారణ్యముల శోభ, సరితా సాగరముల సౌందర్యము తిలకించుచూ సంచరించుచుంటిని. ఆ యాత్రా సందర్భమున నేను యాదృచ్ఛికముగు కాకభుశుండి మహాత్ముని సందర్శించుట సంభవించెను.

ఉమా! సుమేరు గిరికుత్తర భాగమున ఒక నీలాద్రి కలదు. ఆ కొండ నాల్గు బంగారు శిఖరాగ్రములతో చూడ ముచ్చటగా నుండును ఆ శిఖరోపరితలమందు వరుసగా మర్రి, రావి, జువ్వి, మామిడి చెట్లున్నవి. అక్కడి కనతి దూరమున శీతల జల సమృద్ధమైన సరోవరము ఒకటున్నది. సుందరమైన సోపాన పంక్తిచే శీతలోదకముతో నానా విహంగ కలకూజనముతో ఆ కమలాకరము మనోజ్ఞమై యుండును. గిరిజా! ఆ శిఖరస్థ వృక్షాగ్రమందే ఒక వాయసము వాసము చేయుచున్నది. ఆ పక్షికి కల్పాంతమందు సైతం నాశము లేదు. ఆ ఖగోత్తముని పేరే కాకభుశుండి. అప్పుడా కాకభుశుండిని నేను కలుసు కొనుట తటస్థించెను.

శైలేంద్రజా! నేను కాకభుశుండిని దర్శించుట యెట్లు సంఘటిల్లెనో నీకా వృత్తాంతము సంక్షిప్తముగ వివరించితిని. ఇక ఖగరాజు గరుత్మంతుడు కాకభుశుండి యొద్ద రామకథ వినుటకు గల కారణము కూడా చెప్పుచున్నాను సావధానముగా ఆకర్ణింతువు గాక—" అని శశిధరుడు శాంకరి కిట్లు మిగత కథ చెప్ప దొడంగెను.

గరుత్మంత కాకభుశుండుల సమాగమము

"దాక్షాయణీ! లంకా యుద్ధమందు శ్రీరాముడు మేఘనాదుని నాగపాశములకు కట్టుబడెను. అప్పుడు నారద ప్రేషితుడైన ఖగేంద్రుడు రామలక్ష్మణులను నాగ బంధముల నుండి విడిపించెను. కానీ సకల లోక నాథుడగు సాకేత పతి పాశబద్ధుడుగావడము చూచి అప్పుడు ఉరగారి మనస్సు కించిత్తు విచారాధీన మయ్యెను.—" సర్వ వ్యాపకుడు, మాయా తీతుడగు ఆ పరబ్రహ్మ రామ రూపధారియై అవనిపై అవతరించెను గదా! ఆ జగదీశుడు ఒక క్షుద్ర దానవుడు ప్రయోగించిన పాశ జాలమునకు పట్టుపడుట చోద్యముగా నున్నది—" అని అంతరంగముగ వైనతేయుడు విచికిత్సకు లోనయ్యెను. పార్వతీ! నీ వలెనే పక్షిరాజు కూడ ప్రభువు మహిమాశక్తిని శంకించి డోలాయ మానసు డయ్యెను. పిమ్మట గరుత్మంతుడు నారదుని వద్దకు పోయి తన సందేహమూ మౌని ముందటుంచెను. అందుకు సురముని మందస్మితుడై ఖగరాజు నవలోకించి— "గరుడజీ! అవధేశుని మహిమ వూహాతీతమైనది మహామహా జ్ఞాన ధనులే ఒకొకప్పుడా మాయకు లోబడి భ్రమించి ప్రవర్తింతురు. ఆ రాముని మాయ దురూహ్య మైనది. అది నన్ను సైతం అనేక మార్లు ఆడించి వదలినది. ప్రస్తుతము నీవు కూడ దాని ప్రభావమునకు వశీభూతుడవై శంకగొంటివి. నీ యజ్ఞానము మాటలతో బోవునది కాదు. కాబట్టి నీవు బ్రహ్మ యొద్దకు పొమ్ము. అతడే నీకు తగు సమాధాన మివ్వగల సమర్థుడు." అని బోధించి నారదుడు వినతాసునితో చతురాస్యుని యొద్దకు పంపెను.

విరించి వైనతేయుని వైఖరి గ్రహించిన వాడై ఇంచుక గంభీర స్వరమున ఇట్లు ప్రవచించెను— "ఖగేంద్రా! లోకాతీతమగు శ్రీపతి మాయా ప్రభావమును వర్ణించుటకు నే నెంత వాడను! విజ్ఞులు విద్వజ్ఞులు సైతం ఆమాయకు వశవర్తులై నర్తించుచుండెదరు. ఆ పరాత్పరుని ప్రభావము సంపూర్ణముగా గ్రహించ గలవాడు శంకరు డొక్కడే. అతడొక్కడే నీ ప్రశ్నకు సముచితరీతి సమాధాన మివ్వగల సమర్థుడు." అని పలికి ఖగనాథునికి కైలాసమార్గము చూపించెను.

ఉమా! నేను కుబేరుని జూచుటకై అలకాపురికి పోవు చుంటిని. గరుత్మంతుడు మార్గములో వచ్చి నా పాదములపై బడి తనకు గలిగిన సందేహము నివారింప వలసినదని అతివ్రముడై అర్థించెను. నే నతని జిజ్ఞాస కెంతయు హర్షించి సాదర పూర్వకముగ ఇట్లు సమాధాన మిచ్చితిని—

"నాగాంతకా! నీ సందేహము నా కవగతమయ్యెను. కానీ నా కిప్పుడు తీరిక లేదు. అదియునూ గాక బహుకాల సత్సాంగత్యము వలనగాని నీకు కలిగిన సంశయము నివారింప బడదు. పరమాత్ముని లీలా రహస్యములు గూఢమైనవి ఆ దేవ దేవుని దివ్య చరిత్ర బుద్ధుల బోధనల వలన గాని సొంతముగా గ్రహింప బడజాలవు. ఇందుకు పురాణ శ్రవణ మెంతయు అపేక్షణీయమైనది. సాధు సాంగత్యము వినా హరి కథాశ్రవణము లభించదు. హరికథలు విననిదే అజ్ఞానము నశించదు. అజ్ఞానము వీడనిదే రాముని చరణ ద్వయముపై స్థిర భక్తి సిద్ధించుట దుర్లభము.

విహంగాధిపా! ఉత్తర దిశ యందున్న నీలగిరి యొద్ద సుశీలుడు సుచరిత్రుడగు పుణ్యశీలుడొకడున్నాడు. అతని పేరు కాకభుశుండి. ఆ పుణ్య వ్రతుడు నిరంతరము రామాయణము గానము చేయుచుండును. నీవా రామభక్తుని యొద్దకు పోయి భగవంతుని గుణ కథలు ఆకర్ణించుము. తద్వారా మోహ జనితమగు సంశయములు నివారింప బడును." అని బోధించి నేను ఖగపతిని కాకభుశుండి యొద్దకు బంపితిని.

ఉమా! దాశరథి పరమ దయార్ద్ర హృదయుడు. ఆ మహాత్ముని కృపా దృష్టి మర్మము నా కవగతము. ఈ ఖగేంద్రుడేకారణముననో ఒకింత దురభిమానుడై యుండవచ్చును. ఆ దురభిమానము పోగొట్టుటకై భగవంతు డతనిని సంశయాగ్రస్తు డగునట్లు ప్రేరేపించి యుండవచ్చును. హరిభక్తుడు, వాసుదేవునికి వాహనము, ప్రజ్ఞాసంపన్నుడగు పక్షీంద్రుడే మాయకు లోబడి వర్తించినప్పుడు ఇక సామాన్యుల సంగతి చెప్పనేల! ఆ భగవంతుని మాయ ప్రబలమైనది.

గరుత్మంతుడు కాకభుశుండినివసించు చుండు నీలాద్రిని సమీపించెను ఆ పవిత్ర పర్వతమును దర్శించగనే వినతాసుతునిపై ఆవరించియున్న మాయాంధ కార పటలము తొలగి, అతని మనస్సు ప్రకాశ వంతమై భాసించెను. ఖగనాథుడంతట సమీపమందున్న సరోవరమందు సుస్నాతుడై వాయసోత్తము డుండు వటవృక్షము వైపు నడచెను. అప్పుడక్కడ కథాప్రవచనము జరుగుచుండెను. హంసాది పక్షిసముదాయమూ చెట్టుక్రింద సభదీరి యుండెను. ఖగ రాజును చూడగనే పక్షి సమాజము పైకి లేచి పరమాదరముతో ఆహ్వానము పలికి అతనిని ఉచితాసనాసీనుంజేసి కుశల ప్రశ్నలు వేసెను. అనంతరము కాకభుశుండి గరుత్మంతు నవలోకించి వినమ్రుడై —"రాజా! మీ శుభాగమనముచే మా నెలవులు పవిత్రములయ్యె. మీ దర్శన భాగ్యము ప్రసాదించి మమ్ము కృతార్థుల జేసితిరి. మా వలన సమకూర్ప వలసిన కార్యమేదియో సెలవీయ వలసినది—" అని విన్నవించుకొనెను.

వారి ఆదర సత్కారములకు పక్షీంద్రుడు పరమహర్షితుడై— "ఓ ఖగోత్తమా! నీవు భాగవతోత్తముడవు. నీ పుణ్య చరిత్ర ఆ పరమేశ్వరుని ముఖతః వినుభాగ్యము నాకు కలిగెను. ఎప్పుడు



రామచరిత మానస్

ఈ ఆశ్రమములో ప్రవేశించి మీ దర్శనము చేసికొంటినో అప్పుడే నా యాశయము సిద్ధించి నా కోర్కెలు ఫలించెను. సౌమ్యా! సుఖ దాయకము పరమ పవిత్రమగు ఆ సాకేత రాముని శుభ చరిత్ర కృపామతివై వినిపించి నావీనులకు విందొనర్ప వలసినదిగా ప్రార్థించుచున్నాను—" అని వినతాసుతుడు వక్కాణించెను.

*　　*　　*

గరుత్మంతుని ఆశయము పరమ పవిత్రమైన అతని ప్రసంగము ప్రేమ రసపూరితము. అతని సత్సంకల్పమునకు కాకభుశుండి పరమానంద మొందెను. తదనంతర మాతడు మనోజ్ఞమైన రామకథను గరుడునికి చెప్పనారంభించెను.

భవానీ! రామకథ ప్రారంభించుటకు ముందు కాకభుశుండి రామచరిత మానస సరోవరమును సుందరముగ అభివర్ణించెను. పిమ్మట నారదుని మోహము, రావణుని జన్మకారణము, శ్రీరాముని జననము, బాలరాముని దివ్య లీలలు విశదముగ వివరించెను. ఆ పైన అయోధ్యకు కౌశికుని ఆగమనము, రామలక్ష్మణులు తాటకిని వధించుట, మిథిలా నగరము చేరుట, ధనుర్భంగము సీతా రామాదుల వివాహ ఘట్టములను వరుసగా వివరించెను. అనంతరము అయోధ్యలో పట్టాభిషేక ప్రసంగము, దశరథుని వరప్రసక్తి, సాకేత వాసుల శోక విహ్వలత, రామాదుల వనగమనము, నిషాదుని భక్తి, గంగాయమునలు దాటుట, చిత్రకూటనివాసము, సుమంత్రుని పునరాగమనము, రాజు ప్రాణత్యాగము, భరతుని హృదయావేదన, భరతాదులు చిత్రకూటమునకు ప్రయాణించుట, చిత్రకూట సమాజము, పాదుకా ప్రదానము, అయోధ్యకు భరతాదుల పునరాగమనము మున్నగు సంఘటనలను సాందోపాంగముగా వర్ణించి చెప్పెను.

తదుపరి, జయంతుని దుర్బుద్ధి, అవధేశుడు అత్రిమునిని సందర్శించుట, విరాధవధ, శరభంగ, సుతీక్ష్ణ అగస్త్యాదిముని యాశ్రమములను వర్ణించుట, జటాయువుతో మైత్రి, పంచవటీ పర్ణ కుటీర వాసము, శూర్పణఖ ముక్కు చెవుల గోయుట, ఖరదూషణాది రాక్షస సంహారము, మాయలేడి, సీతాపహరణము, కబంధుని వధ, శబరి ఆతిథ్యము, సాగరతీరమునకు వచ్చుట, నారదా గమనము ఆది దండ కారణ్య సంఘటనలు క్రమముగా స్పష్టము చేసెను.

ఆ పైన సుగ్రీవునితో చెలిమి, వాలివధ, ఋతువర్ణన, సీతాన్వేషణ, మారుతి సముద్రోల్లంఘనము, మహావీరుడు విభీషణుని జూచుట, సీతా సందర్శనము, లంకా దహనము, పవనాత్మజుని ప్రత్యావర్తనము, జానకి క్షేమ సమాచారములు దాశరధి కెరిగించుట, విభీషణ శరణాగతి, సాగర గర్వ భంగము మొదలగు వృత్తాంతము సుందరముగా అభివర్ణించెను. అనంతరము సేతు బంధనము, రామలింగేశుని ప్రతిష్ఠ, సముద్రము దాటుట, అంగదుని దూత్యము, యుద్ధ ప్రారంభము, రాక్షసుల సంహారము, రావణవధ, మండోదరి విలాపము, విభీషణుని రాజ తిలకము, పుష్పకారూఢులై అయోధ్యకు బయలు దేరుట రామ భరతుల పునస్సమాగమము, శ్రీరామ పట్టాభిషేకము, రామరాజ్య వైభవము, ఆది సంఘటనలు సాంతముగ కాకభుశుండి గరుత్మంతునికి వినిపించెను.

కాకభుశుండి ప్రబోధము

పక్షీంద్రుడు రఘు ప్రవరుని చరిత్రంతయు పరమభక్తి— శ్రద్ధతో ఆకర్ణించి పరమానందోల్లాస మానసుడై కాకభుశుండితో నిట్లు ప్రసంగించెను—

ఖగోత్తమా! పావనమగు రామకథ విను భాగ్యము ప్రసాదింప జేసిన మీ యనుగ్రహమునకు నేను కృతజ్ఞుడను. మహాత్మా! మునుపాకసారి రణాంగణమున నాగపాశ బద్ధుడై పడియుండిన శ్రీపతిని దర్శించుట సంభవించెను. నా కప్పుడు చిదానంద మూర్తి యగు శ్రీరామమూర్తి పాశాధీనుడు కావడ మేమిటి? అను శంక కలిగియుండెను. ఇప్పుడు మీ ముఖతః ఆ లోకోత్తర రామచరిత్ర సంపూర్ణముగ విన్న అనంతరము నా కుండిన సందేహము తొలగి చిత్తము శాంతించెను. సంప్రతి సీతానాథునిపై స్థిర భక్తి సంప్రాప్తించెను.

"విబుధోత్తమా! నేనా నాడు రామావతార రహస్యము తెలుసుకొన జాలక శంకాధీనుడనైతిని. దాని వలన ఒక లాభము కూడ కలిగెను. ఎండలో నడచిన వానికే నీడ సుఖము తెలియును. ఆ సంశయమే నన్ను మీ బోటి సత్పురుషుల నాశ్రయించుటకు ప్రోత్సహించెను. తద్వారా రమణీయమగు రామకథ సంపూర్ణముగ విన గల్గు భాగ్యము సంప్రాప్త మయ్యెను. భగవదనుగ్రహము కలుగనిదే సత్పురుష సాంగత్య ఫలము సిద్ధించ నేరదని శాస్త్రములుద్ఘోషించుచున్నవి. ఆ రాముని దయ నన్నీ విధముగ ప్రేరేపించి యుండవచ్చును. వాయస శ్రేష్ఠ! మీ దర్శన భాగ్యముచే నా జన్మ తరించెను."

గరుడుని వినయోక్తులకు కాక భుశుండి పరమానంద భరితుడై ఇట్లు ప్రసంగించెను. "ఓ నభగ నాథా! నిశ్చయముగ నీవా సీతాపతి కృపకు పాత్రుడవు. సంశయములు,— భ్రమలు— మోహాదులు —రామ భక్తుని సమీపించ గలవా! మీరీ మిషతో నా యొద్దకు చనుదెంచి నన్ను కరుణించితిరి. అట్లు గాదేని, మిమ్ము మోహవశునిగా జేసి తద్వారా జానకీ నాథుడు నాకు గొప్పదనము కలుగునట్లు సంకల్పించి యుండును. మీరన్నట్లు ఒక వేళ రామ మహిమను గురించి మీరు శంకాధీనులై ననూ చింతించ పనిలేదు. బ్రహ్మ మహేశ నారద సనకాదు లెంతటి ఆత్మజ్ఞాన పరులు! వారిలో ఎవరు మాయకు వశ్యులు కాలేదు? ఖగ రాజా! ఈ జగత్తులో కామునిచే ఆడింప బడని వాడు, తృష్ణా పీడితుడుకాని వాడు, క్రోధమునకు వశ్యుడు కాని వాడు ఎవడున్నాడు! జ్ఞానులు తాపసులు కవులు కోవిదులు శూరులు వీరులు వీరిలో ఎవరు లోభాతురులు కానివారు? కాంతా కనకములకు, ఈర్ష్య ద్వేషములకు లోబడని పురుషు డెవ్వడు! మాయా కుటుంబము బలవత్తరమైనవి, బహు విస్తృతమైనది. బ్రహ్మ మహేశాదులే ఆ మాయకు వశులై వర్తించుచున్నపుడు సాధారణుల సంగతి చెప్పనేల

వైనతేయా! ఈ మాయానటి రామ ప్రభువుకు భృత్యానుభృత్యవు. ఆ భగవంతుని

ప్రభావిలాసము ననుసరించి ఈ మాయ ఆడుచూ ఇతర ప్రాణికోటిని ఆడించుచుండును. కానీ, ఆ దయా ధాముని కృపాదృష్టి నోచుకొన్న జీవుడీ మాయ నుండి ముక్తుడగుచున్నాడు.

సోఽం సచ్చిదానంద ఘన రామా
అజ బిగ్యాన రూప గునధామా,
బ్యాపక బ్యాప్య అఖండ అనంతా
అఖిల అమోఘ శక్తి భగవంతా.

ఆ రాముడే సచ్చిదానంద స్వరూపుడు, జన్మ రహితుడు, విజ్ఞాన మూర్తి, సకలగుణధాముడు, సర్వ వ్యాపకుడు, అఖండుడు, అనంతుడు, అమేయ శక్తి సంపన్నుడు, ఆ దేవుడు అవాఙ్మనస గోచరుడు, అజితుడు, అవినాశి, మిత్రమా! అట్టి దేవ దేవునిని మాయ సమీపించ గలదా! ఏ నాటికైనా చీకటి సూర్యుని సమీపించ గలుగునా!

విజ్ఞుడా! ఆ భగవానుడే భక్త హితార్థమై భూలోకమున మానవ రూపమెత్తి ప్రాకృతుని వలె తన లీలను ప్రకటించెను. నాటకములో నటుడు అనేక వేషములు ధరించును. ఆయా వేషధారణ కనుగుణ్యముగ అతను అభినయించుచుండును కానీ నటుడు నటుడే, అతని నటన నటనమే. అవ్విధముగ భగవంతుని అవతార లీలను అర్థము చేసుకొనవలెను. అట్లు దేవుని లీలా రహస్యములు గ్రహించ లేని మందబుద్ధులు అజ్ఞానముచే సంశయాస్పదులగు చున్నారు. కామిల రోగికి చంద్రుడు పసుపు వర్ణముతో కన్పడును. సముద్ర యానము చేయు వానికి భూతలము పరిభ్రమించు చున్నట్లు తోచును. అటులనే మూర్ఖులు భగవంతుని యెడ పొరబడుచున్నారు. శ్రీరాముడు శోకవ్యాకులితుడై విలపించు చున్నాడనీ, విరహార్తుడై పామరుని వలె ప్రలాపించు చున్నాడని భావించుకొని భ్రమ పడుచున్నారు. భక్త ప్రవరులు మాత్రము ఇట్టి భ్రమకు లోనుగాక శ్రీరాముని సాక్షాత్ భగవత్స్వరూపునిగా భావించి భజించు చున్నారు—

"నిర్గున రూప సులభ అతి,
సగున నజానహిఁ కోఁయీ."

గరుడా! నిర్గుణ బ్రహ్మను తెలుసుకొనుట కడు సులభము, కానీ సగుణ బ్రహ్మను గుర్తించుట బహు దుస్తరము. అందుకు, నిర్గుణ బ్రహ్మ ఏక రస ప్రధానమైనదికాగా—సగుణ బ్రహ్మ బహురూపాత్మకమై యుండుటయే కారణము.

విహంగాధిపా! నీవు రామచంద్రుని భక్తుడవు. ఆ స్వామి కృపకు పాత్రుడవై యున్నందున నీ కొక రహస్యము చెప్ప దలంచితిని. సావధాన మనస్కుడవై ఆకర్ణింపుము. దాశరథి తన దాసుల యందు దురభిమాన ముండుట చూచి సహించ జాలడు. ఇది అతని స్వభావము. ఆ భక్తవత్సలుడు తక్షణమే భక్తుల దురభిమానము తొలగించుటకు ప్రయత్నించును. బాలుడు వ్రణముచే బాధ పడుచుండును తల్లి బిడ్డ బాధ తొలగించుటకు మనస్సు గట్టి చేసుకొని శస్త్రముతో వ్రణము ఛేదించి చికిత్స చేయును. అటులనే భగవానుడు తన భక్తులలో పొడగట్టిన అహంకారమును పోగొట్టుటకు ప్రయత్నించు చుండును.

భక్తుని మూర్ఖత్వము, భగవంతుని దయ

"వైనతేయా! భక్తుడెంతటి మూర్ఖుడైనను భగవంతుడు అతనియెడల యెంత దయామయుడై వర్తించునో నీకు వివరించదలచితిని. అందుకు ఉదాహరణముగా నా అనుభవమునకు సంబంధించిన ఒక సంఘటన పేర్కొనుచున్నాను— ఆకర్ణింతువు గాక.

పరమాత్ముడపుడు రూపావతార ధారుడై తన భక్తుల కొరకు అనేక లీలలను ప్రకటించుచుండును. నేను ఎపుడు అయోధ్యకు పోయిననూ బాల రాముని క్రీడాకలాపములు, వినోదచర్యలు తిలకించి ఆనందించుచుందును. ద్విజోత్తమా! ఆ బాల రాముడే నాకు ఇష్ట దైవము. ఒక్కొక్కప్పుడు అయిదారేండ్ల పర్యంతము అక్కడనే ఉండి ఆ బాల భగవానుని నామకరణము జన్మోత్సవాదులు నేత్రోత్సవకరముగా దర్శించి ఆనందించుచుందును. గరుత్మంతా! భక్తసుఖదాయకమగు భగవంతుని లీలా ప్రసంగమొకటి ఈ సందర్భమున నీకు వినిపింప దలచితిని." అని పలికి భుశుండి భక్తిపారవశ్యముతో తన్మయుడై ఇట్లు ప్రసంగించెను.

"గరుడా! నేనప్పు డొక చిన్న కాకిరూపమున అయోధ్యలోనుండి దశరథనందనుని దివ్య లీలలు నిత్యప్రతి దర్శించుకొని అపార ఆనందమనుభవించుచుంటిని. ఒకమారు రామదేవుడు సౌధప్రాంగణమందు దోగాడుచుండెను. స్వామి కొరికి పారవేసిన పదార్థములను నేను యెత్తుకనిపోయి పరమ ప్రీతితో భక్షించుచుంటిని. అది రత్నఖచితమగు రాజమందిరాంగణము. దానిపై కోసల కుమారుడు క్రీడించుచుండెను. బాలరాముని మంగళ రూప సౌందర్యము కోటి మన్మథులను ధిక్కరించుచుండెను. మరకత వర్ణ శ్యామలాంగుడు, జలజారుణ సదృశ కోమల చరణద్వయుడు, అరుణారుణ హస్తశోభితుడు వివిధ వస్త్ర భూషణాలంకారముగల రఘునందనుడు సింహ కిశోరమువలె ప్రాంగణమున దోగాడుచుండెను. నేనా మనోజ్ఞమూర్తిని రెప్పవాల్పక చూచుచుంటిని. ఆ బాలమూర్తి కదలినపుడు చిరుగజ్జెలు ఘల్లు ఘల్లుమని చిత్తమును హరించుచుండెను. నేనొకప్పుడు ఎగురుచు ఆ మోహన మూర్తిని సమీపింతును, ఆ కుమారుడు నన్ను పట్టుకొనుటకు చిట్టిచేతులు ముందుకు చాపును. అప్పుడు నేను ఎగిరి దూరముగా పోవుదును. అప్పుడా బాలమూర్తి నా దిక్కు చేయిచాపి "ఓ, కాకీ ఇదిగో రొట్టె" అని నన్ను పిలుచును. నేను దగ్గరకు పోగానే కిలకిల నవ్వి పరుగెత్తసాగును. ఒకమారు నేనా బాలదేవుని పాదములు స్పర్శించవలెనని దగ్గరకు పోతిని. ఆ స్వామి నన్ను వెనుదిరిగి చూచుచూ దూరముగా పోయెను. గరుడజీ! ఇట్లు ప్రాకృతుని వలె ముద్దుగా క్రీడించుచూ నన్నాకర్షించిన ఆ బాలుడు సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపుడగు భగవంతుడేనా! అనుశంక నాకాదృశ్యము గాంచిన పిమ్మట కలిగెను. నా మనస్సివ్విధముగ భ్రమించిన మరుక్షణమునందే ప్రభుప్రేరితమగు మాయవచ్చి నన్నావహించెను. కానీ ఆ మాయ నా కెక్కువ హాని కలిగించలేదు. నేను మాయకు వశుడౌటగాంచి ఆ చిన్ని దేవుడు మందహాసము చేసెను. (సశేషం)



"నువ్వు సిగరెట్లు కాలుస్తావని మీ ఆవిడకు తెలుసా?"
"ఆ! నిన్నే తెలిసి కొంచెం మందలించింది!"

పరిశ్రమ తరలింపు

ఎన్. టి. రామారావు



ఈనాటికీనాడు ఇల్లు మారాలంటేనే సమస్య. ఇరుకు, ఇబ్బందులెలావున్నా ఇంతకాలం సరిపెట్టుకున్నది, పైగా కాలంతోపాటు పెనవేసుకున్న మమతలు, నమ్మకాలు, గత విశేషానుభావాలు-అన్నీ కలిసి ఒక్క పెద్ద అవినాభావ సంబంధం ఏర్పడుతుంది. పాతను మరపించే వీళ్లూ, వసతి సౌకర్యాలు, క్రొత్తచోట అమరితేగాని మార్పిడి అంత ఉల్లాసంగా, ప్రోత్సాహకారిగా ఉండదు. ఇటువంటి సామాన్యవ్యక్తిగత సమస్యే ఇంత ఇబ్బందిపెడితే ఇక పలువురి జీవనభృతి కాధారభూతమైన చలనచిత్రపరిశ్రమ తరలింపు ఒక పెద్ద సమస్య కావడంలో ఆశ్చర్యంలేదు.

గత నలభై సంవత్సరాలనుండి మదరాసులో స్థానం ఏర్పరచుకుని, దినదిన ప్రవర్థమానంగా అభివృద్ధికి అవసరమైన హంగులూ, అనుబంధ వ్యాపారశాఖలు, ఏర్పరుచుకొని, చిత్ర నిర్మాణానికి అనువైన సర్దుబాట్లు, సౌకర్యాలు చక్కగా వృద్ధిచేసుకుని, పలుభాషా చిత్రనిర్మాణానికి అందుబాటులో ఉండి, వ్యాపారాభివృద్ధికి పరిశ్రమ పురోగమనానికి అనువైన వాతావరణం సృష్టించుకొని ఈ స్థాయికి చేరగలిగిన దక్షిణ భారత సినీకేంద్రమైన మదరాసు నుండి ఏ భాషవారైనా తమ పరిశ్రమను తమ రాష్ట్రానికి తరలించదలచుకుంటే తరలించుకోవచ్చును. కాని ఆ తరలింపులో ఎదుర్కొన్న కొన్ని సమస్యలను పరిష్కరించుకో వలసిన బాధ్యత ఏర్పడుతుంది. ఈ బాధ్యతాయుత కార్యనిర్వహణలో పరిశ్రమకు సంబంధించినవారందరూ ఏకమై నడుంకడితేనే తప్ప ఈ సమస్య అంత సులభసాధ్యం కాదు.

సమస్యలు-సాధకబాధకాలు

పెద్ద నటీనటులు :

వీరికి ఏ సమస్యా లేదు. ఏ సాధకబాధకాలు లేవు. అదృష్టం కలిసివచ్చింది. పరిశ్రమలో పాతుకుపోయారు. పలుకుబడి సంపాదించారు. వాళ్ల వాళ్ల విలువలకు తగ్గట్టుగా గడించారు. కడుపు నిండినవారు. క్రొత్తచోటనైనా క్రొత్త అభిమానులు వుండనే ఉంటారు — పేరున్నవారు గనుక వీరి ప్రాపుగోరే నిర్మాతలు వారివెంట వెళ్ల వలసిన అవసరం ఏర్పడుతుంది. ఇలా వారి అభిమానులు వారికిచ్చిన పేరు ప్రతిష్ఠల్ని ఏ మార్కెట్టులోనైనా ఎప్పుడైనా ధనంగా మార్చుకోగలరు. చలామణి కాగలరు.

సహాయనటులు:

వీరికన్నీ సమస్యలే. ముందువచ్చే ప్రశ్న—నీవెవరివాడివి ? మొన్న నన్ను కాదన్నావట., వారిని ఔనన్నావట !! ఇక ఇప్పుడు నాతో నీకు పనేముందని ? పై పెద్దవారంటే కన్నీళ్లపర్యంతమై చాలీ చాలని వసతి సౌకర్యాలతో సరిపెట్టుకునే ఆలుబిడ్డలు ఆకలింపుకువచ్చి " సరే ! పొరపాటయ్యింది బాబూ ! ఇకనుంచి మీ స్మరణే !! అనక తప్పని నిస్సహాయులు, పూర్తిగా స్థాయి చిక్కనివారు — జీవనభృతి చాలనివారు — ఉన్న ఆకాస్త సంపాదనైనా గట్టిగా ఉంటుందన్న నమ్మకం, నిలకడలేనివారు.

మేము ప్రచురిస్తున్న శ్రీ ఎన్. టి. రామారావు వ్యాసాలలో యిది రెండవది.

పెద్ద నటీనటులు: "వీరికి ఏ సమస్యా లేదు. ఏ సాధక బాధకాలు లేవు. అదృష్టం వచ్చింది - పరిశ్రమలో పాతుకుపోయారు. పలుకుబడి సంపాదించారు .... సహాయ నటులు: వీరి కన్నీ సమస్యలే ...."

"దినదిన గండం నూరేళ్ళాయుస్సు"

"అటుగొయ్యి — ఇటునుయ్యి"

వెళ్ళాలా ? వెళ్ళకూడదా ?? పెద్దసమస్య !

వెళ్ళితే —— నూతన నివాసం., పిల్లలకు చదువుసంధ్యలు ? క్రొత్తచోట నిలద్రొక్కుకో గలమా ?? అన్న అధైర్యం — జీవితం నిలకడగా సాగుతుందా ? ? ? అన్న ఆరాటం. ఇవీ వారిముందు నిలబడే పెనుభూతాలు ! తేల్చుకోలేని సమస్యలు !!! వెళ్ళకపోతే — ఏమో., పలుకుబడివున్న పెద్దనటులు. ఏనాటికైనా ఈనీళ్ళూ., ఆనీళ్ళూ ఏకమైతే మానని ? ఎండినచెరువులో ప్రాణం కోసం కొట్టు కునే చేపల గతౌతుందే ! అయినా ప్రస్తుతానికి కొన్ని సమస్యలిక్కడలేవు.

నివాసం....ఏదో వుంది.

పిల్లలు .... ఒక ధోరణిలో చదువు కుంటున్నారు.

వాతావరణం .... పాతది. ఏదైన కలిసి రానికాలంలో తెలిసినవారున్నారు గనుక, కష్టాలు చెప్పుకునైనా కాస్త తేలిక పడచ్చు — కాదుబాబూ తీర్చుకుంటామని కాస్త అప్పయినా తెచ్చుకోవచ్చు పాతకొమ్మ వదలలేము — క్రొత్తకొమ్మమీద పాకగలమన్న నమ్మకమూ లేదు. పడితే నడుమే విరుగు తుందో ! ప్రాణమే పోతుందో !! వ్రేలాడుతూవుంటే త్రిశంకు స్వర్గమే అవుతుందో !!! ఇదీ వీరి సంకటం.

సాంకేతిక నిపుణులు:

క్రొత్త ప్రారంభం ! వచ్చే కంపెనీలెన్ని ? తీసే చిత్రాలెన్ని ?? వున్నవాళ్ళం ఆయా శాఖలలో ఎంత మందిమి ఉన్నాం ? అక్కడికి వెళ్తే పనెంతమంది కుంటుంది ??

ఒక స్టుడియోకి : ఒక సౌండు ఇంజనీరు.
ఒక ఆర్టుడైరెక్టరు.

రెండు కంపెనీలకు : ఒక కెమెరా మాన్.
ఒక ఎడిటర్.

నాల్గు కంపెనీలకు : ఒక మ్యూజిక్ డైరెక్టర్.

అందరికీ కలిసి ఒకరో ఇద్దరో డైరెక్టర్లు. మరి సౌకర్యాలు పూర్తిగా అమరని చోటికి ఒకేసారి అందరం వెడితే వృత్తిలో పోటీ., చులకన కావడం— ఇదీ వీరి సందిగ్ధావస్థ.

చిత్రనిర్మాత:

అసలు ఈ చలనచిత్ర వ్యాపార దౌర్భాగ్యం, దుస్థితీ ఇది. ముహూర్తంనాడు కర్పూరం వెలిగించి, డబ్బంతా సేకరించి కావలసిన హంగులన్నీ సమకూర్చు కుని, ఆవేశంతో, ఔత్సుకంతో, ఆపేక్షతో, అపరి మితానందంతో, ఒక మంచి చిత్రాన్ని నిర్మించాలి, ఇది కళాభిమానుల ప్రశంసల్ని, వీలుగాఉంటే ప్రభుత్వ ప్రశంసాపత్రాన్ని, తప్పనిసరిగా వ్యాపార విజయాన్ని సాధించి తీరాలి — ఎంతైనాసరే ! ఏమైనాసరే ! అన్న దీక్షతో, దక్షతతో బయలుదేరిన ఔత్సాహి కుడు నానాటికీ నీరసించి చివరకు చిత్రం ముగింపు నాటికి మనిషి కనిపించినా కనిపించవచ్చు — కని పించక పోయినా ఆశ్చర్యం లేదు. చిత్రం తాలూకు వ్యాపారంలో, లెఖ్ఖలలో అసలు అనామకుడు — ఆఖరివాడు అవుతున్నాడు. కొంతమంది తన చిత్రం ఎంత గడించిందో కూడా తెలియనిస్థితిలో వున్నారంటే ఆశ్చర్యం లేదు. అతిశయోక్తి కాదు.— చిత్ర నిర్మాణకాలంలో పెద్దనటీనటుల సౌంజ్ఞల్ని, ఆజ్ఞల్ని శిరసావహించాలి. వారి ఇష్టానుసారం వ్యవహ రించాలి. అటుపైన పెరిగే ప్రొడక్షన్ ఖాతాలో చెంపపెట్లు — గోడపెట్లు — వ్యాపారవిషయంలో చెలరేగే చిక్కుసమస్యలు — కమీషన్లు — రాయ ల్టీలు — వడ్డీలు — కాంపౌండు వడ్డీలు — సర్వ హక్కుల తనఖాలు—సూపర్‌వైజర్ల హంగామాలు—

" వారును వారువారు, మరి వారును, వారును వారువారునున్ "ఇందరి చేతుల్లో చిక్కిశల్యమై, చివరకు లేచే వోపిక లేక ! ఆదిలోవున్న ఆవేశమంతా చల్లబడి — " ఇదే చిత్ర నిర్మాణం " అని అంత ఆలస్యంగా అర్థం చేసుకునే సినీ ధర్మకర్త నిర్మాత.

ఎవరికి ఏ విధమైన ఆగ్రహం కలిగినా నిర్మాత నీరసించ వలసిందే.

ఎవరు కోపంతో కాదన్నా ఆయన చిత్రం ఆగ వలసిందే.

మొత్తం పరిశ్రమలోఉన్న ఏ కొద్దిమంది స్వతంత్రులోతప్ప మిగిలినవారీ కష్టాలకు గురౌతున్న వారే. ఇప్పుడు వచ్చింది మరొక అదనపు సమస్య.

కొంతమంది అటు — కొంతమంది ఇటు — ఇటూ అటూ కలిస్తేనేగాని చిత్రం తయారుకాదు— అటు వారిటుమళ్ళరు — ఇక ఇటువారటు తరలా లంటే, తలతిరిగేటట్టు రయ్‌మని ఎగిరే వైకాం టులు, ముఖ్యులవెంట కదిలే బంధుమిత్ర పరివారం— వారికి రాచమర్యాదలూ — రిజర్వేషన్లు — రెపరెప మని గుండెదూసుకుపోయే, హోటల్ బిల్లులు — ఆపైన జనం గుండా బుసలుకొడుతూ వురుకులెత్తే మోటారుకార్ల ఏరేంజిమెంట్లు — ఎయిర్ కండిషన్ రూమ్‌లు — ఇంకా అదిలేదు, ఇదిలేదు అనే పిల్ల సింహాల గర్జనలూ, వీటన్నిటికీ బెదిరి గడగడలాడే దుర్భర దుస్థితి నేటినిర్మాత స్థితి.

పెరిగే ప్రొడక్షన్‌మీటర్ "డేంజర్ మార్కు" దాటింది. పద కొండు లక్షలు.

అసలు అయిదులక్షలకు మించని సాంఘిక చిత్ర నిర్మాణం పెరిగి పెరిగి ఈనాటికి ఇంతైంది. ఈనాడు చిత్ర నిర్మాణమే ఒక అనిర్ణీత సమస్య నిర్మాతకు ! అయినా అభిరుచి చంపుకోలేక, ఆవేశం ఆగక సంచులు కట్టి, ఏడుకొండలవాడిమీద భారం వేసి భాగ్య నగరం వెడదామా అంటే — అడ్డుగా నిలిచినవి మరికొన్ని ముఖ్య సమస్యలు.

ఫిలిం సమస్య:

ముఖ్యంగా కెమెరా తిరగాలంటే, ముందు కావలసింది ముడిఫిలిం. కాని ఇది రావలసింది మద్రాసు నుంచి. ఎప్పటికప్పుడే వెతుక్కోవాలి. ప్రతి ఛాంబరు మీటింగుకు హాజరు కావాలి. పర్మిట్ పుచ్చుకోవాలి. ఫిలిం కొనుక్కోవాలి. షూటింగ్‌కు తీసుకుపోవాలి. ఇంత తతంగం — దీని కోసం మదరాసులో మరో ఆఫీసు — వేరొక్క ఎస్టాబ్లిష్‌మెంటు.

సంగీతం-జంత్రకారులు:

ఎంతైనా అనుభవం అనుభవమే — అరితేరిన వారు వాయించందే ఏ పాటైనా పాడే ! రితం సరిగ్గా ఉండాలి — ఉంటేనే హుషార్ — లేకపోతే బేజార్— ఈ లెక్కని ప్రతివారు ప్లెయిన్‌లో తరలాల్సిందేనా ? సరి ! సరి !!

అసలుదానికి అరగాణి !
దానికైన దానికి అర్ధణా !!

రికార్డింగ్:

పనిముట్టు ఒకటే అయినా రికార్డింగు చేసే వారిలో వుంది. పాట పసందు — అంటేనా ? ? ?

అయితే............

ఇందర్ని — అంటే తబలా మొదలు పాడేవారి వరకూ అక్కడికి చేరవేసే బదులు ఆపాటల రికా ర్డింగే మద్రాసులో ముగిస్తే ! ఆఁ ఇదీ ఒక ఆలోచనే— వో. కే.

సెన్సారింగ్:

చిత్రం హైదరాబాద్‌లో ముగించినా, హైదరా బాద్ నార్హత సర్టిఫికేట్ కోసం మద్రాసు తేవలసిందే. సరే! ప్రభుత్వవిషయం పట్టుబట్టి లాభంలేదు. ఇదీ వో.. కే.

ఎక్విప్‌మెంటు ట్రబుల్:

చెప్పకుండా వస్తుంది యంత్రాలకు జబ్బు. మనుషులకే వస్తుంటే దీన్ని ఆపగలమా ? కావి రిపేర్ ! ఇంజనీరు మదరాసు నుంచి రావాలి.

అంతేనా ?
ఇప్పటికింతే !

వచ్చే పెద్ద ఆర్జన వదలుకొని మన ఒక్కరి కోసం మకాం మార్చడుగా ! వీరూ రావాలంటే ? పరిశ్రమ రావాలి ? అప్పుడే మోక్షం !!!

స్పెషల్ ఎఫెక్టుస్:

ఇవన్నీ ఇప్పుడే ఏమీ అనుకోలేం! ఏం ! ఎందుకని? అంటే తనకు పూర్తిగా పని కల్పించే పదిమంది నిర్మాతలూ ఉంటేనేగాని వున్నది వదలుకొని కొత్త చోటికి కాలుకదపరు. ఎవరికి వారికే జీవిత సమస్య. పరిష్కారం పరిశ్రమ పూర్తిగా తరలితేనే.

సెట్టుడెకార్ (అలంకరణ సామగ్రి)

సంటుగరిటె మొదలు, మహారాజు సింహాసనం వరకూ, అన్ని విధములైన సాంఘిక, చారిత్రాత్మక, పౌరాణిక, జానపద చిత్రాలకు, ఆయా కాలాలకు సరిపడే అలంకరణ సామగ్రి సరఫరా చేసేవారు. ఇది ఒక్కసారి సమకూర్చుకోవటానికి సాధ్యం కాదు. డబ్బువున్నా కాలం పడుతుంది. వీలుచిక్కినప్పుడల్లా, సమయం వచ్చినప్పుడల్లా సమకూర్చుకోవలసిన సరుకు.

ఇక ల పైన ....

జాబ్ వర్కుచేసే — మోల్డర్లు — సెట్టు మేస్త్రీలు, వడ్రంగులు, పెయింటర్లు, మేకప్‌వారు దుస్తులు ఏర్పరుచువారు, జరీ కుట్టుపనిచేసేవారు, నాట్యకత్తెలు వగైరా ఆయా శాఖల నిపుణులు, వారి సహాయకులూ అంతమంది తరలి రావాలి. చిత్రం చూసినప్పుడు ఇంతే అనిపిస్తుంది. కాని దాని నిర్మాణంలో ఇంతుంది. అంతా చేతికందివచ్చేటట్లుంటేనేగాని చిత్ర నిర్మాణం సులభసాధ్యం కాదు. ఇందులో ఏది లోపైనా లోటే ! ముఖ్య నటీనటులే తెరమీద మిలమిల లాడుతూ కన్పించవచ్చు. కాని ఆ మెరుపులో, ఇంతమంది మెళుకువ, సామర్థ్యం, సహకారం ఇమిడివుంది. ఇవిలేనిదే అవి పూజ్యం. ఇందరు రావాలంటే వారి జీవనభృతికి చాలినంత రాబడి, చేతినిండా పని దొరుకుతుందన్న నమ్మకం కలిగినప్పుడు తప్పక వస్తారు.

డబ్బింగ్‌పరిశ్రమ:

డబ్బింగైనా, చిత్రం క్రొత్తగా నిర్మించడమైనా చలనచిత్ర వ్యాపారం క్రిందే లెక్క. సగటున షుమారు సంవత్సరానికి 10 తెనిగించబడిన ఇతర భాషా చిత్రాలు విడుదలవుతున్నాయంటే షుమారు సంవత్సరానికి 30 నుండి 40 లక్షల వరకూ వ్యాపారం ఈ పరిశ్రమ మీద సాగుతోంది. ఈ డబ్బింగు వంటిపెట్టుకున్న కవులు, సంగీత దర్శకులు, ప్రొడక్షన్ సిబ్బంది, గొంతులిచ్చే నటీనటులు. ఇంతమంది ఈ పరిశ్రమమీద ఆధారపడి వున్నారు. వ్యాపారంలో లొటుపాటులు తెలిసికొన్నతరువాత క్రమేపీ ఈడబ్బింగ్

పరిశ్రమ - తరలింపు

చిత్రనిర్మాతలే మన తెలుగు చిత్ర నిర్మాతలు కూడా అవుతున్నారు. వీరూ తరలాలంటే వస్తారు. కాని వీరికి వసతులు చూపవలసిన బాధ్యత ఉంది. చౌకగా అంటే మామూలు స్టుడియో కాల్‌షీట్స్‌తో, రేట్లతో సంబంధం లేకుండా, ప్రత్యేకంగా రికార్డింగు వసతులు కల్పించే సొంత స్టుడియోలు నిర్మించబడాలి.

పరిశ్రమ:

ఈనాడు మన తెలుగు చలనచిత్ర పరిశ్రమలో షుమారు 50 నుండి 60 చిత్రనిర్మాణ సంస్థలున్నాయి. సగటున సంవత్సరానికి 30 కంపెనీలు నిర్మాణ కార్యకలాపంలో వుంటే షుమారు 1200 నుంచి 1500 కుటుంబాలు ఆ కంపెనీలమీద ఆధారపడి బ్రతుకుతున్నాయి. వీరిలో పెద్దనటీనటులు, ముఖ్యమైన సాంకేతిక నిపుణులు, మొదలు కాఫీ అందిచ్చే ఆఫీస్ బోయ్ వరకూ వుంటారు.

వీరిలో 100కి — 5 మంది బాగా సంపాదించుకునేవారు.

30మంది గుంభనగా సంసార పద్ధతిలో కాలం వెళ్ళబుచ్చుకునేవారు.

మిగిలిన 65మంది ఏనాటికానాడు బ్రతుకుతెరువు కోసం దేవులాడుకోవలసినవారు. ఒక పూట తింటే మరో పూట పస్తులుండేవారు. ఏనాడో పరిశ్రమలో వచ్చి చేరారు. ఆనాటినుంచి పరిశ్రమను అంటిపెట్టుకున్నవారు. ఈనాడు పాతను వదిలి, క్రొత్తను వెదుక్కునే కాలందాటి పోయింది. ఈ పరిశ్రమే వీరికి శరణ్యం. పరిశ్రమ ఏ మాత్రం దెబ్బతిన్నా వీళ్ల కడుపు మాడుతుంది. అసలే అరకడుపుతో, అర్ధాకలితో బతికేవారికి ఆ ఆధారంకూడా లేకుండా పోతుంది.

లోతుకు వెళ్లిచూస్తే ఈనాటి చలనచిత్ర పరిశ్రమలో ఇంత దుర్భర దుస్థితి గోచరిస్తుంది. ఆవేశంతో పెద్దవాళ్లు గనుక ఈ నిస్సహాయుల్ని నిర్లక్ష్యం చేస్తే వీళ్ల మనుగడ ఏమౌతుందో ఆలోచించండి. పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ ఈ సమస్యలన్నీ పరిష్కరించి ముందు ఈ చిన్న సినిమా ముఖ్యుల జీవితాలకు బాధ్యత వహించకపోతే, ఎవరి బాగు వారు చూసుకున్నట్లవుతుందిగాని అందరి మంచీ గమనించినట్లు కాదు. పరిశ్రమాభివృద్ధిని ఆకాంక్షించినట్లూ కాదు.

ఆస్తిపాస్తులు :

ఇన్నాళ్ళుగా మదరాసులో వృద్ధిచెందిన ఈ పరిశ్రమను నమ్ముకొని మన ఆంధ్రులు మదరాసులో పెట్టిన పెట్టుబడులున్నాయ్. పాతుకు పోయిన అస్తిపాస్తులున్నాయి.


ప్రస్తుతం మదరాసులో ఉన్న ఆంధ్రుల స్టుడియోలు :

1. వాహిని
2 విజయా
3. వీనస్
4 భరణి
5 ప్రకాశ్
6. ప్రసాద్ సినీఎంటర్ ప్రయిజస్
7 జయంతిసొంతుస్టుడియోస్.

ఈ స్టుడియోల పెట్టుబడి పూర్తిగా మన తెలుగు వారిది. షుమారు 90 లక్షల మొదలు ఒక కోటి రూపాయలుంటుంది. ఇవిగాక ఈ పరిశ్రమను నమ్ముకుని, దానిమీద ఆధారపడి, మదరాసులో నివాసం ఏర్పరుచుకున్న నిర్మాతల, నటీనటుల, పారిశ్రామికుల, సాంకేతిక నిపుణుల, భవంతులు ఎన్నేట్లు, సహాయవ్యాపారముల ఎన్నో కోట్లుండ వచ్చును. ఈనాడే వీటన్నిటినీ అమ్మకానికి పెట్టినా భరించగలవారు ఉండక పోవచ్చును. వాటి విలువలు పూర్తిగా రాకపోనూ వచ్చును. పైగా వాహినీ, విజయా స్టుడియోలు ఆసియాఖండంలో గల చలనచిత్ర పారిశ్రామిక కేంద్రాలన్నిటికన్నా ఉత్తమంగా, అతి సుందరంగా, వసతి సౌకర్యాలతో పరిశ్రమ అభివృద్ధి పురోగమనానికి సాయపడేవిగా, నిర్దుష్టంగా అభిరుచితో శ్రీ నాగిరెడ్డిగారు, నిర్మించిన విధానం, చేసిన యత్నం, వినియోగించిన బుద్ధి కుశలత, పట్టినకాలం, ఇవన్నీ స్వతహాగా వారు వెచ్చించిన ధనంకన్నా విలువైనవన్నది నిస్సందేహం. ఒక వేళ తిరిగి వారటువంటి స్టుడియో నిర్మించదలచుకుంటే ఎంతకాలం పడుతుంది ? కాలక్రమేపీ జరగ వలసిన పనిగాని ఆవేశంతో ఈనాటికీనాడు సాధ్యమయ్యేది కాదు.

చిత్ర నిర్మాతకు చేతిలో ఉన్న డబ్బే పెట్టుబడి కాదు. నమ్మకం, విశ్వాసం, అనుభవం, మంచితనం మార్కెట్టులో విలువ—ఇవన్నీ పెట్టుబడులే!

పరిశ్రమను అర్థం చేసుకుని, పరిశ్రమలోవున్న వ్యక్తుల విలువను గుర్తించి క్రొత్తచోటకూడ ఈ పరపతులు, సౌకర్యాలు, వసతులు, అన్నీ ఏర్పడిననాడు, తప్పక పరిశ్రమ భాగ్యనగరుకు తరలుతుంది— వర్ధిల్లుతుంది ! ★



"ఏమండీ ! ... మనకారు గంటకు రెండు మైళ్లకంటే ఎక్కువ వేగం వెళ్లదా? ఏంకే...

వదంతులను వినకండి
వదంతులను ప్రచారం చేయకండి

సరళ సమాధానం చెప్పింది.

రామయ్యగారు తిరిగి ప్రయత్నం ప్రారంభించారు. ఈ మధ్యనే ఇంకొక మంచి సంబంధం ఎవరో మధ్య వర్తి ద్వారా ఏర్పాటయింది. వధూ వరులు ఒకర్నొకరు చూడడం ఆమోదించడం జరిగాక తక్కిన విషయాలు మాట్లాడుకోవచ్చును. కాబట్టి అతడిని పంపమంటూ పెళ్లి కొడుకు తండ్రిపేర ఉత్తరం వ్రాశారు రామయ్య గారు.

5

తన వైపు వస్తున్న కుక్కని చూచేసరికి మూర్తి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినై. గేటు దాటి రోడ్డు మీదికి పారిపోదాం అంటే అమాంతంగా భీమారావు చేతిలో పడతాడు. ఇక్కడే ఉంటే ఈ శునకరూప రాక్షసి తనని చిత్రవధ చెయ్యడం తథ్యం. ఒక లిప్తకాలం మూర్తి ఆలోచించాడు. ఈ కుక్క యజమానులే తనని రక్షించాలన్న నిశ్చయానికి వచ్చాడు. ఒక్క పరుగున ఆ ఇంటి వైపు దారితీశాడు.

మూర్తి ఇంటివైపు పరిగెత్తడం చూడగానే ఆ కుక్కకి మరీ కోపం వచ్చింది. వెంటనే తన వేగాన్ని హెచ్చించి అతడిని వెంబడించింది. మూర్తి హాలులో కాలుపెట్టేసరికి కుక్క అతడి పంట్లం పట్టుకో గలిగింది.

"ఛీ ఛీ వెధవ కుక్క, దీనిని కట్టి వేయమని చెప్పాను. ఎవరు విప్పారు ?" అంటూ రామయ్య గారు కుర్చీలో నుంచి లేచివచ్చారు. "ఒరే వెంకయ్యా ఈ కుక్కని తీసుకొనిపో" అని శూన్యం లోకి ప్రసారం చేసి "రా, బాబూ" అని మూర్తిని ఆహ్వానించారు. వెంటనే గోడమీద నున్న గడియారం చూచారు.

"అబ్బో ! రెండు గంటలయి పోయిందే. ఇంకొక్క పది నిముషాలు మాత్రం వ్యవధి ఉన్నది. మేడ మీదికిరా అబ్బాయి" అంటూ నడిచారు రామయ్యగారు.

తను మేడమీదికి ఎందుకు వెళ్ళాలో మూర్తికి అర్థం కాలేదు. ఎండ దెబ్బ, భీమారావుని చూచిన భయం, కుక్కవల్ల కలిగిన అనుకోని పరుగు, తప్పిన గండం, వీటితో వూపిరి అందకుండా ఉన్నది మూర్తికి. ఇప్పుడు మేడ ఎక్కే పరిస్థితిలో అతడు లేడు. కాని అప్పుడే రామయ్యగారు మెట్ల వరకు వెళ్లారు. ఈయన వెళ్ళాక ఆ కుక్క తిరిగి వచ్చిందా— మూర్తి మరి ఆలోచించలేదు. వెంటనే లేచి ఆయన వెంట మేడమీదకి వెళ్ళాడు.

మేడమీద గది చాలా ఆకర్షణీయంగా ఉన్నది. సోఫాలు, టేబిళ్లు ఇత్యాదులన్నీ లక్షణంగా అమర్చబడి ఉన్నై. వీరెవరో ధనికులు, సంస్కారం కలవాళ్ళూ అయి ఉండాలనుకొన్నాడు మూర్తి సోఫాలో కూర్చొంటూ.

"ఇదిగో, వెంటనే అమ్మాయిని తీసుకు రావాలి" అని రామయ్యగారు కేకవేశారు.

పక్క గదిలో నుండి రామయ్యగారి భార్య కుమార్తెను తీసుకువచ్చింది.

"అమ్మాయిని త్వరగా చూడబ్బాయ్. ఇంకా అయిదు నిముషాలే ఉన్నది" అన్నారు రామయ్య గారు.

వర్షం

19 వ పేజీ తరువాయి

మూర్తికి బోధపడలేదు. కాని అమ్మాయిని చూడు అనే ఆదేశం విన్నాక చూడని అబ్బాయి ఉంటాడా ? మూర్తి అప్రయత్నంగా ఆ అమ్మాయి వైపు చూచాడు.

సరళ !

అదే క్షణంలో సరళ కూడా తల ఎత్తి చూచింది. ఆమె కలలో కూడా అనుకోని వ్యక్తి కనిపించాడు. మూర్తి !

"అమ్మాయి నీకు నచ్చిందా బాబూ ! త్వరగా చెప్పు" అన్నారు రామయ్యగారు.

మూర్తి అదిరి పడ్డాడు. "నాకా ? ఇందులో ఏదో—"

"ముందు నచ్చిందో లేదో త్వరగా చెప్పు. రెండు నిముషాలు మాత్రం ఉన్నది. తక్కిన విషయాలు తరువాత మాట్లాడుకోవచ్చును. నచ్చిందా? అంటూ ఒత్తిడి చేశారు రామయ్యగారు.

"నచ్చడానికేం ? బ్రహ్మాండంగా నచ్చింది. కాని—"

"ఆగు ఆగు, ఇదిగో అమ్మాయి ఇష్టపడిందో లేదో వెంటనే కనుక్కొని చెప్పు. ఇక్కడ చెప్పడానికి సిగ్గుపడుతుందేమో— ఆ వరండాలోకి

తీర్పు చెప్పబోయేముందు జడ్జి ప్రతివాదిని జూచి—

జడ్జి : ఏమయ్యా ! ఆఖరు సారిగా కోర్టువారి ముందు ఏదైనా ఉంచదల్చుకున్నావా ?

ప్రతివాది : నావల్ల కాదు బాబోయ్ ! నాదగ్గర ఉన్న ఆఖరి నయాపైసా కూడా ఈ దావాలో ఖర్చయిపోయింది!

ఎం. మాధవ్‌రావు (తెనాలి)

తీసుకొని వెళ్లి అడుగు త్వరగా." అన్నారు రామయ్య గారు భార్యతో.

"అమ్మాయి కూడా ఇష్టపడింది" అని ఒక నిముషంలోనే వరండాలో నుండి కేక వినిపించింది. వాచీ పెద్దముల్లు సరిగ్గా పదిమీదికి చేరింది.

"గెల్చాం ! గడియారాన్ని, దానిని నమ్ముకొని బ్రతుకుతున్న వర్జ్యాన్ని కూడా గెలిచేశాం. హమ్మయ్య ! ఇన్నాళ్లకి భారం తీరిపోయింది. చివరికి నిన్ను చేరుకోవడానికి ఇష్టపడింది. ఎన్ని సంబంధాలు చూచాననుకొన్నావ్ ! పాపం ఆ కుర్ర వాళ్లందరూ మా సరళని చూచి ఇష్టపడ్డారు. కాని మా అమ్మాయి మాత్రం ప్రతిసారి వద్దన్నమాటే. ఆ తర్వాత ఆ కుర్రవాళ్ళ తల్లి తండ్రులు నాకు ఏవో నెపాలు పెట్టి ఉత్తరాలు వ్రాయుడం. అందుకే కిందటి సారి నుండి ఈ కొత్త పద్ధతి ప్రవేశపెట్టాను. ఒకరికి ఒకరు నచ్చింది లేనిది వెంటనే చెప్పించేస్తున్నాను. రిజల్టు ఆ వరుడే స్వయంగా వింటాడు. దానిని తనే వాళ్ళ ఇంటికి మోసుకు పోతాడు. తనకి అమ్మాయి నచ్చలేదని తల్లి తండ్రులతో చెప్తాడు. దానితో కుర్రవాని పరువు దక్కుతున్నది. నాకు ఉత్తర ప్రత్యుత్తరాల బాధ తప్పుతున్నది. అయితే ఈ సారైనా అమ్మాయికి నచ్చుతుందేమోనని నాకు ఆశ కలగడం సహజం కదూ. లేకలేక శుభ వార్త చివరికి వర్జ్యం వేళలో అమ్మాయి చాత చెప్పించవలసి వస్తుందేమో అని నా భయం. అందుకే కార్యక్రమం శరవేగంతో జరిపించ వలసి వచ్చింది" అని విపులంగా చెప్పారు రామయ్యగారు.

రామయ్యగారు లేచి చప్పట్లు చరుస్తూ గంతులు వెయ్యలేదు కాని అంత ఆనందంగానూ ఉన్నారు. ఆయన కళ్లు మిలమిల మెరిసి పోతున్నై.

"నువ్వు రైలుదిగి సరాసరి వచ్చి ఉంటే ఈ హడావడి లేక పోను" అన్నారు రామయ్యగారు మళ్లా.

"క్షమించండి. నేను—" అని చెప్పబోయాడు మూర్తి.

ఇంతలో రామయ్యగారి భార్య కాఫీ ఫలహారాలు తెచ్చి అక్కడ పెట్టింది. ఆమె ముఖంలోనూ సంతోష రేఖలు స్పష్టంగా కనబడుతున్నై.

"అవునవును ఏదో ఆటంకం వచ్చి ఉంటుంది. బహుశ ట్రెయిను లేటు అయి ఉంటుంది. అన్నట్టు మా సీతారామయ్యను నీకు పరిచయం చెయ్యాలి" అన్నారు రామయ్యగారు.

సీతారామయ్య ఎవరా అని మూర్తి నాలుగు వైపులా చూచాడు. ఎవరూ కనిపించలేదు.

రామయ్యగారు నవ్వారు. "తెల్లబోయి చూస్తున్నావేం ? ఇదిగో ఈ ఇడగారి పేరే సీతారామయ్య. ఇంటిపేరు లేని వాళ్లలాగ తమపేరు వెనక భర్తపేరు తగిలించుకోవడం ఇప్పుడు అందరికీ ఫాషన్ కదూ. మా ఆవిడ పేరు సీత. మరి నా పేరు రామయ్య. అందుచాత ఈమెను సీతారామయ్య అని పేరు పెట్టుకోమన్నాను. కాని ఆవిడకి నా సలహా ఇష్టపడడం లేదు" అన్నాడు.

"కొత్తవాళ్లు ఉన్నారనైనా లేకుండా ఏమిటా మాటలు" అన్నది సీతమ్మ ఓవైపు కోపం, ఇంకో వైపు నవ్వుతో.

6

పెళ్లికొడుకు బదులు మూర్తి ఎందుకు వచ్చాడో సరళకి బోధ పడలేదు. రావలసినది మూర్తి కాదని ఆమెకు స్పష్టంగా తెలుసును. ఆ వరుడి పేరు ఇంకేదో ఉన్నది. అతడి తండ్రి తన తండ్రి పేర వ్రాసిన ఉత్తరం సరళ చదివింది కూడా. మూర్తికి తండ్రి లేడని సరళకి ఇది వరకే తెలుసును. మరైతే మూర్తి ఎలా వచ్చినట్టు ? ఎందుకు వచ్చినట్టు ? ఏమీ తోచక ఆమె కిటికీ వద్ద నిలబడి వీధివైపు శూన్యంగా చూస్తూ నిలబడ్డది.

ఇంతలో తమ ఇంటిగేటు దాటి ఎవరో అబ్బాయి తమ ఇంటిలోకి రావడం సరళ చూసింది. ఆమెకు మెరుపులాగ వెంటనే చాలా వరకు సమస్య పరిష్కారం అయింది. ఆ వస్తున్నవాడే అసలు వరుడై ఉండాలి. మూర్తి ఇతడి కంటే ముందుగా రావడం తటస్థించింది. అయితే ఏ కారణంతో వచ్చాడో

తెలియదు. మూర్తే పెళ్ళికొడుకని ఆమె తండ్రి పొరబడి ఉండాలి. ఆ మాటే మూర్తి చెప్పబోతున్నట్లున్నది కూడా సరళ ఆలోచించింది. ఈ అవకాశం గూర విడచుకోకూడదు. మూర్తి తనని వివాహం చేసుకోవడానికి ఇష్టపడినట్లు తన చెవులతో విన్నది. తను కాస్త తెలివి తేటలతో ప్రవర్తించిందా చిరకాలం నుండి తన మనస్సులో ఉన్న కోర్కె ఈడేర వచ్చును. ఆమె వెంటనే నౌకరు వెంకయ్యని పిలిచింది. ఆ వచ్చినది ఎవరని అడిగింది.

"అయ్యగారితో ముఖ్యమైన పని ఉన్నదంటు టున్నాడమ్మా, పేరేమిటో చెప్పలేదు" అన్నాడు వెంకయ్య.

"అయ్యగారు ఎవరితోనో మాట్లాడుతున్నారని చెప్పు. అతడు వెళ్ళిపోతాడేమో చూడు. అంతగా కదలకపోతే హాలిట్లోనే కూర్చోపెట్టు. మేడమీదికి మాత్రం పంపించకు" అని చెప్పింది సరళ.

కథ ఏ విధంగా నడుస్తున్నదీ తెలుసుకోవడానికి రామయ్యగారు, మూర్తి, మాట్లాడుకొంటున్న గది ద్వారం వద్ద పొంచి నిలబడి వినడం మొదలెట్టింది సరళ. మూర్తి యధార్థం చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. అతడు చెప్పడానికి అవకాశం లేకుండా తండ్రి తన ధోరణితో అతడికి అంతరాయం కల్పిస్తున్నాడు. కాని మూర్తి ఎప్పటికైనా నిజం బయట పెట్టక తప్పదు. అప్పుడు తన తండ్రి మనస్సు ఎలాగ మారుతుందో చెప్పడం కష్టం. జరిగిన పొరపాటుకి క్షమాపణ చెప్పి మూర్తి వెళ్ళిపోవడానికి అవకాశం ఉన్నది. అలాగ జరిగిందా సరళ నిర్మించుకొన్న ఆశాసౌధం వెంటనే కూలిపోతుంది.

"కాఫీ తీసుకో. చల్లారి పోతుంది. ఆ తరువాత మాట్లాడుకోవచ్చును" అంటున్నారు రామయ్యగారు.

"నేను చెప్పింది మీరు ముందు వినాలి. అంతవరకు నేను కాఫీ తీసుకో దలచుకోలేదు" అన్నాడు మూర్తి దృఢనిశ్చయంతో.

సరళ నరాలన్నీ ఒక్కసారిగా బిగుసుకొన్నాయి. ఇక నిజం బయట పడే "క్రైసిస్" వస్తున్నది. ఈ సమయంలో ఏదో ఒకటి చేయకపోతే పరిస్థితి విషమించ వచ్చును. ఆమెకి వెంటనే ఒక ఆలోచన కలిగింది.

"నాన్నగారూ" అంటూ తన యావచ్ఛక్తిని వినియోగించి కేకవేసింది.

రామయ్యగారు, వారి భార్య ఖంగారుగా పరిగెత్తి వచ్చారు.

"ఏమమ్మా ? ఏమిటయింది ?" అని రామయ్య. గారు ప్రశ్నించారు నాలుగు వైపులు చూస్తూ.

"పెళ్ళికొడుకుల వద్ద నన్ను ప్రదర్శించడం ఇప్పటికైనా పూర్తి అయిందా ? ఇంకెవర్నైనా తీసుకు వస్తారా ?" అన్నది సరళ, లేని కటువుతనం ప్రదర్శిస్తూ.

"ఈ ప్రశ్న వేయడానికే అంత గట్టిగా పిల్చావటమ్మా. ఏమయి పోయిందో అని మేము హడలి పోయాం. పాపం ఆ కుర్రవాడు ఏదో చెప్తాంటే విన కుండా వచ్చాను. ఇంతకీ మీ రిద్దరూ ఇష్టపడ్డారు. ఇంకా ఇతర సంబంధాలు వెతికి నిన్ను చూపించ వలసిన అవసరం ఏమిటుంటుంది ?" అన్నారు రామయ్యగారు.

"అది కాదు. ఈ సంబంధం తప్పి పోవడానికి ఏవైనా ఆటంకాలు వస్తాయనుకోండి. వాటిని మీరు ఎదుర్కొంటారా ?" అని అడిగింది సరళ.

"నా ఆస్తి అంతా ధారపోసి అయినా ఈ సంబంధమే చేస్తాను. సరా ?" అన్నారు రామయ్యగారు.

"ఆ వచ్చినది మీరనుకొన్న అబ్బాయేనని నిర్ధారణ చేసుకొన్నారా ?" అని సరళ తిరిగి ప్రశ్నించింది.

"అతడిని ఈ రోజు పంపమని అతడి తండ్రికి వ్రాశాం. ఈ నాటికి ఇక్కడికి వెళ్ళమని కొడుకు పేర ఉత్తరం వ్రాసినట్లు అతడి తండ్రి మనకి ఉత్తరం వ్రాశాడు. ఇతడు వచ్చాడు. ఇంకా నిర్ధారణ ఏమిటి ? తనే పెళ్ళి కొడుకునంటూ ఇంకొకరు రావడం మొదలైనవి నువ్వు వ్రాసే పిచ్చి కథలలో తప్ప వాస్తవంగా జరగవు" అన్నది సరళ తల్లి.

"ఇంతకీ పోస్టు ఆఫీసు వాళ్ళలాగ అయిడెంటీ కార్డు చూపించమని అడగనా ? సాక్ష్యులని తీసుకు రమ్మంటావా ? పోనీ మనం అనుకొన్న అబ్బాయి అతడు కాడనుకో. మీరిద్దరూ ఇష్టపడ్డారు కాబట్టి అతడికే నిన్ను ఇచ్చి వివాహం చేస్తాను" అన్నారు రామయ్యగారు.

"అలాగని నా చేతిలో ఒట్టు వెయ్యండి" అన్నది సరళ.

"నా మాటపైన ఆ మాత్రం నమ్మకం లేదమ్మా ?" అన్నారు రామయ్యగారు.

"ఎంత చదువుకొన్న దానివైనా పెళ్ళి గురించి అంత నిర్మొగ మాటంగా మాట్లాడ కూడదు. మీ తండ్రి ఇంతవరకు ప్రతీది నీ ఇష్టప్రకారమే చేస్తూ వచ్చారు. ఇందులో సందేహం దేనికి ?" అన్నది సీతమ్మ.

"అబ్బాయిని ఒక్కడిని వదిలేసి వచ్చాం. బాగుండదు" అంటూ రామయ్యగారు తిరిగి మూర్తి వద్దకు వెళ్ళారు.

"అమ్మాయి అనవసరంగా ఖంగారెత్తించింది. ఇంతా చేస్తే ఏమీ లేదు. నువ్వు ఏదో చెప్పబోతున్నావ్ ? ఇప్పుడు చెప్పు ?" అన్నారు రామయ్యగారు కూర్చొంటూ.

"నేను మీ రనుకొంటున్న పెళ్ళి కొడుకుని కాను" అన్నాడు మూర్తి.

"ఏమిటీ ?" అన్నారు రామయ్యగారు త్రుళ్ళిపడి.

"నేను మీ ఇంట్లో అనుకోకుండా ప్రవేశించవలసి వచ్చింది. దానికి కారణం ఇది" అంటూ జరిగిన దంతా చెప్పాడు మూర్తి, తన స్వీయ చరిత్రతో సహా.

రామయ్యగారు కొన్ని క్షణాలు మౌనం వహించారు.

"నీకు ఇంతవరకు పెళ్ళికాలేదని, నువ్వు మా అమ్మాయిని వివాహం చేసుకోవడానికి ఇష్టపడ్డావని నీ మాటల వలన నాకు అర్థం అయింది. నిజమేనా ?" అన్నారు చివరికి.

"రెండూ నిజమే" అన్నాడు మూర్తి.

"ఇది వరకు మా అమ్మాయి నిన్ను ఎప్పుడైనా చూచిందా ?" అన్నారు రామయ్యగారు.


"నేను బి. య్యే. చదువుతున్న రోజులలో ఆమె పి. యు. సి. చదివేది. అప్పుడు కాస్త పరిచయం ఉండేది" అన్నాడు మూర్తి.

అదీ సంగతి అనుకొన్నారు రామయ్యగారు.

"నువ్వు మా అమ్మాయిని చేసుకోవడానికి మీ తల్లిగారు ఇష్టపడతారా ?" అని రామయ్యగారు మళ్ళీ ప్రశ్నించారు.

"నేను ఇష్టపడిన అమ్మాయిని నాకు వివాహం చెయ్యాలనే ఆమె అభిలాష" అన్నాడు మూర్తి.

గది ద్వారం వద్ద నిలబడి వింటున్న సరళ కళ్ళు ఆనందంతో నిండినై.



వర్జ్యం

"ఇక నే నెవరినో నా స్థితిగతులు ఎటువంటివో చెప్తాను. విను" అంటూ రామయ్యగారు తన గురించి తన కుటుంబం గురించి వివరాలన్నీ చెప్పారు.

అది వరకే ఎందుకో మేడదిగి వెళ్లిన సీతమ్మ గారు అప్పుడే తిరిగి వచ్చారు.

"ఇదిగో, ఓ చిత్రం జరిగింది. ఇతడు మనం అనుకొన్న అబ్బాయి కాడు. కాని మన అదృష్టం కొద్దీ అంతకంటే ఎక్కువ యోగ్యత కలవాడు. ఏమిటి జరిగిందో తెలుసా ?" అంటూ కథంతా రామయ్యగారు ఆమెతో చెప్పారు.

అంతా విన్నది సీతమ్మ. "అలాగా, చాలా సంతోషం. అన్నట్టు చావిట్లో ఎవరో అబ్బాయి మీ కోసం నిరీక్షిస్తూ కూర్చొన్నాడు. బహుశ ఆ మొదట అనుకొన్న కుర్రాడేమో" అన్నది ఆమె.

"అరే ! చివరికి వచ్చాడన్న మాట. పాపం టూ లేట్. ఆ మాట అతడితో చెప్దాం— పదండి" అంటూ రామయ్యగారు లేచారు.

మేడమీది బృందం అంతా మెట్లు దిగి కిందకి వచ్చారు.

"దొంగా, నా కంతా తెలిసిపోయిందిలే" అన్నారు రామయ్యగారు సరళతో— ఎవరూ వినకుండా, తోవలో.

సరళ నవ్వుతూ సిగ్గుతో తల దించుకొన్నది.

"నీకు గాని మీ కుటుంబంలో ఎవరికైనా గాని క్షయ, కేన్సరు, ఉన్మాదం— మొదలైన రోగాలు ఏవైనా కొన్నిగాని, అన్నీగాని ఎప్పుడైనా వచ్చాయా ?" అంటూ చావిట్లోంచి వినబడింది.

మూర్తి హడలి పోయాడు. ఆ కంఠస్వరం ఎవరిదో అతడికి తెలుసును. తిరిగి మేడ మీదికి పారిపోదా మనుకొన్నాడు. కాని తన వెనక సరళ, ఆమె తల్లి కూడా "సింగిల్ ఫైల్"లో వస్తూండడం మూలాన్న అది సాధ్య పడలేదు. అందరితో బాటు మూర్తి కూడా చావిట్లోకి రాక తప్పింది కాదు.

"హల్లో భీమారావ్ ! నేను ఇక్కడికి రావడం నువ్వు చూశావన్న మాట" అని మూర్తే తెగించి ముందు పలకరించాడు.

"ఎవరది— మూర్తి ! ఎప్పుడు వచ్చావ్ ? నువ్వు రావడం నేను చూడలేదే. నేను ఇక్కడికి రావడానికి కారణం కేవలం వైవాహికం. వీరి అమ్మాయిని చూడడానికి వచ్చాను. వీరే రామయ్యగారనుకొంటాను— నమస్కారం, ముందు చేతిలో పని పూర్తి చేద్దాం. ఈ ప్రపోజలు పైన సాక్షి సంతకం చెయ్యండి" అన్నాడు భీమారావు, రామయ్యగారి చేతికి కాగితం అందిస్తూ.

"భీమారావంటే నువ్వే అనుకొంటాను. నమస్కారం. నేనే రామయ్యని. ఈమె నా కుమార్తె సరళ— ఇప్పుడు పెళ్లి కావలసింది ఈమెకే. ఈమె నా భార్య, పేరు సీతా—"

"నా పేరు సీతమ్మ" అన్నది ఆమె ఖచ్చితంగా

"నమస్కారం. ఒక్క క్షణం క్షమించండి. రామయ్యగారూ ! మీ చేతిలో ఉన్న కాగితం వెంకయ్య తన జీవితం వెయ్యి రూపాయలకి భీమా చేస్తున్న దరఖాస్తు ఫారం. నేను వచ్చేసరికి మీరెవరితోనో మాట్లాడుతున్నారని ఇతడు చెప్పాడు. మీరు వచ్చేవరకు కాలం వ్యర్థం చెయ్యడం ఎందుకని ఈ వెంకయ్యకి జీవిత భీమా గురించి చెప్పాను. అతడిని ఒప్పించాను. ఇదిగో ఇక్కడ సంతకం చెయ్యండి— అంతె" అంటూ భీమారావు కాగితాన్ని తన వేలెట్‌లో భద్ర పరిచాడు.

"నువ్వు చాలా ఘటికుడివి. ఎక్కడకి వెళ్లినా బిజినెస్ సంపాదిస్తావు" అన్నాడు మూర్తి.

"ఏం చెయ్యమంటావు చెప్పు. ఇదంతా మా ఏజంట్లు చెయ్యవలసిన పని. వాళ్ళు ఇళ్లు కదలరు. బిజినెస్ కావడం లేదని పై నుండి మా డివిజనల్ మేనేజరు నన్ను దంచుతాడు. అందుచాత దరఖాస్తు ఫారాలు కూడా నేనే నింపించ వలసి వస్తున్నది" అన్నాడు భీమారావు.

"రెండు ఘంటలు కాకుండా మా ఇంటికి రమ్మని మీ నాన్నగారు నీకు వ్రాయలేదా ఇంత ఆలస్యంగా వచ్చావేం ?" అన్నారు రామయ్యగారు.

"వ్రాశారండి. అలాగే వస్తున్నాను కూడా ఈ లోగా తెలిసిన ముఖం ఒకటి ఎదురైంది అతడు ఒక అయిదు వేల రూపాయలకి ప్రపోజల ఇచ్చాడు. దానితో ఆలస్యం అయిపోయింది.' అన్నాడు భీమారావు.

"నువ్వు రాలేదని ఈ మూర్తికి మా అమ్మాయిని ఇచ్చి వివాహం చెయ్యాలని ఈలోగా మేము నిశ్చయించాం" అని చెప్పారు రామయ్యగారు.

"ఓ ఇకనేం ! చాలా సంతోషం. నా ముఖ్య స్నేహితుడు మూర్తి అయితేనేం—నే నయితేనేం?' అంటూ భీమారావు మూర్తి వైపు తిరిగాడు "ఇవ్వాళ ఇంటర్‌వ్యూలో అసిస్టెంటు లెక్చరర్‌గ సెలక్టయ్యావట కదూ—రెండు శుభవార్తలకి చాల సంతోషం" అన్నాడు భీమారావు.

"అప్పుడే నీకెలా తెలిసింది ?" అని అడిగాడు మూర్తి ఆశ్చర్యంగా.

"మాకు ఇటువంటి విషయాలు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంటాయి. మీ ఉద్యోగాల పైన ఆధారపడి ఉంటాయి మా ఉద్యోగాలు. అన్నట్టు ఈమెను ఇదివరకు ఎక్కడో చూసినట్టున్నదే" అంటూ భీమారావు సరళ వైపు తిరిగాడు.

"మనం బి. య్యే చదువుతున్నప్పుడు ఈమె పి. యు. సి. చదివేది" అని మూర్తి "భీమారావు నీకు గుర్తు ఉన్నాడా ?" అని సరళని ప్రశ్నించాడు.

"నాకు జ్ఞాపకంలేదు" అన్నది సరళ.

"అవును. అప్పటి భీమారావుకి ఇప్పటి భీమారావుకి చాలా వ్యత్యాసం ఉన్నది. అప్పటి భీమారావు ఎవరికి జ్ఞాపకం ఉండదు. అప్పుడు మేక. ఇప్పుడు పెద్ద పులి అయిపోయాడు" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"ఈ శుభ సమయాన సంతోషంగా ఉందామంటే నా మనస్సులో ఒక్క వెలితి మాత్రం బాధిస్తున్నది" అన్నాడు భీమారావు.

"ఏమిటది ?" అన్నాడు మూర్తి, రామయ్యగారు, ఏక కంఠంతో.

"మూర్తి ఇంతవరకు భీమా చెయ్యకుండా తప్పించుకొంటున్నాడు. ఈ రోజున ఇతడికి ఉద్యోగం, వివాహం కూడా స్థిరపడ్డాయి. ఇతడి పేర పది వేల రూపాయలకి ఒక్క ప్రపోజలు ఇచ్చాడా"

"ఏమిటీ ? పదివేల రూపాయలే ? అంత ప్రీమియం నేను చెల్లించ గలనా " అన్నాడు మూర్తి.

"పదివేలేమిటోయ్ వెర్రివాడా, పాతికవేల రూపాయలకి ప్రపోజలు వ్రాయి. ప్రీమియాలు కట్టడానికి సరిపోయేటంత వడ్డీ వచ్చే సొమ్ము నేను అమ్మాయి పేర ఫిక్సెడ్ డిపోజిట్ చేస్తాను. మంచి ముహూర్తం చూచి మీ ఫ్రెండు చాత దరఖాస్తు ఫారం నింపించు. పాలసీ మాత్రం పెళ్లి నాటికి వచ్చేటట్టు ఏర్పాటు చెయ్యి. ఇప్పుడు కట్నాలు ఇవ్వకూడదు కదూ. పెళ్లి పీటలపైన ఇతడికి ఆ పాలసీనే బహూకరిస్తాను" అన్నారు రామయ్యగారు నవ్వుతూ. ★



"జీవితంమీద విరక్తిపుట్టి ఆ కరెంటు తీగలు ముట్టుకొని చద్దామనుకున్నారా! తీరా వెళ్తే అక్కడ కరెంటు తీగలు ముట్టుకొంటే శిక్షిస్తారని రాసుంది."

కూలిన గోడలు

26 వ పేజీ తరువాయి

సించి ఉన్నాయి—దేవతల్లాగ అత్యంత సుందరంగా ఉన్న శ్యామ సుందరీ దేవిని అలా ఎన్ని గంటలైనా చూడ గలడు మధు.

రావలసిన పేరంటాళ్ళంతా ఎప్పుడో వచ్చి వెళ్ళి పోయిన గుర్తులు కన్పించాయి. తివాచీ మీద ఒలికిన అక్షింతలూ పూరేకులూ ఒక దాసీ నెమ్మదిగా ఎత్తుతోంది. శ్యామసుందరీదేవి మేజా మీది వెండి పళ్ళెంలోంచి బంగారు కుంకుమ భరిణె అందుకొని సుందరమ్మ గారికి స్వయంగా బొట్టు పెట్టింది.

"మేము రావటం బాగా ఆలశ్యమైందమ్మా !" అంది సుందరమ్మగారు నొచ్చు కుంటున్నట్టు.

"లేదు పిన్నిగారూ ! మేనా ఆలశ్యంగానే పంపించాము. నిలబడే ఉన్నారు. అలా కూర్చోండి." అంటూ కుర్చీలు చూపించింది శ్యామసుందరీ దేవి.

"ఫర్వాలేదు తల్లీ !" అంటూ సుందరమ్మగారు మనవణ్ణి దగ్గిర పెట్టుకొని తివాచీ మీదే కూర్చుంది. కుంకుమ భరిణె యధాస్థానంలో సర్ది వెనుదిరిగి శ్యామసుందరీ దేవి— "అదేమమ్మా క్రింద కూర్చున్నారు ? మీ పట్టింపులు మీరు మానరుకదా ?" అంటూ తాను కూడా సుందరమ్మగారికి ఎదురుగా కూర్చుంది. వచ్చిన మొదలు కన్నార్పకుండా తననే చూస్తూన్న మధూని నవ్వుతూ పలకరించింది—

"ఏమిటయ్యా అలా చూస్తూన్నావు ? కొత్తగా ఉందా ?"

మధూ సిగ్గుపడి తల దించేసుకున్నాడు.

"నీ పేరేమిటయ్యా ?"

మధు కొంచెం ధైర్యం తెచ్చుకున్నాడు. "మధుసూదనరావు."

"తల దించుకునే మాట్లాడుతున్నావేం ?" నవ్వింది శ్యామసుందరీదేవి.— "నీ పేరు ఎంతో చక్కగా ఉంది. మరి ఏం చదువుకొంటున్నావు ?"

మధూ కొంచెం తల ఎత్తాడు— "రెండో తరగతి."

"అబ్బా ! అప్పుడే రెండో తరగతి చదివేస్తున్నావా ? బావుంది. నీకేమైనా పాటలవీ వచ్చునా ?"

"నాకు బాగారావు. మా అన్నయ్య కైతే ఎన్నో వచ్చు."

"పోనీ ! నువ్వుకూడా నేర్చుకో."

"ఏం నేర్చుకోవటం తల్లీ ? దిగులుతో ఆడుకోవటం కూడా మానేశాడు. ఎప్పుడూ అమ్మా అమ్మా అంటూ ఒకటే ఏడుపు." అంది సుందరమ్మగారు.

"అవునట పిన్నిగారూ ! మేమూ విన్నాము. ఈ వయస్సులో మీకు తీరని కష్టం వచ్చింది. విన్నవారికే విచారం కలుగుతోంది కదా ?" శ్యామసుందరీదేవి సానుభూతితో సుందరమ్మగారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి— "తల్లి పోతే మాత్రం లక్షణంగా బ్రతికే వాళ్ళు ఎంత మంది లేరు తల్లీ ? తండ్రి పరారీ కావటం— ఆస్తిపాస్తులు అమ్ముడు పోవటం చూస్తూండగానే పసివాళ్ళు అనాధలై పోయారమ్మా !"

"విచారించకండి పిన్నిగారూ ! మీరు ఉండగా పిల్లలు అనాథలెందు కవుతారు ? భగవంతుడి నిర్ణయాలను మనం మార్చలేముకదండీ ? మీ రిద్దరూ పది కాకాలపాటు చల్లగా ఉండి పిల్లల్ని పెంచి పెద్ద జేస్తే మంచి చదువులు చదువుకొని ఉద్యోగాలు చేసుకుంటారు. ఆస్థి పాస్తులకే కేమిలెండి. ఉండనూ ఉంటాయి. పోనూ పోతాయి."

"అలాగే ఆలోచించి కాస్త గుండె నిబ్బరం చేసుకున్నాను తల్లీ ! పిల్ల తాతగారు మాత్రం లోలోపల కృశించి పోతున్నారు."

"పాపం పెద్దవారు ! ఈ వయస్సులో ఏది జరిగినా కష్టమే. వారికి మీరే ధైర్యం చెప్పాలి పిన్నిగారూ !"

తల్లి ప్రసక్తి రావటంతో మధూ మొహంలో విచారం అలుముకొంది.

"చంటిపాప క్షేమమేకదా పిన్నిగారూ ?" సుందరమ్మగారు దిగులుగా అంది— "క్షేమంగానే ఉందమ్మా దౌర్భాగ్యురాలు. ఏం సుఖపడాలనో తల్లిని చంపి పుట్టింది. స్వగ్రామంలో మా రెండో అమ్మాయీ, కోడళ్ళూ ఉన్నారు కదమ్మా ! అక్కడే దిగ విడిచి వచ్చాము. ఈ చిన్నవాడిని మరిపించటానికే ఇంత తొందరగా రావలసి వచ్చింది. ఎక్కడ ఉన్నా ఒక్కటేలాగే ఉంది. వీడికి ఆలోచనలు ఎక్కువమ్మా !"

బిక్కమొహం వేసుకొని దిగాలుగా పడి కూర్చున్న మధుని చూస్తోంటే శ్యామసుందరీ దేవి మనస్సు కలచినట్టయింది— "అవును పిన్నిగారూ ! వూహ తెలుస్తూన్న వయసులో తల్లిదండ్రుల్ని మర్చిపోవటం అంత తేలిక కాదుకదండీ." ద్వారం బయట నిలబడి ఉన్న దాసీని పిలిచి— "అమ్మాయిల్ని తీసుకురా మళ్లీ ?" అంది శ్యామసుందరీ

కూలిన గోడలు

దేవి. తిరిగి సుందరమ్మగారి వైపు చూస్తూ— "మధు బాబుని ఇక్కడికి పంపిస్తూ ఉండండి పిన్నిగారూ ! మా అమ్మాయిలతో ఆడుకొంటూ కొంచెం దిగులైనా మర్చిపోతాడు." అంది.

ఇద్దరు ఆడపిల్లలు గదిలోకి వస్తూ సుందరమ్మగారికి నమస్కరించి తల్లి పక్కన కూర్చున్నారు. శ్యామసుందరీదేవి పిల్లలిద్దరితోనూ చెప్పింది— "రేపటి నుంచి ఈ బాబు మన ఇంటికి వస్తాడు. మీతోబాటు తోటలోకి తీసుకు వెళ్లి ఆడుకోవాలి. తెలిసిందా ?"

"అలాగేనమ్మా !" అంది పెద్దమ్మాయి.

ఆ పిల్లల్ని చూసినా మధూకి చాల ఆశ్చర్యం కలిగింది. ఇద్దరూ ఒకేరంగు సిల్కు పరికిణీలూ రవికెలూ కట్టుకున్నారు. జడల పొడుగునా పువ్వులు కట్టుకున్నారు. ఒంటినిండా నగలు పెట్టుకొని కథల్లో రాజకుమార్తెల్లాగ ఉన్నారు.

చిన్నమ్మాయి నెమ్మదిగా తల్లినేవో అడిగింది. శ్యామసుందరీదేవి నవ్వుతూ— "నేను చెప్పటం దేనికి ? నువ్వే అడగరాదూ ?" అంది ఆ పిల్ల సిగ్గుపడకుండా మధుకేసి చూస్తూ— "నాపేరు రాగిణీరాణి, నీ పేరేమిటి ?" అంది.

మధూ సిగ్గుతో తల తిప్పేసుకున్నాడు. శ్యామసుందరీదేవి మధు తలమీద చేయివేస్తూ అంది "ఆడపిల్ల సిగ్గులేకుండా మాట్లాడితే నీకు సిగ్గెందుకు బాబూ ? నువ్వు మగపిల్లవాడివి కదూ ? ధైర్యంగా చక్కగా మాట్లాడాలి. మరి నీ పేరు చెప్పు"

మధు రాగిణివైపు చూస్తూ అన్నాడు— "నా పేరు మధుసూదనరావు. మా అన్నయ్య పేరు సూర్యారావు.

శ్యామసుందరీదేవి నవ్వింది— "అబ్బో ! బాగా ధైర్యం తెచ్చుకున్నావే ! ఇదిగో ! పెద్ద అమ్మాయి పేరు పద్మావతీదేవి. నువ్వు మీ తాతగారితో కలిసి రోజూ ఇక్కడికి వస్తే మీరు ముగ్గురూ కలిసి ఆడుకోవచ్చు. వస్తావుకదూ ?"

మధుకి ఏమీ అర్థం కాలేదు. అంత గొప్పగా ఉన్న ఆ అమ్మాయిలతో తను ఎలా ఆడుకుంటాడు ? సంతోషం మాత్రం మితిమీరింది. అంత అందమైన అమ్మాయి లిద్దరూ తనని ఆడుకోటానికి రానిస్తే. . . ! ఎంత బావుంటుందని !"

"ఎందుకమ్మా మీకు శ్రమ ? వీడసలే తుడుకువాడు. నానా అల్లరీ చేస్తాడు." సుందరమ్మగారు అన్నదానికి "అయ్యో ! అదేమిటి పిన్నిగారూ ? అల్లరి పిల్లలు చెయ్యకపోతే మనం చేస్తామా ?" అంటూ నవ్వింది శ్యామసుందరీదేవి. అంతలో దాసి కొన్ని ప్లేట్లలతో రకరకాల మిఠాయిలు తెచ్చి అమర్చింది. లడ్డులూ జిలేబిలూ చూస్తోంటే మధూ హృదయంలో తండ్రి మెదిలాడు. తండ్రి బస్తీనుంచి తెచ్చే మిఠాయిలు సంచుల్లో వేసుకొని బళ్లోకి తీసుకు వెళ్లి గొప్పగా స్నేహితులందరికీ పంచటం గుర్తు వచ్చింది. ఒకసారి మేష్టారికి కూడా లడ్డులు ఇచ్చాడు మధు.

"తినవేమోయ్ ? సిగ్గు పడుతున్నావా ?" శ్యామసుందరీదేవి ఎంత అనునయించినా మధూ ఎక్కువ తినలేక పోయాడు. తిన్నాననిపించింది. సుందరమ్మగారు— తిరిగి వెళ్లటానికి సిద్ధమైతే మేడదిగి వచ్చింది జమిందారిణి. ఏవేవో తినుబండారాలూ పళ్లూ పసుపు కుంకుమలూ అన్నీ పెద్ద బుట్టలో మేనాలో పెట్టించింది.

ఎన్నిరోజులైనా అక్కడే ఉండిపోతే బావుండుననిపించింది మధుకి. తిరిగి వచ్చేస్తూంటే— "అమ్మమ్మా ! నేను రోజూ వచ్చి ఆడుకుంటానే," అన్నాడు ఆశగా, "అలాగే" అంది సుందరమ్మగారు పొడిగా. జమిందారిణిని చూసినప్పటి నుంచి మధూ మనసు ఎన్నో ఆలోచనలు చెలరేగుతున్నాయి.

"అమ్మమ్మా ! ఆ అమ్మగారికి అన్ని బంగారం నగలు ఎక్కడివి ?"

"ఆవిడకే ఉన్నాయమ్మా !"

"మరి నీకు లేవేం ?"

"వారు చాలా ధనవంతులు. డబ్బు చాలా ఉంది. అందుకే నగలు చేయించుకున్నారు. మనకు అంత డబ్బు ఎక్కడిది ?"

"మరి వాళ్లకు మాత్రం ఎక్కడిది ?"

"మొదట నుంచీ జమిందారు గారి నాన్నగారూ తాతగారూ అంతా సంపాదించి ఇచ్చారు."

"మనకు ఎవ్వరూ ఇవ్వలేదా ?"

సుందరమ్మగారు జవాబు చెప్పలేక పోయింది. మాట మారుస్తూ— "ఇక్కడ ఆడు కోటానికి వస్తే అల్లరి చెయ్యకూడదు సుమా ! బుద్ధిగా ఉంటే రోజూ రానిస్తారు." అనటంతో ఉత్సాహంగా తల వూపాడు మధు.

* * *

పద్మావతీ రాగిణీలతో కలిసి మధు తోటలోకి వచ్చాడు. జమిందారుల తోటను చూస్తోంటే మధుకి విస్మయం కలిగింది. తాతగారి వూళ్లో కూడా తోట వుందిగాని యిన్నిరకాల చెట్లతో



"ఈ విశాల జగత్తులో అందరూ వెతికేది ఆ పరమజ్యోతికోసమే కదా నాయనా ! ... నీకు త్వరలోనే లభించునుగాక...!"

యింత పెద్దదిగా లేదు. ఇక్కడి తోటనిండా మామిడి—పనస—నారింజ—బత్తాయి— నిమ్మ— దానిమ్మ—జామ—సపోటా అన్నిరకాల పళ్ళచెట్లూ విడివిడిగా ఉన్నాయి. చెట్ల క్రింద నడుస్తూ తెలీనివల్లా అడగటం ప్రారంభించాడు మధు. "ఈ చెట్టు పేరేమిటి ? అక్కడ ఉన్న స్తంభం అదేమిటి ? ఈ కొమ్మ ఎందుకు విరిగింది ?"— మధు అడిగే దానికి అక్కచెల్లెళ్ళిద్దరూ పోటీ పడ్డట్టు సంశయాలు తీర్చసాగారు. ఒక్కోసారి మధూ అడగకుండానే— ఇదిగో ఇది జంబూ ములగ. అది అన్నూరం. దాని పక్కనే చూశావా గులాబ్‌జామ్. . . ఎంతో బావుంటుందిలే." అంటూ వివరించారు.

స్తంభాల నిండా అల్లుకున్న ద్రాక్ష తీగల దగ్గర ఆగిపోతూ పద్మావతి అంది— ఎప్పుడైనా ఈ పళ్ళు చూశావా మధు బాబూ ?"

మధు అడ్డంగా తల వూపాడు. ద్రాక్షపళ్ళు తిన్నాడు గాని ఇంతింత గుత్తులుగా వ్రేళ్ళాడటం చూసి ఉండలేదు. విస్మయంగా ద్రాక్ష గుత్తుల కేసి చూస్తూ అన్నాడు— నేను ద్రాక్ష పళ్ళు చాలాసార్లు తిన్నాను."

"మీ ఇంట్లో ఉన్నాయా ?" రాగిణి అడిగింది.

"లేకపోతేనేం ? మా నాన్న బస్తీ నుంచి తెచ్చే వాడుకదా ?

"మీ నాన్నగారు ఇప్పుడు లేరుకదూ ?"

"పోనీ ! మా తాతయ్య లేడా ఏమిటి ?"

"పాపం మీ అమ్మగారు చచ్చిపోయారట కదూ ?"

మధూ అదోమాదిరిగా మారిపోయాడు పద్మావతి చెల్లెల్ని మందలించింది— "తప్పు కదూ ? అటువంటి మాటలేవీ అడగవద్దని అమ్మ చెప్పలేదూ ? రా మధుబాబూ ! ఒకటి చూపిస్తాను." అంటూ మధు చెయ్యి పట్టుకొంది. రాగిణి మాటలతో కుంచించుకు పోయిన మధు కొంత తేరుకొని పద్మావతితో పాటు నడిచాడు. రంధ్రాలలోంచి చుట్టూ నీరు చిమ్ముతున్న జల యంత్రాన్ని చూస్తూ దిగులు మర్చి సంతోషంగా నీళ్ల ధారలలోకి చేతులు జాపాడు.

"దీన్ని ఫౌంటెన్ అంటారు. మీ ఇంట్లో లేదు కదూ ?" అంది రాగిణి పసితనపు అతిశయంతో

"ఫౌంటెన్" మధు మననం చేసుకున్నాడు.

"కాస్సేపు కూర్చుందామా మధుబాబూ ?" అడిగింది పద్మావతి. ఒక దాసీని పిలిచి ద్రాక్ష గుత్తులు కోయించింది. తోటలో చెట్లకి ఏవో పళ్ళు ఉండనే ఉన్నాయి. ద్రాక్ష పళ్ళు అందిస్తూ ఇంకేం కావాలో తరిచి తరిచి అడిగి మధుకోరిన వన్నీ కోయించింది. అన్ని పళ్ల చెట్లూ తన చుట్టూ ఉండి కావాలన్న పళ్లన్నీ కోసుకుతినేస్తుంటే— "మాంత్రికుడూ— మామిడి చెట్టూ" కథలా చిత్రంగా ఉంది మధుకి.

"ఇక పూలతోటవైపు వెళ్దామా ?"

"ఎక్కడ ?"

"అదిగో, అటువైపు, నీకు పువ్వులంటే ఇష్టమేనా ?"

"నేను పెట్టుకోనుగా ?"

"పోనీ వూరికనే చూద్దాం." రాగిణి ముందే పరిగెత్తింది. ఆ తోట మధ్య నడుస్తుంటే మధూ కళ్లు చెదిరి విభ్రాంతి పడ్డాడు— "అబ్బ ! ఎన్ని పువ్వులో ! ఎన్నిరంగులో!" అంటూ సంభ్రమంగా చూశాడు రాగిణి కేసి.

"నువ్వు ఎప్పుడూ చూడలా ?"

రంగురంగుల గులాబీలూ— చేమంతులు— మందారాలు ఒక్కోరకం పువ్వులే అనేక రంగుల్లో మెరిసిపోతున్నాయి. మధు ఎన్నడూ చూడని పువ్వులే ఎక్కువగా ఉన్నాయి. "ఈ మందారం ఏమిటి? ఇంత పెద్దదిగా ఉంది ?"

"ఆ నీలం పువ్వుల పేరేమిటి ?"

"చేమంతి పూలు మరీ ఇంత బుల్లిగా ఉన్నాయేం ?" మధుబాబుకి చాలా సందేహాలు వచ్చాయి.

"తొందరగా నడు మధు బాబూ ! ఇంకా కొత్త పువ్వులు చూపిస్తాను. పారిజాతం పువ్వులు చూశావు కదూ అక్కడ ?"

నడుస్తూ నడుస్తూ తెల్లగులాబీల దగ్గర ఆగి పోయాడు మధు. ఆ పువ్వులు శ్యామ సుందరీ దేవి పెట్టుకున్నప్పుడు మధుకి ఎంతో నచ్చాయి.

"ఒక గులాబీ నేను కోసుకోనా ?" పద్మావతిని చూస్తూ సంకోచంగా అడిగాడు.

యువతి : జన్మజన్మలకీ మిమ్మల్నే భర్తగా పొందాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

యువకుడు : ముందు జన్మల సంగతేమోగానీ ఈ జన్మలో మీ నాన్నొప్పుకోడు గదా !

మాధవ్ (తెనాలి)

"నువ్వు పువ్వులు పెట్టుకోవుగా ?" ఆశ్చర్యంగా చూసింది రాగిణి.

"వూరికే చేతిలో పట్టుకుంటాను." ఆశగా అన్నాడు మధు.

"కోసుకో మధుబాబూ ! జాగ్రత్త ముళ్లు ఉంటాయి."— పద్మావతి అనుమతి ఇవ్వగానే మధు మొహం సంతోషంతో వికసించింది. ఒక పెద్ద పువ్వు కోసుకున్నాడు.

"ఇంకా కావాలా ?"

"వద్దు, ఈ ఒక్కటీ చాలు."

తోటంతా చాలాసేపు తిరిగాక విసుగ్గా అంది రాగిణి.

"ఏదేనా ఆడుకుందామే అక్కా !"

పద్మావతికి ఆడుకోవాలనిపించింది. "మధు బాబూ ! నీకేవేనా ఆటలు వచ్చునా ?"

"ఓ బోలెడు వచ్చు. బొంగరాలూ, గోళీ కాయలూ గూటీ బిళ్లలూ గాలిపడగలూ. . ."

"ముందు బొంగరాలాట ఆడు. చూద్దాం." కుతూహలంగా అంది రాగిణి.

"చెక్క బొంగరాలా ? మట్టి బొంగరాలా ?" తీవిగా ప్రశ్నించాడు మధు.

"మట్టివి కూడా ఉంటాయేమిటి ? భలేఉందే ! అవి ఎలా ఆడటం ?"

తను కూడా వాళ్లకు ఓ విషయం చెప్ప గగాడన్న మాట. మధుకి గర్వం కలిగింది— "మట్టి బొంగరాలే తెలీవూ ? అవి నేను ఎంతో చక్కగా చెయ్యగలను. బాగా తిప్పగలను కూడా. అదిగో. ఆ గులాబీ మొక్క కింద మట్టి బొంగరాలకు బాగా ఉంటుంది." రివ్వున పరిగెత్తుకు వెళ్లి దోసెడు మట్టి తీసుకువస్తూ అరిచాడు. "నీళ్లు కావాలి నీళ్లు."

"అయితే ఫౌంటెన్ దగ్గరే కూర్చుందాం."

"సరే ! పదండి."

"ఇంకా ఏం కావాలి ?"

"గట్టి చీపురు పుల్లలూ— రంగు కాయితాలూ కాకిబంగారం రేకులూ. . . మరి ఎక్కడున్నాయి ?"

"ఇప్పుడే చెప్పేస్తాను." రాగిణి పరిగెత్తుకు వెళ్లి అన్నిటికీ ఆజ్ఞాపించి వచ్చింది. మధు మట్టి నీళ్లతో తడిపి మెత్తగా ముద్ద చేశాడు.

"దీన్ని చిన్నచిన్న ఉండలు చెయ్యాలి."

"దాసీని పిలవనా ? చేస్తుంది."

"వద్దు. మనమే చేసుకోవాలి. దాసీది ఆడుకొంటుందా ఏమిటి ? ఇదిగో, ఇలా గోళీకాయల్లా చేయండి." పద్మావతి, రాగిణీ రాణీ ఉత్సాహంగా గానే మట్టి ఉండలు చేశారు.

"సరేనా ? ఇప్పుడు చూడండి."

మధు ఉండలన్నీ రూపాయి బిళ్లల్లా వత్తాడు. వాటి మధ్య నుంచి పొడుగ్గా చీపురు పుల్లలు గుచ్చాడు. మట్టి కన్పించకుండా అడుగున రంగ కాయితాలూ పైన కాకిబంగారం రేకులూ అంటించాడు. పావు గంటకల్లా డజను బొంగరాలు తయారయ్యాయి. తళతళ లాడుతూ ముచ్చటగ మెరిసిపోయాయి.

"ఇప్పుడు ఎవరి బొంగరం ఎక్కువ సేపు తిరుగుతుందో పోటీ వేసుకోవాలి." ఒక బొంగరం తీసి గిర్రున తిప్పి ఫౌంటెన్ గట్టు మీద వదిలాడు. అది గిర్రున తిరుగుతూ చాలసేపు పడకుండా ఉండి పోయింది. రాగిణి కూడా హుషారుగా బొంగరం తిప్పింది. వదిలింది వదిలి నట్టే పడి పోయింది. "నాకు సరిగ్గా నేర్పవు మధు బాబూ !" అంటూ ప్రాధేయ పడింది. బొంగరం తెచ్చుకొని. పద్మావతి విడిచిన బొంగరం దొర్లి వెళ్లి ఫౌంటెన్ నీటిలో పడిపోయింది. ఇంకోటి తీసి ఇస్తూ— "ఇదిగో, ఇలా పట్టుకొని ఇలా తిప్పాలి." అంటూ మెళుకువలు బోధించాడు మధు. పద్మావతీ, రాగిణీ బొంగరాలు మళ్ళీ మళ్ళీ తిప్పారు. తిప్పటం వచ్చేంతవరకూ ఆడారు. రాగిణి బొంగరాలు నాలుగూ పద్మావతివి, రెండూ విరిగి పోయాయి. మధు తన దగ్గిర ఉన్నవి ఇద్దరికీ ఇచ్చేశాడు. అంతలో దాసి వచ్చి— "అమ్మగారు వచ్చెయ్యమంటున్నారమ్మా !" అంది.

"అబ్బాయిగార్ని కూడా లోపలికి తీసుకు రమ్మన్నారమ్మా ! ఫలహారం చేసి వెళ్తారు." అంది మళ్లీ.

"ఇంట్లోకిరా మధుబాబూ ! దాసీతో జాగ్రత్తగా పంపిస్తాము." అంది పద్మావతి. మధు ఆటలాడిన దర్జా మర్చిపోయి సిగ్గుగా వాళ్ల వెనకే నడిచాడు.

(సశేషం)

నాగుండెదడ ఎక్కువైంది. చొక్కా వేసుకుని పరుగెత్తాను.

జోసెఫ్ యింటి ముందర చాలామంది పోగయి ఉన్నారు. తోసుకొని లోపలకు వెళ్ళాను. ఆ దృశ్యం చూస్తూనే నిశ్చేష్టుణ్ణయ్యాను. జోసెఫ్ గదిలో మధ్యగా వ్రేలాడుతున్నాడు. నాలుక బయటకు పీక్కుని వచ్చింది. కనుగుడ్లు బయటకు వెళ్ళుకునివచ్చి భయంకరంగా ఉన్నాడు. నాగుండె ఒక్కసారి ఆగిపోయినట్లయింది. నిలబడలేక పోయాను. కళ్ళు తిరిగి పడిపోయాను.

తన చావుకు కారణం ఎవరూకాదని, తను బుద్ధిపూర్వకంగానే ఆత్మహత్య చేసుకుంటున్నానని వ్రాసిన చీటి వాడి టేబులో దొరికింది.

ఇక జరుగవలసిన కార్యక్రమంతా జరిగిపోయింది. ఆ రెండు రోజులు దీన్నిగురించి కొండగొడవగానే ఉంది. తలా ఒక రకంగా అనుకున్నారు. ఆ రోజు రాత్రి సావిత్రి వాళ్ళు యింటికి తాళంవేసి ఎక్కడికో వెళ్ళిపోయారు.

కాలం ఎవ్వరికోసం ఆగదు. నేను విశాఖపట్నం వచ్చేశాను. జోసెఫ్ గురించి వ్రాసిన గొడవంతా కాలప్రవాహంలో కలిసిపోయింది. కొన్నిరోజులకు అంతా మర్చిపోయారు. నేనుమాత్రం ఆ భయంకర దృశ్యాన్ని మర్చిపోలేకపోయాను. తల్చుకుండేప్పుడల్లా ఒళ్ళంతా భయంతో జలదరించేది. రాత్రింబగళ్ళు కళ్ళకు కట్టినట్లు, ఆ దృశ్యం అగుపడుతుండేది.

నాలుగు నెలలకనుకుంటాను మైసూరులో సావిత్రిని ఎవరో పెద్ద యింజనీరుకు రెండో పెళ్ళాం గా యిచ్చి పెళ్ళిచేసినట్లు విన్నాను. ఊహించనిదే కాబట్టి కాబట్టే ఆ విషయం విని నేనంతగా ఆశ్చర్యపడలేదు.

మెదడంతా వేడెక్కిపోయింది. తిరిగి బాహ్య ప్రపంచంలోకొచ్చేటప్పటికి ఎటుచూసినా చీకట్లు అలుముకుంటున్నాయి. చేతిలోనుండి పుస్తకం జారి ఎప్పుడు క్రిందపడిందో తెలియదు. కళ్ళనుండి రెండుకన్నీటి బొట్లు జారిపడ్డాయి. ఎవ్వరూ చూడకుండా తుడుచుకున్నాను. మనసంతా వికలమైంది.

"ఏరా అట్లా పడుకున్నావు" అని రామం వచ్చాడు. అలసటగా ఉంటే పడుకొన్నానని చెప్పి, యిందాక మీ యింటికి కొకామె వచ్చింది నీకు తెలుసా? అని అడిగాను.

"ఆమె పేరు సావిత్రి. మాకు కొద్దిగా దూరపు చుట్టం లే. ఆమెభర్త పెద్ద యింజనీరు. పెళ్ళికి పూర్వం ఆమెకొక పెద్ద కథతో సంబంధమున్నట్లు చెప్పుకుంటారు. నీకేమయినా తెలుసా" అని అడిగాడు.

ఇదివరకు చూసినట్లు జ్ఞాపకం అని సమర్థించు కున్నాను.

ఆరాత్రంతా నిద్రపట్టలేదు. మనసంతా అల్లకల్లోలంగా ఉంది. జోసెఫ్ సావిత్రిలగురించి ఆలోచిస్తూ నిద్రపట్టక ప్రక్కమీద పొర్లసాగాను.

ప్రక్కగదిలో అస్పష్టంగా మాటలు వినపడ్డాయి. ఎవరో ఏడుస్తున్నారు. మరెవరో అనునయిస్తూ ఏదో అంటున్నారు. శ్రద్ధగా ఆలకించ సాగాను. వారు రామం శశిలని పోల్చుకోవటానికి ఎక్కువసేపు పట్టలేదు. శశి ఎందుకు ఏడుస్తుందో

లేచిపోయింది

—1వ పేజీ తరువాయి

నని ఆత్రుత ఎక్కువై యింకా శ్రద్ధగా ఆలకించ సాగాను.

"మా వంశం, పరువు, మర్యాదనుచూసే బాధ్యత నీకూ ఉంది. లోకం యింతవరకు మా వంశాన్ని వేలెత్తిచూపలేదు." రామం గొంతు స్పష్టంగా విన పడసాగింది. "అతను మంచివాడు. యోగ్యుడు అని నాకూ తెలుసు. కాని కులం. ఇప్పుడు అన్ని ఏర్పాట్లు జరిగిపోయినై. ఇంక ఏంచెయ్యటానికి నేను అశక్తుణ్ణి. చెల్లీ నన్నర్థంచేసుకో. నీసుఖమే నాకు కావలసింది. క్రమేపి నీవు అతన్ని మర్చిపోతావు. అతనూ నిన్ను మర్చిపోతాడు. కుల మతాలను పాటించకుండావుండేందుకు మనదేశం యింకా అంతటి అభ్యున్నతిని సాధించలేదు." రామం ఆగాడు.

తరువాత శశినుండి ఎటువంటి సమాధానం రాలేదు. కాని వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లు విన్నాను.

విషయమేమిటో కొంతవరకు అవగాహన మైంది. ఎక్కడచూసిన యివే సమస్యలు. శశి

వధువు తండ్రి: ఏం పేరయ్యగారూ! మా అమ్మాయికి వరుడు కావాలని చెప్పాను. ఏం చేశారు?

పేరయ్య: ఏమోనండీ! ఇరవై ఏళ్ళ వాడు దొరకలేదు. అంతగా కావాలంటే, పదేళ్ళవాళ్ళిద్దరు దొరుకుతారు.

లక్ష్మి (హైదరాబాద్)

ఎందుకట్లా ఉన్నదో యిప్పుడు నాకర్థమైంది. ఇక ఆలోచించలేకపోయాను. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

* * *

ఆ పగలల్లా నాకేం తోచలేదు. రామం పనుల మీద తిరుగుతూవుండిపోయాడు. ఎవరెవరో కొత్త చుట్టాలు వస్తున్నారు. రామం గదిలోని పుస్తకాలతో కాలక్షేపం చేశాను. శశి కనపడుతుందే మోనని చూశాను. ఆ పగలంతా నాకంటికగపడలేదు.

నాలుగు రోజులు సరదాగా గడుపుదామని వస్తే లేనిపోని ఆలోచనలతో మనసంతా చికాకయిపోయింది. కాస్సేపు కబుర్లాడుదామంటే పరిచయస్తులెవ్వరూ లేరు.

అర్ధరాత్రి అవుతుందేమో. గదిలో ఉక్కగా ఉంది. నిద్రపట్టటంలేదు. తలుపు తెరచుకుని పెరట్లోకొచ్చాను.

తెల్లటి పాలవంటి వెన్నెల. విశాలమైన పెరడు. రకరకాల పూలచెట్లు. ఒకవైపుగా పెద్దబావి. చల్లనిగాలి సన్నగా వస్తుంటే మనసుకెంతో హాయిగా ఉంది. నాకు ప్రక్కగా వేపచెట్టుక్రింద గడ్డిలో కూలబడ్డాను. పూర్ణచంద్రుడు ఆకాశంలో ప్రకాశిస్తున్నాడు. అంతటా నిశ్శబ్దం. తారకలు నిశ్చలంగా మెరుస్తున్నాయి. చాలసేపు ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుణ్ణవుతూ కూచున్నాను.

దూరంగా, అస్పష్టంగా ఒక ఆకారం కదలివెళ్తున్నట్టు కనపడింది. జాగ్రత్తగా పరకాయించి చూశాను. ఆ ఆకారం దొడ్డి చివరనున్న బావివైపు వెళ్తున్నది. లేచినిలబడి కళ్ళు నులుముకుని గమనించాను.

ఆకారంతోపాటు విషయంకూడా అర్థమై గుండె వేగంగా కొట్టుకోవడం మొదలిడింది. ఒక్క నిమిషం తటాపటాయించి పరుగెత్తాను.

అప్పటికే శశి బావిగోడ ఎక్కబోతుంది. చేయి పట్టుకుని యివతలకు లాగేశాను. భయంతో వణుకుతూ నిలబడ్డది.

రెండు నిమిషాలవరకు మాట్లాడలేకపోయాను. కొద్దిగా స్తిమితపడిన తరువాత మాట్లాడాను.

"చూడు శశి నువ్వెంతటి పిరికిపని చేయబూనావో నీకు తెలియదు. నువ్వు చేయబోయే పనివలన మీ అన్నయ్య, మీవాళ్ళూ ఎంత బాధపడతారో వూహించలేకపోయావు. ఈ పని హర్షించతగినది కాదు. అందువల్ల నీవు సాధించగలిగేదేమీ లేదు. నిన్ను నీవు నాశనం చేసుకుని ఎవరిని ఉద్ధరించినట్లు?"

"రాత్రి రామం మాటలవలన విషయమేమిటో నాకు తెలిసింది. ఇటువంటి సంఘటనలతో నలిగి, ఆత్మనిగ్రహం కోల్పోయి, చిత్తస్థైర్యం లేక, ఆత్మార్పణ చేసుకున్న అవివేకుల మార్గంలోనే నీవు నడవబోయావు. కాని వారేం చేయగలిగారు.? సమాజాన్నేమయినా మార్చగలిగారా? వారి చావువలన ఏ ఉపయోగం జరిగింది.? ఇతంత విజ్ఞాన అభివృద్ధి చెందినప్పటికి నీవూ అదే పద్ధతి అవలంబించబోయావు."

శశి తలవంచుకుని నిలబడ్డది. చివరకు తడబడుతున్న మాటలనుకూడదీసుకుని అన్నది.

"అన్నయ్యా నేను మూర్ఖురాలనని మీరు అనుకోవద్దు. నాకింతకంటే మార్గాంతరం లేకపోయింది. ప్రకాశం, నేను మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నాము. ఇప్పుడు వేరొకరికి నా హృదయంలో చోటివ్వలేను. అన్నయ్యకు తెలిసివుండికూడా పరువు మర్యాద అని నన్ను బలిచేయబోతున్నాడు. ఇటు వంశమర్యాదకు భంగం కలగకుండా, అటు ప్రేమించినవాడ్ని జీవితాంతం కలిసివుంటానని వాగ్దానాలు చేసి, ద్రోహంచేయకుండా ఉండాలంటే నాకీదారితప్ప వేరే మార్గం స్ఫురించలేదు."

చంద్రుడు మబ్బుచాటుకు మాయమయాడు. తెల్లని వెన్నెలంతా మసక చీకటిగా మారింది. పరిసర ప్రాంతాలన్నీ చీకట్లో అస్పష్టంగా కనపడసాగినై.

"నీవు చనుకున్నదానివి. సమాజాన్ని ధైర్యంగా ఎదుర్కొనగలిగినవారూ, మార్చగలిగినవారూ మీవంటివారే. ఈ పని పిరికివాళ్ళు చేయతగినది. నీ ప్రేమ గురించి, నీ ఆత్మవిశ్వాసం, కార్యదీక్షత గురించి నాకుతెలుసు. శాశ్వతమైన ప్రేమ ఏదో, తాత్కాలికమైనదేదో నేను నిర్వచించలేను. ఉన్నవి రెండే రెండు మార్గాలు. మొదటిది మీ అన్నయ్య చెప్పినట్లు విని చేసుకోవటం—క్రమేపి అంతా మర్చిపోతావు. కాలానికి ఎదురేదేది ప్రపంచంలో ఏదీ లేదు. కొన్ని రోజులకు అతను కూడ నిన్ను మర్చిపోతాడు. తప్పదు. జరుగుతున్న సంఘటనలే యివి. ఇటు మీవాళ్ళందరినీ రక్షించినదానివి అవుతావు.

"ఇక రెండవది అసాధారణమైనది. దీనికి ఆత్మ

విగ్రహం, ఆత్మవిశ్వాసం కావాలి. ఏది ఏమైనా జీవితంలో అతన్ని తప్ప అన్యుల్ని స్వీకరించలే ననుకున్నప్పుడు, ఎంతటి విపత్కర పరిస్థితుల కయినా తట్టుకోగల మనస్థయిర్యం ఉండి, చచ్చినా, బ్రతికినా అతనితోనే, జీవితంలో మోస పోయాననీ తిరిగి రాకుండా ఉండేటట్లయితే ఇందుకు పూనుకోవాలి. ఇందుకు కఠినమైన మనస్సుండి అన్ని బాంధవ్యాలను త్రెంచుకోవాలి. అప్పుడే అందుకు సిద్ధపడాలి. ఇది స్వార్థపూరితమే అవుతుంది. ఎవరేమైనా లెఖ్ఖచేయకుండా, తన జీవితం, తన సుఖం చూసుకోగలిగినప్పుడు యితర బలహీనతలకు తావియ్యకూడదు. ఇది సాహసోపేత మయినది. నిర్ణయించుకొనే ముందు బాగా ఆలోచించు" నా సుదీర్ఘమైన ఉపన్యాసాన్ని ఆపాను.

శశి ఆలోచించుకుంటూ అక్కడే నిలబడ్డది. "చాలా రాత్రయింది ఇక వెళ్ళు" అని శశిని పంపి నా గదికి వెళ్లిపోయాను.

మొదటినుండి నా జీవితానికి సంబంధించినవి కాకపోయినప్పటికి, విచిత్రమైన పరిస్థితులు నాకు తటస్థపడ్డవి. ఎడతెరపిలేని ఆలోచనలతో సతమత మవుతూనే ఉన్నాను. తెల్లవారబోతుండగా చిన్న కునుకు పట్టింది.

రామం తట్టి లేపడంతో ఉలిక్కిపడి లేచాను. ఏదో హఠాత్పరిణామం కలిగినట్లు వాడి ముఖం పాలిపోయివుంది. తలుపు దగ్గరకు వేసి వచ్చి కూర్చు న్నాడు.

"అరేయ్, కొంప మునిగిందిరా! ఇప్పుడునేనేం చేయాలో అర్థం కావటంలేదు. తలెత్తుకొని ఎట్లా తిరగను. నలుగురికి నా ముఖం ఎట్లా చూపించను." అని తల పట్టుకుని కూచున్నాడు.

నాకేం అర్థంకాలేదు. "విషయ మేమిటో చెప్పకపోతే నాకేం తెలుస్తుంది" అని వాడి వైపు అయోమయంగా చూడసాగాను.

"మా శశి ఉదయం నుండి కనపట్టం లేదురా. చుట్టుప్రక్కలంతా వెదికాము. తరువాత నే ననుకున్నదే నిజమైంది. శశి, ప్రకాశం తెల్లవారు జామున బండికి స్టేషనులో కనబడినట్లు బండి వాడు వెంకటేశం చెప్పాడు. ఇంత తెగింపు చేస్తుందని నేనెన్నడూ అనుకోలేదు. ఇప్పుడు నేనేం చేయాలి? పెళ్లివారికి ఏమని చెప్పుకోవాలి? నాకు ఆత్మహత్య తప్ప వేరే మార్గం గోచరించడం లేదు" అంటూ వాపోయాడు.

అప్పటికి పరిస్థితి పూర్తిగా నా కవగాహన మైంది. రాత్రి నా ఉపదేశం ఇంత హఠాత్పరిణామం కలుగజేస్తుందని అనుకోలేదు. రెండు నిమిషాలు మౌనంగా గడిచిపోయినవి. రామం అట్లాగే తల చేతో పట్టుకొని కూచున్నాడు.

"రామం నీవిట్లా అధైర్యపడితే లాభంలేదు. ధైర్యవంతుల లక్షణం జరిగిపోయిన దానిని గురించి దుఃఖించకూడదు. శశి మనసు తెలుసుకోలేక పూర్తి అంగీకారం లేకుండా, నీవు సిద్ధపడటం, నీ మొదటి తప్పు. చదువుకున్నవాడివి. లోకులు అనుకుంటారని భయపడకు. న్యాయమైన పద్ధతి, నీకు మంచిది అని తెలిపినదానిని అవలంబించు, శశి సుఖంకన్న నీకు వేరే కావలసింది లేదు గదా. నీకు నమ్మకముండి శశి సుఖపడగలదని నీకుంటే శశి చేసిన దానిని సమర్థించి ప్రోత్సహించు, వారు జీవితంలో సుఖపడేటట్లు నీవు చేయగలిగే సహాయం చెయి. లోకం ఎప్పుడూ అంతే. భయపడిన వాళ్లనే భయపెడ్తుంది. ఎదిరించి, ఆత్మవిశ్వాసంతో నెగ్గుకొచ్చేవాళ్ళకు దాసోహం అంటుంది. జరిగినదానికి లోలోపల కుమిలిపోతూ, పైకి కారాలు, మిరియాలు నూరుతూ పంతాలు పెట్టుకొని కక్ష కట్టడం ఉట్టి అవివేకమైన పని. సమర్థించి పరిస్థితులను అనుకూలంగా త్రిప్పుకొని అందరూ సుఖపడేటట్లు చేయగలగటమే విజ్ఞుల కర్తవ్యం. ఇంతకన్న నేనేం చెప్పలేను."

రామం అట్లాగే కూచున్నాడు. బయట చుట్టాలు, ఇంట్లోవాళ్లు తలా ఒకచోట గుమిగూడి గుసగుసలాడుకొంటున్నారు. అంతటా ఒక రకమైన వాతావరణం రాజ్యం చేస్తున్నది. ఎవరి నోటిగుండా కూడ పెద్దగా శబ్దం రావటంలేదు. ఒక్క పూటలోనే పరిస్థితి అంతా తారుమారయింది.

ఆపూట మధ్యాహ్నం నేను తిరిగి బయలు దేరుతూ రామంతో నా చివరి మాటలు చెప్పి బయటకు వచ్చాను.

ముందు వసారాలో నలుగు రైదుగురు స్త్రీలు కూర్చొని గుసగుస లాడుకొంటున్నారు. మధ్యగా సావిత్రి కూచొని చెప్తున్నదల్లా నన్ను చూసి ఒక్కసారి ఆగింది. అప్పటికే నా కర్ణపుటాల్లో "ఆ ఏముందీ ఎవడితోనో లేచిపోయింది" అన్న మాట దూసుకొని వచ్చింది.

మనస్సులో శశి సుఖపడేటట్లు చేయుమని భగవంతుని ధ్యానించి, గబగబ అడుగులేసుకుంటూ స్టేషనుకు దారితీశాను. ★

హుస్సేన్ సాగర్

13 వ పేజీ తరువాయి

పాడతానన్నావు మరిచిపోయావా? శ్రీవారికి ఎన్నో పనులుంటవి, —" "లేదు. లేదు...., అయితే మాధవ చెప్పింది సబబే. మీరు పాడితే దేహమంతా చెవులు చేసుకొని వింటాను." రాధ పకపక నవ్వింది. గోపీ కండ్లు మూయలేదు. ఏమి పలువరస! నవ్వితే కళ్లల్లో ఏమి చిలిపితనం.

"ఎందుకండీ నవ్వు"

"అబ్బే! ఏమీలేదు. ఇంద్రుడికి ఎందుకో దేహమంతా కళ్లే" గోపీకి తెలుసు అహల్య కథ. తాను నవ్వేశాడు. గోపీ తంబుర తీసి రాధకు ఇచ్చాడు. ఆమె లేచి పుచ్చుకుని తివాచీ మీద కూర్చుని శ్రుతి సరిచేసుకొని పాడ నారంభించింది. మీరా భజన 'మోరెతో గిరిధర గోపాల" గోపీ ముగ్ధుడైపోయాడు. ఏమి కంఠస్వరం! కోకిలగాన అని సుబ్బులక్ష్మికి బిరుదు, ఈమెది గంధర్వగానం. ఆ వంపులు, ఆరవలు ఆ గమకాలు గోపీ హృదయాన్ని కరిగించింది. రాళ్లు కరిగించు శక్తిగల ఆ గానం కుసుమ కోమలమైన గోపీ వంటి కళాకారుని హృదయాన్ని కరిగించుటలో వింత ఏమి? పాడుతూ ఉన్నప్పుడు కొన్ని సమయాల్లో ఆమె కనుగవ అరమోడ్పుగా ఉండడం చూచి ఆమె గానామృతం ఆమె కూడా ఆస్వాదం చేస్తున్నట్లు అనిపించింది.

పాట ఆపింది. గోపీ పలుకలేదు. ఆమె కండ్లకు తన కండ్లు అప్పగించాడు. ఆమె అర్థం చేసుకుంది. భలే. అని వాచ్యంగా ఆమోదించి ఉంటే అంత సంతసించి ఉండదు. "మరి మీరొకటి పాడరూ" అని మృదువుగా అడిగింది. గోపీ తక్షణం తివాచీ మీద కూర్చుని తంబుర తీసుకుని తనకు తగిన శ్రుతి పెట్టుకొని "రాధిక తవ విరహ" అనే అష్టపది పాడాడు. రాధను చూస్తూ. రాధ మాటిమాటికి ఆనందానుభవం సూచిస్తూ కండ్లు మూసుకోవడం కనిపెట్టాడు. ఆహ్లాద భరితుడయ్యాడు. మాధవరావు లేచి "ఇక వెళ్దామా, పొద్దయింది" అన్నాడు. అంత వరకు అతడక్కడ ఉన్నదే వాళ్లు మరిచి పోయారు. రాధ లేచి నమస్కరించి "ఈ రోజు నేను ఎన్నడూ మరిచి పోను" అని మెల్లగా అన్నది. "నేనూ మరిచి పోను" అని నమస్కరించాడు. మాధవరావు రాధతో వెళ్లి పోయాడు. గోపీ ఒంటరిగా ఆ గదిలోనే సోఫామీద కూర్చుని స్మృతి పరంపరలో మునిగి పోయాడు. ఆ స్మృతులు రాధాదేవి గానానికి సంబంధినవి మాత్రమే కాదు. ఆమె రూపు రేఖా విలాసాలు గురించి కూడా. ముఖ్యంగా ఆమె కండ్లు, ఆమె పెదిమలు, మాటి మాటికి తనకే తెలియని కోర్కెలతో నింపి వేసినవి. ఎప్పుడు మళ్లీ ఆమెను కలుసుకోడాని వీలవుతుందో, అదే చింత. మాధవరావును అడగడానికి సంకోచించాడు.

రెండు రోజుల తర్వాత మాధవరావే సందేహ నివర్తి చేశాడు. "ఏమండోయ్. ఆవిడ నన్ను వెళ్లిపోయాడు." ... కనుక్కోమంది. మళ్లీ తమ దర్శనం చేసుకోవచ్చా తమకు వీలుంటే అని. "సరే అన్నాను" "నో ఎప్పుడైనా సరే. ఆవిడకు వీలైతే" గోపీ రాధాదేవి గురించి మాధవరావు నడిగి తెలుసుకోవాలని కోర్కె ఉన్నా ధైర్యం చాలక పోయింది.

ఆ సాయంత్రం రాధాదేవి మాధవరావుతో బంగళా వచ్చింది. రాధ కొంతసేపు, గోపీ కొంత సేపు పాడుకున్నారు. ఈ సారి గోపీ రాధ సమీపం లోనే కూర్చున్నాడు తివాచీ మీద, ఆమె జడలోని మల్లె పువ్వుల పరిమళం ఆఘ్రాణిస్తూ ఉంటే ఆమెను తాకుచున్నట్లే తోచింది. తంబుర అందిస్తున్నప్పుడు ఆమె చెయ్యి తన చేతికి తగిలింది. ఒళ్లు ఝల్లు మంది. ఆ రోజు మాధవరావు రాధ వెళ్తున్నప్పుడు గోపీ తానే అనేశాడు "మీరు వీలున్నప్పుడల్లా రావాలి. సాయంత్రం నే నిక్కడే ఉంటాను, వాయించుకుంటూ, పాడుకొంటూ, లేదా చదువుకొంటూ, ఏమీ తోచదు. మీరు వస్తే సరదాగా ఉంటుంది."

"తప్పకుండా, అంతకన్నానా" అని చిరునవ్వుతో బదులు చెప్పింది.

తర్వాత వారానికి మూడు నాలుగు సార్లు రాధ వచ్చేది మాధవతో, రోజురోజుకూ పరిచయం దగ్గరైంది. చనువు ఎక్కువైంది. ఒక నాడు మాధవ వచ్చిన వెంటనే తాను ఫ్యాక్టరీ సంబంధంగా ఎవరో ఆఫీసర్ని ఇంటి దగ్గర చూడవలెనని చెప్పి వెళ్లిపోయాడు. గోపీ, రాధ ఒంటరిగా ఉండి

హుసేన్ సాగర్

పోయారు. యధాప్రకారం పాడుకోలేదు. సోఫాలో రాధ ప్రక్కన కూర్చున్నాడు గోపీ, మౌనంగా ఉన్నారు ఇద్దరూ, తటాలున గోపీ ఒక విచిత్ర ప్రశ్న వేశాడు.

"రాధా ! నీకు వివాహమైందా."

"లేదు. మీకూ ?"

"లేదు."

"ఎందుకు వేశారీ ప్రశ్న."

"ఎందుకో తెలియదు."

"నాకు తెలుసును" అని నవ్వింది రాధ.

"రాధా నీవు నవ్వితే ఎలా ఉంటుందో చెప్పనా. సెలయేటి మీద వెన్నెల ప్రకాశించినట్లుంటుంది.... బృందావనంలో రాధ నీలాగే ఉండేది కాబోలు"

"మీరో.... సాక్షాత్తు మురళీధర్ లాగ కనబడతారు నాకు" అని ఆవేశంతో అతని చెక్కిళ్ళు తన చేతులతో నొక్కి అతని పెదవులపై ముద్దు పెట్టింది. గోపీ ఒళ్లంతా వేడెక్కింది. రక్తం తలకెక్కింది గట్టిగా రాధ కంఠం తన చేతులతో చుట్టేసి, పెదిమల మీద, చెంపల మీద, కండ్ల మీద, మళ్లీ పెదిమల మీద ముద్దుల వర్షం కురిపించాడు.

"రాధా, నీవు లేనిది నేను జీవించలేను"

"మీతో నున్నపుడు నాకు ఎప్పుడూ మీతోనే ఉండి పోవాలని ఉంటుంది. ఏం చెయ్యను." "నిజంగా ? నాదే భాగ్యం" అని ఏదో చెప్పబోతూ ఉండగా మాధవరావు పైకి వచ్చే చప్పుడయింది, మానేశాడు. మాధవరావు ఏదో చెపుతున్నాడు. ఆఫీసర్ ఎక్కడికో అకస్మాత్తుగా వెళ్లాడని,— కాని గోపీకి, రాధకు వినబడలేదు. వారు మరో ప్రపంచం నుంచి ప్రస్తుత ప్రపంచానికి మెల్లిగా దిగుతున్నారు. "పాడుకున్నారా." అని అడిగాడు మాధవ. "లేదు. ఇవ్వేళ పాట మీద లేదు. ఏదో బాతా ఖానీ తోనే సరిపోయింది." అన్నాడు గోపీ మాధవ గ్రహించాడు ఏదో జరిగిందని. ఏవో కబుర్లు చెప్పుకున్నారు ముగ్గురూ వ్యర్థంగా, రాధ వెళ్లేటప్పుడు గోపీ మర్నాడు తన ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. రాధ పలుకలేదు. మాధవని చూస్తూ, గోపీ నిశితంగా "రాకూడదా" అని అడిగాడు. "అలాగే నండి" అని మాధవ బదులు చెప్పాడు.

రోజూ గోపీ ఫ్యాక్టరీ పనుల కోసరమే వెళ్తున్నాడని ఇంట్లో వారి అభిప్రాయం. ఆనాడు ఇంటికి రాగానే "సుమిత్రా" అని పిలిచాడు. బావ ఎప్పుడూ అలా పిలువలేదు. కనుక సంతోషంగా, తొందరగా వచ్చింది.

"ఏం బావా"

"ఏమీ లేదు. రేపు సాయంత్రం ఒక అమ్మాయిని మన ఇంటికి రమ్మన్నాను. పేరు రాధాదేవి. బహుశా జ్ఞాపక ముంటుందేమో నీకు. నా కచేరిలో నీ ప్రక్కనే కూర్చుంది."

"ఆఁ. చక్కని ముఖం. మీ పాట చాలా మెచ్చుకుంది. మీకు ఆవిడతో పరిచయం ఎలా అయింది."

చిక్కు ప్రశ్న వేసిందే. జవాబు చెప్పక తప్పింది కాదు. "మాధవరావు ఆమెను బాగా ఎరుగునట. బంగళాకు ఒకటి రెండు సార్లు వచ్చి పాడింది. గొంతు చాలా శ్రావ్యంగా ఉంటుంది.... అమ్మతో చెప్పు."

సుమిత్ర స్త్రీ సహజమైన కుశాగ్ర బుద్ధితో అర్థం చేసుకుంది— పూర్తిగా కాక పోయినా 'సరే' అని లోపలికి వెళ్ళి పోయింది.

గోపీ తన గదిలో కూర్చొని ఆలోచించాడు. అమ్మతో సమయం చూచి మాట్లాడాలి. ఎంత చనువున్నా అమ్మతో సహా కొన్ని విషయాల గురించి మాట్లాడడానికి ఏ కొడుకైనా ధైర్యం చాలదు. సిగ్గు, జంకు, కొంత భయం కూడా ఉంటుంది. మాట్లాడడానికి పూర్వం అమ్మ రాధని చూడాలి. రాధను గురించి తనకేమి తెలుసును ? మాధవరావు ఏదీ వివరంగా చెప్పలేదు. బెల్గాం వాళ్లు, బ్రాహ్మలు. ఒకప్పుడు మంచి స్థితిలో వున్నా ప్రస్తుతం కుటుంబం చితికిపోయింది, ఆడపిల్లలకు పాట నేర్పించి వచ్చే రాకలతో కాలక్షేపం అన్నాడు. తనకున్న డబ్బు చాలదా, భార్య శ్రీమంతురాలుగా ఎందుకుండాలి. ఇలాటిభావాలు చిందరవందరగా మనసును చెదిరించినవి.

మర్నాటి సాయంత్రం అయిదు గంటల నుంచి ఎదరు చూస్తున్నాడు, రాధ రాకకు. అరఘంట తర్వాత కనబడ్డారు. ఒక్క పరుగున క్రిందికి దిగి ద్వారం దగ్గరే ఆహ్వానించి లోపలికి తోడ్కొని వచ్చాడు. "సుమిత్రా, సుమిత్రా" అని పిలిచాడు. సుమిత్ర వచ్చింది. గోపీ పరిచయం చేశాడు పరస్పరం— "ఈవిడే రాధాదేవి.... ఈ అమ్మాయి మా మామయ్య కూతురు, సుమిత్ర అమ్మ దగ్గరికి తీసుకొని వెళ్ళు" అని సుమిత్రతో చెప్పి, తాను మాధవరావుతో పైకి వెళ్లాడు.

సుమిత్ర మర్యాదగా "రండి" అని రాధనువిశాలమ్మ కూర్చుని ఉన్న ప్రక్క గదిలోకి తీసుకొని పోయింది. "అత్తమ్మా, ఈమె రాధాదేవి మన గోపీ బాగా ఎరుగునట. చాలా ఇంపుగా పాడుతుందట." విశాలమ్మ రాధను కూర్చోమని సుమిత్రతో కాఫీ తెమ్మన్నది. సుమిత్ర వెళ్లగానే రాధ ముఖం పరీక్షించింది. అందం కన్న ఆకర్షణ ఎక్కువ ఉంది.

"అమ్మాయ్ ! మా గోపీతో నీకు ఎలా పరిచయమైంది ?"

"ఆ రోజు కచేరిలో చూచాను. వారి పాట అద్భుతంగా ఉండింది. నాకు పాట అంటే ప్రాణం. మాధవరావు గారిని నేను చాలా కాలం ఎరుగుదును. ఆయన దగ్గర వారి పాటను మెచ్చుకున్నాను. అప్పుడాయన మీ అబ్బాయిగారితో పరిచయం చేశారు." మిగతా విషయాలేమీ చెప్పలేదు భయంతో.

"ఈ వూరేనా"

"అవునండి"

"తలిదండ్రులు"

"వారి ప్రేమకు నోచుకోలేదు. చిన్ననాడే పోయారు"

"మరి...."

"మా అమ్మమ్మతో ఉంటున్నాను"

ఈ జవాబులతో విశాలమ్మ తృప్తి పడలేదు. అయినా ప్రప్రథమంగా ఇంటికి వచ్చిన అమ్మా యిని ఎన్ని ప్రశ్న లడగడం ?

సుమిత్ర కాఫీ పట్టుకొని వచ్చింది. విశాలమ్మ తొందరగా ఇంకొక్క ప్రశ్న వేసింది "వివాహం ?"

"కాలేదు."

"మా అన్నయ్య కుమార్తె, సుమిత్ర గోపీ కిచ్చి వివాహం చేస్తున్నాం"

రాధ గుండె గతుక్కు మన్నది కాని బయటికి ఏమీ వ్యక్తం చెయ్యలేదు. "అందమైన సంబం ధం" అని చిరునవ్వుతో అనింది సుమిత్ర సిగ్గుతో తలవంచుకుంది. ఇంతలో గోపీ మాధవరావు దిగి వచ్చారు. "ఏం సుమిత్రా ఆడవారి కేనా ? మాకు లేదా కాఫీ" అన్నాడు గోపీ. సుమిత్ర లేచింది "నో, నో, వేళా కోళానికి అన్నాను. మాధవరావు వెళ్ళాలట." అనగానే రాధ నిలబడింది. విశాలమ్మకు సుమిత్రకు, గోపీకి నమస్కరించి మాధవరావుతో వెళ్ళిపోయింది.

ఆ రాత్రి భోజనాలయ్యాక ముగ్గురూ — గోపీ, విశాలమ్మ, సుమిత్ర వీధి గుమ్మం దగ్గర గదిలో కూర్చున్నారు. విశాలమ్మ ముక్తసరిగా "సుమిత్రా, నీవు వెళ్ళి పడుకో" అంది. సుమిత్ర కాశ్చర్యమైంది. ఎనిమిదైనా కాలేదు. వెంకటేశ్వరు పూళ్ళో లేడని తొందరగా భోజనం చేశారు. ఏదో కారణంతోనే ఇలా చెప్పింది. బహుశా గోపీతో ఏకాంతంగా మాట్లాడాలెననే ఉద్దేశం అయ్యుంటే అని గ్రహించి, సెలవు తీసుకుంది.

గోపీ, విశాలమ్మ కొన్ని క్షణాలు మౌనంగా ఉన్నారు. తరువాత సంభాషణ ప్రారంభమైంది విశాలమ్మ ప్రశ్నతో

"గోపీ ! ఎవర్రా ఆ అమ్మాయి"

"పుట్టు పూర్వోత్తరాలు ఇంకా తెలియవు. నాకు నచ్చింది. నీ అనుమతితో వివాహం చేసు కుందామని తీర్మానించుకున్నాను."

విశాలమ్మ నిర్ఘాంతపోయి "ఏమిటీ, ఏమిటీ — నీకు మతి పోయిందా. వీధిలో పోయే దాన్ని వివాహం చేసుకుంటావా — మరి సుమిత్ర ! మీ నాన్న అన్నయ్యకు మాట ఇచ్చారు. వారు కొన్నాళ్ళు జీవించి ఉంటే ఈ నాటికి వివాహం అయి సంవత్సరం దాటేది."

"సుమిత్రను పెళ్ళాడుతానని నేను ఎప్పుడూ చెప్పలేదే."

"నీ వెందుకు చెప్పాలి చిలకా గోరువంకల్లాగ మెలిగేవారు కాదూ ! వాళ్ళు మన ఇంట్లో ఉన్నప్పుడు అయిష్టం కనబరచలేదే నీవు —"

"సుమిత్ర అంటే ఇష్టం లేదని చెప్పలేదే — నాకు చెల్లెలుంటే ఎంత ఇష్టంగా ఉండేవాడినో అలాగే."

"చాల్చాలు. అయితే నాన్న మాట నా మాట వ్యర్థమేనా."

"కోప్పడవద్దమ్మా ... పెండ్లి చేసుకొనే వాణ్ణి నేనా — నాయనా — నీవా"

"పోనీ.... నీ కక్కర లేకపోతే సుమిత్రకు బంగారు వంటి సంబంధాలు వస్తాయి... కాని నేను మాత్రం నీవా పిల్లను వివాహం చేసుకోడానికి ఈ జన్మలో సమ్మతించను." అని క్రోధంతో

హుస్సేన్ సాగర్

తన గదిలోకి వెళ్లి పోయింది. గోపీకూడా చుర్రుమని మేడ మీదికి వెళ్లిపోయాడు.....

ఈ సంభాషణ కొంతవరకు విని కొంతవరకు వూహించి సుమిత్ర తన గది తలుపులు వేసుకొని, మంచం మీద బోరగిలి పడుకొని ఏడవసాగింది. తాను నిర్మించుకొన్న ఆనంద సౌధం భూకంపంలో వలె నిర్మూలనమై పోయింది. తాను కన్న కలలన్నీ విఫలములై పోయినై. భరింపరాని ఆవేదనతో తీరని బాధతో హృదయం క్రుంగి పోయింది. తనకింక జీవితమంతా అమావాస్యనే...

ఆ రాత్రి విశాలమ్మకు గోపీకి నిద్ర పట్టి లేదు. అమాయకుడు. అర్భకుడు అని ఎంచిన కొడుకు ఈ విధంగా ఎదురు తిరగుతాడని స్వప్నంలో కూడా తలవలేదు విశాలమ్మ. తన మీద అపార మైన ప్రేమ, వాత్సల్యం గల తల్లి ఇట్లా తన సంతోషానికి అడ్డు వచ్చునని అనుకోలేదు గోపీ.

తెల్లవారింది. గోపీ కాఫీ త్రాగి, స్నానం చేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. వూరంతా తిరిగి సాలార్ జంగ్ మ్యూజియంలో రెండు గంటలు గడిపి హోటలులో ఏదో తిని ఇల్లు చేరాడు. భోజనానికి పిలిస్తే వెళ్లలేదు. సుమిత్ర వచ్చి "బావా, ఒంట్లో బాగాలేదా" అని అడిగితే తల నొప్పిగా ఉందని మాత్రలు రెండు మ్రింగి పడుకున్నాడు. దేహమూ, మనసూ అలిసి పోవడం చేత నిద్ర పొయ్యాడు. లేచేటప్పటికి ఆరైనది. ముఖం కడుక్కొని ఫ్యాక్టరీ బంగళాకు బయలుదేరాడు.

యథా ప్రకారం మాధవరావు, రాధ బంగ ళాకు అయిదున్నరకు వచ్చారు. గోపీ లేడు. ఎందు చేతనో ఆలస్యమైంది అనుకొన్నాడు మాధవ. రాధకు మాత్రం ఏదో అనర్థమైందని సందేహం. మాధవ అమిత ఉత్సాహంగా ఉన్నాడు.

"రాధా ! మన పంట పండింది. బాగా వలలో వేసికొన్నావు బంగారు పిచ్చుకను. ఇంకా వూరు కుంటే లాభం లేదు. ఆరువేలకు ఒక రత్నాల హారం మోహనలాల్ అంగట్లో చూచి వచ్చాను. ఇప్పుడే నీ చమత్కారం ఎలా చూపిస్తావో, మేలు కోక ముందే దొరికినంత డబ్బు లాగాలి." రాధకు కోపం వచ్చింది "ఛీ ఛీ—నే నతని దగ్గర డబ్బు ఆశించలేదు."

"అబ్బో! ఏమి శ్రీరంగ నీతులు — ఏం నా కమీషన్ ఎగ గొట్టాలనా నీ యెత్తు?"

"నిజం చెప్పితే నీకర్థంకాదు— నేను అతన్ని ప్రేమించాను. నాదేహంలో, నా మనస్సులో, అతని తోనే నా బ్రతుకు."

"సానిదానికీ, ప్రేమకూ ఎన్నో యోజనాలు దూరం. నా దగ్గిరనా డబుకులు."

"ఎంత హీనంగా మాట్లాడుతున్నావు."

"ఏం రాధా, నీకేమన్నా మతిపోయిందా ....."

"అయ్యో! నిన్నెలా నమ్మించగలను దయచేసి ఈ మాటలు చాలిస్తే నీకొక నమస్కారం."

"అయితే ఏమిటి నీ ఉద్దేశ్యం. రోజా నిన్ను వెంటబెట్టుకుని రావాలె కాబోలు నౌకర్‌లాగ, నామాట పోనీ. నీగతే ఏమవుతుంది. వాడిమోహం శాశ్వతంగా ఉంటుందా ? నీపైన విసుగు పుట్టితే

ఎంగిలి విస్తరిలాగ పారేస్తాడు. లాభం—చెల్లిగవ్వ లేదు"

"అలాంటి మనిషికాదు. ఇప్పుడు నేను సరే అంటే వివాహం చేసుకోడానికి సిద్ధంగా ఉన్నాడు."

"అహ్హా హ్హా హ్హా" అని విరగబడి నవ్వాడు మాధవ. "ఇదేమిటి కొత్త తెగులు పుట్టింది సానివంశంలో పెండ్లి పురుగు."

"నాకు లేదాకోరిక, ఆయన్ని అసత్యంతో అన్యాయం చెయ్యలేను. నాపూర్వచరిత్ర ఆయనకు తెలియదు. ఆయనకు నాపైన ప్రేమ ఉన్నంతకాలం స్వర్గసుఖం అనుభవిస్తాము. ఆతర్వాత.... ఏమో... నీకర్థంకాదు. కొన్ని రోజులనుంచి ఇంటికి వచ్చిన వారినందర్ని పంపేస్తున్నాను. తెలుసా...పాడడంకూడా లేదు "

"రాధా నన్ను మోసంచేశావు కదూ."

"మోసమా. నీకేమన్నా మాట ఇచ్చానా. ఆయన్ని కొల్లగొట్టి నీకు భాగం ఇస్తానన్నానా "

ఇంతలో గోపీ వచ్చిన చప్పుడైంది. ఎప్పటిరీతి చకచకా మెట్లెక్కడంలేదు. మెల్లమెల్లగా ఒక్కొక్క మెట్టుపైన ఆగుతూ వస్తున్నాడు. రాధకేదో అనుమానం. ఇదేనా అంతం? గోపీ గదిలో ప్రవేశించగనే అతని ముఖం చూచి బెదిరిపోయింది. రాధ. కండ్లు ఎర్రగా వాచి ఉన్నాయి. చెక్కులెండిపోయినవి. వాడిపోయిన పువ్వులాగ కనబడ్డాడు. "ఏమండీ ఒంట్లో బాగాలేదా" అని అడిగింది. బదులు చెప్పక సోఫాలో కూలబడ్డాడు. మాధవరావు తనకక్కడ చోటులేదని గ్రహించి "చాలా జరూరు పనివుంది, సెలవిప్పిస్తారా.....రాధను టాక్సీలో పంపండి." అని చెప్పి రాధవంక కోపంగా చూచిపోయాడు. రాధ సోఫామీద గోపీ ప్రక్కన కూర్చుని అతని చెక్కిళ్ళు తన చేతులతో నొక్కుతూ "చెప్పరూ. ఎందుకిలా బాధపడుతున్నారు" "రాధా! రేపే మనం వివాహం చేసుకోవాలి. నీకేమన్నా అభ్యంతరమా". రాధ తల తిరిగిపోయింది. ఇంత హఠాత్తుగా ఇంత విషమ సమస్యలో చిక్కుపడతాననుకోలేదు. "నన్నా వివాహం చేసుకుంటారు. నిన్న మీ అమ్మగారు మీ మావ కూతుర్ని వివాహం చేసుకోబోతున్నారని స్పష్టంగా, ఆ అమ్మాయి ఎదురుగా చెప్పిందే"

"నేనెప్పుడూ అంగీకరించలేదు. అసలు నన్ను ఎవ్వరూ అడగలేదు."

"అంత చక్కని అమ్మాయి, గుణవతి, కావలసిన సంబంధం వదిలిపెట్టి అనాథను, పరదేశిని, అపరిచితను మీ అర్ధాంగిగా స్వీకరిస్తారా?.....తప్పు, ఆ అమాయకురాలికి నేను ద్రోహం చేయలేను".

"ఎందుకిలా మాటలు చల్లేస్తున్నావు. ఒక్క మాటతో సరిపోయేదే, నాపైన ప్రేమలేదని"

"హరి హరి. ఎంత నిర్దయగా అన్నారు" అని నేలపై గోపీ కాళ్లవద్ద కూర్చుని రోదనం చేస్తూ "ఈ పాదారవిందాలు సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. మీరే నాభర్త! నా దైవం—నాజీవం...మీరు ఏనాడు నా జీవితంనుంచి వెళ్లిపోతారో ఆనాడు లోకంనుంచి నిష్క్రమిస్తాను ... నమ్మండి."

గోపీ మనసు కరిగిపోయింది. రాధను లేవనెత్తి తన ఒడిలో పడుకోపెట్టుకున్నాడు. తలవెంట్రుకలు నిమురుతూ "రాధా, ఎంత తప్పు చేశాను? ఎంత బాధపెట్టాను? నిన్నరాత్రి మా అమ్మకూ నాకు పెద్ద సంఘర్షణయింది. సుమిత్రను నాకు చేసుకుంటానని నాన్నా అమ్మా మాట ఇచ్చారట. నా పూచీ అందులో ఏమీలేనట్లే. నేను దృఢంగా చెప్పేశాను సుమిత్రను వివాహం చేసుకోనని. అమ్మ కోపంలో నిన్ను పెండ్లాడడానికి సమ్మతించనని చెప్పేసింది."

"అయ్యయ్యో. నావల్ల ఎంత కుటుంబకలహం? సుమిత్ర అన్నివిధాలా మీకు తగిన పిల్ల. ఎందుకని మీకు ఇష్టంలేదు?"

"సుమిత్రను చిన్నప్పటినుంచి చెల్లెల్లాగే భావించాను. అంతే. ఆవిడ మీద నాకు ద్వేషంలేదు"

"మనం వివాహం చేసుకోవడం అంత అవసరమా, ప్రేమ చాలదా...... ."

"లోకం?"

"అబ్బ! లోకం, లోకం, లోకం...లోకం కోసం ఎంత తెలివిగలవారైనా ఎంత తెలివిలేని కార్యాలు చెయ్యడానికి బద్ధులైపోతారు."

"రాధా, ఆలోచించు.....నీవే నాతో అంగీకరించగలవు అకస్మికంగా అడిగి ఆందోళనలో ముంచేశాను నిన్ను"

రాము : ఎక్కడికిరా రాజూ స్పీట్ గా బయల్దేరావ్ !

రాజు : ఎక్ఛేంజికి.

రాము : అరె ! ఉద్యోగం ఎప్పుడొచ్చిందీ !

రాజు : టెలిఫోన్ ఎక్ఛేంజి కాదురా! ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజికి.

మాధవ్ (తెనాలి)

రాధ సర్వం మరచిపోయింది. టాక్సీలో రాధ వెళ్లేటప్పటికి పదిగంటలు దాటినాయి.

* * *

గోపీ అన్నంత పనీ చేసేస్తాడేమోనన్న భీతి విశాలమ్మకు ఘడియ ఘడియకు అధికమైంది. ఆలశ్యంచేస్తే మించిపోతుందేమో,— మాధవరావుకు కబురంపింది. వచ్చాడు. రాధగురించి యదార్థం చెప్పమన్నది. సంకోచించినట్లు కనబడి తనకసి తీర్చుకోడానికి ఇదే సందర్భమని చెప్పాడు. రాధ సానిపిల్ల. గానావాలీ, నాచ్‌వాలీ తరగతిలో చేరింది. మీ అబ్బాయిని బాగా బుట్టలో వేసుకుంది, డబ్బు లాగడానికి......విశాలమ్మ కథంతా చెప్పింది. వంద రూపాయలు నోటు చేతిలోపెట్టి "ఈగండం తప్పిస్తే అయిదు వందలిస్తా"నని అన్నది. 'రేపే వచ్చి చెప్తాను' అని హుషారుగా వెళ్లాడు. అలాగే వచ్చాడు కానీ బిక్కమొగంతో "ఏమీ ప్రయోజనం లేదు. నన్నసలు చూడనే చూడనన్నదట"....కొంచెం పస్తాయించి "నాకొక్కటే ఉపాయం తోస్తుంది. మీరు కోప్పడకుంటే చెప్తాను." విశాలమ్మ వూ కొట్టింది. "తమరే ఆవిణ్ణి అడిగితే ఏదైనా లాభం ఉంటుంది. ఆమెగుణం అటువంటిది" విశాలమ్మకూ అదే స్ఫురించింది.

"నీవుపోవద్దు. నేనేవెళ్తాను. అడ్రెసు డ్రైవరుతో చెప్పు". అని పంపివేసింది. తక్షణమే విశాలమ్మ బంగారు గాజులు, కంఠసరం మొదలైన కొన్ని ఆభరణాలు మూటగట్టుకుని కారులో వెళ్లింది. రాధ ఇంటికి. రాధ ఇల్లు చార్‌మినార్ దగ్గర ఒక చిన్న వీధిలో. అది నిజంగా ఒక గల్లీ. డ్రైవరు తలుపు తట్టితే ఒక ముసలమ్మ తీసింది. విశాలమ్మ కారులోనుంచి దిగి "రాధాదేవి ఇల్లు ఇదేనా" అడిగింది. అవునని దారితీసింది మర్యాదగా విశాలమ్మ వైభవం చూస్తూ. ఒక కుర్చీలో కూర్చోపెట్టి "రాధా రాధా ఎవరో వచ్చారు నీకోసం" అని కేకవేసింది. పైనుంచి రాధ ఎవరో సరసుడను కొని "చూడటానికి వీలులేదని చెప్పేయి" అని జవాబు చెప్పింది. విశాలమ్మ గత్యంతరంలేక "వెళ్లి చెప్పండి, గోపీ తల్లి అని" ఎంతో బాధతో చెప్పింది. ముసలమ్మ పైకివెళ్లి చెప్పగానే తత్తరపాటుతో రాధ దిగి వచ్చింది. నమస్కరించి "అయ్యో మీబోటివారు ఈ కొంపకురావడం కాకితో కబురంపితే వచ్చేదాన్నే" అని దీనంగా అన్నది.

"కారణంలేకుండా రాలేదు. రహస్యంగా మాట్లాడాలి నీతో" అని విశాలమ్మ ముసలమ్మవంక చూచింది. అర్థంచేసుకుని రాధ "అమ్మా దుకాణానికి వెళ్లి ఏమైనా పళ్ళు పట్టుకొనిరా" అని పంపేసింది. వీధి తలుపు మూసి ఇంకొక కుర్చీమీద కూర్చుంది. గుండెదడ ఆగడంలేదు.

"అమ్మాయీ! నిన్ను వేడుకోడానికి వచ్చాను."

"ఎంతమాట. మీరు—నన్ను వేడుకోవడం?"

"అటువంటి సందర్భం వచ్చింది నిన్ను పుత్రభిక్ష కొరకు యాచిస్తున్నాను"

"అంటే"

"సావధానంగా విను. గోపీ నాకు పుత్రుడు. వాడికోసరమే నేను జీవిస్తున్నాను. వాడికి నా మేనకోడలు సుమిత్రనిచ్చి వివాహం చెయ్యాలని మావారి సంకల్పం. ఆ శుభం చూడడానికి ఆయన ఇచ్చిపెట్టుకోలేదు. నేనన్నా చూస్తాననుకొన్నాను"

"ఆరోజే చెప్పారే మీరు"

"అవును నిజమే కాని చేసికొనేది గోపీ—నేనుకాదు. గోపీ చేసుకోనన్నాడు. కారణం నీవు"

"... ... ..."

"గోపీ నీమీద చాలా మోజుతో ఉన్నాడు".

"ప్రేమిస్తున్నాడు".

"మోహాన్నే ప్రేమ అనుకోవచ్చు. గోపీ నిన్ను వివాహం చేసుకుంటానని చెప్పాడు"

"నాతోకూడా అలాగే అన్నారు."

"నీవు ఒప్పుకున్నావా."

"లేదు"

ఆశ్చర్యంతో "ఎందుచేత?"

"వారికీ నాకు చాలా వారా ఉంది అందుకనే నేను సుమిత్రను చేసుకోమన్నాను. ఆయన సుమిత్రను తన చెల్లెలిగా భావిస్తున్నానన్నారు"

"అదయినా నీమీది వ్యామోహంచేత"

"ఏమో, నేనేం చెప్పగలను"

"మాది చాలా మర్యాద అయిన వంశం. గోపీ నిన్ను వివాహంచేసుకుంటే నేను, మా అన్నయ్యా—బంధువులు, స్నేహితులు అవమానంతో క్రుంగిపోతాం, గోపీమాత్రం, కొంతకాలమైన తర్వాత చింతిస్తాడు "

"అయితే నేనేం చెయ్యగలను?"

"నేను కోరేది నీకు కష్టంగా ఉండొచ్చు— నీవు గోపీని మళ్లీ చూడవద్దు. కలుసుకోవద్దు. క్రమేపి మరచిపోతాడు అప్పుడు తప్పకుండా సుమిత్రను పెండ్లిచేసుకుంటాడు"

"రాధ ముఖాన్ని చేతులతో కప్పేసుకుంది. ఏడుస్తూ "నేను గోపీని మనసార ప్రేమించాను. నాజన్మలో ఇంకెవ్వరినీ ప్రేమించలేదు. ఇంత ఘోరమైన శిక్ష విధిస్తే నేను భరించలేను"

"వేరేమార్గం లేదు. మొదట అలాగే ఉంటుంది తర్వాత మరచిపోతావు"

"నేనా...నేను జీవించి ఆయన్ని మరచిపోవడం అసాధ్యం"

కొన్ని క్షణాలు ఆలోచించింది రాధ "సరే. మీరు గోపీకి కన్నతల్లి. మీరు కోరినట్లే చేస్తాను!" ఆ మాటలు తననోటినుంచి ఎలా వచ్చినాయో ఆమెకు తెలియదు.

విశాలమ్మ రాధను లేవనెత్తి "నీవింత మంచి దానవని నాకు తెలియదు. నీగొప్పదనం ఎన్నడూ మరువను. నాజ్ఞాపకార్థం వీటిని తీసుకో. ఇవి నా స్వంత నగలు" అని నగలమూట చేతికియ్యబోయింది.

"వద్దు క్షమించండి. నేను ధనాన్ని అపేక్షించ లేదు. ఆ నగలు ధరించడానికి అర్హత నాకులేదు. సుమిత్రకియ్యండి." అని తీసుకోలేదు. విశాలమ్మకు కండ్లు చెమ్మగిల్లినవి. లేచి రాధను చేరదీసి కన్నీళ్లు తన కొంగుతో తుడిచి "నేనిక వెళ్తాను. నీకు ఏ సహాయం కావాలన్నా నాకు కబురుచెయ్యి" అని చెప్పి వెళ్లిపోయింది. ముసలమ్మ వాపసైనప్పుడు రాధ నేలమీద స్పృహలేక పడి ఉన్నది చూచింది.

*   *   *

అయిదారు రోజులైనవి. ప్రతి సాయంత్రం గోపీ బంగళాకు వెళ్లేవాడు. కాని రాధ రాలేదు. ఒక రోజు మాధవని అడిగాడు. మాధవ "ఏమోనండీ, ఇంటికి వెళ్లినా దర్శనం ఇయ్యలేదు" అని విసుగ్గా చెప్పాడు. "ఆరోగ్యం బాగాలేదేదేమో" అన్నాడు. గోపీ ఆదుర్దా కలిగింది. చూడకుండా ఉండడానికి సాధ్యం కాలేదు. మాధవరావుని ఆమె అడ్రసు అడిగి తెలుసుకున్నాడు.

చీకటిపడ్డ తర్వాత టాక్సీలో రాధ ఇల్లు చేరాడు. వీధి తలుపువద్ద ఒక ముసలమ్మ నిలుచుంది చుట్ట కాలుస్తూ. పనిమనిషో, రాధ అవ్వనో అయి ఉండాలి. కారుదిగి అడిగాడు. "రాధాదేవిని చూడవచ్చునా" ముసలమ్మ బోసి నోటితో నవ్వుతూ "ఎప్పుడూ రాలేదు కాబోలు. పైకెళ్ళు నాయనా." పైనుండి గానం వినబడుతూ ఉంది. మెట్లెక్కుతూఉంటే గజ్జెల శబ్దం. ఏదో నాట్యప్రదర్శనం జరుగుతుందని వూహించుకున్నాడు. మేడమీది గది ప్రవేశించగానే అతని కనులకు కనబడిన దృశ్యం స్వప్నంలో కనబడినా ఒడలు మండిపోయేది. ఇది వాస్తవమేనా. భ్రాంతియా, మాయనా, మోసమా— అవును రాధనే ఆ నర్తకి నన్ను మోసంచేసింది. తబలా, సారంగి వాయించే వాళ్ళు సరే— మిగతా వెధవలెవ్వరు? పండ్లు ఇకిలిస్తూ ఉన్న ఆ స్థూలకాయుడెవరు, లుంగీ కట్టుకున్న ఆ కుర్రకుంక. కండ్లజోడు కోటు తలపాగాతో ఖిల్లీ నములుతూ తన వూస్తూ ఉన్న ఆ పెద్దమనిషి— ఎవరు వీళ్లు, ఆ గ్లాసులేమి? ఆ సిగరెట్లు పొగ! అబ్బ తలతిరిగి పోతుంది. అతణ్ణి చూడ

హుసేన్ సాగర్

గానే రాధ నృత్యం ఆపేసింది. నిశ్చేష్టమైపోయింది. నోటమాట రాలేదు. గోపీకి పట్టరాని కోపం వచ్చింది. తుఫానులాగ "గెటవుట్" అని బిగ్గరగా అరిచాడు. అతని వాలకం చూచి అందరూ నిలబడ్డారు. గ్లాసుల్ని కాళ్లతోతన్నేసి గోపీ ఒక్కొక్కరిని బైటికి నెట్టేశాడు. అతని ఆవేశం, దర్పం, అధికారం చూచి భయపడ్డారు. ఎవరో పోలీసు ఉద్యోగి అనే అనుమానంతో తొందరగా దిగిపోయారు. గోపీ పర్సుతీసి వాద్యగాళ్లకు పదిరూపాయలిచ్చి "జావ్" అన్నాడు. పలకకుండా వెళ్లిపోయారు. రాధ ఒక్కతే ఉంది. సమీపించి ఈ చెంపా ఆ చెంపా వాయించాడు. రాధకు అప్పుడు చైతన్యం వచ్చింది. "హాయి! హాయి! ధన్యోస్మి— నాప్రాణ నాథుడు ఎంత ప్రేమతో, ఎంత చనువుతో ఎంత అధికారంతో నన్ను కొట్టాడు." అని రాధ తటాలున కిందపడిపోయింది. "భలే. నేను ప్రాణ నాథుణ్ణి. వీళ్లందరూ....." అని అపహసించాడు.

"వీళ్లా? పశువులు, కుక్కలు, ఎలకలు, దోమలు, చీమలు, పురుగులు, గడ్డిపరకలు— థూ! థూ!" అని చెప్పరాని అసహ్యంతో బిగ్గరగా అరిచింది. గోపీ రాధ

> వచ్చే వారమే!
> 'బాలసాహితి'
> శీర్షిక
> ప్రారంభం!
> బొమ్మలు: బాపు

ముఖం పరీక్షగా చూశాడు. చెంపలు ఎర్రగా కమిలిపోయినవి. జాలివేసింది. ఎంత అమానుషంగా ప్రవర్తించాను అని చింతించాడు. నేను వెళ్లిపోనా? అని అడిగాడు. రాధ అతని రెండు చేతులూ పట్టుకొని "వద్దు, వద్దు.... నేను వదలను. కావలిస్తే నన్ను చంపేసి వెళ్లిపొండి" అని కన్నీళ్లతో వేడుకొంది. గోపీ రాధను తన రొమ్మున చేర్చుకొని "వెళ్లలేను, వెళ్లలేను,.... నీవేమిచేసినా నిన్ను వదలలేను," అని ముద్దుపెట్టుకున్నాడు. మధువు వాసన వచ్చింది. కోపంరాలేదు, ఎందుకనో, "రాధా, నీవు తీసుకున్నది నాకియ్యవూ" అన్నాడు పరిహాసంతో రాధ నమ్మలేదు. "నిజంగా", "వూఁ"— లోపలి గదిలోకి వెళ్లి గ్లాసులో విస్కీ తీసుకుని వచ్చి ఇచ్చింది. "నీవు తాగి ఇయ్యి" రాధ అలాచేసింది. గోపీ గబగబా త్రాగేశాడు. తలతిరిగింది ఒకక్షణం. సర్దుకున్నాడు.

"మీరు నాకథ సావధానంగా వినాలి కూర్చోండి"

"ఈ రోజేనా"

"అవును ఈ రోజే. తరువాత అవకాశం చిక్కదేమో."

గోపీకి అర్థం కాకపోయినా "సరే" అన్నాడు. ఇద్దరూ కూర్చున్నారు. "వినండి, నా చరిత్ర టూకీగా చెప్పేస్తాను. నా తల్లిదండ్రులెవ్వరో నేనెక్కడ పుట్టానో నాకు తెలియదు. చిన్నప్పటినుంచి నాకు తెలిసింది, క్రింద మీరు చూచారే ఆవిడే. ఇప్పుడిలా ఉందికానీ యవ్వనంలో చాలా చలాకీగా అందంగా ఉండేది. సంగీతం, నృత్యం రెండింట్లో ప్రవీణ. ఆవిడే నాకు నేర్పింది. ఎంతో దయతో ఆదరంతో కన్న కూతురువలెనే నన్ను పెంచింది. నాకు లోకజ్ఞానం కొంచెం వచ్చాక తెలుసుకున్నాను ఆమె వృత్తి కేవలం వ్యభిచారంకాదు. ఆమె పాట వినటానికి, నృత్యం చూడటానికి మాత్రం వచ్చేవారు ఎక్కువమంది. మెచ్చుకొని రూకలిచ్చి వెళ్ళిపోయేవారు. ఎవరో ఒకరు ఎప్పుడైనా రాత్రి ఉండిపోయేవారు. సాధారణ కుటుంబ జీవనం తెలియని నాకు అందులో ఏమీ తప్పుగాగా కనబడేదికాదు. నాకు పదేండ్లప్పుడు ఆవిడ ఇంకొక పిల్లను తీసుకుని వచ్చింది. ఆపిల్లకు ఆట, పాట రాదుగాని చదువుకున్నది తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూలో ధారాళంగా చమత్కారంగా మాట్లాడేది. కొందరు విటులను ఆమె ఆకర్షించేది. ఆ పిల్ల దగ్గరే నేను చదువు నేర్చుకున్నాను. నాకు పదహారేండ్లు రాగానే ఆ అమ్మాయిని పంపించేసింది అమ్మ— మరి ఆమే అమ్మ నాకు. తరువాత నా ప్రకరణం."

"చెప్పవద్దు రాధా. నీవేమి చేయగలవు?"

"ఆ రోజు కచేరిలో మిమ్మల్ని చూచి మీగానం విన్నప్పటినుంచి ఎందుకో నాకు ఈ వృత్తిమీద జుగుప్స కలిగింది. పాట, నాట్యం తప్పిందికాదు. అంతే అమ్మ ఆక్షేపించింది. గాని నేను నిష్కర్షగా చెప్పేశాను. అలా నిర్బంధిస్తే పారిపోతానని. వృద్ధాప్యంతో ఆమెకు విదిలేక వూరకుండింది. మీతో పరిచయం ఎక్కువై — మిమ్మల్ని ప్రేమించినప్పటినుంచి పాట, ఆటకూడా మానేశాను........."

"మరి నేడు?"

"అది ఇంకొక కథ. నిన్న మీ అమ్మగారు మా ఇంటికి వచ్చారు"

"ఆఁ ఆఁ"

"రాకూడదనా"

"కాదు. ఏదో ప్రబలకారణం లేకపోతే వచ్చి ఉండదే అని"

"అవును. ప్రబల కారణమే......మిమ్మల్ని ఇకనెప్పుడూ చూడనని నావద్ద ప్రమాణం తీసుకున్నారు."

"ఎంత అన్యాయం. ఎంత క్రూరం.... నీవెలా అంగీకరించావు........"

"మీకోసం, మీ కుటుంబ మర్యాదకోసం, మీ కన్నతల్లి మనశ్శాంతి కోసం"

"ఇది అక్రమం. ఈ ప్రమాణం నన్ను బంధించదు. రేపే మనం వివాహం చేసుకొందాం. అప్పుడు నాభార్యవైన నీవు నా మాటను ఉల్లంఘించలేవు. మనఃపూర్వకంగా చేసిన ప్రమాణంకాదు. బలవంతం మీద ఇచ్చినమాట పాటించనక్కరలేదు. రాధా— వేరే మార్గంలేదు. రేపే, రేపే, నేనన్ని ఏర్పాట్లు చేస్తాను. గుళ్లో పెండ్లి చేసుకుందాం, ఈశ్వరుని సమక్షంలో..... అమ్మ ఇంత అమానుషంగా ప్రవర్తిస్తుందని అనుకోలేదు"

"రేపు మాటరేపు. ఈ రోజు ఈ రాత్రి మనది. నా నృత్యం మీరెన్నడూ చూడలేదు... మీరు పాడండి నేను నాట్యం చేస్తాను. జయదేవుడు అష్టపదులు పాడుతూ ఉంటే పద్మావతి నృత్యం చేసేదటకదూ"

గోపీ అష్టపది పాడుతూ ఉంటే రాధ నృత్యం చేసింది. అద్భుతంగా, నిరుపమానంగా, ఆ హస్త విన్యాసం, చరణ లాఘవం, ఆదేహ భంగిమలావణ్యం ఆ భావ ప్రకటన— గోపీని ముగ్ధుణ్ణి చేసినవి. శాపవశాత్తు భూలోకంలో అవతరించిన అప్సరస అనిపించింది గోపీకి. పాట, నృత్యం ముగించగానే రాధను తన కౌగిట చేర్చుకున్నాడు గోపీ. అర్ధరాత్రి దాటింది. గోపీ రాధను వీడి వెళ్లే సరికి....

"రాధా! రేపు.......కలుసుకుందాం"

"ఆఁ....... మనం కలుసుకోకుండా ఉండలేము... ఎప్పటికైనా."

రాధ మాటల్లో గూఢార్థంబోధపడలేదు,గోపీకి.

* * *

తెల్లవారి బండిలో వెంకటేశ్వర్లు వచ్చాడు. స్నానంచేసి కాఫీ త్రాగుతూ వీధిగదిలో కూర్చుని విశాలమ్మతో ఇదీ అదీ మాట్లాడుతూ ఉన్నప్పుడు విశాలమ్మ గోపీ వివాహ విషయం తెచ్చింది. "అన్నయ్యా! త్వరలో ముహూర్తం పెట్టుకుంటే బాగుంటుందికదూ. శుభస్యశీఘ్రం అన్నారు పెద్దలు. మనం ఉన్నప్పుడే వాళ్లకి పెండ్లై సంతానం కలిగితే తర్వాత ఎప్పుడైనా మనం దాటుకోవచ్చు"

"సరే నే వద్దన్నానా. గోపీని అడిగావా"

"పిల్లల్ని అడగటం ఏమిటి. నన్ను, నిన్ను అడిగారా మన తలిదండ్రులు"

"ఆకాలంవేరు విశాలమ్మా"

ఎవరో తలుపు తట్టారు. వెంకటేశ్వర్లు వెళ్లి తీసాడు. మాధవరావు వెర్రిగా ప్రవేశించి "ఏమండోయ్ ఈ ఘోరం విన్నారా" అని గట్టిగా అరిచాడు.

"ఏం మాధవా, ఏమిటా ఖంగారు. ఏం జరిగింది" అని విశాలమ్మ అడిగింది.

"రాధ ఆత్మహత్య చేసుకుంది, హుసేన్‌సాగర్‌లో పడి నేటి ఉదయం కార్పొరేషన్ నౌకర్ తేలుతూ ఉన్న శవాన్ని చూచి పోలీసు వాళ్లతో చెప్పాడట. ఇంత దారుణం ఎందుకుచేసిందో"

"ఆఁ ఆఁ" అనడంతప్ప విశాలమ్మకు వేరేమాట రాలేదు. మాధవ అరుపువిని లోపలినుంచివచ్చినసుమిత్ర అంతా వింటూ ఉంది. అయితే ఎవరూ చూడలేదు. వెంకటేశ్వర్లుకు అయోమయంగా ఉంది. "ఎవరీ రాధ?" అని అడిగాడు. విశాలమ్మ గద్గదస్వరంతో చెప్పసాగింది. "అన్నయ్యా! నేనుచేసిన అపరాధం విను.....రాధ ఒక భోగంపిల్ల. మనగోపీకి ఆవిడతో ఎలాగో పరియం అయింది. ఆవిడ మాయలో పూర్తిగా పడిపోయాడు. మన సుమిత్రను వివాహం చేసుకోనన్నాడు. తుదకు ఆవిడనే పెండ్లాడతానని చెప్పేశాడు. నేనెలా ఒప్పుకుంటాను. వేరే మార్గంలేక నేను స్వయంగా వెళ్లి ఆ అమ్మాయిని వేడుకున్నాను. గోపీని చూడవద్దిక అని. సరే అని ప్రమాణం చేసింది .... ఇంత త్యాగం చేస్తుందని నే నెలా తలుస్తాను. అన్నయ్యా ! నే చేసిందంతా మన కుటుంబ గౌరవాన్ని రక్షించడానికే చేశాను....." వెంకటేశ్వర్లు చలించిపోయాడు. "ఎంతపని చేశావు, విశాలమ్మా ! మన సుమిత్రకు వేరే సంబంధమే దొరక్కపోయేదా. ఏవో చిన్నతనంవల్ల అలా అన్నా గోపీకి మాత్రం అంత సాహసం ఉంటుందా."

సుమిత్ర నిశ్శబ్దంగా ఏడుస్తూ నిలబడింది. గోపీ తన గదిలో నుంచి క్రిందికి దిగి వచ్చాడు. ఒకసారి అందరినీ కలియజూచాడు. ఎందు కిలా ఉన్నారు ? ఏం జరిగింది ? గోపీని చూడగానే సుమిత్ర వచ్చి కాళ్లమీద పడింది. "బావా ! అంతకూ కారణం నేను. అయినా నే నిందులో ఏమి చెయ్యలేదు. బావా ఎలా చెప్పను ? ఎలా భరిస్తావు .... నీ రాధ హుసేన్‌సాగర్‌లో పడి మరణించింది." పిడుగు వంటి వార్త వినగానే గోపీ కూలిపోయాడు. నెత్తి బాదుకున్నాడు. లేచి వెర్రిగా "అమ్మా, నీవే చంపేశావు. నన్ను కూడా చంపేయరాదూ" అని అరిచి "ఎక్కడుంది నా రాధ ?" అంటూ గుమ్మం దగ్గరకు పోతుండే వెంకటేశ్వర్లు చెయ్యి పట్టుకొని "గోపీ, వెళ్లి ఏం చేస్తావు. పదిమంది ముందర అవమానం తప్ప ఏమీ లాభంలేదు" అని నెమ్మదిగా చెప్పాడు. గోపీ పైకి వెళ్లిపోయాడు.

ఆనాటినుంచి గోపీ మంచం పట్టాడు. గడ్డం చేసుకోడు. స్నానం చెయ్యడు. పిచ్చి మాటలు, వెర్రి చూపులు. డాక్టర్ వచ్చి రాత్రిళ్లు ఇంజెక్షన్ ఇచ్చేవాడు. మత్తుగా నిద్రపట్టడానికి. సుమిత్ర ఎప్పుడూ బావ ప్రక్క వదలలేదు. కాఫీ ఇచ్చేది. అన్నం తెచ్చి ఏవో రెండు మెతుకులు గతికేవరకు నిలబడి ఉండేది. రెండువారాలైనవి. గోపీ ఉన్మాదావస్థ తగ్గింది. అయితే కళ్లలో వైరాగ్యం. కార్యాల్లో పరధ్యాన్నం చూచి సుమిత్ర దుఃఖించేది. ఒకనాడు సుమిత్ర తనను చూచి జాలిగా ఏడవడం గుర్తించాడు గోపీ. మెల్లగా అన్నాడు. "సుమిత్రా, ఎంత మంచిదానవు".

"నేనా ? నీ పాలిటి యమదూతను."

"కాదు—ఇందులో నీ తప్పు ఏమీ లేదు.. ఎవరి తప్పూ లేదేమో."

* * *

ఆనాడు పౌర్ణిమ. గోపీ సుమిత్రతో "షికారు వెళ్దామా" అన్నాడు. సుమిత్రకు ఆశ్చర్యమైంది. "కార్లో వెళ్దాం రండి" అని చెప్పింది. కార్లో ఇద్దరూ కూర్చున్నారు. బంజారా వైపు పోనీమన్నది డ్రైవర్‌తో. పండు వెన్నెల. చల్లగాలి. గోపీ ఈ లోకంలో లేడు. ఒకనాడు ఇటువంటి వెన్నెల రాత్రి బంగళా డాబామీద రాధతో కూర్చున్నది స్మృతికి వచ్చింది. ఉన్నట్లుండి గోపీ డ్రైవరుతో హుసేన్‌సాగర్ వైపు పొమ్మన్నాడు. సుమిత్ర కెందుకో భయం వేసింది. కాని, ఆక్షేపించడానికి ధైర్యం చాలలేదు.

హుసేన్‌సాగర్ ఆ వెన్నెల రేయిలో రమణీయంగా కనబడింది. గోపీ కారునుంచి దిగాడు. సుమిత్ర కూడ దిగింది. మెల్లగా ఒడ్డు దగ్గరికి వెళ్తున్నాడు. సుమిత్రకు అనిర్వచనీయమైన భీతి కలిగింది. గోపీ చెయ్యి పట్టుకునే ఉన్నది. పూర్ణచంద్రుని ప్రతిబింబం నీళ్లల్లో ప్రకాశిస్తూ ఉంది. చూస్తూ నిలబడ్డారు. తటాలున గోపీ "అదో, అదో రాధ నా రాధ—నన్ను రమ్మని పిలుస్తూ ఉంది ...." అని సుమిత్ర పట్టుకున్న చెయ్యి విదిలించుకుని నీళ్లల్లోకి ఒక్క దూకు దూకాడు... "బావా ! బావా !" అని వెర్రిగా అరుస్తూ, ఆలోచించకుండా సుమిత్ర కూడా దూకింది. బావను రక్షించాలని. ఇద్దరికీ ఈత రాదు .....

చాలా ఆలస్యమైంది. ఎంతకూ రారేమా అని డ్రైవరు వెదుకుతూ వచ్చి రెండు శవాలు తేలుతూ ఉంటే చూచాడు.

ప్రేమ అనే హుసేన్‌సాగర్—రాధ—గోపీ—సుమిత్ర—ముగ్గుర్ని ముంచేసింది. ★

గారి వాంఛ కాబోలు !

పత్రికలలో వస్తున్న ప్రకారం కాశ్మీరులో మధ్యతర ఎన్నికలు జరగాలని, అందులో ప్రజలు తన వైపే మొగ్గు చూపాలని అబ్దుల్లా అనుకొంటున్నారట. అదే జరగకపోతే, పాకిస్తాన్‌లో జిన్నాసాహెబ్ గారు చేసినట్లు, కాశ్మీరులో కూడా అబ్దుల్లా "సదార్— ఇ— రియసత్" అమలు జరిపి, తనంతట తనే పదవి నొక దానిని స్వీకరించవచ్చు. ఏమైనా, కాశ్మీరులో తనదే పైచేయి కావాలని అబ్దుల్లా ఆరాటం.

కాశ్మీరు సమస్యను ఎలా పరిష్కరించాలన్నా, పాకిస్తాన్‌ను రంగంలోకి తీసుకు రావాలని అతను మొదటి నుంచీ చెప్తూనే ఉన్నాడు. తనేదో, పాకిస్తాన్— ఇండియాల మధ్య సంబంధ బాంధవ్యాలను పెంచాలని కృషి చేస్తున్నట్లు, అందరూ అనుకోవాలని అతని ఆరాటం. అందువల్ల ఎలాంటి త్రైపక్ష సమావేశం జరిగినా— అబ్దుల్లా పాకిస్తాన్ వైపే మొగ్గుతాడు కనుక— చివరకు ఇండియాకు నష్టం పడక తప్పదు.

న్యూఢిల్లీ లేఖ

7 వ పేజీ తరువాయి

కాశ్మీరు పాకిస్తాన్‌లో కలిసి పోవాలని అబ్దుల్లా అనుకొంటున్నాడా ?— కానే కాదు. అతనికి అలాంటి అభిప్రాయమే లేదు. అదే నిజమయితే, అబ్దుల్లా కూడా పాకిస్తాన్‌లో ఉండే లక్షలాది సాయబుల్లో ఒకడవుతాడు.... చాలా మంది విదేశీ యాత్రికులతో కాశ్మీరు ప్రజలు.... తాము తటస్థ విధానం, స్వాతంత్ర్యం యొక్క లాభాలను గురించి.... నెహ్రూవద్ద గుణ పాఠాలు నేర్చుకొన్నారని చెప్పారుట. వాళ్ల అభిప్రాయం ప్రకారం, అదృష్టం కాశ్మీరు వాకిట్లో కాచుకొని కూర్చుకొన్నదట. అవసరమయితే, కాశ్మీరులోకి, రష్యా అమెరికా, చైనా, పాకిస్తాన్, ఇండియాలు కోట్ల రూపాయలను వర్షింప చేస్తాయట. ఎంత వరకు నిజమో

ఒప్పందం కుదిరేందుకు అవకాశా లేమిటి ? అసల్లేవనే చెప్పాలి. దీనికి ఎన్నో కారణాలున్నాయ్.

మొదటిది : అబ్దుల్లా ఉద్రిక్తతను తగ్గించాలనే అభిప్రాయానికే, కాంగ్రెసులో చాలా మంది వ్యతిరేకులై ఉన్నారు. మొరార్జీ, కృష్ణమీనన్ కత్తులు దూస్తున్నారు. నందాగారు తాను అబ్దుల్లాకు ఏమి చెప్పినారో, బహిరంగ పరచారు. నెహ్రూ గారు, కాస్త బలహీనంగా ఉన్నా, ప్రమాదకర పరిస్థితిని గుర్తించక పోలేదు.


మరోవైపు—

నెహ్రూగారి ఆలోచనారహిత ప్రభుత్వంలో షేక్ అబ్దుల్లాకు కాశ్మీరులోని మహమ్మదీయులను రెచ్చగొట్టే అవకాశం లభించింది.

అబ్దుల్లా మనోరథం నెరవేరితే, ఇండియాలో బహిరంగమైన తిరుగుబాటు ఉండటం తథ్యం.

పరిస్థితి ఎంతో ప్రమాదకరంగా ఉన్నది.

శ్రీకృష్ణ ★



లాన్సింగ్ విమానాశ్రయంలో తెలుగుమిత్రుల వీడ్కోలు.

అ మె రి కా అ ను భూ తు లు...

గంటలతరబడి ఇంగ్లీషులోనే మాట్లాడవలసివస్తోంది: అక్కినేని

అమెరికాలో పర్యటిస్తున్న శ్రీ అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాదులో తనవారికి రాస్తున్న ఉత్తరాలలోని విషయాలను కొన్నింటిని యేరి ఈ వ్యాస రూపంగా పొందుపరుస్తున్నాం—

గంటల తరబడి ఇంగ్లీషులో మాట్లాడాల్సి వస్తోంది—అయినా మాట్లాడేస్తున్నాను. హైస్కూళ్ళకి, కాలేజీలకు వెళ్ళి నేను చదువుకోలేదని తెలిసే సరికి ఇక్కడి వాళ్ళందరికి వింతగా, విడ్డూరంగా ఉంది.....ఎక్కడా ఇది మామూలే.....

అమెరికా వెళ్ళేముందు, అమెరికాలో తెలుగు భోజనం దొరకుందో లేదో అనిపించేది. దొరక్కపోతే ఆరోగ్యం దెబ్బ తింటుందేమో అనిపించేది— ఇప్పుడు మాత్రం అంతా చిత్రం. ప్రతిచోట తెలుగు మిత్రులు కనిపిస్తున్నారు. సుష్టుగా తెలుగు భోజనం. ఈ ఆదరణ, ఈ తిండి చూస్తుంటే, మితిమీరి ఆరోగ్యం చెడుతుందేమోనని భయం వేస్తోంది ఇప్పుడు.

మరో తమాషా— నేను కజ్జికాయలు తింటానని వీళ్ళకి ఎలా తెలిసిందో! ఎక్కడికి వెళ్ళినా అవే వేసి పెడుతున్నారు.....ఇహ 'పులిహోర' ఒకటే తక్కువ. అదికూడా చేయించేస్తారేమో....

అమెరికాలో ఆదరణ ఇది. చక్కని మర్యాద ప్రతిచోటా శ్రీ నాగేశ్వరరావును ఆహ్వానిస్తోంది. పర్యటిస్తున్న వారు తెలుగువారు కావటం— తత్సంబంధంగానే, తదనుగుణంగానే ఏర్పాట్లు అమెరికా ప్రభుత్వంవారు అమరుస్తున్నారుట.

ఇంతవరకు అయిదు టెలివిజన్ ఇంటర్వ్యూలు జరిగినాయి. అట్లాగే పత్రికల వారితో గోష్ఠికూడా.

తేలిపోతున్న గాలిని అల్లలాడిస్తూ, పూర్వాపరాల అపూర్వ మేళవింపును ద్యోతకంచేసే పొందూరు ఖద్దరుపంచ, జుబ్బా ధరించిన నాగేశ్వరరావు— అతని వేషం వ్యక్తిత్వం— ఖండాంతరాల విశిష్ట సమన్వయాన్ని స్ఫురింపజేస్తున్నాడు. అంటూ ఆదేశపు ఒక ప్రముఖ పత్రిక వ్యాఖ్యానించింది.

"సియటల్"లోని ప్లేహౌస్ "నాటకశాల"ను సందర్శించటానికి శ్రీ నాగేశ్వరరావు అసలైన ఆంధ్ర వేషంలో ఉత్తరీయంతో వెళ్లారుట.

అన్నివేల మైళ్ళ అవతల దేశాంతరాన తనజాతి, తన సాంప్రదాయ సంపద నిండుగా చెప్పుకుంటూ ఉంటే శ్రీ నాగేశ్వరరావుకు ఒక విచిత్రానుభూతి ఎంతో మెప్పుగా అనిపిస్తోంది.

"మొన్న 'మనియా పొలిస్' నుంచి రైలులో 'సియటెల్' చేరాం. 1772 మైళ్ళ రైలు ప్రయాణం ఎంతో అందంగా ఉంది. 'గ్లాస్‌డోం' రైలులో కూర్చుంటే ఆరుబయట డాబామీద కూర్చున్నట్లనిపించింది. నాలుగు మూలలా చుట్టూ ప్రపంచం, చల్లగా జారిపోతున్నట్లనిపించింది. పెద్ద పెద్ద పంట పొలాలూ దాటిన తరువాత కొండ ప్రాంతం ప్రవేశిస్తే, అయిదారు అడుగుల మందాన మంచు— తెల్లటి పొందూరు ఖద్దరు పరచినట్లనిపించింది......" అని రాస్తున్నారాయన.

"ఐస్‌ఎరేనా" లో రెండు వందలమంది, ఆడ మగ, రకరకాల అందమైన దుస్తుల్లో "స్కేటింగ్ చేస్తూ డ్యాన్స్ చేస్తుంటే కొన్నివేల మంది ప్రేక్షకులు— ఆదృశ్యం ఎప్పటికీ మరచిపోలేరు" అంటారు శ్రీ అక్కినేని.

సరిగ్గా ఈ రోజు: అంటే ఏప్రిల్ 29న శ్రీ నాగేశ్వరరావు 'లాస్ ఏంజెల్స్' కాలిఫోర్నియా ప్రాంతంలో పర్యటిస్తున్నారు. మే రెండవ తేదీన పశ్చిమ దిక్కుగా విమానంమీద బయలుదేరి ఒక పక్షం రోజులపాటు పడమరదిక్కు ప్రాంతాలను పర్యటిస్తారు. ఇప్పటివరకు తూర్పుభాగ పర్యటన పూర్తి అయింది.

అమెరికాలో ప్రతి యూనివర్సిటీలోనూ నాటకానికి సంబంధించిన కోర్సు ఉంది. ప్రతిచోటా సాంకేతిక విలువలకు ఎక్కువ ప్రాధాన్యత, చక్కటి శిక్షణ.

ఏప్రిల్ 21వ తేదీ రాత్రి 8 గంటలకు కాలిఫోర్నియా యూనివర్సిటీలో శాన్‌ఫ్రాన్‌సిస్కోలో భారతీయ విద్యార్థులు 'రిసెప్షన్' ఏర్పాటుచేశారు.

ఆ యూనివర్సిటీలో తెలుగు నేర్పుతున్న శ్రీ దొరస్వామిగారిని శ్రీ నాగేశ్వరరావు కలుసుకున్నారు.

నాటకకళలో అనేక రీతులలో వాషింగ్టన్ ప్రాంతపు 'సియటెల్'లో అపూర్వకృషి జరుగుతోంది. అక్కడ 'ప్లేహౌస్' ఒక ఉన్నత స్థాయిని పొందిన శిక్షణాశాల కూడా.

నాటక కళలో వివిధ రీతులలో వివిధ ప్రయోగాలు చేస్తున్నారు. వీటిని ఎంతో ఉత్సాహంగా శ్రీ అక్కినేని చూస్తున్నారు.

'కింగ్ లియర్' అనే నాటకాన్ని ఆయన చూచారు.

ఏప్రిల్ 17వ తేదీన 'ఒలంపిక్ పెనిన్సులా' లోని ఒలింపిక్ నేషనల్ పార్కును శ్రీ నాగేశ్వరరావు చూచారు. 8,88,558 ఎకరాల భూభాగంలో విస్తరించుకున్న ఒక సహజ జంతు ప్రదర్శన శాల ఇది ఇలాంటివి ఆ దేశంలో మరి నాలుగు పార్కులున్నాయి.

భారతీయులంటే అక్కడి వారిలో చాలామందిలో ఒక విచిత్రమైన కుతూహలం కనిపిస్తుంది. భారత దేశాన్ని గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం, అక్కడికి వెళ్ళాలనే కోరిక ఎంతో బలంగా ఉంటాయి. వారందరినీ కలుసుకుని మాట్లాడుకుంటుంటే— శ్రీ అక్కినేనికి అదొక విచిత్రానుభూతి.

విశాలమైన రోడ్లు, ఎత్తైన మేడలు. రెండు వందల మైళ్ళనుంచి కార్లమీద వచ్చారుట కొందరు. ఇంతదూరం ప్రయాణం క్షణాలమీద జరిగిపోతూ ఉంటుంది. అన్నీ అంతే భారీగా చకా చకా జరిగిపోతాయి. టెలివిజన్, సినిమా, నాటకం— అన్నీ ఉన్నతంగా— ఆదేశంలో ఆధునిక నాగరికత అత్యున్నత ప్రమాణాలు అందుకుంది......

తాను భారతీయుడు, తెలుగువాడు—....

"ఏదేశమేగినా, ఎందుకాలిడినా....." రాయప్రోలు వారి పద్యం తనను ఒకవింత అనుభూతితో ముంచెత్తివేస్తుంది.

అందుకే 'ప్లేహౌస్' చూడటానికి వెళుతూ

కొండూరు ఖద్దరు పంచె, జుబ్బా ధరిస్తే— వింతో విందుగా అనిపించింది తనకు—

*   *   *

ప్రఖ్యాత సినీ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు అమెరికాదేశపు చలన చిత్ర రాజధాని లాస్ ఏంజలిస్ నగరానికి వెళ్లినప్పటి నుంచి విసుగు విరామం లేకుండా అనేక కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఆయన 'ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్' స్టూడియో, వాల్ట్ డిస్నీ ప్రొడక్షన్స్, యూనివర్సల్ స్టూడియోస్, మెట్రో—గోల్డ్ విన్— మేయర్ స్టూడియోస్‌తో సహా అనేక చలన చిత్ర నిర్మాణ శాలలను చూచారు.

"డిస్నీ స్టూడియో చూడటం నిజంగా ఒక గొప్ప అనుభూతి. అక్కడ పని చేసేవారు సాంకేతికులు, కళాకారులే కాదు. వారు శాస్త్రవేత్తలు వారి కృషి అత్యద్భుతంగా ఉంది. మా అయిదు గురు పిల్లలకు వారు అయిదు కార్టూన్ కారెక్టరు రేఖా చిత్రాలు బహూకరించినందుకు వారికి నా కృతజ్ఞతల తెలుపవలసి ఉంది" అన్నారు శ్రీ అక్కినేని.

అక్కడికి దగ్గరలోనే ఎనాహైమ్ అనే ప్రదేశంలో ఉన్న డిస్నీలాండ్ కూడా చూచి ఇది గొప్ప వినోద ప్రదేశం అని వర్ణించారు శ్రీ నాగేశ్వరరావు. పసిఫిక్‌లోని మెరైన్ లాండ్ చూచి

అమెరికాలో అక్కినేని....

ఆయన చాల మెచ్చుకొన్నారు. ఇక్కడ చేవల వేళ వింతవింత పనులు చేయిస్తారు.

చలన చిత్ర నిర్మాతల సంఘం వారి చిత్ర నిర్మాణ నిబంధనల అమలును తనికీ చేసే ఆ సంఘం అధికారి జ్యాఫ్రీ షర్నాక్‌తో శ్రీ అక్కినేని ముచ్చటించారు.

స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ (చలన చిత్ర నటుల సంఘం), దర్శకుల సంఘం వంటి సంస్థలు అవి చేస్తున్న కృషి శ్రీ నాగేశ్వరరావుకి బాగా నచ్చాయి.

అమెరికా విదేశాంగ శాఖవారి సాంస్కృతిక వినిమయ కార్యక్రమం పరంగా ప్రభుత్వ ఆహ్వానంపై వచ్చిన శ్రీ నాగేశ్వరరావు పర్యటనలో సగానికి పైగా పూర్తి అయింది.

సినిమానాటక కళకు విశ్వవిద్యాలయాల అమోఘసేవ

అమెరికాలో నాటక పాఠశాలలు సినిమా నాటక కళక సంబంధించిన అన్ని విషయాలను కూలంకషంగా బోధించి, శిక్షణ గరిపే ఏర్పాటు వల్ల సినిమా పరిశ్రమ భవిష్యత్తు పదిలంగా ఉన్నదని చెప్పవచ్చునన్నారు శ్రీ అక్కినేని.

అమెరికాలో ఆయన అనేక అద్భుత విషయాలు చూచారు. అన్నిటిలోకి ఇక్కడి కళాశాలలు విద్యార్థులకు నాటక కళలు బోధించటంలో చూపే గొప్ప శ్రద్ధా శక్తులు ఆయన్ను ముగ్ధుణ్ణి చేశాయి.

"ఇక్కడ నాటక కళలు బోధించే అధ్యాపకులు ఏదో జీతం కోసం అని గాక అతి ఉత్సాహంతో బోధిస్తుంటారు. ఇక్కడి విద్యార్థులను చూస్తుంటే భవిష్యత్తులో పుష్పించగల ఫలాలను చూస్తున్నట్లనిపిస్తుంది." అన్నారు శ్రీ అక్కినేని.

తన పర్యటన పూర్తి అయిన తర్వాత తన యాత్రానుభవాలను పుస్తక రూపంలో ప్రచురించాలనుకొంటున్నానని చెప్పారాయన. "ఎన్నెన్నో సంగతులు చూచాను. అన్నీ విడివిడిగా అందరికీ చెప్పటం సాధ్యం కాదు. ఒక పుస్తక రూపంలో ఈ అనుభవాలన్నిటినీ ప్రచురిస్తే నా ఈ యాత్రలో జరిగిన సంగతులు, అయిన అనుభవాలు, తెలుసుకొన్న విశేషాలు గురించి అందరూ తెలుసుకోటానికి అవకాశం కల్గుతుంది" అన్నారు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు. ★



దాగుడు మూతలు చిత్రంలో యన్. టి. రామారావు బి. సరోజాదేవి.

మద్రాస్ సినిమా వార్తలు

ప్రముఖ సినీతార శ్రీమతి కన్నాంబ అస్తమయం

వంద చిత్రాలకు పైగా నటించి, యావత్ దక్షిణ భారత చలనచిత్ర సీమలో నటీమణిగా అసమాన ఖ్యాతి నార్జించిన శ్రీమతి పసుపులేటి కన్నాంబ కొన్ని మాసాల నుండి అస్వస్థతగా ఉన్నందువలన శస్త్ర చికిత్స జరిగింది. ఈ మధ్య నులువుగానే ఉంది. నయమయింది కూడా. మూడు రోజుల క్రితం ఆయాసంగా ఉన్నందువలన ప్రయివేటు హాస్పటల్‌లో చేర్చారు. 7వ తేదీ ఉదయం 4 గంటలకు స్వర్గస్థురాలైనారు. ఆ సమయానికి ఆమెకు కావలసిన వారందరూ దగ్గరనే ఉన్నారు. ఉదయం 6 గంటలకు ఇంటికి తీసుకు వచ్చారు. మద్రాసులోని ఫిలిం పరిశ్రమలోని వారందరూ ఆమె భౌతిక దేహాన్ని చూడటానికి వచ్చారు. ఆ రోజు సాయంత్రం అంత్యక్రియలు జరిపారు. అభిమానులు, శ్రేయోభిలాషులు భాషా, వర్గ భేదములు లేకుండా తండోపతండాలుగా ఇంటికి వచ్చి కడసారిగా ఆమెను చూసారు.

జకార్తా ఫిలిం ఉత్సవాలలో రంగారావు ఉత్తమ నటుడు

జకార్తాలో జరిగిన ఫిలిం ఉత్సవాలకు రాజ్యం పిక్చర్సు వారి 'నర్తనశాల' చిత్రం డాక్యుమెంటరీ చిత్రంగా భారత దేశం నుండి ఎన్నిక కాబడిన విషయం పాఠకులకు తెలిసిందే. 13 వేల అడుగుల నిడివితో పంపబడింది. ఈ చిత్రానికి డాక్యుమెంటరీ శ్రీ గిడుగు రామారావు ("సబ్ ఎడిటర్" మెయిల్) ఇంగ్లీషులో వ్రాశారు.

ఈ చిత్రంతో పాటు డిస్ట్రిబ్యూటరు శ్రీ సుందర్‌లాల్ నాహాతా, వారి సతీమణి, నిర్మాతలు శ్రీధరరావు, శ్రీమతి లక్ష్మీరాజ్యం, నటీ నటులు యస్. వి. రంగారావు, రేలంగి, సావిత్రి కూడా వెళ్ళారు.

ఈ చిత్రంలో కళా దర్శకుడు టి. వి. యస్. శర్మగార్కి అంతర్జాతీయ ఉత్తమ కళా దర్శకునిగా, అంతర్జాతీయ ఉత్తమ నటుడుగా యస్. వి. రంగారావు గార్కి బహుమతులు లభించాయి.

6వ తేదీ రాత్రి మద్రాసు విమానాశ్రయంలో వీరంతా విమానం దిగేసరికి మద్రాసులోని ఫిలిం పారిశ్రామికులు, నటీనటులంతా ఘనమైన సుస్వాగతాన్నిస్తూ, పూల మాలలతోను, హారతి నీరాజనాలతోను సంతోషాన్ని వెలిబుచ్చారు. బాణసంచా కూడా కాల్చారు.

"దాగుడుమూతలు"

డి. బి. ఎన్. ప్రొడక్షన్సు వారి దాగుడుమూతలు చిత్రానికి 8 పాటలను రికార్డు చేశారు. 8 పాటలను చిత్రీకరించారు. ఈ చిత్రాన్ని జూన్

వెలలో విడుదల చేయనున్నట్లు నిర్మాత తెలియ జేశారు.

"అందలం ఎక్కాడమ్మా. . . .
. . . . . . అందకుండా పోయాడమ్మా"

పై పాటను ఆత్రేయ వ్రాయగా ఘంటసాల, సుశీల పాడగా రికార్డు చేశారు యన్. టి. రామా రావు, బి. సరోజాదేవిలతో చిత్రీకరించారు.

"అడగక ఇచ్చిన మనసే ముద్దు. . . .
అందీ అందని అందమే ముద్దు. . . ."

పై పాటను కూడా ఆత్రేయ వ్రాశారు. ఘంటసాల, సుశీల పాడగా రికార్డు చేశారు. రామా రావు, బి. సరోజాదేవితో చిత్రీకరించారు.

"దేవుడనే వాడున్నాడా అని. . . . . .
. . . . మనిషికి కలిగెను సందేహం —
మనుషుడనే వాడున్నాడా అని. . . . .
. . . . దేవుని కొచ్చెను అనుమానం—"

పై పాటను కూడా ఆత్రేయ వ్రాశారు. ఘంటసాల, పి. సుశీల పాడగా రికార్డు చేశారు. యన్. టి. రామారావు, బి. సరోజాదేవితో చిత్రీకరించారు.

"మెల్ల మెల్ల మెల్లగా అణువు అణువు నీదెగా"

పై పాటను కూడా ఆత్రేయ వ్రాశారు. ఘంటసాల, పి. సుశీల పాడగా రికార్డు చేశారు. యన్. టి. రామారావు, బి. సరోజాదేవిలతో చిత్రీక రించారు.

"డిప్పీ డిప్పీ డివిట్టం. . . .
గట్టెక్కింది మనకష్టం. . . ."

పై పాటను ఆరుద్ర వ్రాశారు. పిఠాపురం నాగేశ్వరరావు, స్వర్ణలత పాడగా రికార్డు చేశారు. పద్మనాభం, శారదలతో చిత్రీకరించారు.

"గోరంక కెందుకో కొండంత అలక. . .
అలకలో ఏముందో తెలుసుకో చిలుక. . ."

పై పాటను దాశరథి వ్రాశారు. సుశీల పాడగా రికార్డు చేశారు. బి. సరోజాదేవితో చిత్రీకరించారు.

"గోరంక గూటికే చేరేవు చిలుక. . . .
భయమెందుకే నీకు బంగారు మొలక. . ."

ఈ పై పాటను కూడా దాశరథి వ్రాశారు. ఘంటసాల పాడగా రికార్డు చేశారు. యన్. టి. రామారావుతో చిత్రీకరించారు.

"ఎంకిచ్చిందోయి మామ— ఎదురొచ్చిం దోయి. . .
ఎదురొచ్చి నీ కోసం— ఏదో తెచ్చిందోయి"

పై పాటను ఆరుద్ర వ్రాశారు. సుశీల పాడగా రికార్డు చేశారు బి. సరోజాదేవితో చిత్రీకరించారు.

చిత్రం దాదాపు పూర్తి అయినట్లే, ఈ చిత్రానికి మాటలు ముళ్లపూడి వెంకటరమణ, పాటలు : ఆత్రేయ, ఆరుద్ర, దాశరథి; ఛాయ : పి. యల్. రాయ్, సంగీతం: కె. వి. మహాదేవన్, కళ : కృష్ణారావు, నృత్యం: పి. ఎస్. గోపాల కృష్ణ, కూర్పు : కృష్ణ, స్టూడియో: విజయా, వాహినీ; నిర్మాత : డి. బి. నారాయణ, దర్శకుడు : ఆదుర్తి సుబ్బారావు. ఈ చిత్రంలో యన్. టి. రామారావు, బి. సరోజాదేవి, గుమ్మడి, రమణారెడ్డి, పద్మనాభం, సూర్యకాంతం, అల్లు రామలింగయ్య, శారద మొదలగు వారు నటిస్తున్నారు.

సినీ నటుడు చలానికి భార్యావియోగం


ఆంధ్రదేశంలో ఆంధ్రా దిలీప్‌గా వెండితెరపై నటుడుగా ఖ్యాతి నార్జించిన సినీ నటుడు చలం భార్య వెంకట రమణమ్మ నీటిని మరిగించడానికి బోయిలర్‌ను అంటించబోయి అగ్ని ప్రమాదానికి గురై మరణించింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

నేను ఇటుపై సినీమాలలో నటించను సినీతార 'రాగిణి'

మే 1వ తేదీన బొంబాయిలోని కేరళీయ సేవా సంఘ సహాయార్థం రాగిణి నృత్య ప్రదర్శన జరిగింది. ఆ సందర్భములో ఆగస్టు నాటికి ఆమెకున్న సినిమా అగ్రిమెంట్లు పూర్తి అయిపోతాయని, నిజ జీవితంలో గృహిణి పాత్ర నిర్వహించటం సినీమాలలో నటించడం కన్నా ఎంతో కష్టమని, తెరపై రాణించడం కన్నా గృహిణిగా విజయం పొందడం ముఖ్యం గనుక అభిమానులను వదలడం కష్టమైనప్పటికినీ నేను గృహిణిగా వెళ్తున్నందుకు అందరూ హర్షిస్తారనే ఆశతో ఆగస్టు తర్వాత తిరువనంత



జకార్తా ఉత్సవాల్లో 'నర్తనశాల' తరఫున పాల్గొని, ఉత్తమ నటుడుగా బహుమతి పొంది, ఇటీవలనే మద్రాసుకు తిరిగివచ్చిన శ్రీ యస్. వి. రంగారావుకు మీనంబాకం విమానాశ్రయంలో పలువురు సినిమా ప్రముఖులు ఘనమైన స్వాగతం ఇచ్చారు.


ప్రేక్షకుల హృదయాలను
హత్తుకపోయే కథాగమనం
గల చిత్రరాజము!
శ్రీదేవీ ప్రొడక్షన్స్
సమర్పించు
దేవర్ ఫిలిమ్స్
వారి...
దొంగను పట్టిన
దొర
నిర్మాత:
తోట సుబ్బారావు
మాటలు-పాటలు
అనిసెట్టి
సంగీతం
కె.వి.మహదేవన్
దర్శకత్వం
ఎం.ఎ.తిరుముగం
పూర్ణా రిలీజ్.

సినిమా వార్తలు

పురం వెళ్ళి తన భర్తతో గృహిణిగా వ్యవహరిస్తా వని తెలియ జేసింది.

"మంగమ్మ శపథం"

డి. వి. యస్. ప్రొడక్షన్సు వారు 'మంగమ్మ శపథం' చిత్రానికి మే 7వ, తేదీన గోల్డెన్ స్టూడియోలో పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవము జరిగింది. ప్రారంభోత్సవము యన్. వి. టి. అధినేత శ్రీ త్రివిక్రమరావు జరిపేరు. సి. నారాయణరెడ్డి వ్రాసిన రెండు పాటలను రికార్డ్ చేశారు. ఘంటసాల, సుశీల, జానకి మరియు బృందం పాడారు. సంగీత దర్శకుడు : టి. వి. రాజు. ప్రారంభోత్సవానికి ఆంధ్రా, సీడెడ్, నైజాం డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు, ఫిలిం పరిశ్రమకు సంబంధించిన వివిధ శాఖల పెద్దలు హాజరైనారు.

* * *

గౌరి ప్రొడక్షన్సు వారు వారి ద్వితీయ చిత్రంకు గోల్డెన్ స్టూడియోలో మే 7వ తేదీ ఉదయం ప్రారంభోత్సవం జరిగింది. పూర్ణా పిక్చర్సు అధినేత శ్రీ జి. కామరాజు స్విచ్ ఆన్ చేశారు. నటి రాజశ్రీతో ప్రథమ చిత్రీకరణ చేశారు.

* * *

చిత్రాలయ బేనర్ క్రింద శ్రీధర్ నిర్మించిన "కాదలిక్క నేరమిల్లై" అనే హాస్య రస చిత్రం హక్కులు పద్మశ్రీ వారు కొని, తెలుగులో పద్మశ్రీ బేనర్ క్రింద శ్రీ పి. పుల్లయ్య దర్శకత్వంలో చిత్రాన్ని నిర్మించేందుకు సర్వసన్నాహాలు జరుగుతున్నట్లు ఒక వార్త.



శ్రీ సత్యనారాయణ మహాత్మ్యంలో కాంతారావు.



"దేశద్రోహులు"లో గిరిజ.

ఆలయ ఫిలింస్ త్వరలో ప్రారంభం

ఆలయ ఫిలింస్ బేనర్ క్రింద శ్రీయం. క్వె రెడ్డి సాంఘిక చిత్రాన్ని నిర్మించడానికి సర్వ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి రచన : పినిశెట్టి శ్రీరామమూర్తి, ఛాయ : యం. జి. సింగ్, కళ : రాజేంద్రకుమార్, కూర్పు: అంకిరెడ్డి.

ఈ చిత్రంలో నటీ నటులుగా బగ్గయ్య, కృష్ణకుమారి, ప్రభాకరరెడ్డి, పద్మనాభం, గీతాంజలి, స్వర్ణను ఇంతవరకు ఎన్నుకున్నారు. త్వరలోనే మిగిలిన నటీ నటులను, సాంకేతిక నిపుణులను ఎన్నుకొని త్వరలో సెట్సుపైకి వెళ్లనున్నారు.

ఆర్. ఆర్. పిక్చర్సు


ఆర్. ఆర్. పిక్చర్సు వారు తమిళంలో విజయవంతమైన 'పెరియ ఇడత్ పెణ్' చిత్రాన్ని తెలుగులో తీస్తున్నారు. ఇంకా పేరుపెట్టలేదు. ఇప్పటికి దాదాపు అయిదు రీళ్లు పూర్తి అయింది. జూన్ నెలాఖరుకు షూటింగ్ పూర్తి కాగలదని తెలుస్తుంది. ఈ చిత్రంలో యన్. టి. రామారావు, కృష్ణకుమారి, వాసంతి, గీతాంజలి, పద్మనాభం, రాజనాల, రమణారెడ్డి, ప్రసాద్, జగ్గారావు మొదలగువారు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్. ఆర్. పిక్చర్స్ తరపున నిర్మాత: టి. ఆర్. చక్రవర్తి, దర్శకుడు : ఐ. ఎస్. మూర్తి, సంగీతం : పెండ్యాల, ఛాయ : మల్లి యిరానీ, రచన : ఆత్రేయ.

'కాన్సు'కు నర్గీస్ అధ్వర్యాన ప్రతినిధివర్గం

'కాన్సు'లో ఈనెల 29 నుంచి జరుగనున్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో భారత ప్రతినిధి వర్గంకు శ్రీమతి నర్గీస్ అధ్వర్యం వహిస్తారు. "ముఝే జీనేదో" చిత్రం ఈ ఉత్సవంలో ప్రదర్శిస్తారు. ఇందులో సునీల్‌దత్ వహీదా, రహెమాన్ నటించారు. దర్శకత్వం : శ్రీ మోని భట్టాచార్య. బహుశా మే, 10వ ప్రదర్శించ వచ్చునని సునీల్ అన్నారు.

సి. ధర్మారావు ★

Edited, Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6 &7 Thambuchetty Stree
Madras-1. Phone: 22244 & 23713. Chief Editor S. Sambhu Prasad.



'కెరటాలు — కొయ్యతీవులు'

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.



శారద

మృదుత్వమునకు, నునుపైన సున్నిత చర్మానికి

రెమి

సోప్

ఉపయోగించండి

CRITERION RP. 318